www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

బుధవారం | 6-2-2019 | పేజీలు: 20 + 20 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 59 సంచిక (Issue) : 292 | శ్రీవిళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, శుక్లపక్షం; తిథి: విదియ పూర్తి; నక్షత్రం: ధనిష్ఠ ఉ. 9.09 తదుపరి శతభిషం; వర్జ్యం: సా. 5.15-7.03; దుర్ముహూర్తం: మ. 12.07-12.52; అమృతఘడియలు: తె. 4.03-5.51; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 6.51; సూర్యాస్తమయం: 6.08 | విజయవాడ సిటీ

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad | Bangalore and Chennai

రూ.2,26,177కోట్ల బడ్జెట్

తొలి త్రైమాసికానికి రూ.65,869 కోట్లు

అప్పులే ఆధారం.. నాలుగున్నరేళ్లలో 74,962 కోట్ల రుణం

ద్రవ్య లోటు 32,390 కోట్లు.. జీఎస్‌డీపీలో 3.03%

జల వనరుల పద్దులో సింహభాగం 9,835 కోట్లు పోలవరానికే



నిరుద్యోగులకు రెట్టింపు భృతి

యువతకు ఇక నెల నెలా రూ. 2000

డ్రైవర్ల సంక్షేమానికి సాధికార సంస్థ

ఆరోగ్య'మస్తు'

ఆరోగ్య శాఖకు 10,032 కోట్లు

విద్యలో నాణ్యతకు పెద్దపీట

25,955 కోట్లు కేటాయింపు

రూ.5వేల కోట్లతో అన్నదాతా సుఖీభవ

ఖరీఫ్ నాటికే అమలు.. విధి విధానాల ఖరారుకు సమయం

రుణవిముక్తి చేశాకే ఎన్నికలకు.. ఒక్కో రైతుకు లక్షన్నర మాఫీ

ఇంత లబ్ధి 70 ఏళ్లలో తొలిసారి.. 4ఏళ్లలో 81 వేల కోట్లు: సీఎం

'మధ్యాహ్న' భోజన కార్మికుల వేతనం రూ. 3 వేలకు పెంపు

88 వేల మందికి ప్రయోజనం.. సీఎం చొరవతో చర్చలు సఫలం

సమగ్ర కథనాలు
16,17,18లో..


సమృద్ధిగా సంక్షేమం!.. ప్రతి ఒక్కరికీ ప్రతిఫలం!

వర్గాల వారీగా వరాల వర్షం!

కొత్త ప్రకటనలు, పాత పథకాలకు పెరిగిన చెల్లింపులు, ఇటీవల ప్రకటించిన వరాలకు విస్పష్ట కేటాయింపులు! 'అన్నదాతా సుఖీభవ' అంటూ రైతుకు దన్ను! రెట్టింపు భృతితో నిరుద్యోగులకు అండ! పెరిగిన సామాజిక పింఛన్లన్నింటికీ తగిన నిధులు! పేరుకే అది ఓటాన్ అకౌంట్ బడ్జెట్! తీరుకు సంపూర్ణమైన కేటాయింపులతో కూడిన 'సంక్షేమ పద్దు'! మంగళవారం శాసనసభలో ఆర్థిక మంత్రి యనమల బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఆర్థిక ఇబ్బందులున్నా, లోటు పోటు వెంటాడుతున్నా... 'వెనక్కి తగ్గేది లేదు' అంటూ ఎన్నికల రహదారిపై రివ్వున సాగారు. 2019-20కి రూ.2.26 లక్షల కోట్లతో బడ్జెట్‌ను ప్రతిపాదించారు. ఇందులో తొలి మూడు నెలల కోసం 'ఓటాన్ అకౌంట్'ను సమర్పించారు.

వరాల పద్దు

అందరికీ సంక్షేమం.. సంతోషం!



సామాన్యుడికి సర్కారు అండ దండ

నాలుగో వంతు సంక్షేమానికే కేటాయింపు

క్షత్రియ కార్పొరేషన్ ఏర్పాటుకు 50 కోట్లు

కొత్తగా ఆరు పథకాలు, నిర్ణయాలు

రెట్టింపు పింఛన్లకు తగినంత కేటాయింపు

డ్వాక్రా 'పసుపు-కుంకుమ'కు 4 వేల కోట్లు

బీసీల హామీల అమలుకు రూ.3 వేల కోట్లు

మరింత ధీమాగా 'చంద్రన్న బీమా'

అమలులోని పథకాలకు ఘనంగా నిధులు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

అంకెలు రంకెలేశాయి. 'సంక్షేమ పథం'లో పరుగు తీశాయి. గత కొన్ని నెలలుగా ముఖ్యమంత్రి వరుసగా ప్రకటిస్తున్న వరాలకు బడ్జెట్‌లో ఘనంగా కేటాయింపులు చేశారు. దాదాపు 12 రకాల సామాజిక పింఛన్ల సహాయాన్ని రెట్టింపు చేశారు. నిరుద్యోగ భృతిని పెంచుతామన్నారు. రైతులకు పెట్టుబడి సహాయం

మిగతా 16వ పేజీలో...



2

మాది ఖాకీ కులం!

శాఖలో చేరాక అందరిదీ అదే

నా కులం ఇక్కడికి సుదూరం

హైకోర్టు ఆదేశాల ప్రకారమే సీనియారిటీ జాబితా తయారీ

ఎవరూ వివరణ కోరలేదు

ఈసీ అడిగితే చెబుతా: ఠాకూర్

జగన్ విమర్శలకు డీజీపీ కౌంటర్



2

దక్షిణ మధ్య రైల్వే జీఎంగా

గజానన్

• రంగంలోకి ప్రియాంక



రాహుల్‌తో ప్రియాంక భేటీ.. మిషన్ యూపీపై నజర్

సమావేశంలో జ్యోతిరాదిత్య, రాజ్‌బబ్బర్, వేణుగోపాల్

ప్రభువులా మోదీ ప్రభ ఏదీ?

ఆయనపై ప్రజల్లో వ్యతిరేకత.. 3 రాష్ట్రాల ఫలితాలే రుజువు

పారిశ్రామికవేత్తల రుణ ఎగవేతలే నిరర్థక ఆస్తులా?

రైతు రుణాలను కూడా నిరర్థక ఆస్తులని ఎందుకనరు?

ప్రస్తుత పథకాలు కొనసాగిస్తూనే కనీస ఆదాయం ఇస్తాం

రాఫెల్ డీల్.. ప్రధాని మోదీ నిర్వహించిన 'బైపాస్' సర్జరీ

మోదీ ఓటమే లక్ష్యం.. ప్రధాని ఎవరో తర్వాతే తేలుస్తాం 14

అయోధ్యపై సుప్రీం తీర్పును గౌరవిస్తాం: రాహుల్ గాంధీ

(పారిశ్రామిక వేత్తలు) బ్యాంకు రుణం తీసుకుని దాన్ని తిరిగి తీర్చకపోతే 'ఎన్‌పీఏ (నాన్ పెర్ఫార్మింగ్ అసెట్-నిరర్థక ఆస్తి)'గా వ్యవహరిస్తారు. మరి రైతుల విషయంలో కూడా వారు చెల్లించలేని రుణాల్ని 'ఎన్‌పీఏ' అని ఎందుకు అనరు? రైతులకు కూడా అవే పదాలు ఎందుకు వాడరు? రైతులు రుణం తీర్చకపోతే ఎగవేతదారులైపోతారు! ఎగవేతదారులైన కార్పొరేట్లు మాత్రం 'ఎన్‌పీఏలు' అయిపోతాయి. ఎందుకిలా? -రాహుల్

బెజవాడలో సీడబ్ల్యూసీ భేటీ!

హోదా భరోసా యాత్రకు మీరు రావాలి 2

ప్రియాంక, జాతీయ నేతలు కూడా.. రాహుల్‌కు రాష్ట్ర కాంగ్రెస్ విజ్ఞప్తి

అధ్యక్షుడి సానుకూల స్పందన.. నెలాఖరులోగా అభ్యర్థులు: రఘువీరా

సుప్రీంకోర్టు మధ్యే వాదం



సీబీఐకి సహకరించాలని సీపీ రాజీవ్‌కు ఆదేశం

అరెస్టు వద్దని, ఒత్తిడి పెట్టొద్దని సీబీఐకి ఉత్తర్వు

మమత దీక్ష విరమణ

12న ఢిల్లీలో సీఎంల ధర్నా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: పశ్చిమ బెంగాల్లో తీవ్రస్థాయిలో ఘర్షణ పడుతున్న రెండు పక్షాలకూ కాస్తంత ఊరట కలిగించేలా సుప్రీం కోర్టు ఓ మధ్యస్థ ఉత్తర్వును ఇచ్చింది. దీని ప్రకారం- శారదా చిట్‌ఫండ్ కుంభకోణంపై కోల్‌కతా సిటీ పోలీస్ కమిషనర్ రాజీవ్ కుమార్‌ను విచారణ నిమిత్తం సీబీఐకి సహకరించాలని ఆదేశించింది. సీబీఐ ఎప్పుడు తేదీ ఖరారు చేస్తే ఆ రోజున ఆయన విధేయతతో హాజరవ్వాలని చీఫ్ జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్ దీపక్ గుప్తా, జస్టిస్ సంజీవ్ ఖన్నాతో కూడిన ధర్మాసనం మంగళవారం నాడు ఇచ్చిన రూలింగ్‌లో తేల్చిచెప్పింది. అదే

మిగతా 7వ పేజీలో...



కోల్‌కతాలో మమత దీక్ష విరమణ సమయంలో చంద్రబాబు

మోదీ.. తప్పుకో!.. రాజీనామా చేసి గుజరాత్‌కు వెళ్లిపో

కేంద్రంలో ఏక వ్యక్తి, ఏక పార్టీ ప్రభుత్వం.. మమత ధ్వజం

కూటమి రూపకర్త మమతే.. విపక్షానికి ఆమే మూల స్తంభం

జాతీయ స్థాయిలోనూ కీలకం.. బెంగాల్లో క్లీన్‌స్వీప్: బాబు

నేరమని తెలిసీ చేశారు

129 మంది విద్యార్థులపై అమెరికా అభియోగం

అక్రమంగా ఉండాలన్నది వారి యత్నం

విద్యాచరిత్రలో ఇది ఓ అసాధారణ పరిణామం

భారత్ నిరసనకు అమెరికా సమాధానం

మోసపు ఘటనలు అరుదని వ్యాఖ్య 14

ఆర్టీసీ సమ్మె లేదు..!



ఈయూతో మంత్రి చర్చలు సఫలం.. తాత్కాలికంగా 25% ఫిట్‌మెంట్‌కు ఓకే

తర్వాత ఎన్జీవోలకు పెంచినంత ఇస్తాం.. 2020కల్లా అరియర్స్

ఉగాదికి మొదటి వాయిదా చెల్లింపు.. తెలుగు వెలుగు నష్టాలు భరిస్తాం

ఎంవీటాక్స్ మినహాయింపుపై సీఎంతో చర్చించి నిర్ణయం.. మంత్రి హామీ 7

గుర్తింపు సంఘం అంగీకారం.. నిరసనగా నేడు ఎన్‌ఎంయూ బ్లాక్ డే!

షా.. మీ కళ్లు నెత్తికెక్కాయా?

అహంభావంతో పతనమే

నాలుగేళ్ల కింద మీరెక్కడ?

మీ కుమారుడి ఆస్తులు 16 వేల రెట్లు ఎలా పెరిగాయ్?

నాది రైట్ టర్న్.. యూటర్న్ కాదు

మీవే వంకరటింకర టర్న్‌లు

మీది భస్మాసుర హస్తం 5

నమ్మించి ద్రోహం చేశారు

అసెంబ్లీలో సీఎం ఆగ్రహం

అప్పు.. తప్పు

ఎన్నారై జయరాం హత్య కేసులో మరో మలుపు

రాకేశ్‌రెడ్డే చంపాడని తేల్చిన పోలీసులు

ఆస్తి గొడవే కారణమని ప్రకటన

శిఖాచౌదరికి క్లీన్‌చిట్ 2

విభేదించిన జయరాం భార్య పద్మశ్రీ

విలువైన పత్రాలు ఎత్తుకెళ్లిందని ఆరోపణ

రాకేశ్ ఎవరో తెలియనే తెలియదని వెల్లడి

ఏపీ పోలీసులపై నమ్మకం లేదని తెలంగాణ పోలీసులకు ఫిర్యాదు



Paramjyothi
పరంజ్యోతి

అంత్యకాల స్మరణ



అంత కాలేచ మామేవ స్మరన్ ముక్త్వా కళేబరం
యః ప్రయాతి స మద్భావం యాతినాస్తి అత్ర సంశయః

"ఎవడు మరణ కాలమందు కూడా నన్నే స్మరిస్తూ దేహాన్ని విడిచి వెళతాడో, అతడు నా స్వరూపాన్నే పొందగలడు. ఈ విషయంలో ఎలాంటి సందేహం/సంశయం అక్కరలేదు" అన్నాడు గీతాచార్యుడు. మనకి తరించడానికి చక్కని అవకాశం కల్పించాడు. కానీ.. ఏ జీవికైనా అంత్యకాలమెప్పుడు? ఇదే ఘడియా? తరువాతి ఘడియా? నేడా? రేపా? ఏడాదికా? చెప్పలేం. ఏ క్షణమైనా ఈ దేహం.. మహావృక్షం కూలిపోయినట్టుగా భూమిపై పడిపోతుంది. కాబట్టి ఆ విషయం గ్రహించి దైవ స్మరణ చేస్తూ ఉండాలి. ఎందుకంటే దైవస్మరణ అనేది మరణ సమయాన అప్పటికప్పుడు నిర్ణయించుకొనేది కాదు. బాల్యం నుంచే స్మరణ శిక్షణ పొందాలి. యవ్వనం ఉన్నప్పుడే.. పళ్లు, కళ్లు, దేహం, అవయవాలు, మనసు, అన్నీ సవ్యంగా పనిచేస్తున్నప్పుడే, చిత్తచాంచల్యం దరిజేరక ముందే, స్మరణను అలవాటుగా మార్చుకుంటే, అంత్యదశలో స్మరణ స్వాధీనంలో ఉంటుంది. లేదంటే.. మరణ సమయంలో శారీరక స్థితి అందుకు సహకరించదు. నాడి బలహీనమైపోతుంది. బతుకు పరాధీనమవుతుంది. ఆ సమయంలో దైవ స్మరణ శ్రమతో కూడి ఉంటుంది. అందుకే.. ఉద్యోగంలో చేరిన వ్యక్తి ధనాన్ని ముందుగా భద్రపరచుకొని, పదవీ విరమణ అనంతరం ఆ సొమ్ము తనను కాపాడుతుందని ఎలా తలుస్తాడో అదేవిధంగా చిన్ననాటి నుంచి అలవాటైన దైవ స్మరణ తనకు చరమాంకదశలో అలవాటుగా సాగి భగవత్ సాన్నిధ్యం కలిగిస్తుందని తెలుసుకోవాలి. అందుకే ప్రణాళికాబద్ధంగా నిరంతర స్మరణ ఈ దేహానికి అలవాటు చేయాలి. మన గమ్యం భగవత్ సాన్నిధ్యమే గానీ, తిరిగి జన్మించడం కాదుగా. ఆ విషయం స్మృతిలో జ్వలిస్తూ ఉండాలి. చివరి సమయపు భావన స్థిరమైనది అని ముందే గ్రహించి 'ఎరుక'తో ఉండాలి. దీర్ఘ ప్రయాణానికి 'దారి బత్తెం' సేకరించి పెట్టుకున్నట్టే స్మరణ అలవాటును సేకరించి పెట్టుకోవాలి. అంత్యకాలమునందు మాత్రమే స్మరణ అన్న భావన రానీయక, సోమరి తనానికి తావీయక, "తస్మాత్ సర్వేషు కాలేషు మాం అనుస్వర' అన్న శ్లోక పాద సారాన్ని గ్రహించాలి. మరణ సమయాన భగవంతుడి స్మరణ తప్ప.. ప్రయోజన శూన్యమైన సంసార తాపత్రయాలను దరిజేరనీయకూడదు. ఆయువు తీరాక భక్తి నావ ద్వారా సముద్రాన్ని అలవోకగా దాటగలనని భావిస్తూ దృఢచిత్తులై శరీరాన్ని అలవోకగా విడిచిపెట్టాలి. అప్పుడే ఆత్మ.. పరమాత్మ అయిన ఆ భగవంతుడిని చేరగలదు. నాలుగు రకాల మోక్షాలైన.. సాలోక్యం, సాయుజ్యం, సామీప్యం, సారూప్యాలలో భక్తుడి స్మరణ, భక్తి పారవశ్యాల ఆధారంగా ఏదో ఒకటి ప్రాప్తించగలదు.

- వేదాంతం జగన్నాథాచార్య, 98859 50072

'మధ్యాహ్న' కార్మికులకు 3 వేలు

ఒకేసారి 2వేలు పెంపు.. సీఎంతో చర్చలు సఫలం

అమరావతి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన పథకం కింద పాఠశాలల విద్యార్థులకు భోజనం తయారు చేస్తున్న కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఊరట కలిగించింది. తమ వేతనాలను పెంచాలంటూ గత 11 సంవత్సరాలుగా వారు చేస్తున్న పోరాటానికి సర్కారు సానుకూలంగా స్పందించింది. వారందరి నెలవారీ వేతనాన్ని రూ.రెండు వేల మేరకు పెంచేందుకు ముఖ్యమంత్రి అంగీకరించారు. దాదాపు 88 వేల మందికి ఈ నిర్ణయం వల్ల తక్షణ లబ్ధి చేకూరనుంది. ఈ మేరకు మధ్యాహ్న భోజన పథకం కార్మికులను, వారి యూనియన్ నేతలను ప్రజాదర్బార్‌కు పిలిపించుకుని చంద్రబాబు జరిపిన చర్చలు విజయవంతం అయ్యాయి. దీనిపై రెండు రోజుల్లో ప్రభుత్వ ఉత్తర్వులు విడుదల కానున్నాయి. రాష్ట్రంలో 2007 నుంచి నెలకు రూ.1,000 వేతనంతో మధ్యాహ్న భోజన పథకం కార్మికులు పనిచేస్తున్నారు. ఇప్పటినుంచి వారంతా రూ.3,000 వేలు అందుకొంటారు. ఈ నిర్ణయం వల్ల దాదాపు 17 కోట్ల మేర అదనపు భారం ఖజానాపై పడనుంది. రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి చొరవ పట్ల ఏపీ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సీఐటీయు) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వరలక్ష్మి, స్వరూపరాణి హర్షం వ్యక్తం చేశారు. ఇతర డిమాండ్లపైనా ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని వారు కోరారు.

దక్షిణ మధ్య రైల్వే జీఎంగా గజానన్



హైదరాబాద్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే(ఎస్‌సీఆర్) జనరల్ మేనేజర్‌గా గజానన్ మాల్యా నియమితులయ్యారు. మంగళవారం ఆయన పదవీ బాధ్యతలను స్వీకరించారు. ఇండియన్ రైల్వే సర్వీస్ ఆఫ్ మెకానికల్ ఇంజనీర్స్ (ఐఆర్ఎస్ఎంఈ) పట్టభద్రుడైన మాల్యా.. స్పెషల్ క్లాస్ రైల్వే అప్రెంటీస్‌గా 1979లో రైల్వేలో చేరారు.

అప్పు.. తప్పు

ఎన్నారై జయరాం హత్య కేసులో మరో మలుపు

రాకేశ్‌రెడ్డే చంపాడని తేల్చిన ఆంధ్రప్రదేశ్ పోలీసులు

విజయవాడ/నందిగామ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కోస్టల్ బ్యాంక్ డైరెక్టర్, ప్రముఖ పారిశ్రామికవేత్త చిగురుపాటి జయరామ్ కేసు మరో మలుపు తిరిగింది. ఆయనను చంపింది రాకేశ్ రెడ్డేనని పోలీసులు తేల్చారు. కానీ, అసలు రాకేశ్ ఎవరో తమకు తెలియదని జయరామ్ భార్య పద్మశ్రీ చెప్పారు. జయరామ్‌కు రాకేశ్ రూ.4.15 కోట్లు అప్పు ఇచ్చాడని, వాటిని వసూలు చేసుకునే క్రమంలోనే హత్య చేశాడని పోలీసులు చెప్పారు. కానీ, అన్ని కోట్లు అప్పు ఇచ్చే స్తోమత రాకేశ్‌కు లేదని అతని ఆర్థిక పరిస్థితి స్పష్టం చేస్తోంది. రాకేశ్‌ను ప్రధాన నిందితుడిగా, అతనికి సహకరించిన వాచ్‌మన్‌ను ఏ2గా చేర్చి ఏపీ పోలీసులు కేసు దర్యాప్తును ముగించారు. కానీ, ఈ కేసులో శిఖా చౌదరి పాత్ర ఏమిటనేది బయటకు రావాలని, ఏపీ పోలీసులు జరిపిన దర్యాప్తు తనకు సంతృప్తికరంగా లేదని, కేసును తెలంగాణకు బదిలీ చేయాలని పద్మశ్రీ విజ్ఞప్తి చేశారు. ఈ కేసు వివరాలను కృష్ణా జిల్లా ఎస్పీ సర్వశ్రేష్ట త్రిపాఠీ మంగళవారం విలేకరులకు వెల్లడించారు.

విడతలవారీగా రూ.4.15 కోట్ల అప్పు!

జయరామ్‌కు చెందిన టెట్రాన్ పరిశ్రమ వివాదంలో చిక్కుకున్నప్పుడు కార్మికులతో మాట్లాడి రాకేశ్ సమస్యను పరిష్కరించాడు. ఇద్దరి మధ్య ఈ పరిచయం అప్పులు ఇచ్చిపుచ్చుకునే దాకా వెళ్లింది. కొన్నాళ్లకు జయరామ్ అతడికి ఫోన్ చేసి రూ.2.25 కోట్లు సర్దుబాటు చేయమని అడిగి తీసుకున్నాడు. ఇంకొన్నాళ్లకు మరో రూ.1.1 కోట్లు తీసుకున్నాడు. అనంతరం జయరామ్ అమెరికా వెళ్లిపోయాడు. కొన్నాళ్లకు మళ్లీ రాకేశ్‌కు ఫోన్ చేసి మరో రూ.80 లక్షలు ఏర్పాటు చేయాలని అడిగాడు. ఈ డబ్బును రాకేశ్ రెండు విడతలుగా ఇచ్చాడు. అప్పటిదాకా తీసుకున్న రూ.4.15 కోట్ల అప్పును అవసరమైతే జూబ్లీహిల్స్‌లోని ఇంటిని విక్రయించైనా తీరుస్తానని జయరామ్ అతడికి మాటిచ్చాడు. కాగా బాకీ తీర్చాలంటూ రాకేశ్ ఇటీవల తరచూ జయరామ్‌కు ఫోన్ చేస్తున్నాడు. ఆయన కాల్స్ ఎత్తకపోగా, రాకేశ్ నంబర్లను బ్లాక్ చేశాడు. జయరామ్‌ను ఎలాగైనా పట్టుకోవాలనే ఉద్దేశంతో రాకేశ్ ఆయన కదలికలపై నిఘా పెట్టాడు. హైదరాబాద్‌కు వచ్చిన జయరామ్ ఏదో ఒక సమయంలో శిఖా చౌదరి ఇంటికి వెళ్తాడని భావించాడు. గచ్చిబౌలిలో ఆమె ఉంటున్న విల్లా మేనేజర్‌ను పరిచయం చేసుకున్నాడు. జయరామ్ వస్తే చెప్పాలంటూ అతడికి నెలకు రూ.15 వేలను వేతనంగా ఇచ్చేవాడు. జయరామ్ జనవరి 29వ తేదీ సాయంత్రం శిఖా చౌదరి ఫ్లాట్‌కు వెళ్లిన విషయాన్ని విల్లా మేనేజర్ వెంటనే రాకేశ్‌కు ఫోన్ చేసి చెప్పాడు. తాను ఫోన్ చేసినా.. వెళ్లినా ఫలితం ఉండదని భావించిన రాకేశ్.. జయరామ్‌కు ఉన్న అమ్మాయిల బలహీనతను ఆసరాగా చేసుకొని రప్పించుకోవాలనుకున్నాడు. కొత్తగా సెల్ నంబర్ తీసుకుని.. వాట్సా్ప్‌లో ఓ మోడల్ ఫొటోను డీపీగా పెట్టాడు. 30న రీనా పేరుతో గంట గంటకు జయరామ్ ఫోన్‌కు వాట్సాప్ మెసేజ్‌లను పెట్టాడు. ఆమే తనతో చాట్ చేసిందని భావించిన జయరామ్ అదే రోజు సాయంత్రం నేరుగా ఆ ఇంటికి వెళ్లిపోయాడు. లోపలకు వెళ్లగానే రాకేశ్ ఆయన్ను బంధించాడు. రాత్రంతా చిత్రహింసలకు గురిచేశాడు. గుండెకు స్టంట్లు వేయించుకున్న జయరామ్ తాను మందులు వేసుకోవాల్సి ఉందని.. తనను వదిలేయమని వేడుకున్నా రాకేశ్ రెడ్డి కనికరించలేదు. డబ్బులు తిరిగివ్వాల్సిందేనని తీవ్రంగా కొట్టాడు. దెబ్బలకు తాళలేక జయరామ్.. తాను విజయవాడ వెళ్లాల్సి ఉందని.. అక్కడి నుంచి డబ్బులు తెచ్చి ఇస్తానని ప్రాధేయపడ్డాడు. అంతలోనే సోఫాలో కుప్పకూలిపోయాడు. రాకేశ్ మరింత కోపంతో జయరామ్ పీకను చేతులతో పట్టుకొని గట్టిగా సోఫాకు అదిమిపట్టాడు. కొద్దిసేపటికే ముక్కు నుంచి రక్తస్రావమై జయరామ్ ప్రాణాలు కోల్పోయాడు. కంగారుపడిన రాకేశ్ వివిధ కేసుల్లో పరిచయాలు ఉన్న ఇబ్రహీంపట్నం ఏసీపీ మల్లారెడ్డి, నల్లకుంట ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులకు ఫోన్ చేసి విషయం చెప్పాడు. అప్పటికే జయరామ్ విజయవాడకు వెళ్లాల్సి ఉందని చెప్పడంతో ఆ ఇద్దరు పోలీసు అధికారాలు విజయవాడకు వెళ్లే మార్గంలో రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించి వదిలేయాలని చెప్పారు. అర్ధరాత్రి ఒంటిగంటకు రాకేశ్ తన ఇంటి వాచ్‌మన్ దున్నే శ్రీనివాస్ సాయంతో కారులోని వెనుక సీట్లో జయరామ్ మృతదేహాన్ని పెట్టాడు. కారు డ్రైవ్ చేసుకుంటూ వచ్చి నందిగామ దాటిన తర్వాత ఐతవరం వద్ద జాతీయ రహదారికి పక్కకు తోసేశాడు. అనంతరం ప్రైవేటు బస్సులో తిరిగి హైదరాబాద్‌కు వెళ్లిపోయాడు.



భర్త హత్యపై ఫిర్యాదు చేసేందుకు జూబ్లీహిల్స్ పోలీసుస్టేషన్‌కు వచ్చిన జయరాం భార్య పద్మశ్రీ

ఏసీపీ మల్లారెడ్డి బదిలీ

హైదరాబాద్ సిటీ, ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): భూదందాలు, సెటిల్మెంట్లు చేస్తూ నేరచరిత్ర కూడా ఉన్న రాకేశ్‌రెడ్డితో అంటకాగిన ఫలితం.. ఆ ఇద్దరు పోలీసు అధికారులపై బదిలీ వేటు పడింది. జయరామ్ హత్య కేసులో రాకేశ్ రెడ్డికి సహకరించారంటూ రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం ఏసీపీ ఎస్.మల్లారెడ్డి, నల్లకుంట సీఐ శ్రీనివాసులు ఆరోపణలు ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. జయరామ్ హత్య అనంతరం రాకేశ్.. ఈ ఇద్దరి పోలీస్ అధికారుల సలహాలు తీసుకున్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది. కృష్ణాజిల్లా ఎస్పీ త్రిపాఠి హైదరాబాద్ పోలీసులకు ఈ సమాచారం ఇచ్చారు. దీంతో, సీఐ శ్రీనివాసులును సోమవారమే బదిలీ చేశారు. ఏసీపీ ఎస్.మల్లారెడ్డిని మంగళవారం అంబర్‌పేట్ పోలీస్‌హెడ్ క్వార్టర్‌కు అటాచ్ చేశారు.



90 అడుగుల వాసవీ మాతకు 160 అడుగుల మాల

పెనుగొండ, ఫిబ్రవరి 5: వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి 90 అడుగుల పంచలోహ విగ్రహానికి అపురూపమైన 160 అడుగుల పొడవైన మాల తయారయ్యింది. పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండ పుణ్యక్షేత్రంలోని వాసవీ శాంతిధాంలో కోట్లాది రూపాయల వ్యయంతో 102 అడుగుల ఎత్తైన రుషి గోత్ర మందిరం నిర్మిస్తున్నారు. అందులో అమ్మవారి 90 అడుగుల పంచలోహ విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నారు. విగ్రహాలంకరణ నిమిత్తం అపురూపమైన దండ తయారు చేయాలని కర్నాటక రాష్ట్రంలోని దావణగెరెకు చెందిన భక్తురాలు పద్మ భావించారు. 4నెలల వ్యవధిలో 160అడుగుల పొడవైన మాలను ముత్యాలు, పగడాలు, బంగారుపూతతో తయారు చేశారు. 'ఫిబ్రవరి 11న విగ్రహ ప్రతిష్ఠాపన ప్రారంభమవుతుంది. పంచలోహ విగ్రహాన్ని ఫిబ్రవరి 15న ఆవిష్కరిస్తారు. క్రేన్ సాయంతో మాలను అమ్మవారికి అలంకరిస్తాం" అని ట్రస్ట్ చైర్మన్ గోవిందరాజులు తెలిపారు.

కృష్ణా నదిలో నీటమునిగిన బల్లకట్టు

ప్రయాణికులు క్షేమం... మునిగిపోయిన లారీ, ఆటో

చందర్లపాడు, జనవరి 5: కృష్ణా నదిలో 60 మంది ప్రయాణికులు, కొన్ని వాహనాలతో ఉన్న బల్లకట్టుకు ప్రమాదానికి గురైంది. ప్రమాదంలో బల్లకట్టు పూర్తిగా నీటమునిగినా అదృష్టవశాత్తూ ప్రయాణికులందరూ క్షేమంగా ఒడ్డుకు చేరారు. అయితే, దానిపైన ఉన్న కొన్ని వాహనాలు మాత్రం నీట మునిగాయి. కృష్ణాజిల్లా చందర్లపాడు మండలం రామన్నపేట-గుంటూరు జిల్లా అచ్చంపేట మండలం పుట్లగూడెం గ్రామాల మధ్య కృష్ణానదిలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. రామన్నపేట వద్ద రెగ్యులర్‌గా నడిచే బల్లకట్టు మరమ్మతుకు గురికావటంతో నిర్వాహకులు వారం రోజుల నుంచి మరో బల్లకట్టు తెచ్చి నడుపుతున్నారు. సామర్థ్యం తక్కువగా ఉన్న కొత్త బల్లకట్టుపై రామన్నపేట ఒడ్డున 60 మందికి పైగా ప్రయాణికులు, 20 ద్విచక్ర వాహనాలు, ఆటో ఎక్కించారు. లోడ్ లారీ ఎక్కించే ప్రయత్నంలో బల్లకట్టు కుదుపుకు గురైంది. బల్లకట్టును కదలకుండ రెండువైపులా గట్టిగా కట్టేసిన తాళ్లల్లో ఒకటి తెగింది. పావుగంట వ్యవధిలో బల్లకట్టు పూర్తిగా నీట మునిగింది. లారీ, ఆటో, రెండు ద్విచక్రవాహనాలు నీటిలో మునిగిపోయాయి.



లారీలతో సహా నీటిలో మునిగిపోతున్న బల్లకట్టు

ఎన్నికలకు పొరుగు పోలీసులు



దక్షిణాది రాష్ట్రాల అంతరాష్ట్ర పోలీస్ సమన్వయ సమావేశంలో మాట్లాడుతున్న డీజీపీ ఆర్పీ ఠాకూర్

భద్రతకు సహకరిస్తామన్న డీజీపీలు

మద్యం, నగదు అక్రమ రవాణాకు చెక్

సరిహద్దుల్లో నిరంతర నిఘా

తిరుపతి సమావేశంలో నిర్ణయం

నక్సల్స్ సమస్యపై ప్రత్యేక దృష్టి: ఠాకూర్

తిరుపతి/హైదరాబాద్, ఫిబ్రవరి, 5(ఆంధ్రజ్యోతి): ఇరుగు పొరుగు రాష్ట్రాల పరస్పర సమన్వయం, సహకారాలతో త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికలు ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహిస్తామని ఏపీ డీజీపీ ఆర్పీ ఠాకూర్ అన్నారు. త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆరు రాష్ట్రాల డీజీపీలు, హోంశాఖ కార్యదర్శులు, సీఆర్పీఎఫ్, ఇంటలిజెన్స్ విభాగాల ఉన్నతాధికారులతో తిరుపతిలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన పోలీస్ ఉన్నతాధికారులు ఎన్నికల వ్యూహంపై చర్చించారు. సమావేశం అనంతరం వారు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ డీజీపీ ఠాకూర్ మాట్లాడుతూ.. 'ఎన్నికల తరుణంలో రాష్ట్రాల సరిహద్దులు దాటి మద్యం, నగదు, ఆయుధాల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు చర్యలు తీసుకుంటాం. సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తాం. ఉన్నవాటిని పటిష్ట పరుస్తాం. సరిహద్దుల నుంచి 5 కిలోమీటర్ల వరకూ పోలింగ్ రోజున డ్రై డే అమలు చేస్తాం. ఈ పరిమితిని ఎన్నికల సంఘం తాలూకా స్థాయికి విస్తరించే అవకాశం ఉంది. ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రంలోకి నేరస్థులు, దుండగులు ప్రవేశించకుండా నిరోధించేందుకు ఏమేమి చేయాలో చర్చించాం. సరిహద్దుల్లో నిరంతర నిఘాకు ప్రాధాన్యం ఇస్తున్నాం. రియల్ టైమ్‌లో సమాచార మార్పిడికి అత్యంత ప్రాధాన్యం ఉంటుంది. దీనికోసం కమ్యూనికేషన్ సెట్స్, రవాణాకు అవసరమైన వాహనాలను పరస్పరం అందజేసుకునేందుకు ఆలోచిస్తున్నాం. హెలికాప్టర్లు, ఎయిర్ అంబులెన్సులు ఎక్కడెక్కడ ఉంచాలో చర్చించాము. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలలో నక్సల్స్ సమస్య ఉంది. ఈసీ మార్గదర్శకాల మేరకు మావోయిస్టులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. నక్సల్స్ ఎన్నికల బహిష్కరణకు పిలుపు ఇవ్వడంతో పాటు, పోలింగ్‌ను అడ్డుకునే అవకాశం ఉంది. అందుకే ముందు నుంచే వారిపై ఎలాంటి నిఘా వేయాలి, ఎలా నియంత్రించాలి అనే దానిపై చర్చించాం' అని డీజీపీ ఠాకూర్ వెల్లడించారు. ఆరు రాష్ట్రాల పరిధిలో ఎన్నికల తేదీలు వేర్వేరుగా ఉంటాయని, అందువల్ల ఒక రాష్ట్ర బలగాలను మరో రాష్ట్రానికి తరలించడం అంత కష్టమేమీ కాదని ఆయన అన్నారు. 'బలగాలు ఎంత అవసరమనేది ఇప్పటికే ఈసీకి ఆయా రాష్ట్రాలు ప్రతిపాదనలు పంపాయి. ప్రతి రాష్ట్రంలోనూ అదనపు బలగాలు అవసరమన్న అభిప్రాయం సమావేశంలో వ్యక్తమైంది. ప్రస్తుత సమావేశం ఉన్నతస్థాయిలో జరిగింది. ఎన్నికల వరకూ తరచూ సమన్వయ సమావేశాలు జరుగుతాయి. అన్నీ సక్రమంగా అమలు జరగడం కోసం ఆయా రాష్ట్రాల తరపున నోడల్ అధికారులను నియమిస్తాం. ఎన్నికలతో సంబంధం లేకపోయినప్పటికీ ఈ సమావేశంలో ఎర్రచందనం అక్రమ రవాణా గురించి కూడా చర్చించాం' అని డీజీపీ ఠాకూర్ చెప్పారు. ఈ సమావేశంలో కర్ణాటక డీజీపీ నీలిమా రాజు, తమిళనాడు డీజీపీ టీకే రాజేంద్రన్, తెలంగాణ హోంశాఖ కార్యదర్శి రాజీవ్ త్రివేది తదితరులు పాల్గొన్నారు.



మాది ఖాకీ కులం!

శాఖలో చేరాక అందరిదీ అదే

నా కులం ఇక్కడికి చాలా దూరం

జగన్ విమర్శలకు డీజీపీ కౌంటర్

తిరుపతి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): 'పోలీసులకు కులం ఉండదు. ఉద్యోగంలో చేరిన రోజే కులాలన్నీ వదిలేస్తారు. ఉద్యోగంలో చేరాక ఇక అందరిదీ ఖాకీ కులమే' అని రాష్ట్ర డీజీపీ ఆర్పీ ఠాకూర్ స్పష్టం చేశారు. మంగళవారం తిరుపతిలో ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. ఈ సందర్భంగా విపక్ష నేత జగన్ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించగా.. 'నేను ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఆరు రాష్ట్రాల డీజీపీల సమావేశంలో పాల్గొనేందుకు వచ్చాను. ఇలాంటి వాటిపై స్పందించేది లేదు. అసలు ఆ వ్యాఖ్యలపై నేనెందుకు స్పందించాలి' అని ఆయన ఎదురు ప్రశ్నించారు. అయితే తర్వాత డీజీపీ తన అభిప్రాయాలను వెల్లడించారు. పోలీస్ శాఖలో పదోన్నతులనేవి పూర్తిగా మెరిట్‌పై ఆధారపడి ఉంటాయన్నారు. 'హైకోర్టు ఆదేశాల ప్రకారం సీనియారిటీ జాబితా రూపొందించాము. మేము తీసుకున్న ప్రతి నిర్ణయం న్యాయస్థానం సమీక్షిస్తుంది. ఎన్నికల సంఘం నన్ను ప్రశ్నిస్తే అప్పుడు సమాధానం చెబుతాను. ఇంతవరకూ ఎన్నికల సంఘం గానీ, హోంమంత్రి కానీ నన్ను వివరణ కోరలేదు. నా కులం ఇక్కడికి చాలా దూరంగా ఉంది. నేనెలా పనిచేస్తున్నదీ మీకు కూడా తెలుసు' అని ఠాకూర్ వ్యాఖ్యానించారు. తాను నిజాయితీగా విధులు నిర్వర్తిస్తున్నానని స్పష్టం చేశారు. 'డీజీపీ కాకముందు రెండేళ్లు ఏసీబీ డైరెక్టర్ జనరల్‌గా నా పనితీరు ఏమిటో కూడా మీకు తెలుసు. డీజీపీగా శాంతిభద్రతల నిర్వహణే కాకుండా పోలీసుల సంక్షేమం, పదోన్నతులు చూడడం కూడా నా బాధ్యత. సాధారణ పోలీస్ కానిస్టేబుల్‌గా చేరిన వ్యక్తికి సీనియారిటీ, మెరిట్‌ను బట్టి పదోన్నతి ఇవ్వడం తప్పా?. రాష్ట్రంలో సిబ్బందిని ఎవరిని ప్రశ్నించినా పదోన్నతులు ఎలా జరిగాయో చెబుతారు' అని డీజీపీ ఠాకూర్ పేర్కొన్నారు.

బెజవాడలో సీడబ్ల్యూసీ భేటీ!

హోదా భరోసా యాత్రకు మీరు రావాలి

ప్రియాంక, జాతీయ నేతలు కూడా..

రాహుల్‌కు రాష్ట్ర కాంగ్రెస్ విజ్ఞప్తి

నెలాఖరులోగా అభ్యర్థుల ఖరారు: రఘువీరా



న్యూఢిల్లీ/అమరావతి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) విస్తృత స్థాయి సమావేశాన్ని విజయవాడలో నిర్వహించాలని ఏపీ నేతలు తమ అధిష్ఠానాన్ని అభ్యర్థించారు. రాష్ట్రంలో తాము చేపట్టే 'ప్రత్యేక హోదా భరోసా ప్రజా యాత్ర'లో పాల్గొనాలని, ప్రియాంకగాంధీతో అగ్రనేతలందరినీ పంపించాలని కోరారు. ఇందుకు ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ సానుకూలంగా స్పందించారు. రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి ఊమెన్ చాందీ, పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి, మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎంపీలు టి.సుబ్బిరామిరెడ్డి, కేవీపీ రామచంద్రరావు తదితరులు మంగళవారం ఢిల్లీలో రాహుల్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, పార్టీ కార్యకలాపాలు, ఎన్నికల సన్నద్ధతపై ఆయన ఆరా తీశారు. సమావేశం ముగిశాక రఘువీరారెడ్డి విలేకరులతో మాట్లాడారు. ప్రత్యేక హోదా భరోసా యాత్ర 13 జిల్లాల్లోని 25 లోక్‌సభ నియోజకవర్గాల్లో సాగుతుందని చెప్పారు. 'ఈ యాత్రలో ఒక రోజు రాహుల్, మరొక రోజు ప్రియాంక రావాలని ఆహ్వానించాం. మిగిలిన రోజుల్లో కూడా జాతీయ స్థాయి నేతలను పంపించాలని విజ్ఞప్తి చేశాం. సీడబ్ల్యూసీ భేటీని కూడా విజయవాడలో నిర్వహించాలని కోరారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించారు' అని అని వెల్లడించారు. బీజేపీని నమ్మి ఆంధ్ర ప్రజలు మోసపోయారని అన్నారు. అధికారంలోకి వచ్చాక ప్రత్యేకహోదా ఫైలుపైనే తొలిసంతకం చేస్తానని కర్నూలుసభలో రాహుల్ ప్రకటించిన నేపథ్యంలో రాష్ట్రంలో సీడబ్ల్యూసీ సమావేశం నిర్వహించాలని కోరామన్నారు. అసెంబ్లీ, లోక్‌సభ నియోజకవర్గాలకు పార్టీ అభ్యర్థులను ఈ నెలాఖరులోగా ఖరారు చేస్తామని రఘువీరా చెప్పారు. పోటీ చేయాలనుకునే వారు ఈ నెల 7 నుంచి 10వ తేదీ వరకు అన్ని జిల్లాల కాంగ్రెస్ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని, వాటిని పీసీసీ పరిశీలించి అధిష్ఠానానికి జాబితా పంపుతుందన్నారు. టీడీపీతో పొత్తుపై మాట్లాడుతూ.. కాంగ్రెస్‌కు జాతీయ స్థాయిలో ఒక విధానం.. ఆయా రాష్ట్రాల పరిస్థితులను బట్టి స్థానిక విధానాలు ఉంటాయని, ఆంధ్రలో బీజేపీ, టీడీపీ, వైసీపీలకు సమాన దూరం పాటిస్తున్నామని చెప్పారు.

లోకం తీరు



చలికాలం

కేంద్రం	కనిష్ఠం	గరిష్ఠం
విశాఖపట్నం	16.6	31.4
హైదరాబాద్	16.9	30.9
కడప	18.0	34.0
అనంతపురం	19.8	32.6
విజయవాడ	20.2	31.1
చిత్తూరు	20.4	31.5
ఒంగోలు	21.7	31.6
నెల్లూరు	21.9	32.0

పగలు ఎండ, రాత్రి చలి

విశాఖపట్నం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎండ క్రమేపీ పెరుగుతోంది. రాత్రివేళల్లో మాత్రం చలి వాతావరణం కొనసాగుతోంది. రాయలసీమ, కోస్తాల్లో మంగళవారం పగటిపూట ఉష్ణోగ్రతలు 32 నుంచి 34 డిగ్రీల వరకూ నమోదయ్యాయి. ఇక మధ్యభారతంలో నెలకొన్న చలి వాతావరణం ప్రభావంతో ఉత్తర కోస్తాలో రాత్రిపూట చలిగాలులు వీస్తున్నాయి. మధ్య భారతం దానికి అనుకుని ఒడిశాలో రాత్రి ఉష్ణోగ్రతలు పది నుంచి 12 డిగ్రీల మధ్య నమోదు కావడంతో ఆ ప్రభావం ఉత్తరకోస్తాపై పడుతోందని వాతావరణ అధికారి ఒకరు తెలిపారు. మరో రెండు, మూడు రోజులు వరకు రాత్రి చలి వాతావరణం కొనసాగుతుందని పేర్కొన్నారు. ఇక కోస్తా, రాయలసీమల్లో రానున్న 24 గంటల్లో పొడి వాతావరణం నెలకొంటుందని వాతావరణ అధికారి ఒకరు తెలిపారు.



'సగం వీవీప్యాట్‌ల లెక్కింపు' వచ్చే ఎన్నికలకు అసాధ్యం

వీవీప్యాట్‌లను 50 శాతం లెక్కించి, వాటిని ఈవీఎంలలో నమోదైన ఓట్లతో సరిపోల్చేలా నిబంధనలు తీసుకురావడం వచ్చే సార్వత్రిక ఎన్నికలకు సాధ్యం కాకపోవచ్చు. అందుబాటులోకి వచ్చే వీవీప్యాట్‌లను బట్టి ఈవీఎంలతో సరిపోల్చే ప్రక్రియను క్రమేపీ పెంచుకుంటూ పోతామని ఎన్నికల సంఘం ఇప్పటికే స్పష్టం చేసింది. సగం వీవీప్యాట్‌ల లెక్కింపును అమలు చేయడం రాత్రికి రాత్రి అయ్యే పని కాదు.

- మాజీ సీఈసీ టి.ఎస్.కృష్ణమూర్తి



ఆరెస్సెస్.. అతిపెద్ద లౌకిక సంస్థ

అతిపెద్ద లౌకికవాద సంస్థల్లో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆరెస్సెస్) ఒకటి. వ్యక్తుల విశ్వాసాలు, హక్కులను ఆ సంస్థ ఎప్పుడూ గౌరవిస్తుంది. కేబీ హెడ్గేవార్ నాటిన మొక్క(ఆరెస్సెస్) మహావృక్షమై ప్రపంచమంతా విస్తరించింది.

- మహారాష్ట్ర గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు

ఆరోగ్యకరమైన ఆహారంతో ఆందోళన దూరం

వాషింగ్టన్, ఫిబ్రవరి 5: ఆరోగ్యకరమైన ఆహారం వల్ల ఆందోళన దూరమవుతుందని తాజా సర్వే పేర్కొంది. వేడిగా ఉన్నప్పుడు కూల్‌కూల్‌గా ఐస్‌క్రీం తింటే ఉపశమనం కలిగినట్లే.. బరువు తగ్గించే, పోషకాలు కలిగిన, కొవ్వును కరిగించే ఆహారం తినడం వల్ల ఆందోళనలు దూరం అవుతాయని సైకోమాటిక్ మెడిసిన్ అనే జర్నల్‌లో ప్రచురించిన అధ్యయనంలో తేలింది. ఆహారం మనిషి మనోవైకల్యంపై ప్రభావం చూపుతుందని, ఫలితంగా ఆందోళన పెరిగి, ఒత్తిళ్లు తట్టుకోలేక ఇబ్బంది పడతారని వివరించింది. అందుకే ఫైబర్ ఎక్కువగా ఉండే ఆహారం, కూరగాయలు తీసుకోవాలని, ఫాస్ట్ ఫుడ్స్, జంక్ ఫుడ్స్‌కు దూరంగా ఉండాలని సూచిస్తోంది.

మలేరియాకు కొత్త వ్యాక్సిన్!

న్యూయార్క్, ఫిబ్రవరి 5: ఇప్పుడున్న వాటికన్నా మరింత ప్రభావవంతంగా పనిచేసే మలేరియా వ్యాక్సిన్‌ను అమెరికాలోని చికాగో యూనివర్సిటీ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. రోగనిరోధక వ్యవస్థలోని నిర్దిష్ట కణజాలాన్ని లక్ష్యంగా చేసుకొని ఈ టీకాను అభివృద్ధి చేశారు. దీంతో ఈ వ్యాక్సిన్‌కు ఎక్కువ రోగనిరోధక శక్తి, యాంటీబాడీ రియాక్షన్ ఉన్నట్టు పరిశోధకులు గుర్తించారు. ప్రస్తుతం మలేరియాకు వ్యాక్సిన్ ఉన్నప్పటికీ అది 30 నుంచి 50 శాతమే ప్రభావం చూపుతోంది. 'ప్రస్తుత మలేరియా వ్యాక్సిన్‌తో పోలిస్తే.. మేం అభివృద్ధి చేసిన టీకా ఉత్తేజకరమైన ఫలితాన్ని అందించింది' అని చికాగో యూనివర్సిటీ ప్రొఫెసర్ జెఫ్రీ హుబెల్ తెలిపారు.

ఆర్డీల పనితీరుపై మంత్రి శ్రావణ్ ఆరా!

▸▸ 'ఆంధ్రజ్యోతి' కథనంపై స్పందన.. విచారణకు ఆదేశం

అమరావతి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): డైరెక్టర్ ఆఫ్ హెల్త్ పరిధిలో ఉన్న రీజనల్ డైరెక్టర్ (ఆర్డీ) కార్యాలయాల్లో జరుగుతున్న అవినీతిపై మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'ఆరోగ్యశాఖలో ముడుపుల జాతర' కథనంపై మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ స్పందించారు. ఈ వ్యవహారంపై విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. అప్పటిదాకా కౌన్సెలింగ్‌లన్నింటినీ నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో కౌన్సెలింగ్‌లను నిలిపివేశారు. మరోవైపు 'ఆంధ్రజ్యోతి' కథనంపై ఆర్డీ కార్యాలయం వివరణ ఇచ్చింది. పదోన్నతులను సీనియార్టీ ఆధారంగానే చేస్తున్నామని, నిబంధనలు ఉల్లంఘించలేదని వివరించింది.

▸▸ ఎన్టీపీసీకి రూ.100 కోట్లు చెల్లింపు

బకాయి తక్షణమే చెల్లించకుంటే బుధవారం నుంచి విద్యుత్తు సరఫరా నిలిపివేస్తామంటూ ఎన్టీపీసీ చేసిన హెచ్చరికలు ఫలించాయి. ఏపీ సహా తెలంగాణ, కర్ణాటక, పలు దక్షిణాది రాష్ట్రాలు ఎన్టీపీసీకి వేల కోట్లలో బకాయి పడ్డాయి. ఈ బకాయిలు తక్షణమే చెల్లించకుంటే బుధవారం నుంచి విద్యుత్తు సరఫరా నిలిపివేస్తామంటూ ఎన్టీపీసీ హెచ్చరించింది. రాష్ట్రానికి ఎన్టీపీసీ నుంచి 1400 మెగావాట్ల విద్యుత్తు సరఫరా అవుతోంది. ఈ విద్యుత్తు కోసం రూ.2100 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఎన్టీపీసీ హెచ్చరికలతో ఏపీ రూ.100 కోట్లు చెల్లించింది. దీంతో సరఫరా నిలిపివేయాలన్న నిర్ణయాన్ని ఎన్టీపీసీ ఉపసంహరించుకుంది.

ప్రతిపక్షనేతగా జగన్ అట్టర్‌ఫ్లాప్: కేఏపాల్

కడప మారుతీనగర్, ఫిబ్రవరి 5: పాలకుల నిర్లక్ష్యంతోనే రాయలసీమ రాళ్లసీమగానే ఉందని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ అన్నారు. మంగళవారం కడపలో ఆయన మీడియాతో మాట్లాడారు.విక్షనేతగా జగన్ అట్టర్‌ఫ్లాప్ అయ్యారన్నారు. ప్రజల పక్షాన పోరాటం చేయాల్సిన జగన్, అసెంబ్లీకి డుమ్మాకొట్టడం సరైంది కాదన్నారు.

కాపుల పురోగతే లక్ష్యం

▸▸ కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కొత్తపల్లి సుబ్బారాయుడు

విజయవాడ (వన్‌టౌన్), ఫిబ్రవరి 5: కాపుల పురోగతి, అభ్యున్నతే లక్ష్యంగా కాపు కార్పొరేషన్ పని చేస్తోందని కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు అన్నారు. మంగళవారం విజయవాడలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాపులను ఆర్థికంగా, విద్య, ఉద్యోగ పరంగా పైకి తీసుకురావాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. గత నాలుగు సంవత్సరాలుగా కాపు కార్పొరేషన్ కోసం రూ. 3,100 కోట్లను మంజూరు చేశారన్నారు. కాపుల కోసం ప్రభుత్వం రూ. 4,223 కోట్లను ఖర్చు చేసిందని, బ్యాంక్ లింకేజీతో కలిపి సుమారు రూ. 6 వేల కోట్లకు పైబడి లబ్ధి చేకూరిందన్నారు. విదేశీవిద్య పథకం కింద 1892 మందికి రూ. 207 కోట్లు మంజూరు చేసినట్టు, ఇందులో 1282 మందికి రూ. 116.58 కోట్లను విడుదల చేసినట్టు తెలిపారు. కేంద్రప్రభుత్వం ప్రకటించిన పదిశాతం ఈబీసీ రిజర్వేషన్‌లలో రాష్ట్రంలో 5శాతం కాపులకు కేటాయిస్తూ శాసనసభలో ప్రవేశపెట్టడం ద్వారా చట్ట బద్దత తీసుకురావడం జరుగుతోందన్నారు. పేద, నిరుపేద కుటుంబాలకు చెందిన కాపులను అన్ని విధాలుగా ఆదుకునేందుకు విదేశీ విద్యా దీవెన, విద్యోన్నతి, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను పెద్దఎత్తున అమలు చేస్తామన్నారు. విదేశీ విద్యాదీవెన పథకంలో భాగంగా రూ. పదిలక్షల ఆర్థికసాయంతో పాటు విమాన యాన చార్జీలు, విసా చార్జీలు మొత్తం రూ. 11.50 లక్షలు మేర ఖర్చులు ప్రభుత్వమే భరిస్తోందన్నారు.

కార్పొరేషన్లు లేని బీసీలకూ ప్రాధాన్యం: సీఎం

అమరావతి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన బీసీ కార్పొరేషన్ల పరిధిలోకి రాని, కార్పొరేషన్లు లేని సూర్యబలిజ, కూరాకుల, అచ్చుకట్ల వాండ్ల, జక్కల సామాజిక వర్గాలకూ ప్రభుత్వ ఆర్థిక పథకాల అమలులో అత్యధిక ప్రాధాన్యమివ్వాలని సీఎం చంద్రబాబు అధికారులను బుధవారం ఆదేశించారు. ఆయా సామాజిక వర్గాల నుంచి వచ్చిన అభ్యర్థనలు, ప్రతిపాదనలపై సీఎం స్పందించారు. రాష్ట్రంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన పని లేదని, పేదరిక నిర్మూలన కోసమే కార్పొరేషన్లు ఏర్పాటు చేశామని చెప్పారు. బీసీ ఫెడరేషన్లను బీసీ సామాజిక వర్గాల కార్పొరేషన్లుగా ఉన్నతీకరణ చేసిన తమ ప్రభుత్వం, పథకాల ఫలాలు అందరికీ అందించాలన్న ఆకాంక్షతో పని చేస్తోందని స్పష్టం చేశారు.

12న వాల్మీకి, బోయల చలో ఢిల్లీ: మంత్రి కాల్వ

అమరావతి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోని వాల్మీకి, బోయ కులస్థులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు కేంద్ర ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని కోరుతూ.. ఈ నెల 12వ తేదీన ఢిల్లీలో ధర్నా నిర్వహించనున్నట్లు రాష్ట్ర సమాచారశాఖ మంత్రి కాల్వ శ్రీనివాసులు తెలిపారు. అత్యంత ప్రాచీన గిరిజన తెగగా ఎప్పటి నుంచో ఆధారాలున్నా, వాల్మీకి, బోయలు నేటికీ గిరిజనులుగా గుర్తింపు పొందకపోవడం విచారకరమని మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వాల్మీకి, బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరుతూ రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపి 14 నెలలవుతున్నా, ఇంత వరకు కేంద్రం ఎలాంటి చర్యలూ తీసుకోలేదని మంత్రి విమర్శించారు.

ఎస్పీ బాలు తల్లికి కన్నీటి వీడ్కోలు



తల్లి మృతదేహం వద్ద విషణ్ణ వదనంతో ఎస్పీ బాలు

నెల్లూరు, ఫిబ్రవరి 5 : సుప్రసిద్ధ గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం మాతృమూర్తి శకుంతలమ్మ అంత్యక్రియలు మంగళవారం నెల్లూరులో అశ్రునయనాల మధ్య జరిగాయి. శకుంతలమ్మ సోమవారం ఉదయం మృతిచెందగా, ఆ సమయానికి లండన్‌లో ఉన్న బాలు మంగళవారం ఉదయానికి నెల్లూరు చేరుకున్నారు. విషాద వదనంతో మాతృమూర్తి భౌతికకాయం వద్దనే బాలు విలపిస్తూ కొంతసేపు ఉండిపోయారు. అనంతరం తోబుట్టువులు శైలజ, వసంత, పార్వతి తదితరులను ఓదార్చారు. ఉదయం 11.40 గంటలకు అంత్యక్రియలు ప్రారంభించారు. అంతిమయాత్రలో తల్లి పాడెను బాలు ముందుగా భుజానికెత్తుకోగా కుటుంబ సభ్యులు, బంధువులు వెంటనడిచారు.

1 నుంచి దేశవ్యాప్తంగా రేషన్ బంద్

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్ల సమస్యలను పరిష్కరించాలని, లేకపోతే మార్చి 1 నుంచి రేషన్ సరుకుల పంపిణీని నిలిపివేస్తామని ఆలిండియా రేషన్ డీలర్ల సమాఖ్య హెచ్చరించింది. మంగళవారం ఢిల్లీలో జరిగిన సమాఖ్య కేంద్ర కమిటీ సర్వసభ్య సమావేశానికి అన్ని రాష్ట్రాల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు హాజరయ్యారు. ఇందులో పలు తీర్మానాలను కేంద్ర కమిటీ ఆమోదించింది. దేశవ్యాప్తంగా ఉన్న 5.17లక్షల మంది రేషన్ డీలర్లకు నెలకు రూ.50 వేల వేతనం ఇవ్వాలని, లేకుంటే క్వింటాల్‌కు రూ.300 కమీషన్ ఇవ్వాలని కమిటీ డిమాండ్ చేసింది.

భీమవరంలో మత్స్య, సముద్ర వర్సిటీ!

▸▸ రూ.300 కోట్లతో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం

▸▸ మంత్రి ఆదినారాయణ వెల్లడి

అమరావతి, ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో మత్స్య, సముద్ర విశ్వ విద్యాలయం ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతినిచ్చినట్లు మత్స్యశాఖ మంత్రి సి.ఆదినారాయణరెడ్డి చెప్పారు. ఈ మేరకు మంగళవారం సచివాలయంలో ఉద్దరాజు ఆనందరాజు ఎడ్యుకేషన్ ట్రస్ట్ ప్రతినిధి ఉద్దరాజు కాశీవిశ్వనాథరాజుకు లెటర్ ఆఫ్ ఇండెంట్‌ను అందజేశారు. భీమవరం సమీపంలో రూ.300కోట్లతో 150ఎకరాల్లో ఏర్పాటు చేసే ఈ విశ్వ విద్యాలయం కేరళ, తమిళనాడు తర్వాత దేశంలో మూడోదిదని, వచ్చే ఏడాది జూన్ నుంచి తరగతులు ప్రారంభమవుతాయని మంత్రి చెప్పారు. ఇందులో మత్స్యశాఖ అధికారులకు, రైతులకు శిక్షణ కార్యక్రమాలు కూడా చేపట్టనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మత్స్య, పశుసంవర్ధకశాఖ కార్యదర్శి దమయంతి పాల్గొన్నారు.

'ఆదిత్య' శేషారెడ్డికి జీవిత సాఫల్య పురస్కారం



జీవిత సాఫల్య పురస్కారాన్ని అందుకుంటున్న శేషారెడ్డి

కాకినాడ రూరల్, ఫిబ్రవరి 5: ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డికి జీవిత సాఫల్య పురస్కారం లభించింది. విద్యారంగంలో ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా బ్రైన్‌ఫీడ్ సంస్థ 6వ జాతీయ సమావేశంలో ఢిల్లీ విశ్వవిద్యాలయం మాజీ వీసీ ప్రొఫెసర్ దినేష్‌సింగ్ ఈ పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తూర్పుగోదావరిజిల్లా కాకినాడ ఆదిత్యలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో శేషారెడ్డి మాట్లాడుతూ... జనవరి 31న హైదరాబాద్‌లోని ఒక హోటల్‌ల్లో నిర్వహించిన సమావేశంలో 2018-19 సంవత్సరానికి తనను ఈ పురస్కారంతో సత్కరించారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ చుక్కారామయ్య, ఇంటెలిజెన్స్ డీఐజీ శివకుమార్, జేఎన్టీయూహెచ్ పరిశోధనాభివృద్ధి డైరెక్టర్ ఎం.అంజిరెడ్డి పాల్గొన్నారని తెలిపారు. ఒక అధ్యాపకుడిగా జీవితాన్ని ప్రారంభించి ఆదిత్య విద్యాసంస్థలను స్థాపించి కోస్తాజిల్లాల్లో ఒక ప్రముఖ విద్యాసంస్థగా గుర్తింపు పొంది 6వేల మందికి ఉద్యోగావకాశాలు కల్పించామన్నారు. పాఠశాల స్థాయి నుంచి పీజీ వరకు ఉన్న తమ కళాశాలల్లోని 60 సంస్థలలో 65వేల మందికి విద్యనందిస్తున్నామని తెలిపారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నానన్నారు.

డెడ్ స్టోరేజిని తోడకండి

▸▸ శ్రీశైలం ప్రాజెక్టుపై కృష్ణా బోర్డు నిర్ణయం

▸▸ 2 తెలుగు రాష్ట్రాలకు లేఖ

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ప్రాజెక్టులో డెడ్ స్టోరేజిలోని దిగువ నీటిని ఉపయోగించవద్దని కృష్ణా బోర్డు 2 తెలుగు రాష్ట్రాలకు సూచించింది. బోర్డు అనుమతి లేనిదే ఈ నీటిని తోడకూడదని పేర్కొంది. ఈ మేరకు బోర్డు సభ్య కార్యదర్శి పరమేశం మంగళవారం తెలంగాణ, ఏపీ రాష్ట్రాల నీటిపారుదల శాఖ ఈఎన్‌సీలకు లేఖలు రాశారు. ప్రస్తుతం శ్రీశైలం రిజర్వాయర్‌లో నీటి నిల్వలు 834 అడుగులకు చేరినందున దిగువలోని నీటిని ఉపయోగించకూడదు. ఇదే విషయాన్ని బోర్డు లేఖల్లో ప్రస్తావించింది. కాగా నాగార్జునసాగర్ నుంచి 3.43 టిఎంసీల నీటిని వాడుకునేందుకు ఏపీకి బోర్డు అనుమతిని జారీ చేసింది. ఇందులో సాగర్ ఎడమ కాల్వ అవసరాలకు 1.43 టిఎంసీలు, కుడి కాల్వ అవసరాలకు 2 టిఎంసీల నీటిని కేటాయించింది.

రథసప్తమి రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈనెల 11, 12 తేదీల్లో ప్రొటోకాల్ వర్తించే ప్రముఖులకు మాత్రమే వీఐపీ బ్రేక్ దర్శనం పరిమితం చేస్తున్నట్టు టీటీడీ ఒక ప్రకటనలో తెలిపింది. అలాగే 12న వృద్ధులు, దివ్యాంగులు, చంటిబిడ్డ తల్లితండ్రుల ప్రత్యేక ప్రవేశ దర్శనాలను కూడా రద్దు చేశారు.

మాల్యా రాక ఎప్పుడు?

విజయ్‌మాల్యాను వెనక్కు తెచ్చే బృహత్కార్యంలో మరో ముందడుగు పడింది. మాల్యాను భారత్‌కు అప్పగించమంటూ లండన్‌లోని వెస్ట్‌మినిస్టర్ కోర్టు డిసెంబరు 10న తీర్పు చెబితే, అంతిమ నిర్ణయం చేయాల్సిన హోంశాఖ కూడా ఆదివారం సానుకూలంగా స్పందించింది. మాల్యా అప్పగింతకు తలూపుతూ పాకిస్థాన్ సంతతికి చెందిన బ్రిటన్ హోంమంత్రి సాజీద్ జావీద్ పత్రాలపై సంతకాలు చేయడంతో భారత పాలకులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే, ఈ నిర్ణయంపై బ్రిటన్ ఉన్నత న్యాయస్థానాల్లో అప్పీలుకు పోతున్నట్టు మాల్యా ప్రకటించిన నేపథ్యంలో ఈ సుదీర్ఘ న్యాయపోరాటం ఇప్పట్లో ఒక కొలిక్కి రాకపోవచ్చు.

వెస్ట్‌మినిస్టర్ కోర్టు తీర్పునూ, తదనుగుణంగా హోంశాఖ తీసుకున్న నిర్ణయాన్నీ సవాలు చేస్తూ హైకోర్టులో మాల్యా పోరాడుతారు. మాల్యా అప్పీలును హైకోర్టు తిరస్కరించిన పక్షంలో మాత్రమే ఎన్నికలు మొదలయ్యేలోగా ఆయనను దేశానికి తేవాలన్న పాలకుల అభీష్టం నెరవేరే అవకాశాలున్నాయి. తీసుకున్న అప్పును పక్కదారి పట్టించాడనీ, వ్యక్తిగత అవసరాలకు వాడుకున్నాడనీ మేజిస్ట్రేట్ కోర్టు నమ్మినట్టుగానే హైకోర్టు కూడా భావిస్తే తీర్పు భిన్నంగా రాకపోవచ్చు. కానీ, బ్రిటన్ అప్పగింతల చట్టంలోని కొన్ని రక్షణలను మాల్యా అస్త్రాలుగా వాడుకొనే సూచనలున్నాయి. అప్పగించిన వ్యక్తిని సదరు దేశం ఉరితీసే అవకాశాలున్నా, అప్పగిస్తున్న కేసుతో పాటు ఇతరత్రా కేసుల్లో ఇరికిస్తారని అనిపించినా ఈ అప్పగింత రద్దుకావచ్చు. అప్పీలులో మాల్యా ఇప్పటివరకూ మేజిస్ట్రేట్ కోర్టులో ఏయే వాదనలైతే చేశారో అన్నీ హైకోర్టులో మొదటినుంచీ చేయవచ్చు. కక్షసాధింపనీ, ఆరోపణలకు ఆధారాలు లేవనీ, భారత్ జైళ్ళలో దుర్భరమైన పరిస్థితులున్నాయనీ, న్యాయవిచారణ పక్షపాతంగా జరుగుతుందనీ ఎన్నైనా చెప్పుకోవచ్చు. అప్పీలుకు పదిహేను రోజుల గడువున్నది కానీ, వాదనలు మొదలు కావడానికీ, తీర్పురావడానికీ ఎన్ని నెలలైనా పట్టవచ్చు. అప్పీలును హైకోర్టు తిరస్కరిస్తే సుప్రీంకోర్టుకు కూడా పోవచ్చు. ఈ కేసులో విస్తృత ప్రజాశ్రేయస్సూ, ప్రాధాన్యతలు ఇమిడివున్నాయని హైకోర్టు నిర్ధారిస్తే చాలు. భారత్–బ్రిటన్ అప్పగింతల ఒప్పందం ప్రకారం మనదేశం రెండో కేటగిరీలో ఉన్నది కనుక అక్కడి న్యాయవ్యవస్థలు ఇచ్చే ఈ తరహా తీర్పులపై అంతిమ నిర్ణయాధికారం హోంశాఖదే. సుప్రీంకోర్టులో ఏ నిర్ణయం జరిగినా వ్యవహారం తిరిగి హోంశాఖ ముందుకు వస్తుంది. ఇప్పటిమాదిరిగానే అప్పుడు కూడా సానుకూల నిర్ణయం జరిగితేనే మాల్యా భారత్ వస్తారు. అప్పగింతల విషయంలో హోంశాఖ ఏ నిర్ణయమూ తీసుకోకుండా ఏళ్ళతరబడి నాన్చిన ఉదాహరణలు అనేకం.

మాల్యా రావడానికి కనీసం ఏడాది పడుతుందని కొందరి అంచనా. భారత్–బ్రిటన్ అప్పగింతల ఒప్పందం కుదిరిన దశాబ్దంన్నర కాలంలో ఇప్పటివరకూ వెనక్కు రప్పించగలిగిది ఒకే ఒక్కరిని. గోధ్రా అనంతర ఘటనల్లో పాలుపంచుకున్న సమీర్‌భాయ్ వినూభాయ్ పటేల్ 2016లో ఇలా వచ్చారు. ఈ లెక్కన మాల్యాను తీసుకురావడంలో ఎంత జాప్యం జరిగినా అది భారత్‌కు విజయోత్సాహాన్నిచ్చేదే. ఈ దేశ ప్రజల సొమ్ముదోచుకొని విదేశాలకు పోయి విలాసాలు చేస్తున్న మాల్యావంటి అనేకులకు ఇది హెచ్చరికగా పని చేస్తుంది. పాలకుల్లో పట్టుదల ఉంటే, సమస్త వ్యవస్థలను సంఘటితం చేసి తదేక దృష్టితో కృషి చేస్తే ఇటువంటివారిని వెనక్కు తీసుకురావడం అసాధ్యమేమీ కాదు. మాల్యా రాక ప్రభావం ఎన్నికలపై ఎంత ఉంటుందో చెప్పలేం కానీ, పాలకులు మాత్రం సార్వత్రిక ఎన్నికల్లోగా ఆయనను పుట్టింటికి తెచ్చి, కోల్పోయిన పరువుప్రతిష్టలను తిరిగి దక్కించుకోవడానికి శ్రమిస్తున్నారు. చోక్సీ, నీరవ్ కూడా వెంటవెంటనే వచ్చేస్తారని హామీ ఇస్తున్నారు. ఈ పిడికెడు మంది మాత్రమే కాక, ఈ దేశ బ్యాంకులను ముంచి, ఇక్కడినుంచి ఎగిరిపోయినవారి సంఖ్య రెండు పదులు దాటే ఉందని నివేదికలు అంటున్నాయి. బ్యాంకులు రుణాలపై రుణాలు ఇస్తూపోవడం, పేరుకుపోతున్న బకాయిలు బయటకు పొక్కకపోవడం, చివరకు వారు దేశం వదిలి ఎగిరిపోతుంటే సర్వవ్యవస్థలూ సహకరించడం ఈ దుస్థితికి కారణం. ఇందుకు విరుగుడుగా యాభైకోట్లకు మించిన రుణ ఎగవేతదారుల జాబితా బహిర్గతం చేయమంటూ గత ఏడాది కేంద్ర సమాచార కమిషన్ రిజర్వుబ్యాంకును ఆదేశించినప్పటికీ ఫలితం లేకపోయింది. మాల్యా రాకకంటే, నష్టపోయిన బ్యాంకులకు తిరిగి సొమ్ము సమకూర్చిపెట్టడం ముఖ్యం. గతనెలలో పలాయిత ఆర్థిక నేరస్థుడిగా మాల్యాను ప్రకటించి 12వేల కోట్ల రూపాయల ఆస్తిపాస్తులను ప్రభుత్వం స్వాధీనంచేసుకున్నది. అయితే, నష్టపోయిన బ్యాంకులకు న్యాయం చేకూర్చే విషయంలో మాత్రం ఇప్పటికీ స్పష్టత లేకపోయింది.

నీతిబాహ్య బాటల్లో భారత ప్రజాస్వామ్యం

ఇండియాగేట్



■ ఎ. కృష్ణారావు

రాజనీతిజ్ఞులు రాజకీయ కారణాల వల్ల ఆవేశపూరితంగా వ్యవహరించినప్పటికీ వాటి వల్ల దేశ రాజ్యాంగంలో పొందుపరచిన కేంద్ర, రాష్ట్ర సంబంధాలకు, సమాఖ్య స్ఫూర్తికి భంగం వాటిల్లకుండా జాగ్రత్తపడుతుంటారు. పోలీసులకూ, సైనికులకూ మధ్య ఘర్షణ జరిగేంత తక్కువస్థాయి రాజకీయాలకు కేంద్ర, రాష్ట్రాలు పాల్పడేలా నేతలు హుందాతనాన్ని కోల్పోతే ఇక రాజ్యాంగమెందుకు? ఈ ప్రజాస్వామ్య వ్యవస్థ ఎందుకు?

లోక్ సభ ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ దేశ రాజకీయ వాతావరణం మరింత వేడెక్కుతోంది. సోమవారం సాయంత్రం నేషనల్ కాంగ్రెస్ పార్టీ నేత, మరాఠాయోధుడు శరద్ పవార్ నివాసంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌తో పాటు నేషనల్ కాన్ఫరెన్స్, జనతాదళ్ (ఎస్)తో పాటు కొన్ని ప్రాంతీయ పార్టీల నేతలు సమావేశమయ్యారు. కోల్‌కతాలో, నగర పోలీస్ కమిషనర్‌ను అరెస్టు చేసేందుకు సిబిఐ అధికారులు పెద్ద ఎత్తున ఆయన ఇంటి వద్ద కేంద్ర భద్రతా దళాలను మోహరించడంపైనా, తర్వాత ఏర్పడిన పరిణామాలపైనా వారు ఆందోళన వ్యక్తం చేశారు. మాజీ ప్రధాని దేవెగౌడ, డిఎంకె నేత స్టాలిన్, ఎస్‌పి నేత రాంగోపాల్ యాదవ్, బిఎస్‌పి నేత మాయావతి, ఆర్‌జెడి నేత తేజస్వి యాదవ్ మొదలైన వారంతా మమతకు సంఘీభావంగా నిలిచారు. ఆఖరుకు శివసేన కూడా సిబిఐ అధికారులు చేపట్టిన చర్యను ప్రజాస్వామ్యానికి ముప్పుగా అభివర్ణించింది. ఉత్తర, పశ్చిమ భారతంలో తమకు వంద సీట్లు తక్కువ వస్తాయని గ్రహించినందువల్లే బిజెపి బెంగాల్‌లో 10–15 సీట్లు సంపాదించుకునేందుకే ఈ హంగామా సృష్టించిందని శివసేన తన అధికార పత్రిక 'సామ్నా'లో విమర్శించింది. 'అమ్మ పుట్టిల్లు మేనమామకు తెలిసినట్లు' బిజెపి సంగతి శివసేనకు కాక మరే పార్టీకి ఎక్కువ తెలుస్తుంది?

ఈ విపత్కర పరిణామాలు అవినీతి కుంభకోణానికి సంబంధించిన విషయం మాత్రమేనని ఎవరైనా అనుకుంటే వారు విషయాన్ని సమగ్రంగా అర్థం చేసుకోవడానికి నిరాకరిస్తున్నారని చెప్పక తప్పదు. భారత దేశంలో అనేక అవినీతి కుంభకోణాలు జరిగాయి. కాని ఈ కుంభకోణాలు కేంద్రానికీ రాష్ట్రానికి మధ్య ఘర్షణగా మారిన ఉదంతాలు స్వాతంత్ర్యం తర్వాత ఎప్పుడూ ఎక్కడా జరగలేదు. పోలీసులకూ సిబిఐ అధికారులకు ఘర్షణ జరగడం, సిబిఐ తమ కార్యాలయాన్ని కాపాడుకునేందుకు పారామిలటరీ దళాల్ని రంగంలోకి దించడం వంటి సంఘటనలు గతంలో ఎప్పుడూ వినలేదు.

యుపిఏ హయాంలో బెంగాల్ తీరంలో భారత అమెరికా సంయుక్త వైమానిక విన్యాసాలపై అభ్యంతరం వెలిబుచ్చి సిపిఐ(ఎం) కార్యకర్తలు అడ్డుకుంటారని ఆ పార్టీ ముఖ్యమంత్రి బుద్దదేవ్ భట్టాచార్య హెచ్చరించడంతో అత్యంత సాత్వికుడైన అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ సైతం తీవ్రంగా స్పందించారు. రక్షణ, విదేశాంగ విధానాలను అనుసరించే విషయంలో ఏ రాష్ట్ర ప్రభుత్వమూ కేంద్రాన్ని అడ్డుకోలేదని, రక్షణ స్థావరాల వద్ద శాంతి భద్రతలను రాష్ట్ర ప్రభుత్వం కాపాడకపోతే ఆ ప్రభుత్వాన్నే రద్దు చేస్తామని ఆయన హెచ్చరించారు. దీనితో భట్టాచార్య దిగిరావడమే కాక సిపిఐ(ఎం) అప్పటి ప్రధాన కార్యదర్శి ప్రకాశ్ కారత్ ప్రధానమంత్రికి ఫోన్ చేసి రక్షణ విన్యాసాలకు తమ పార్టీ కార్యకర్తలు ఎలాంటి విఘాతం కల్పించబోరని హామీ ఇచ్చారు. దేశ భద్రతకు సంబంధించి ఇలాంటి కీలక ప్రాధాన్యత గల సంఘటన తప్ప కేంద్రం, రాష్ట్రానికి స్పర్థలు వచ్చిన దాఖలాలు లేవు. రాజనీతిజ్ఞులు రాజకీయ కారణాల వల్ల ఆవేశపూరితంగా వ్యవహరించినప్పటికీ వాటి వల్ల దేశ రాజ్యాంగంలో పొందుపరచిన కేంద్ర, రాష్ట్ర సంబంధాలకు, సమాఖ్య స్ఫూర్తికి భంగం వాటిల్లకుండా హుందాగా జాగ్రత్తపడుతుంటారు. పోలీసులకూ, సైనికులకూ మధ్య ఘర్షణ జరిగేంత తక్కువ స్థాయి రాజకీయాలకు కేంద్ర, రాష్ట్రాలు పాల్పడితే, నేతలు హుందాతనం కోల్పోతే ఇక రాజ్యాంగమెందుకు? ఈ ప్రజాస్వామ్య వ్యవస్థ ఎందుకు?

నిజానికి కోల్‌కతా పరిణామాలపై సుప్రీంకోర్టు కలుగ చేసుకోకపోతే పరిస్థితి మరింత అధ్వాన్నంగా మారి ఉండేది. బహుశా రాజ్యాంగ సంక్షోభం సృష్టించారన్న పేరుతో కేంద్రం మమతా బెనర్జీ ప్రభుత్వాన్ని రద్దు చేసి ఉండేది. అందుకు గవర్నర్‌ను సిద్ధం చేశారన్న వార్తలూ వచ్చాయి. శారదా కుంభకోణంలో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం దర్యాప్తును అడ్డుకున్నదనడానికి సాక్ష్యాలేమిటని ప్రశ్నించిన సుప్రీంకోర్టు ఒక తటస్థ రాష్ట్రంలో పోలీస్ కమిషనర్‌ను పిలిచి వివరాలు సేకరించవచ్చునని, ఆయనను అరెస్టు చేయనవసరం లేదని చెప్పింది. ఢిల్లీలో కోల్‌కతా పోలీసు కమిషనర్ విచారణనుకానీ, ఆయన అరెస్టును కానీ ఎందుకు అనుమతించలేదు? కేంద్రం, సిబిఐ ఈ ప్రశ్నలకు సంబంధించి ఆత్మపరిశీలన చేసుకోవాలి. శారదా కుంభకోణంపై మమతా బెనర్జీ నియమించిన ప్రత్యేక దర్యాప్తు బృందం చీఫ్‌గా ఉన్న కోల్‌కతా పోలీసు కమిషనర్ తన దగ్గర ఉన్న వివరాలను సిబిఐకి సమర్పించకపోతే లేక ఆ కుంభకోణంపై విచారణలో సిబిఐకి సహకరించకపోతే ఆ విషయం సుప్రీంకోర్టుకు చెప్పాల్సిన బాధ్యత సిబిఐది. ఎందుకంటే శారదా చిట్ ఫండ్ కుంభకోణం వివిధ రాష్ట్రాల్లో జరిగినందువల్ల దానిపై సిబిఐ విచారణ జరపాలని 2014లో చెప్పింది సుప్రీంకోర్టే. గత అయిదేళ్లలో ఎప్పుడైనా కోల్‌కతా పోలీసు కమిషనర్ తమకు సహకరించలేదని సిబిఐ సుప్రీంకోర్టుకు చెప్పిందా? సరిగ్గా ఇప్పుడే లోక్‌సభ ఎన్నికల షెడ్యూలు ప్రకటించడానికి కేవలం నెల ముందు కోల్‌కతా వెళ్లి పోలీసు కమిషనర్ ఇంటిని చుట్టుముట్టాల్సిన అవసరం ఏమొచ్చింది?



బహుశా 2019 ఎన్నికల్లో ఏదో రకంగా మమతా బెనర్జీని అభాసు పాలు చేసి రాజకీయ ప్రయోజనాలు పొందేందుకే మోదీ సర్కార్ ఈ చర్యకు పాల్పడి ఉండాలి. చిట్‌ఫండ్‌ల పేరిట ప్రజల వద్ద వేల కోట్ల డబ్బులు వసూలు చేసి వ్యాపారాన్ని అనేక రంగాలకు విస్తరించి, ప్రజలను మోసగించిన శారదా కుంభకోణంలో ఎక్కడా మమతా బెనర్జీ పేరు లేదు. నిత్యం నారచీరలు కట్టుకునే ఆమెకు ఈ కుంభకోణంలో వ్యక్తిగత పాత్ర ఉన్నదని ఇంతవరకూ తేలలేదు. ఉంటే మోదీ సర్కార్ ఇప్పటివరకూ ఊరుకునేది కాదు. సరే, ఆమె పార్టీ నేతలు కొందరికి కుంభకోణంలో పాత్ర ఉండవచ్చు. యుపిఏ హయాంలోనే ఈ కుంభకోణం బయటపడి, తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన నేతలు జైలు పాలయ్యారు. మరో మంత్రి బిజెపి హయాంలో అరెస్టయ్యారు. పశ్చిమబెంగాల్ లోనే కాదు, అస్సాం, జార్ఖండ్, బిజెపి పాలిత ఛత్తీస్‌గఢ్‌కూ ఈ కుంభకోణం పాకింది. విచిత్రమేమంటే ఈ కుంభకోణంలో కీలక పాత్ర వహించి, శారదా గ్రూప్ మీడియా విభాగానికి సారథ్యం వహించి, ఆ గ్రూప్ చైర్మన్ సుదీప్త సేన్ కోల్‌కతా నుంచి పారిపోవడానికి సహాయపడ్డారనే ఆరోపణ ఎదుర్కొన్న ఒకప్పటి మమత కుడిభుజం ముకుల్ రాయ్ విచారణ జరుగుతుండగానే బిజెపిలో చేరారు. మరి ఆయనపై సిబిఐ ఇంతవరకూ ఏ విచారణ జరిపిందో ఎవరికీ తెలియదు. అస్సాంకు చెందిన ప్రస్తుత బిజెపిమంత్రి, మాజీ కాంగ్రెస్ నేత హేమంత బిశ్వాస్ శర్మ తన రాష్ట్రంలో శారదా గ్రూప్ వ్యాపారాన్ని విస్తరింపచేసేందుకు ఆ గ్రూప్ నుంచి నెలకు రూ.20 లక్షలు పొందేవారని, తనను రూ.3 కోట్లకు పైగా మోసం చేశారని సుదీప్త సేన్ లేఖ రాశారని ఆరోపణలున్నాయి. ముకుల్‌రాయ్, హేమంత బిశ్వాస్‌లు బిజెపిలో చేరిన తర్వాతే వారిపై సిబిఐ విచారణ మందగించిందని అంటున్నారు. మమతా బెనర్జీని దెబ్బతీసేందుకు ముకుల్ రాయ్‌ను, ఈ కుంభకోణంలో అరెస్టైన మరికొంతమందిని బిజెపి ఉపయోగించుకుంటున్నారని ఆరోపణలున్నాయి. అంతేకాదు, పోలీస్ కమిషనర్‌ను టార్గెట్ చేయడానికి ప్రధాన కారణం ఆయన మమతా బెనర్జీకి నమ్మకస్తుడైన వ్యక్తి కావడమేనని కూడా వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి.

సిబిఐ కోల్‌కతాలో సృష్టించిన ఈ హంగామా విచారణపై నిజాయితీతో చేసింది కాదనే విషయం స్పష్టమవుతోంది. ఇటీవలి కాలంలో సిబిఐ ఏ దర్యాప్తు అయినా నిజాయితీగా చేసిందని చెబితే నమ్మేందుకు ఎవరూ సిద్ధంగా లేరు. గతంలో కూడా సిబిఐ తన రాజకీయ యజమానులకు అనుగుణంగా నడుచుకుంది కాని మోదీ హయాంలో ఆ సంస్థ చాలా పచ్చిగా వ్యవహరిస్తున్నదనేందుకు అనేక ఉదాహరణలు ఉన్నాయి. ఎంత పచ్చిగా వ్యవహరిస్తున్నదంటే సిబిఐ అధికారులపై సిబిఐ అధికారులే కేసులు పెట్టుకునే దాకా దిగజారారు. సిబిఐ అధికారులే గ్రూపులను నిర్వహించుకుంటారని, ఒక అధికారి అందలం ఎక్కితే మరో అధికారి వర్గాన్ని శంకర గిరి మాన్యాలు పట్టిస్తారని తాజాగా తెలిసింది. సిబిఐకి కనుక నిజాయితీ ఉంటే ముకుల్ రాయ్, హేమంత్ బిశ్వాస్‌లు కటకటాల వెనుక ఉండేవారు. అసలు బిజెపికి అవినీతిపై పోరాడాలన్న నిజాయితీయే ఉంటే వారిని పార్టీలో చేర్చుకునేదే కాదు. సిబిఐకి కనుక నిజాయితీ ఉంటే కొన్ని కేసుల్లో విచారణ మందకొడిగా సాగేది కాదు. కర్ణాటకలో యడ్యూరప్ప, గాలి జనార్దన్ రెడ్డి వంటి అవినీతి, అక్రమ మైనింగ్ ఆరోపణలున్నవారి అండతో ఓట్లు సంపాదించేందుకు ప్రయత్నించిన బిజెపికి నిజంగా అవినీతిపై పోరాడాలన్న నిజాయితీ ఉన్నదా అన్నదే ప్రధాన ప్రశ్న. ఇప్పటికీ కర్ణాటకలో ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు బిజెపి నేతలు కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో బేరసారాలు ఆడుతున్నారనేది జగద్విదితం.

సిబిఐని మాత్రమే కాదు, ఐటి, ఈడీ వంటి సంస్థల్ని కూడా ప్రత్యర్థుల్ని బలహీనపరిచేందుకు మోదీ సర్కార్ ఉపయోగించుకుంటున్నదని వివిధ ప్రాంతీయ పార్టీల నేతలు వాపోతున్నారు. కర్ణాటక ఎన్నికల సందర్భంగా వివిధ వ్యాపార సంస్థలపై, పార్టీ నేతలపై విస్తృతంగా దాడులు జరిగాయి. తన ప్రభుత్వంలో ఏసీబీ కార్యాలయాన్నే పారామిలటరీ దళాలు స్వాధీనం చేసుకున్నాయని, తన ఇంటిని కూడా అంగుళం అంగుళం సోదా చేశారని, తన మంత్రులను, నేతలను, అధికారులను కూడా కేంద్ర సంస్థలతో వేధింపులకు గురి చేశారని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. ఎస్‌పి, బిఎస్‌పి నేతలు కూడా తాము ఈ వేధింపులకు గురయ్యామని అంటున్నారు. కొందరు ప్రాంతీయ పార్టీల నేతలైతే అసలు ఈ ఘటనలపై స్పందించేందుకే భయభ్రాంతులవుతున్నారు. ఇదో విచిత్ర పరిణామం.

తమ పార్టీ ఒక్కటే స్వచ్ఛమైనదని, తానొక్కడినే నీతిపరుడినని, మిగతా నాయకులంతా నీతిపరులు కారనీ, వారందరూ ఏకమయి తనను గద్దె దించాలని భావిస్తున్నారని చెప్పేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రయత్నిస్తున్నట్లు కనపడుతోంది. ఎమర్జెన్సీలో ప్రతిపక్షాలన్నీ దేశంలో అస్థిరత సృష్టిస్తున్నాయని ఆరోపించి ఇందిరాగాంధీ అందర్నీ కట్టకట్టి జైలులో వేస్తే మోదీ ఎమర్జెన్సీ విధించనవసరం లేకుండానే అందర్నీ భయభ్రాంతులు చేయాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఒకరకంగా ప్రతిపక్షాలన్నీ ఏకం అయ్యేందుకు ఆయనే దోహదం చేస్తున్నారు. కర్ణాటకలో కాంగ్రెస్, జెడిఎస్ ఏకం కావడానికి, యుపిలో ఎస్‌పి, బిఎస్‌పిలు ఏకం కావడానికి, దేశవ్యాప్తంగా ప్రతిపక్షాలు ఏకం కావడానికి మోదీయే కారకులవుతున్నారు. తద్వారా వారి ఓట్ బ్యాంకులు సంఘటితం అయ్యేందుకు వీలు కల్పిస్తున్నారు. కాని ఈ క్రమంలో కేంద్రాన్ని రాష్ట్రాలు శత్రువుగా పరిగణించేలా చేసి ఒక అంతర్గత యుద్ధ వాతావరణం ఏర్పరిస్తే దానికి ఎవరు బాధ్యులు? దేశంలో ఆరోగ్యకరమైన రాజకీయాల స్థానంలో విధ్వంసకర రాజకీయాలు ప్రవేశించడం, ఎన్నికల్లో గెలుపుకు దేశంలో వ్యవస్థలు బలి కావడం ఆందోళన కలిగిస్తోంది.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

దేవతా మూర్తులకూ హక్కులు ఉంటాయి!

గతంలో దండయాత్రలకు పాల్పడ్డ దురాక్రమణదారులు కేవలం మన దేవాలయాల భౌతిక సంపదను మాత్రమే కొల్లగొట్టారు తప్ప, మన ఆధ్యాత్మిక సంపత్తిని కాదు. ప్రస్తుత కాలంలో, ఈ ఆచార వ్యవహారాలపైనే దాడిచేసి నేటి ఆక్రమణ కారులు గతంలో చేయలేని విధంగా ఆధ్యాత్మిక సంపత్తిని సమూలంగా నాశనం చెయ్యాలని ప్రయత్నిస్తున్నారు.

హిందూ దేవాలయాలను ప్రభుత్వాలు తమ అజమాయిషీలో ఉంచుకోవడం వలన ఈ దేవాలయాలు భూ, కనక, వస్తు, ద్రవ్య రూపాలలో ఉండే తమ లక్షల కోట్ల సంపదలను చేజార్చుకుంటున్నాయన్న చేదునిజం అందరికీ తెలియడమే కాదు, రికార్డుల్లో ఉంది కూడా! తమిళనాడులో వెలుగు చూసిన ఎన్నో సంఘటనలను గమనిస్తే, వీరు అక్కడి మందిరాలలోని విగ్రహాలను కూడా వదలలేదని, వాటినీ తస్కరించి దొంగరవాణాలు చేశారని కూడా తెలుస్తోంది.

హిందూ దేవాలయాలను పరిరక్షించుకునేందుకు ప్రయత్నాలు చేసే వారికి శబరిమలలో భక్తుల పోరాటం ఒక మంచి ముఖ్యమైన పాఠాన్ని నేర్పింది. దేవాలయ పరిరక్షణ పోరాటాలకు భగవన్మూర్తుల హక్కులకై పోరాడడమే సరైన దిశయని చాటి చూపింది.

1925 ఏప్రిల్ 28 'ప్రమథనాథ్ మల్లిక్ వెర్సెస్ ప్రద్యుమ్నకుమార్ మల్లిక్ ప్రీవీ కౌన్సిల్‌లోని తీర్పు ప్రకారం, సుప్రీంకోర్టు, కేరళ న్యాయస్థానం ఏర్పరచిన నియమాన్ని అనుసరించి, కోవెలలోని దైవానికి సంబంధించిన ఏ విధమైన నిర్ణయం తీసుకుంటున్నా కొలువైన భగవంతుని ఇచ్ఛను, తప్పక పరిగణనలోకి తీసుకోవాలి. తీర్పును వెలువరించేముందు ఈ సూత్రానికి ప్రాధాన్యత నివ్వాలని ప్రముఖంగా వక్కాణించారు.

1991లో కేరళ హైకోర్టు వెలువరించిన తన తీర్పులో, శబరిమలలో కొలువైన దైవం ఇష్టప్రకారం నైష్ఠిక బ్రహ్మచర్యవ్రతాన్ని పాటించడానికే తమ తీర్పుల్లో కట్టుబడి ఉంటామని స్పష్టపరిచింది. శబరిమల అయ్యప్పస్వామి ఇష్టాన్ని గురించి కేరళ హైకోర్టు వెలువరించిన ఈ నిజాలను ఎవరూ సవాలు చెయ్యకపోవడం వలన అంతిమ తీర్పుగా వెలువరించడమయింది.

శబరిమల దైవానికి ప్రాథమిక హక్కులంటూ ఉండవని, అందువలన ఆ దైవం ఇష్టాన్ని పరిగణనలోకి తీసుకోవలసిన అవసరం లేదనీ అత్యున్నత న్యాయస్థానం వెలువరించిన తీర్పు, ఇదే అత్యున్నత న్యాయస్థానం, కేరళ హైకోర్టు తదితరులు కూడా అనుసరిస్తూ వస్తున్న ప్రీవీ కౌన్సిల్ తీర్పులో నిర్ధారించిన నిర్ణయాల ఉల్లంఘన మాత్రమేకాక, తొమ్మండుగురు న్యాయాధిపతుల ధర్మాసనం ఇచ్చిన తీర్పుకు కూడా విరుద్ధంగానే ఉంది. ఈ తొమ్మండుగురు జడ్జీలు 'స్టేట్ ట్రేడింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ వెర్సెస్ కమర్షియల్ టాక్సు ఆఫీసర్ అండ్ అదర్స్' కేసులో ఆర్టికల్ 14, ఆర్టికల్ 21, ఆర్టికల్ 25 తదితర అధికరణాల ప్రకారం దేవాలయాలలో ఉండే దైవాలకు హక్కులు ఉంటాయన్న తీర్పు ఇవ్వడం అయింది. (న్యాయవేత్తలకు కూడా)



1949లో భారత ప్రభుత్వం తరపున పటేల్ గారు పద్మనాభస్వామి వారికి ఇచ్చిన మాటను ఈనాడు సుప్రీంకోర్టు ఎట్టి పరిస్థితులలోను మీరరాదని సుప్రీంకోర్టుకు ప్రధాని మోదీ గుర్తు చెయ్యాలి. రాజ్యాంగపరమైన నైతికత అంటే ఆనాడు భగవంతుడైన పద్మనాభస్వామి వారికి– హిందూ దేవతల, భక్తుల హక్కులకు భంగం కలగనీయమని చేసిన ప్రమాణానికి కట్టుబడి ఉండడం.

పూర్వపు తిరువాన్కూరు రాజ్య పరిధిలో ఉండే హిందూ దేవాలయాల దైవాలకు సంబంధించిన ఒక ముఖ్యమైన అంశంపైన ప్రభుత్వాల మధ్య జరిగిన ఒప్పందం నిజానికి అక్కడి దైవమైన పద్మనాభస్వామికి, భారత ప్రభుత్వానికి మధ్య 1949 జూలై 1న, జరిగిన ఒప్పందం--భగవంతునికి, మానవునికి మధ్య జరిగిన ఒప్పందం--అనే చెప్పాలి. తిరువాన్కూరు పాలకులు తమ రాజ్యాన్ని తమ ఇష్టదైవమైన పద్మనాభస్వామి చరణకమలాల వద్ద సమర్పించుకుని తాము కేవలం ఆ పరమాత్మ సేవకులం మాత్రమే అన్న భావంతో, ఆయన ప్రతినిధులుగా మాత్రమే రాజ్యాన్ని పాలిస్తున్నామన్న భావంతో పరిపాలనను కొనసాగించడమే దానికి కారణం. పైన చెప్పిన ఒప్పందం తిరువాన్కూరు రాజ్యపరిధిలోనున్న అన్ని దేవాలయాలలో కొలువైన దేవతల హక్కులను పరిరక్షిస్తుంది. అంతేకాక, సుప్రీంకోర్టు వీటిని ఏ విధంగానూ చిందరవందర చెయ్యకూడదని మన రాజ్యాంగంలోని ఆర్టికల్ 361(1) ప్రకారం దూరం ఉంచుతోంది కూడా!

సర్దార్ పటేల్ గారి అతిపెద్ద విగ్రహాన్ని స్థాపించిన కేంద్ర ప్రభుత్వాన్ని నరేంద్రమోదీ తన నేతృత్వంలో నడిపిస్తున్నారు. ఆనాడు భారత ప్రభుత్వం తరపున పటేల్ గారు పద్మనాభస్వామి వారికి ఇచ్చిన మాటను ఈనాడు సుప్రీంకోర్టు ఎట్టి పరిస్థితులలోను మీరరాదని సుప్రీంకోర్టుకు ప్రధాని మోదీ గుర్తు చెయ్యాలి. రాజ్యాంగపరమైన నైతికత అంటే ఆనాడు భగవంతుడైన పద్మనాభస్వామి వారికి హిందూ దేవతల, భక్తుల హక్కులకు భంగం కలగనీయమని చేసిన ప్రమాణానికి కట్టుబడి ఉండడం. కోర్టు నోటీసు సెక్షను 4(1) ఆరాధనా స్థలాల 1991 చట్టం (ప్రత్యేక నియమావళి) ప్రకారం ఆలయాలలోని దేవత ఇష్టాలను గౌరవించడం. హిందూ దేవాలయాల ప్రత్యేకతను పరిరక్షించేందుకు 1947 ఆగష్టు 15న జరిగిన ఒప్పందంలో న్యాయస్థానాలు తల దూర్చరాదన్న నియమాన్ని మరోసారి గుర్తుచేసి కేంద్ర ప్రభుత్వం తన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించాలి. 1947 ఆగష్టు 15 నాటికి తిరువాన్కూరు రాజ్యం ఇంకా పద్మనాభస్వామి వారి ఏలుబడిలోనే ఉందని ఇక్కడ ముఖ్యంగా గమనించదగిన విషయం.

శబరిమలపై నేటి నుంచి ప్రారంభమయ్యే సుప్రీంకోర్టు విచారణలో పై అంశాలన్నీ పరిగణనలోకి రావాలని ప్రార్థిద్దాం!

■ సి.ఎస్. రంగరాజన్

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు 70, జుబిలీ హిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

రాయలసీమకు కాలువ నీళ్ళొచ్చాయి!

కొన్ని కలలు కల్లలుగానే మిగిలిపోతుంటాయి. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి రాయలసీమ రైతులు– కోస్తాలో పొలాలకు వచ్చినట్టు తమకూ కాలువల ద్వారా నీరు రావాలి అంటూ కన్న కల అలాగే మిగిలి పోయింది. అయితే ఇకపై ఆ బెంగ లేదు. ఇకపై, బోరు ఎండి పోతుందేమో అనే బెంగ లేకుండా రాయలసీమ రైతులు కూడా పంటలు వేసుకోవచ్చు. రాయలసీమకు కూడా నీటితో నిండిన సాగునీటి కాలవలు వచ్చాయి! మొదటిసారిగా అనంతపురం, కర్నూలు, కడపలకి గత జనవరి చిత్తూరు జిల్లాకి ఈ ఏడాది కాలవల్లో నీళ్ళొచ్చాయి.

రాయలసీమకు కాలవల్లోకి ఈ నీళ్ళు ఎలా వచ్చాయి? నాలుగు సంవత్సరాల్లో ఎత్తిపోతల పథకాలు ఎలా పూర్తయ్యాయి? అనంతపురంలోని బుక్కపట్నం చెరువులో, ఉరవకొండలో, కదిరి చెర్లోపల్లెలో, కర్నూల్ ముచ్చుమర్రి, గోరకల్లు, అవుకు సొరంగం దాకా; కడప గండికోట నుంచి చిత్తూరు బీ. కొత్తకోటలోని పులిచెర్ల గ్రామం దాకా, పుంగనూరు బ్రాంచ్ కెనాల్ నుండి కుప్పం దాకా, ఈ కాలవలు ఎప్పుడు పూర్తయ్యాయి? అసలు కృష్ణా నదిలో కృష్ణా డెల్టాకి, రాయలసీమకీ, రెండింటికీ నీటిని ఇవ్వగలిగిన నీటి సామర్థ్యం ఎలా వచ్చింది? కృష్ణా నదిలో వరద ప్రవాహం 30 రోజులకు మించి లేని నేపథ్యంలో, చెన్నై నగరానికి 15, ఎస్సార్బీసీకి 19, కె.సి.కెనాల్‌కు 10, మొత్తం 44 టియంసిల నికరజలాలతోపాటు తెలుగుగంగకు 29, గాలేరు నగరి సుజల స్రవంతి పథకానికి 38 కలిపి మొత్తం 67 టియంసిల మిగులు జలాలు, అలాగే త్రాగునీటి అవసరాలకు స్థూలంగా 112 టియంసిలను 30 రోజుల్లో సరఫరా చేయాలి. ఇది కాకుండా కృష్ణా డెల్టాకి సాగునీరు ఇవ్వాలి. ఇంత సామర్థ్యం శ్రీశైలంలోని కృష్ణాజలాలకు లేదు. శ్రీశైలం నుంచి, కృష్ణా నీటిని, నాగార్జున సాగర్ ద్వారా బెజవాడకు తరలించకుండా, రాయలసీమకు ఎలా ఇచ్చారు? మరెలా సాధ్యమయింది, రాయలసీమకు కాలువలు రావడం, ఆ తవ్విన కాలవల్లో నీరు పారడం?

సాగునీటి సాంకేతిక పరిభాషలోకి పోకుండా చెప్పాలంటే, వివిధ దశల్లో వున్న కాలవలను పూర్తి చేసారు. అనుసంధానం కోసం వివిధ స్థాయిల్లో వున్న ఎత్తిపోతల పథకాలను, యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసారు. మరీ ముఖ్యంగా, పోలవరం పూర్తి కావడం ఆలస్యం అవుతుంది కాబట్టి, గోదావరి జలాలను, కృష్ణా నదితో అనుసంధానం చెయ్యడం కోసం 'అవుట్ ఆఫ్ ది బాక్స్' ఆలోచనతో 'పట్టిసీమ' గోదావరీ జలాల ఎత్తిపోతల పథకాన్ని సంవత్సరంలో పూర్తి చేసి, కృష్ణా డెల్టాకు సాగునీరు ఇచ్చారు.

హంద్రీ నీవా, గాలేరు నగరి, కాలువల ద్వారా కృష్ణా జలాలు రాయలసీమకు తరలించాలి అనేది దశాబ్దాల ప్రణాళిక. ఎన్టీఆర్ హయాంలో పట్టాలైతే ఎక్కింది. కానీ ఆ తర్వాత కాలంలో పెద్దగా పురోగతి లేదు. 38 టిఎంసీల కృష్ణా జలాలను మళ్ళించి 2.6 లక్షల ఎకరాలకు సాగునీరు, 640 గ్రామాలకు త్రాగునీరును అందించాలని అప్పట్లో అభిలషించిన ఎన్టీఆర్ కల ఇప్పుడే నెరవేరింది. 2006లో గాలేరునగిరి సుజల స్రవంతి ప్రాజెక్టు 2006లో ఫేజ్–I కింద 2,155 కోట్ల అంచనాలతో ప్రారంభించినా పలు అంతరాలతో పెద్దగా ముందుకు పోలేదు. ఈ మిలీనియం మొదటి దశాబ్దంలో కొంత వేగం పెరిగినా ఫలితమిచ్చే స్థాయికి ఏ కాలువా ముందుకు పోలేదు. కాలువల్లో పారాలంటే కావాల్సిన ఎత్తిపోతల పథకాల ఊసేలేదు.

రాయలసీమలో వ్యవసాయం ప్రధానంగా భూగర్భ జలాల ఆధారంగా, బావుల నుండి నీళ్ళు తోడి, చెరువులు, కుంటల క్రింద సాగు చేసేవారు. కాలక్రమంలో బావులను పూడ్చేశారు. విద్యుత్తు బోరుబావుల వ్యవసాయం మొదలైంది. పెరిగిన జనాభాతో పెరిగిన సాగువిస్తీర్ణంతో భూగర్భ జలాలు తరిగిపోయాయి. కుంటలు పోయాయి. చెరువులు ఒట్టిపోయాయి. వ్యవసాయాన్ని పక్కనపెట్టి, త్రాగునీటికే దుస్థితి నెలకొన్నది. వానొస్తే వ్యవసాయం. వాన రాకపోతే వలస. అంతే. ప్రణాళికలు వేసారు. కృష్ణానదీ జలాలను తరలిస్తామని వాగ్దానాలు చేసారు. ప్రజలు ఆశలు పెట్టుకొన్నారు. రైతులు వేచి చూసారు. ఏళ్లు గడిచాయి. కంట కన్నీరు తప్ప, చుక్క నీటి బొట్టు చూడడం గగనం అయిపోయింది. ఇదీ స్థూలంగా గత మూడు దశాబ్దాల రాయలసీమ పరిస్థితి.

ఇక రాష్ట్ర సాగునీటి పరిస్థితికి వస్తే; 2014లో రాష్ట్రాన్ని విభజించారు. కృష్ణానది మీద ఎగువ రాష్ట్రాలు కొత్త ప్రాజెక్టులు నిర్మించాయి. శ్రీశైలంలోకి వచ్చే కృష్ణానదీ నీటి ప్రవాహం ఏటికేడు తగ్గిపోతోంది. రైపేరియన్ హక్కులు వున్న డెల్టా ప్రాంతానికే సెప్టెంబర్, అక్టోబర్‌లకు గానీ నాట్లు వేసుకోవటానికి నీటిని కాలువలలోకి విడుదల చేయలేకున్నారు. తమ ప్రాజెక్టులు నిండితే కానీ ఎగువ రాష్ట్రాలు నీటిని విడుదల చేయటం లేదు. చివరి రాష్ట్రం అయిన మనం వేచి చూడాల్సిన పరిస్థితి. ఇదేమీ ఊహించనిది కాదు. ఈ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొనే డెబ్బయ్యో దశకంలోనే పోలవరం ప్రాజెక్టుని ప్రతిపాదించారు. ఈ శతాబ్దపు మొదటి దశాబ్దంలో కొంతపని మొదలు పెట్టినా, అక్కడితోనే ఆగిపోయింది. ఇదీ విభజన సమయంలో రాష్ట్ర సాగునీటి పరిస్థితి.

ఏదో ఒక కాలువ పూర్తి చేసేస్తే రాయలసీమ కాలవల్లో నీళ్ళు పారలేదు. ప్రాథమ్యాలు మారాయి. మొట్టమొదటిసారిగా సాగునీటి మీద సూక్ష్మ దృష్టి పెట్టారు. అప్పటికివున్న ప్రాజెక్టులను అన్నింటినీ అధ్యయనం చేసి ప్రాధాన్యతపరంగా ఏది పూర్తిచేస్తే ఎక్కువ ప్రాంతానికి సాగు, తాగు నీరు ఇవ్వచ్చో అంచనాలు వేసి ఆమేరకు వాటిని ఒక్కొక్కటినీ పూర్తి చేస్తూ వచ్చారు. అలా చేసినవే, ముందుగా డెల్టాకు నీరిచ్చిన పట్టిసీమ, ముచ్చుమర్రి, గోరకల్లు, చిత్రావతి–గండికోట, గాలేరు నగరి, హంద్రీ నీవా కాలువలు తదితరాలు. కొన్ని ప్రధానమైన పనులను వివరిస్తాను.

2014లో జి.ఓ 63 జారీ చేసి పెరిగిన 2800 కోట్ల వ్యయం ప్రాతిపదికగా నాలుగు ఏళ్ళలో పోతిరెడ్డిపాడు నుంచి గండికోట జలాశయం వరకు 135 కిలోమీటర్ల వరకు, బానకచర్ల నుంచి గోరుకల్లు రిజర్వాయర్ వరకు ఎస్సార్బీసీ కాలువ విస్తరణ పనులు చేపట్టారు. గాలేరు నగరి ప్రాజెక్ట్ లో ప్రధానమైన గోరుకల్లును 12.84 టీఎంసీల సామర్థ్యంతో దాదాపు 600 కోట్లు వెచ్చించి పూర్తి చేసారు. గండికోటకు 10 క్యూసెక్కుల నీటిని తరలించడానికి అవుకు కుడి సొరంగం పూర్తి చేసి ప్రారంభించారు.



రాయలసీమ వాసులు ఎన్నాళ్ళుగానో ఎదురుచూస్తుంటే ఇన్నాళ్లకు సాకారమైన స్వప్నం ఈ కాలువలు. ఈవేళ వచ్చింది కొన్ని టీఎంసిలే కావచ్చు. పరవళ్లు తొక్కకపోవచ్చు. కానీ, నీళ్ళతో నిండిన కాలవలు వచ్చాయి. శ్రీశైలం నీళ్ళు వచ్చే సౌలభ్యం వచ్చింది. ఆ నీళ్లే రాయలసీమకు అమృతతుల్యం.

అవుకు కుడి బైపాస్ సొరంగం, ఎడమ టన్నెల్లోని 500 మీటర్ల ఫాల్ట్ జోన్ పనులుతో పాటుగా ట్విన్ బైపాస్ టన్నెల్‌కు శ్రీకారం చుట్టి 10,000 క్యూసెక్కులను గండికోటకు మళ్ళించడానికి సుగమం చేసారు. హంద్రినేవ రెండోదశలో భాగంగా జీడివల్లి నుంచి కదిరి సమీపంలోని చర్లోపల్లి జలాశయంకు కాలువ తవ్వారు. తుంగభద్ర జలాశయం నుంచి ఎల్లెల్సీ కాలువకు ఉన్న34 టీఎంసీల వాటా ఆధారంగా కర్నూలు జిల్లాలోని ఆలూరు, ఆదోని, మంత్రాలయం, ఎమ్మిగనూరు, కొడుమూరు నియోజకవర్గాలలో 1,51,134 ఎకరాల సాగు ఆధారపడి ఉంది. 2003లో ప్రారంభించిన గురురాఘవేంద్ర ప్రాజెక్ట్ లో భాగమైన పులికనుమ ఎత్తిపోతలు కోసం కోస్గీ సమీపంలో 500 ఎకరాల విస్తీర్ణంలో పులికనుమ జలాశయం, ప్రధాన పంప్ హౌస్, జలాశయం నుంచి 14 కిలోమీటర్ల పైప్ లైన్, పెద్దతుంబలం సమీపంలో ఎల్లెల్సీ కాలువకు 200 క్యూసెక్కులను మళ్లించేందుకు 2 కిలోమీటర్ల ప్రధాన కాలువను పూర్తి చేసారు.

గండికోట ప్రధాన జలాశయం నుండి నిర్మించబడిన చిత్రావతి జలాశయానికి గండికోట చిత్రావతి ఎత్తిపోతల పథకం ద్వారా కృష్ణా నదీ వరద జలాలను తరలించే పథకం నిర్మాణాన్ని పూర్తి చేసారు. 10 టియంసిల సామర్థ్యంతో నిర్మించి చాలా సంవత్సరాలైనా చిత్రావతి నదిలో నీటి లభ్యత తగ్గి పోవడం మూలంగా రిజర్వాయరులోకి నీళ్ళు చేరడం లేదు. తుంగభద్ర నుండి పులివెందుల బ్రాంచి కెనాల్ ద్వారా లభించాల్సిన నీళ్ళు పెద్దగా లభించడం లేదు. గండికోట చిత్రావతి ఎత్తిపోతల పథకం ద్వారా పులివెందులకి నీరివ్వడం వీలయింది.

'ముచ్చుమర్రి' ఎత్తిపోతల పథకాన్ని కర్నూలు జిల్లా నందికొట్కూరు సమీపంలో పగిడ్యాల దగ్గర హంద్రీనీవా, కేసీ కెనాల్‌కు నీరు తరలించడానికి రూపకల్పన చేశారు. శ్రీశైలంలో 834 అడుగుల నీరున్నప్పుడే హంద్రీనీవాకు నీరు తరలించే అవకాశం వుంది. దీనివలన రాయలసీమకు అందాల్సిన 40 టీఎంసీల నీరు అందడం లేదని భావించి అప్పటి ఉమ్మడి రాష్ట్రంలోనే శ్రీశైలం జలాశయానికి పైభాగాన, దాదాపు 80 కిలోమీటర్ల దూరంలో ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం శ్రీకారం చుట్టారు. డెడ్ స్టోరేజీ దాటినా తర్వాత కూడా 787 అడుగులకు కింద వరకు శ్రీశైలం జలాశయం నుంచి రోజుకు 4000 క్యూసెక్కుల తరలించవచ్చు. తుంగభద్రలో నీరులేక కెసి కెనాల్ పరిధిలో 35వేల ఎకరాల ఆయకట్టు భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిన నేపథ్యంలో, దీని సంరక్షణకు, ఆగిపోయిన పథకాన్ని 2015 ఏప్రిల్లో మళ్ళీ పునఃప్రారంభించారు. నీటిని ఎత్తిపోయడానికి 100 మీటర్ల లోతైన డీప్ కట్ ద్వారా 7 కిలోమీటర్ల కాల్వను తవ్వారు. ముచ్చుమర్రి నుంచి 11 కిలోమీటర్ల దూరంలోని హంద్రీనీవా ఇన్‌టేక్ పాయింట్ వద్దకు నీటిని తరలించడానికి 16 పంపుల సామర్థ్యంతో ఎత్తిపోతల పథకం రూపొందించారు. దాదాపు వెయ్యి కోట్ల రూపాయల వ్యయంతో పూర్తి చేసిన ఈ ప్రాజెక్టు కేవలం రెండు సంవత్సరాల్లో పూర్తయింది, కర్నూలు కడప(కెసి) కాల్వకు, హంద్రీనీవా కాలవకు కృష్ణానది మిగులు జలాలు 5 టిఎంసీలు ఎత్తిపోస్తారు.

హంద్రీ నీవా కాలవలో భాగంగా, చివరి జిల్లా అయిన చిత్తూరుకి, కదిరి దగ్గరి చెర్లోపల్లె రిజర్వాయర్ నుండి చిత్తూర్ జిల్లా మదనపల్లి డివిజన్లోని పీటీఎం మండలంలోని పులికల్లు గ్రామానికి చేరాయి. అక్కడి నుండి పుంగనూర్ మెయిన్ బ్రాంచ్ కెనాల్కు చేరుతాయి. అక్కడి నుండి ఇంకొద్ది రోజుల్లోనే, కుప్పం దాకా వస్తాయని అంచనా.

ఇన్ని కాలవల్లో నీళ్ళు పారాలంటే, శ్రీశైలం నుంచి కృష్ణా నీళ్ళు హంద్రీ నీవాకు మళ్ళించాలి. మరి శ్రీశైలంపై ఎప్పటినుంచో ఆధారపడివున్న కృష్ణా డెల్టా సంగతేమిటి? ఇక్కడే, ప్రభుత్వ చిత్తశుద్ధి, నేర్పరితనం, అధ్యయనం కనపడింది. ఆ లక్షణాలే 'పట్టిసీమ'గా రూపాంతరమయింది. పోలవరం ప్రాజెక్టులో భాగంగా 70 శాతం తవ్వబడి వృథాగా ఉన్న కుడికాలువను, పూర్తిగా నిర్మాణం చేసి, ఆ కాలువను ఉపయోగించి సముద్రంలోకి వృథాగా పోతున్న గోదావరి నీటిని టర్బయిన్ పంపుల ద్వారా కృష్ణా డెల్టాకి మళ్ళించారు. అదే ప్రసిద్ధి గాంచిన పట్టిసీమ అయింది.

కృష్ణడెల్టాకు శ్రీశైలం, నాగార్జున సాగర్ ద్వారా యిచ్చే నీటిని ఆపేసి, ఆ నీటిని శ్రీశైలం నుండి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా రాయలసీమలోని అనంతపురం, కడప, చిత్తూరు ప్రాంతాలకు హంద్రీ – నీవా, గాలేరు – నగరి కాలువలకు తరలించారు. పోలవరం ప్రాజెక్ట్ ప్రధాన ధ్యేయం కూడా ఇదే. కృష్ణాజలాలు సాలుకి 140 టిఎంసిలను రాయలసీమకు వినియోగించారు. అలమట్టి నుంచి కృష్ణానీరు శ్రీశైలంకు రాని నేపథ్యంలో గత కొన్ని సంవత్సరాలుగా కృష్ణా డెల్టా వట్టిపోతోంది. పట్టిసీమ వచ్చిన తర్వాత జూన్ మొదట్లోనే గోదావరి జలాలను పుష్కలంగా డెల్టాకి ఇవ్వడంవలన, ఆయకట్టు స్థిరీకరణే కాదు, ఉత్పత్తికూడా ఇబ్బడిగా పెరిగి ఈ నాలుగు ఏళ్ళలోనే పట్టిసీమ ద్వారా 6వేల కోట్ల అదనపు ఆదాయం వచ్చింది. శ్రీశైలం నీరు రాయలసీమకు ఇవ్వడంతో 3000 కోట్ల అదనపు ఆదాయం వచ్చింది.

రాయలసీమ వాసులు ఎన్నాళ్ళుగానో ఎదురుచూస్తుంటే ఇన్నాళ్లకు సాకారమైన స్వప్నం ఈ కాలువలు. ఈవేళ వచ్చింది కొన్ని టీఎంసిలే కావచ్చు. పరవళ్లు తొక్కక పోవచ్చు. కానీ, నీళ్ళతో నిండిన కాలవలు వచ్చాయి. శ్రీశైలం నీళ్ళు వచ్చే సౌలభ్యం వచ్చింది. ఆ నీళ్లే రాయలసీమకు అమృతతుల్యం. మట్టి నీళ్ళ కావవి. రాయలసీమకి అవి ఎర్రగా కస్తూరి తిలకం కలిపినవి. యువత కేరింతలు చూస్తుంటే శివతాండవం, కూచిపూడి కలిపి జుగల్బందీ చేస్తున్నట్టు వుంది గ్రామాల్లో. ఆ జేసీబీలు భగీరథుడి రూపంలో కనిపిస్తున్నాయి. ఇంత చిన్న కాలువలకి, అంత ఆనందమా అనకండి. చెరువులు నిండాయి. భూగర్భ జలాలు పెరిగాయి. ఒక చెరువు నిండితే ఆ సంవత్సరానికి, నాలుగువేల ఎకరాలు నిండినట్టే. కొన్ని వందల కుటుంబాలు బాగుపడ్డట్టే! నీళ్లొస్తే రాయలసీమలో అంతే. ఆనందం అర్ణవం. అది సాకారం చేసిన వ్యక్తి మీద అనురాగం అంబరం!

■ విజయ్ కుమార్

షా.. కళ్లు నెత్తికెక్కాయా?

- అహంభావంతో పతనమే
- నాలుగేళ్ల కింద మీరెక్కడ?
- మీ కుమారుడి ఆస్తులు 16 వేల రెట్లు ఎలా పెరిగాయ్?
- మీది భస్మాసుర హస్తం
- అసెంబ్లీలో సీఎం ఆగ్రహం



నాపై ఈగవాలితే..

అమరావతి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): అహంభావంతో ప్రవర్తించేవారికి పతనం తప్పదని, బీజేపీకీ అదే పరిస్థితి వస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరించారు. ఇప్పుడా పార్టీ జాతీయ అధ్యక్షుడిగా ఉన్న అమిత్ షా నాలుగేళ్ల కింద ఎక్కడున్నారని ప్రశ్నించారు. ఢిల్లీకి రాగానే కళ్లు నెత్తికెక్కాయా అని ఆయనను నిలదీశారు. 'ఇష్టమొచ్చినట్లు అవాకులు చవాకులు పేలితే ప్రజలు సహించరు. మీరు చేసింది చెప్పుకోండి. కానీ నన్ను విమర్శించే నైతికత, నిబద్ధత మీకు లేవు' అని తేల్చిచెప్పారు. మంగళవారం అసెంబ్లీలో వ్యవసాయ రంగంపై చర్చ సందర్భంగా సీఎం మాట్లాడారు. బీజేపీ నేతల తీరుపై విరుచుకుపడ్డారు. 'కావాలంటే మీ పార్టీని పొగుడుకోండి. కానీ నన్ను విమర్శించే హక్కు మీకు లేదు' అని అన్నారు. బీజేపీది భస్మాసుర హస్తమని, ఆంధ్రప్రదేశ్‌ను నమ్మించి మోసం చేసిందని మండిపడ్డారు. ఇంకా ఏమన్నారో ఆయన మాటల్లోనే...

'నాది యూటర్న్ కాదు.. రైట్ టర్న్. మీవే వంకరటింకర టర్న్‌లు. తెలుగుజాతి కోసం మీతో కలిశాను. నమ్మక ద్రోహం చేయడంతో తిరుగుబాటు చేశాను. న్యాయం చేసేవరకూ పోరాటం ఆపను. నా కుమారుడి పదవి కోసం నేనేదో చేస్తున్నానని అంటున్నారు. ఆ అవసరం నాకేంటి? రాష్ట్రంలోని అక్కచెల్లెళ్లతో నాది జన్మజన్మల బంధం. అన్నగా వారికి రూ.10వేలు ఇస్తున్నాను. అవసరమైతే మళ్లీ మళ్లీ ఇస్తా. ఈ అన్నపై ఈగవాలితే తోలు తీస్తామని వారే చెబుతారు.'

అభివృద్ధి అంటే ఏంటో తెలుసా?

'రాష్ట్రానికి పూర్తిగా అన్యాయం చేసిన కేంద్రం.. అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తున్న నన్ను విమర్శిస్తోంది. అసలు బీజేపీకి అభివృద్ధి అంటే తెలుసా? 650 అవార్డులు రాష్ట్రానికి మీరే ఇచ్చి.. మళ్లీ మీరే విమర్శలు చేస్తారా? ఇకనైనా కథలు ఆపి ప్రత్యేక హోదా ఎందుకు ఇవ్వలేదో చెప్పండి. 2014లో కలుద్దామని నరేంద్ర మోదీయే అడిగారు. కానీ కలవాలని మేం అడుక్కున్నామని షా అంటున్నారు. మేమేం అడగలేదు. విభజనతో అన్యాయం జరిగిందని, న్యాయం చేస్తారనే కలిశాం. అవినీతి అంటూ మాట్లాడుతున్న బీజేపీ రాఫెల్ వ్యవహారంపై ఎందుకు విచారణ చేపట్టడం లేదు? బ్యాంకులను మోసం చేసి విదేశాలు పారిపోయిన వారిపై విచారణ అవసరం లేదా? మా దగ్గర అగ్రిగోల్డ్ మోసం చేస్తే.. ప్రతి పైసా వసూలు చేస్తున్నాం. మేం మళ్లీ ఎన్డీఏతో కలుస్తామన్నట్లు ప్రచారం చేస్తున్నారు. ఆనాడు రాష్ట్రపతి ఎంపిక విషయంలో వాజ్‌పేయితోనే పోరాడాను. ఇప్పుడున్నది పాత విలువలున్న బీజేపీ కాదు. కేవలం మోదీ, షా బీజేపీ. రాష్ట్రానికి మేలు చేయండని అడుగుతున్నందుకు మాపై ఎదురుదాడి చేస్తున్నారు. మా ఎంపీలు, ఎమ్మెల్యేలపై ఐటీ దాడులు చేయిస్తున్నారు. అమిత్‌షా కుమారుడి ఆస్తులు నాలుగేళ్లలో 16 వేల రెట్లు పెరిగితే ఒక్క విచారణా ఉండదు. నిన్న పలాసలో షా సభలో కుర్చీలు వెలవెలబోయాయి. పెళ్లాన్నే సరిగా చూసుకోలేనివాడు.. దేశాన్నేం చూసుకుంటాడని గడ్కరీయే అన్నారు.'

మీరు పతనమే..

'మీరు మాపై ఎంత ఒత్తిడి పెంచితే అంత త్వరగా పతనమవుతారు. రాష్ట్రానికి రూ.80 వేల కోట్లు రావాలని జయప్రకాశ్ నారాయణ కమిటీ, రూ.75 వేల కోట్లు రావాలని పవన్ కల్యాణ్ కమిటీలు తేల్చాయి. ప్రజలు అడుగుతున్నవే నేనడుగుతున్నాను. రేపు మోదీ, షా రాష్ట్రానికి వస్తే ఇవే ప్రశ్నలు ప్రజల నుంచి వస్తాయి. రహదారులకు నిధులిచ్చామని చెప్పుకోవడం కాదు.. గుజరాత్‌కు, మహారాష్ట్రకు ఎన్ని ఇచ్చారో.. మాకెంత ఇచ్చారో చూడండి. ఈ అంశంపై నేను చర్చకు సిద్ధం.'

మోదీ విఫలం..

'ప్రపంచంలో భారత్‌ను ముందుకు తీసుకెళ్లడంలో ప్రధాని మోదీ విఫలమయ్యారు. ఆయన కాకుండా ఎవరున్నా దేశం బాగుపడుతుంది. చివరకు కోడి కత్తి కేసును కూడా ఎన్ఐఏకి ఇచ్చారు. ఇలా చేసే బెంగాల్లో చేతులు కాల్చుకున్నారు.

మీ చెవిలో మీరే పూలు పెట్టుకుంటున్నారు. మీ నెత్తిన మీరే చెయ్యి పెట్టుకుంటున్నారు. మీది భస్మాసుర హస్తం. బీజేపీలో ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, ఎంపీ కంభంపాటి హరిబాబుకే గతి లేదు. మీరు సాధిస్తామన్న రైల్వే జోన్ రానేలేదు. దాని కోసమైనా మీరిద్దరూ పదవులకు రాజీనామా చేసుంటే సంతోషించేవాడిని. మీరిక ప్రజలకేం చెబుతారు?'

రాహుల్‌ను ప్రధాని చేయాలన్న.. బాబు ఆశ అడియాసే: జేసీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీకి దేశాన్ని మార్చడం సాధ్యం కాదని అనంతపురం టీడీపీ ఎంపీ జేసీ దివాకర్ రెడ్డి తేల్చిచెప్పారు. ఆయన్ను ప్రధానిని చేయాలన్న సీఎం చంద్రబాబు ఆశ అడియాసే అవుతుందన్నారు. ప్రత్యేక హోదా ఇస్తారన్న ఆశతోనే చంద్రబాబు రాహుల్ వెంటపడుతున్నారని చెప్పారు. కొడుకును ప్రధానిని చేయడానికే సోనియాగాంధీ రాష్ట్రాన్ని ముక్కలు చేసిందని మండిపడ్డారు. మంగళవారం ఢిల్లీలో మాగంటి బాబు దీక్షాశిబిరాన్ని జేసీ సందర్శించి ఆయనకు సంఘీభావం తెలియజేశారు. ఆ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రధాని మోదీ ఫ్యాక్షనిస్టుగా, నియంతగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రైల్వే జోన్ వల్ల రాష్ట్రానికి లాభం లేదు.. ఇచ్చినా కేంద్రానికి నష్టం లేదు. ఒక భవనంలో 10 మంది గుమస్తాలు పెరుగుతారు. తెలిసో తెలియకో రైల్వే జోన్ అడుగుతున్నాం. అది కూడా ఇవ్వడం లేదు' అని పేర్కొన్నారు.

మోదీ ఇమేజ్ డ్యామేజీకి యత్నం: కన్నా



శ్రీకాకుళం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): "ప్రధాని మోదీ ఇమేజ్‌ను డ్యామేజి చేసే ప్రయత్నం చేస్తున్నారు. నవ్యాంధ్రకు 39 కేంద్ర ప్రభుత్వ సంస్థలను తీసుకువచ్చాం. అయినా రాష్ట్ర ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తోంది. టీడీపీ డ్రామా కంపెనీ మాదిరిగా వ్యవహరిస్తోంది" అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ చైతన్యయాత్రలో భాగంగా రెండో రోజు శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల, రాజాం, పాలకొండ నియోజకవర్గాల మీదుగా విజయనగరం జిల్లా పార్వతీపురంలోకి బస్సు యాత్ర ప్రవేశించింది. ఈ సందర్భంగా కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడారు. "కేంద్రం మంజూరు చేస్తున్న నిధులలో కమీషన్లు కొడుతూ రాష్ట్రంలో ప్రతి పనిలోనూ అవినీతికి పాల్పడుతున్న సీఎం చంద్రబాబు పెద్ద గజదొంగ. చంద్రబాబు మాటలు విని మరోసారి మోసపోతే, ఆంధ్ర ప్రజలను దేవుడు కూడా రక్షించలేడు" అని కన్నా అన్నారు.

జనసేనలోకి విష్ణు రాజు



అమరావతి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): జనసేన సలహా మండలి అధ్యక్షునిగా ప్రముఖ విద్యా సంస్థల అధినేత విష్ణు రాజును నియమిస్తూ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ప్రకటించారు. జనసేన అధ్యక్షుడు పవన్ సమక్షంలో విష్ణురాజు జనసేనలో చేరారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడారు. 'విష్ణురాజు వంటి విద్యావంతులు, మేధావులు పార్టీలోకి రావాలని ఆకాంక్షిస్తున్నా" అని పవన్ అన్నారు.

రోస్టర్ ప్రకారమే డీఎస్పీ పదోన్నతులు: రాజప్ప

అమరావతి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రోస్టర్ ప్రకారమే డీఎస్పీలకు పదోన్నతులిచ్చామని.. ఎక్కడ, ఎవరికి ప్రమోషన్ ఇచ్చామో చర్చకు సిద్ధమని ఉపముఖ్యమంత్రి (హోం) నిమ్మకాయల చినరాజప్ప ప్రతిపక్షనేత వైఎస్ జగన్‌కు సవాల్ విసిరారు. ఒకే సామాజిక వర్గానికి పదోన్నతులు ఇచ్చారనడం సరికాదన్నారు. ప్రమోషన్లు, బదిలీలపై శ్వేతపత్రం విడుదల చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఎన్నికల్లో ఓడిపోతానన్న భయంతోనే పోలీసులపై ఎన్నికల కమిషన్(ఈసీ)కు జగన్ ఫిర్యాదు చేశారని ఆరోపించారు.

నేడు తిరుపతిలో వైసీపీ సమర శంఖారావం

తిరుపతి అర్బన్, ఫిబ్రవరి 5: రాబోయే ఎన్నికల్లో బూత్ కమిటీ నాయకులు, పార్టీ కార్యకర్తలకు దిశానిర్దేశం చేసేందుకు వైసీపీ సమరశంఖారావానికి శ్రీకారం చుడుతోంది. తొలి సమరశంఖారావం సభను బుధవారం తిరుపతిలో ఆ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ ప్రారంభించనున్నారు. తిరుపతి సమీపంలోని ఓ రియల్ ఎస్టేట్ వెంచర్‌లో చిత్తూరు జిల్లా వైసీపీ నేతలు ఈ సభ ఏర్పాట్లు పూర్తిచేశారు.

వారంలో గిరిజన టీచర్లకు న్యాయం: కిడారి

అమరావతి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): వారం రోజుల్లో గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తామని గిరిజన శాఖ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్ హామీ ఇచ్చారు. సచివాలయంలోని తన కార్యాలయంలో మంగళవారం ఆయన గిరిజన ఉపాధ్యాయ సంఘాలు, అధికారులతో సమావేశమయ్యారు. జీఓ 132ను రద్దు చేయాలని, డీడీఓ అధికారులను రద్దు చేసి, పాత విధానంలో ప్రధానోపాధ్యాయులకే పూర్తి బాధ్యతలు అప్పగించాలని ఉపాధ్యాయ సంఘాలు మంత్రిని కోరాయి. దీనిపై మంత్రి స్పందిస్తూ.. గిరిజన సంక్షేమశాఖ ఉపాధ్యాయుల బకాయిలపై ఆర్థిక మంత్రి, సంబంధిత అధికారులతో ఇప్పటికే చర్చించామని, వారంలో పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

ఉపాధి కూలీలకు వేసవి అలవెన్సులు

అమరావతి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలకు వేసవి అలవెన్సులు ప్రకటిస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఫిబ్రవరి నెలలో 20 శాతం, మార్చి 25 శాతం, ఏప్రిల్/మే 30 శాతం, జూన్ నెలలో 20 శాతం కూలీలకు అలవెన్సులు ప్రకటించారు.

హోదా కోసం నేడు ర్యాలీలు: చలసాని



ఒంగోలు (కలెక్టరేట్), ఫిబ్రవరి 5: "ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు ఉద్యమం కీలక దశకు చేరింది. దీన్ని మరింత ఉధృతం చేస్తాం. జెండాలు వేరైనా లక్ష్యం ఒక్కటే అయినందున అన్ని పార్టీలు ఐక్యంగా ముందుకు సాగాలి" అని ప్రత్యేక హోదా సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఒంగోలులో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'ఏపీఎన్‌జీవో, అమరావతి జేఏసీ, ఏపీయూడబ్ల్యూజేతో పాటు వివిధ సంఘాల మద్దతుతో బుధవారం రాష్ట్రవ్యాప్తంగా మోటార్ సైకిల్ ర్యాలీలు నిర్వహిస్తున్నాం. జాతీయ రహదారులపై వాహనాలను నిలుపుదల చేసి వాటిని శుభ్రంగా తుడిచి నిరసన తెలియజేస్తాం. ఈ ర్యాలీల్లో పార్టీలకతీతంగా ప్రజలంతా భాగస్వాములు కావాలి. 10న గుంటూరుకు ప్రధాని నరేంద్రమోదీ వస్తున్నారు. ఆరోజున అక్కడ ఖాళీ కుండలతో నిరసన కార్యక్రమాలు చేపడతాం. 11న ఢిల్లీలో సీఎం చంద్రబాబు చేపట్టనున్న దీక్షకు సంఘీభావం తెలిపి శిబిరంలో కూర్చుంటాం" అని వివరించారు. ఈ సమావేశంలో ఏపీయూడబ్ల్యూజే అధ్యక్షుడు ఐ.వి.సుబ్బారావు, సాధన సమితి కార్యవర్గ సభ్యుడు పి.వి.సత్యనారాయణ రాజు, హర్షిణీ విద్యా సంస్థల అధిపతి జి.రవికుమార్ పాల్గొన్నారు.

ఇంటర్వ్యూల కోసం 'అసిస్టెంట్ ప్రొఫెసర్ల' దీక్ష

అమరావతి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 14 విశ్వవిద్యాలయాల్లో 1108 అసిస్టెంట్ ప్రొఫెసర్స్ ఉద్యోగాల భర్తీకి తక్షణమే ఇంటర్వ్యూలు నిర్వహించి, ఉద్యోగ నియామకాలు చేపట్టాలని 'అసోసియేషన్ ఆఫ్ అసిస్టెంట్ ప్రొఫెసర్స్ స్క్రీనింగ్ టెస్ట్ క్వాలిఫైడ్ క్యాండిడేట్స్' ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. కోర్టు కేసులేవీ పెండింగ్‌లో లేవని, నియామకాలకూ ప్రతిబంధకాలు లేవని వారు పేర్కొన్నారు. అభ్యర్థులు తమ సమస్యలను ఇప్పటికే సీఎం చంద్రబాబు, మంత్రి గంటా శ్రీనివాసరావు, ఉన్నత విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి కె.దమయంతి, ఉన్నత విద్యా మండలి చైర్మన్ విజయరాజు దృష్టికి తీసుకెళ్లారు. పలువురు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీలను కలిసి ప్రాతినిధ్యం చేయాలని కోరుతున్నారు. హామీలు తప్ప ఇంటర్వ్యూ షెడ్యూలు విడుదల కాకపోవడంతో సోమవారం నుంచి పలువురు అభ్యర్థులు విజయవాడలోని ధర్నా చౌక్ వద్ద నిరసన దీక్ష చేస్తున్నారు. ఈ దీక్షకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు, కేంద్ర కమిటీ సభ్యులు వై.వి.రావు, ఏపీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి పి.పాండురంగ వరప్రసాద్, కార్యదర్శి అనిల్‌కుమార్ సంఘీభావం తెలిపారు.



దీక్షలో పాల్గొన్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు

ప్రసంగంలో రాష్ట్ర ప్రస్తావనేదీ?

- సీమకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించండి
- లోక్‌సభలో బుట్టా రేణుక డిమాండ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ గురించి రాష్ట్రపతి ప్రసంగంలో ప్రస్తావన లేకపోవడం అసంతృప్తినిచ్చిందని ఎంపీ బుట్టా రేణుకా ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర విభజన చట్టంతోపాటు అప్పటి ప్రధాని రాజ్యసభలో ఇచ్చిన హామీల గురించి రాష్ట్రపతి మాట్లాడలేదన్నారు. విశాఖ రైల్వేజోన్, కడపలో ఉక్కు పరిశ్రమ వంటివి అమలు చేయలేదని తెలిపారు. రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించి ఆ ప్రాంత అభివృద్ధికి తోడ్పడాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఇతర ప్రాంతాలతో సమానంగా రాయలసీమను అభివృద్ధి చేయాలని ప్రతిపాదించారు. మంగళవారం లోక్‌సభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు చెప్పే తీర్మానంపై జరిగిన చర్చలో రేణుక మాట్లాడారు. ఎన్నికల కోసమే ప్రభుత్వం కొత్త పథకాలను ప్రవేశపెట్టిందని ఆరోపించారు. సంస్థల విశ్వసనీయత కోల్పోయేవిధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. రాఫెల్ డీల్‌పై అధ్యయనం చేయడానికి సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)ని నియమించాలని డిమాండ్ చేశారు.

చివరికి నిరాశే: మురళీమోహన్

ఏపీకి ప్రత్యేక హోదా ప్రకటిస్తారని చివరి బడ్జెట్ వరకు చూశామని, చివరికి నిరాశే మిగిలిందని ఎంపీ మురళీమోహన్ ఆవేదన వ్యక్తం చేశారు. లోక్‌సభ జీరోఅవర్‌లో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం చేయడంలో కేంద్రం విఫలమైందని విమర్శించారు. తితలీ తుఫానుతో నష్టపోయిన ఏపీకి రూ.997.62 కోట్లు ఇవ్వాలని నిర్ణయించామని కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ తెలిపారు. ఎంపీలు కేశినేని నాని, జేసీ దివాకర్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి మంగళవారం లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. రాజధాని అమరావతి నిర్మాణంపై తమ శాఖ అభిప్రాయాలను నీతి ఆయోగ్‌కు తెలిపామని కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి అన్నారు. గల్లా జయదేవ్, జేసీ దివాకర్ రెడ్డి ప్రశ్నలకు ఆయన సమాధానమిస్తూ.. అమరావతిలో రూ.39,937 కోట్లతో ప్రభుత్వ భవనాలు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలను పంపిందని, దానిపై తమ శాఖ అభిప్రాయాలను నీతి ఆయోగ్ కోరిందని చెప్పారు. 14వ ఆర్థిక సంఘం చేసిన సిఫారసుల మేరకు ఏపీకి మూడేళ్లలో రూ.99,674.41 కోట్లు విడుదల చేశామని ఆర్థిక శాఖ సహాయ మంత్రి పొన్ రాధాకృష్ణన్ తెలిపారు.రాజ్యసభలో ఎంపీ కేవీపీ అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం ఇచ్చారు.

దేశంలో ఆంధ్ర అంతర్భాగం కాదా?

- విచ్ఛిన్నానికి బీజేపీ యత్నాలు: సుజనాచౌదరి ఆగ్రహం
- హోదా నినాదాలతో దద్దరిల్లిన ఢిల్లీ.. మాగంటి బాబు దీక్ష

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): 'ప్రత్యేక హోదా-ఆంధ్రుల హక్కు' నినాదాలతో దేశ రాజధానిలోని జంతర్‌మంతర్ దద్దరిల్లింది. ఆంధ్రప్రదేశ్‌ను ఆదుకోవాలని తన జన్మదినం సందర్భంగా మంగళవారం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఏలూరు టీడీపీ ఎంపీ మాగంటి బాబు ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరాహార దీక్ష చేశారు. దాదాపు 300 మంది టీడీపీ కార్యకర్తలు దీక్షలో పాల్గొన్నారు. జన్మదినం రోజు రాష్ట్ర హక్కుల కోసం దీక్ష చేసిన మాగంటిని సహచర ఎంపీలు అభినందించారు. ఈ సందర్భంగా సుజనా మాట్లాడుతూ... దేశంలో ఆంధ్ర అంతర్భాగం కాదన్న అనుమానం కలిగించేలా మోదీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని మండిపడ్డారు. 'ప్రతిపార్టీకీ సిద్ధాంతాలు ఉంటాయి. కానీ వాటిని ప్రభుత్వంపై రుద్ది దేశాన్ని విచ్ఛిన్నం చేయడానికి బీజేపీ ప్రయత్నిస్తోంది. మతం పేరిట విభజించు.. పాలించు అనే విధానాన్ని అమలు చేస్తోంది' అని విమర్శించారు. ఈ పోరాటంలో విజయం సాధించాలని, విజయం ఎన్నికలతోనే సాధ్యమని రామ్మోహన్‌నాయుడు స్పష్టంచేశారు. రాష్ట్రం కోసమే కాకుండా చంద్రబాబు దేశానికీ అవసరమని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో 25 లోక్‌సభ స్థానాలు గెలిస్తే మన హక్కులు సాధించుకోవచ్చని అశోక్ గజపతిరాజు స్పష్టం చేశారు. రాష్ట్రంకోసం కేంద్రంతో నిరంతరం పోరాడుతున్న సీఎం చంద్రబాబుకు ఎంతోకొంత సాయపడాలని పుట్టినరోజునాడు దీక్ష చేస్తున్నానని మాగంటి తెలిపారు. తమ పోరాటం కొనసాగుతుందని ప్రకటించారు. అనంతరం అశోక్ గజపతిరాజు, రామ్మోహన్, బుట్టా రేణుక ఆయనకు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు.



జంతర్- మంతర్ వద్ద టీడీపీ నేతల ధర్నా

అధిష్ఠానంపై ఆమంచి అలక!

- నా ప్రత్యర్థికి తెలుగు మహిళ పదవా?
- చీరాల ఎమ్మెల్యే ఆగ్రహం
- పార్టీ మార్పుపై అనుచరులతో భేటీ
- మంత్రి శిద్దా రాయబారం
- ఫోన్లో లోకేశ్ బుజ్జగింపు
- నేడు సీఎంను కలిసే అవకాశం



అనుచరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆమంచి

ఒంగోలు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా చీరాల శాసనసభ్యుడు ఆమంచి కృష్ణమోహన్ టీడీపీపై అలిగారు. అధిష్ఠానం వైఖరితో తన ఆత్మాభిమానం దెబ్బతిందని అసంతృప్తి వ్యక్తం చేశారు. భవిష్యత్ కార్యాచరణపై అనుచరులతో పందిళ్లపల్లిలోని తన స్వగృహంలో సమావేశమయ్యారు. తక్షణమే రంగంలోకి దిగిన సీఎం చంద్రబాబు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ బుజ్జగింపు ప్రయత్నాలు ప్రారంభించారు. మంత్రి శిద్దా రాఘవరావును పందిళ్లపల్లి పంపి.. ఎమ్మెల్యేతో మంతనాలు జరిపారు. బుధవారం చంద్రబాబును కలవాలని మంత్రి సూచించారు. ఈ నేపథ్యంలో ఆమంచి తన తుది నిర్ణయాన్ని బుధవారానికి వాయిదా వేసుకున్నారు.

అసంతృప్తికి కారణాలివీ..

గత ఎన్నికల్లో చీరాల నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందిన కృష్ణమోహన్ అనంతరం టీడీపీలో చేరారు. కొంతకాలంగా ఆయన పార్టీ మారే ఆలోచనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. వైసీపీకి చెందిన ఓ రాజ్యసభ సభ్యుడు, మరికొందరు ముఖ్య నాయకులు ఆయనతో మంతనాలు కూడా జరిపారు. అయితే టీడీపీలో చంద్రబాబు ఆయనకు అత్యంత ప్రాధాన్యమిచ్చారు. కానీ కొన్ని పరిణామాలు ఆయనకు అసంతృప్తి కలిగించాయని చెబుతున్నారు. గత ఎన్నికల్లో తనపై పోటీచేసి ఓడిపోయిన పోతుల సునీతకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వడంతోపాటు.. ఇటీవల తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలిగా నియమించడంపై ఆయన గుర్రుగా ఉన్నట్లు తెలిసింది. అంతేగాక నియోజకవర్గంలోని ఇద్దరు, ముగ్గురు టీడీపీ నేతలు ప్రత్యేక కార్యక్రమాలు పెట్టి.. తనపై సాగిస్తున్న వ్యతిరేక ప్రచారాన్ని అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లినా క్రమశిక్షణ చర్యలు తీసుకోలేదని ఆయన ఆగ్రహంతో ఉన్నట్లు సమాచారం. అధిష్ఠానం ఉద్దేశపూర్వకంగానే తనను అలక్ష్యం చేస్తోందని మంగళవారం తన అనుచరులతో చర్చల సందర్భంగా ప్రస్తావించినట్లు తెలిసింది. టీడీపీలో ఒక సామాజికవర్గానికి చెందినవారు తనపై పెత్తనం చేయాలని చూశారని.. ముఖ్యంగా టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ వ్యవహార శైలి కూడా తన అసంతృప్తికి ముఖ్యకారణంగా చెప్పినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో సీఎం ఆదేశాల మేరకు మంత్రి శిద్దా ఎమ్మెల్యే వద్దకు వెళ్లారు. సమస్యల పరిష్కారానికి సీఎం సిద్ధంగా ఉన్నారని, మీపై ఆయన చూపుతున్న గౌరవాన్ని గుర్తించి వేరే ఆలోచన చేయవద్దని శిద్దా సూచించినట్లు తెలిసింది. అప్పటికప్పుడే లోకేశ్‌కు ఫోను కలిపారు. సమస్యలుంటే పరిష్కరించుకుందామని.. తొందరపడి నిర్ణయాలు తీసుకోవద్దని లోకేశ్ కూడా కోరినట్లు తెలిసింది. సీఎం సూచన మేరకు బుధవారం అమరావతికి వచ్చి ఆయన్ను కలవాలని ఆమంచికి శిద్దా సూచించారు. మంత్రి వెళ్లిన తర్వాత ఇంటి వద్ద వేచి ఉన్న ఇతర అనుచరులతో ఆయన భేటీ అయ్యారు. అక్కడున్న మీడియా ప్రతినిధులను బయటకు పంపించి.. రాత్రి పొద్దుపోయే వరకూ చర్చలు జరిపారు. తనకు జనసేనలో చేరే ఉద్దేశం లేదని వారికి స్పష్టం చేసినట్లు తెలిసింది. అదే సందర్భంలో వైసీపీ పట్ల సానుకూలంగా మాట్లాడారని సమాచారం.

జీవీఎల్‌కు దేహశుద్ధి తప్పదు

- వైసీపీలో అంతా ఒకే కులానికి చెందినోళ్లేగా: బుద్దా వెంకన్న

అమరావతి, విజయవాడ, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): 'సీఎం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్చుకోలేక చంద్రబాబుపై ప్రతిపక్షనేత జగన్, బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారు' అని ప్రభుత్వ విప్ బుద్దా వెంకన్న అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడుతూ.. 'జీవీఎల్ సీఎంపై పిచ్చివాడిలా మాట్లాడుతున్నారు. నోరు అదుపులో పెట్టుకోవాలి. లేకపోతే దేహశుద్ధి తప్పదు. 16 నెలలు జైల్లో ఉన్న ఆర్థిక నేరస్థుడు డీజీపీ, నిఘా డీజీలపై బరితెగించి విమర్శలు చేయడం దారుణం. వైసీపీలో అధ్యక్షుడు, గౌరవ అధ్యక్షురాలు, ఇలా అందరూ ఒకే కులానికి చెందిన వారున్నారు. అలాంటి జగన్ కులాల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉంది' అని మండిపడ్డారు.

జగన్.. వాస్తవాలు తెలుసుకుని మాట్లాడు: పల్లె

'పోలీసుల మనోభావాలు దెబ్బతీసేలా జగన్ మాట్లాడడం తగదు. ఆయనకు, వైఎస్‌కు కులపిచ్చి ఎక్కువ. టీడీపీతోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుంది' అని ప్రభుత్వ విప్ పల్లె రఘునాథరెడ్డి అన్నారు. ఆధారరహిత ఆరోపణలు చేస్తే జగన్ చరిత్రహీనుడుగా మిగిలిపోవడం ఖాయమని విరుచుకుపడ్డారు. 'అధికారం 2019లో కూడా రాదని ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ నిరాశ నిస్పృహలతో ఉన్నారు. కులాల ప్రస్తావన తెచ్చి రాష్ట్రంలో చిచ్చు పెడుతున్నారు. ఢిల్లీ వెళ్లి ఆంధ్రప్రదేశ్ పరువు తీస్తున్నారు' అని వర్ల రామయ్య విమర్శించారు.

జీవీఎల్‌పై హక్కుల నోటీసు

అమరావతి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు శాసనసభను కించపరిచారని.. ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తాడికొండ టీడీపీ ఎమ్మెల్యే తెనాలి శ్రవణ్‌కుమార్ సభాహక్కుల ఉల్లంఘన కింద స్పీకర్ కోడెల శివప్రసాదరావుకు నోటీసు సమర్పించారు. 169 నిబంధన కింద ఆయన మంగళవారం సభలో ఈ అంశాన్ని లేవనెత్తారు. ఈ నెల 2న జీవీఎల్ చేసిన ట్వీట్ అభ్యంతకరంగా, అగౌరవపరిచేలా ఉందని తెలిపారు. సీఎంను అసెంబ్లీ రౌడీ అని, బీజేపీ ఎమ్మెల్యేలు విష్ణుకుమార్‌రాజు, మాణిక్యాలరావులను బెదిరిస్తున్నారని ఆయన అందులో పేర్కొన్నట్లుగా సభ దృష్టికి తీసుకొచ్చారు.

భయంతోనే సభా హక్కుల నోటీసులు: జీవీఎల్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): తమ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలను బెదిరించినందుకు వారు సీఎం చంద్రబాబుపై సభా హక్కుల ఉల్లంఘన నోటీసులిస్తారన్న భయంతో ముందుగానే టీడీపీ నేతలు తనపై సభా హక్కుల ఉల్లంఘన నోటీసులు అందించారని జీవీఎల్ ఢిల్లీలో అన్నారు. రాజ్యసభ ఎంపీలకు అసెంబ్లీలో ఈ నోటీసులు ఇచ్చే అధికారం లేదని, వాటిని పట్టించుకోనవసరం లేదని వ్యాఖ్యానించారు. అసెంబ్లీలో బీజేపీ ఎమ్మెల్యేలను తిరగనివ్వబోమని ముఖ్యమంత్రి అనడం సభా హక్కుల ఉల్లంఘన కిందికి వస్తుందని తెలిపారు.

పత్తికొండ, డోన్ మాకే!

- అలాగైతే కోట్ల చేరికకు ఓకే.. కేఈ కుటుంబం గ్రీన్‌సిగ్నల్

అమరావతి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాల వైరం స్థానంలో కర్నూలు జిల్లా రాజకీయాల్లో కొత్త స్నేహాలు చిగురించే సూచనలు కనిపిస్తున్నాయి. జిల్లాలో కాంగ్రెస్ సీనియర్ నేత కోట్ల విజయభాస్కర్‌రెడ్డి కుటుంబం టీడీపీలో చేరడానికి ఆమోదం తెలపాలని ఉపముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి కుటుంబం నిర్ణయించుకున్నట్లు సమాచారం. కాకపోతే సుదీర్ఘ కాలంగా తాము ప్రాతినిధ్యం వహిస్తున్న డోన్, పత్తికొండ అసెంబ్లీ సీట్లను కోట్ల కుటుంబానికి ఇవ్వరాదని.. వేరే చోట ఎక్కడ ఇచ్చినా వారిని గెలిపించి తీసుకువస్తామని కేఈ కుటుంబం చెబుతోంది. కోట్ల కుటుంబానికి, కేఈ మాదన్న (కృష్ణమూర్తి తండ్రి) కుటుంబానికి ఎంతో కాలంగా రాజకీయ వైరం కొనసాగుతోంది. వచ్చే ఎన్నికల్లో తాను పోటీ నుంచి వైదొలగి.. ప్రస్తుతం తాను ప్రాతినిధ్యం వహిస్తున్న పత్తికొండలో తన కుమారుడు శ్యాంను నిలపాలని కేఈ అనుకుంటున్నారు. ఈ దశలో సూర్యప్రకాశ్‌రెడ్డి కుటుంబం చేరికకు తాను అడ్డుపడడం భావ్యం కాదని ఆయన నిర్ణయించుకున్నారు. డోన్, పత్తికొండ తప్ప కోట్ల కుటుంబానికి మరెక్కడ సీట్లిచ్చినా వారి కోసం పని చేసి గెలిపిస్తామని ఆయన ఆంతరంగిక సంభాషణల్లో టీడీపీ నేతలకు చెబుతున్నారు. కర్నూలు ఎంపీ సీటును సూర్యప్రకాశ్‌రెడ్డికి ఇవ్వడానికి ఆయన అభ్యంతరం చెప్పడం లేదు. వారికి అసెంబ్లీ సీటు ఇవ్వాల్సి వస్తే ఆలూరు ఇస్తే మంచిదని, అక్కడ ఒక మండలంలో తమకు కూడా పట్టుందని.. కోట్ల కుటుంబానికి మంచి మెజారిటీ అందించగలమని కేఈ అంటున్నారు. ఇవే విషయాలను పార్టీ అధ్యక్షుడు చంద్రబాబుకు వివరించేందుకు మంగళవారం ఆయన తన సోదరులు, కుమారుడితో కలిసి ఆయన వద్దకు వెళ్లారు. ఆ సమయానికి చంద్రబాబు కోల్‌కతా వెళ్లే హడావుడిలో ఉండడంతో భేటీ కుదరలేదు. బుధ/ గురువారాల్లో వీరు సమావేశమయ్యే అవకాశం ఉంది.


జమ్మలమడుగుపై రాజీ ఫార్ములా!

- ఎంపీగా పోటీ చేసేవారికి ఎమ్మెల్సీ.. రెండోవారికి ఎమ్మెల్యే సీటు
- ఆదినారాయణరెడ్డి ఆమోదం.. అసెంబ్లీకే రామసుబ్బారెడ్డి?

అమరావతి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం మొత్తం దృష్టినీ ఆకర్షిస్తున్న కడప జిల్లా జమ్మలమడుగు అసెంబ్లీ స్థానం విషయంలో తెలుగుదేశం పార్టీ ఒక రాజీ ఫార్ములా ఖరారుచేసింది. కడప ఎంపీగా పోటీ చేసేవారికి ముందుగానే ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని.. రెండోవారికి జమ్మలమడుగు అసెంబ్లీసీటు ఇవ్వాలని నిర్ణయించింది. జమ్మలమడుగు సీటుకు ప్రస్తుతం మంత్రి ఆదినారాయణరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. గత ఎన్నికల్లో వైసీపీ టికెట్‌పై గెలిచిన ఆయన.. తర్వాత టీడీపీలోకి వచ్చి.. మంత్రి అయ్యారు. అక్కడ టీడీపీ అభ్యర్థిగా పోటీచేసి ఓడిపోయిన మాజీ మంత్రి రామసుబ్బారెడ్డికి అధిష్ఠానం ఎమ్మెల్సీ ఇచ్చి.. ప్రభుత్వ విప్ పదవి కూడా కట్టబెట్టింది. నియోజకవర్గంలో ఈ ఇద్దరికీ బలమైన అనుచర గణం ఉంది. అందుకే ఒకరిని కడప ఎంపీగా.. మరొకరిని జమ్మలమడుగు ఎమ్మెల్యేగా నిలపాలని టీడీపీ అధిష్ఠానం నిర్ణయించింది. కానీ ఇద్దరూ అసెంబ్లీ సీటునే కోరుకోవడంతో సమస్య వచ్చింది. దీంతో టీడీపీ అధినేత చంద్రబాబు వారితో చర్చించారు. ఈ ఇద్దరూ కలిస్తే జమ్మలమడుగు స్థానంలో గెలుపు చాలా సులభం. కడప ఎంపీ సీట్లో విజయం మాత్రం మిగిలిన ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో రాజకీయ పరిస్థితిపై ఆధారపడి ఉంటుంది. లోక్‌సభకు పోటీచేసేవారికి కొంత రిస్క్ ఉంది. అందువల్ల ఎంపీగా ఎవరు పోటీచేస్తే వారికి ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని నిర్ణయించారు. రెండో వారికి ఎమ్మెల్యే సీటు ఇస్తారు. ఈ ఫార్ములాను సూచిస్తే తనకు ఏదైనా ఒకటేనని రామసుబ్బారెడ్డి తనకు నచ్చింది తీసుకుంటే రెండోది తాను తీసుకుంటానని ఆదినారాయణరెడ్డి అధిష్ఠానానికి చెప్పారు. రామసుబ్బారెడ్డి అసెంబ్లీకే పోటీ చేయాలని భావిస్తున్నారు. ఈ ఫార్ములా అమలైతే ఆయన తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసే అవకాశం ఉంది.

సీబీఐ దాడులు సమాఖ్య స్ఫూర్తికి ప్రమాదకరం

- అమెరికాలో భారతీయ విద్యార్థుల పట్ల మోదీ మౌనం దారుణం: నారాయణ



తిరుపతి, ఫిబ్రవరి 5: 'నరేంద్ర మోదీ ప్రభుత్వం రాష్ట్రాల్లో సీబీఐ దాడులు నిర్వహించి భయాందోళనలు సృష్టిస్తోంది. ఇది ఫెడరల్ వ్యవస్థకు ప్రమాదకరం. పశ్చిమబెంగాల్‌లో కక్షగట్టి సీబీఐ దాడులు నిర్వహించడం అప్రజాస్వామిక చర్య' అని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. తిరుపతిలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ బీజేపీ తమకు వ్యతిరేకంగా పోరాటాలు చేసే సెక్యులర్ పార్టీలపై సీబీఐని ఉసిగొల్పడం దారుణం. పశ్చిమబెంగాల్‌లో 2014లో శారదా స్కామ్‌పై కోర్టు ఉత్తర్వులు ఉన్నాయి. ఐదేళ్లుగా పట్టనట్టుండి నేడు సీబీఐ అధికారులు అత్యుత్సాహం చూపడం సమంజసం కాదు. స్కామ్‌లను సీపీఐ ఎప్పుడూ సమర్థించదు. తెలుగు రాష్ట్రాల్లో వైఎస్ జగన్ స్కామ్, కేసీఆర్ టెలిఫోన్ ట్యాపింగ్ లాంటి వాటి జోలికి కేంద్రం ఎందుకు వెళ్లలేదు? గాంధీవర్ధంతి రోజు ఉత్తరప్రదేశ్‌లో ఆర్ఎస్ఎస్ మూకలు మహాత్మాగాంధీ ఫ్లెక్సీపై తుపాకులతో కాల్చి, గాడ్సే అమర్ రహే అని నినాదాలు చేస్తే నరేంద్ర మోదీ, బీజేపీ అధ్యక్షుడు ఖండించకపోవడం అవమానకరం. సీబీఐ స్పెషల్ డైరెక్టర్ ఆస్తానా కేసును వాదించేందుకు న్యాయవాదులు ముందుకు రావడం లేదంటే, సుప్రీం కోర్టును కూడా మోదీ అదుపులో ఉంచుకొన్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అమెరికన్ విద్యాలయాల్లో చదువుకొంటున్న భారత విద్యార్థులుపై చర్యలు తీసుకుంటున్నా మోదీ స్పందించకపోడం దారుణం' అని నారాయణ అన్నారు.



సీతారామయ్య, రాజ్యలక్ష్మి దంపతులను సన్మానిస్తున్న కాలనీ వాసులు

ఆంధ్రా వాసులకు ఆత్మీయ వీడ్కోలు

- 1975 నుంచి నేటి వరకు వరంగల్ డాక్టర్స్ కాలనీలో నివాసం
- ఉద్యోగ విరమణ అనంతరం స్వరాష్ట్రానికి..
- ఘనంగా సత్కరించిన కాలనీ వాసులు

పోచమ్మమైదాన్, ఫిబ్రవరి 5: రాష్ట్రం విడిపోయినా తెలుగు ప్రజల మధ్య ఆత్మీయత అలాగే ఉందని నిరూపించారు వరంగల్ అర్బన్ జిల్లా హన్మకొండ డాక్టర్స్ కాలనీ వాసులు. బతుకు తెరువు కోసం వరంగల్‌కు వచ్చి ఉద్యోగ విరమణ అనంతరం స్వరాష్ట్రానికి బయలుదేరిన ఆంధ్రా దంపతులకు కాలనీ వాసులు ఆత్మీయంగా వీడ్కోలు పలికారు. తీపి జ్ఞాపకాలు, 44 ఏళ్లుగా పంచుకున్న ఆత్మీయతను గుర్తు చేసుకొని సాదరంగా సాగనంపారు. ఆంధ్రప్రదేశ్ కృష్ణాజిల్లా ఉయ్యూరుకు చెందిన కంటమనేని సీతారామయ్య 1975లో చదువు నిమిత్తం వరంగల్ జిల్లాకు వచ్చారు. చదువు అనంతరం వ్యవసాయశాఖ అధికారిగా ప్రభుత్వ కొలువు సాధించారు. తమ ప్రాంతానికి చెందిన రాజ్యలక్ష్మిని పెళ్లి చేసుకొని వరంగల్ నగర కేంద్రానికి సమీపంలోని డాక్టర్స్ కాలనీ-2లో స్థిరపడ్డారు. నాటి నుంచి కాలనీ అభివృద్ధి పనులలో, దేవాలయ కమిటీలో సేవలందించి అక్కడి వారితో కలిసిపోయారు. కాగా, ఇటీవల పదవీ విరమణ పొందిన సీతారామయ్య తన బంధువులు, కుటుంబ సభ్యులతో కలిసి ఉండాలని స్వరాష్ట్రానికి బయలు దేరారు. వారిని మంగళవారం డాక్టర్స్ కాలనీ వాసులు ఘనంగా సన్మానించారు. స్థానిక కార్పొరేటర్ కావటి కవిత యాదవ్ ఆధ్వర్యంలో దంపతులకు శాలువాలు కప్పి, పూలమాలలతో సత్కరించారు.

సెల్ఫీ మరణాలను నిరోధించండి

- రాష్ట్రాలకు కేంద్రం సూచన

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: పర్యాటక కేంద్రాల వద్ద సెల్ఫీ మరణాలను నిరోధించడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని రాష్ట్రాలను, కేంద్ర పాలిత ప్రాంతాలను కేంద్రం ఆదేశించింది. పర్యాటక కేంద్రాల వద్ద ప్రమాదకర స్థలాలను గుర్తించి వాటి వద్ద హెచ్చరిక బోర్డులు గానీ, బారికేడ్లు గానీ పెట్టాలని పర్యాటక శాఖకు సూచించింది. అవసరమైతే 'నో సెల్ఫీ జోన్'గా ప్రకటించాలని తెలిపింది.

రైతుల స్థితిగతులపై దేశవ్యాప్త సర్వే

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: దేశవ్యాప్తంగా రైతుల స్థితిగతులను అంచనా వేయడానికి ప్రస్తుత పంట సంవత్సర(జూలై-జూన్) కాలానికి ఒక సర్వే చేపడతామని కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ తెలిపారు. లోక్‌సభలో ఓ ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిస్తూ నేషనల్ శాంపుల్ సర్వే 77వ రౌండ్‌లో భాగంగా రైతుల ఆదాయం, ఖర్చు, రుణాల వివరాలు సేకరిస్తామని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి సర్వే గతంలో 2012-13 పంట సంవత్సరానికి నిర్వహించిన తర్వాత మళ్లీ చేయలేదని చెప్పారు.

లోక్‌సభ ఎన్నికలకూ ఫ్రంట్‌గానే?

- సీపీఐతో టీజేఎస్ నేతల చర్చలు.. కాంగ్రెస్ నేతలతోనూ మంతనాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): వచ్చే లోక్‌సభ ఎన్నికల్లోనూ ప్రజాఫ్రంట్‌గానే పోటీ చేయాలని భాగస్వామ్యపక్షాలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజాఫ్రంట్‌గా పోటీ చేసిన కాంగ్రెస్, టీడీపీ, సీపీఐ, టీజేఎస్ పార్టీలు లోక్‌సభ ఎన్నికల్లోనూ అలాగే పోటీ చేస్తాయని టీజేఎస్ ముఖ్య నేతలు అంటున్నారు. దీనిపై ఇప్పటికే సీపీఐ, టీజేఎస్ మధ్య ప్రాథమిక చర్చలు జరిగాయి. కాంగ్రెస్ ముఖ్యులతోనూ భేటీ అయినప్పటికీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు, రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై మాత్రమే చర్చించామని చెబుతున్నారు. భాగస్వామ్య పక్షాలన్నీ త్వరలో సమావేశమై లోక్‌సభ ఎన్నికలపై చర్చించాల్సి ఉందని టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజాఫ్రంట్ మంచి అజెండాతో ప్రజల్లోకి వెళ్లినప్పటికీ ప్రచార వ్యూహం ఆశించిన స్థాయిలో లేకపోవడంతో నష్టపోయామని ఆయన అభిప్రాయపడ్డారు.

వైసీపీలో చేరిన మాజీ మంత్రి ఖలీల్ బాషా

- టీడీపీ నేతకు కండువా కప్పి ఆహ్వానించిన జగన్



హైదరాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లాకు చెందిన టీడీపీ నేత, మాజీ మంత్రి ఖలీల్ బాషా వైసీపీలో చేరారు. మంగళవారం ఆ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని హైదరాబాద్ లోటస్‌పాండ్‌లోని ఆయన నివాసంలో కలుసుకున్నారు. కడప వైసీపీ ఎమ్మెల్యే అంజాద్ బాషాతో కలిసి వెళ్లిన ఖలీల్ బాషాకు జగన్ వైసీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.


నిధుల్లేవ్.. టీడీ, డీఏ ఇవ్వలేం!

- అధికారులకు ఆర్మీ వెల్లడి.. తీవ్ర నిరసన.. వెనక్కి తగ్గిన పీసీడీఏ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: ఒకపక్క కేంద్ర ప్రభుత్వం దేశ రక్షణ శాఖకు భారీ ఎత్తున నిధులు కేటాయిస్తోంది. ఈ నెల 1న ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో కూడా రూ.3.05 లక్షల కోట్లను సైన్యానికి కేటాయించింది. అయితే, మరోపక్క తమ దగ్గర నిధుల కొరత ఏర్పడిందని ఆర్మీ అధికారులు వెల్లడించడం చర్చకు దారితీసింది. నిధులకు కొరత ఏర్పడిందని, టీఏ, డీఏలు ఇవ్వలేమని సైనిక వ్యయాలను పర్యవేక్షించే ప్రిన్సిపల్ కంట్రోలర్ ఆఫ్ డిఫెన్స్ అకౌంట్స్(పీసీడీఏ) సోమవారం ప్రకటించింది. ఈ పరిణామంతో నిర్ఘాంతపోయిన ఆర్మీ అధికారులు సోషల్ మీడియా వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు. అదేసమయంలో ఆర్మీ ఖజానా వట్టిపోయిందనే వార్తలు ప్రచారంలోకి వచ్చాయి. దీంతో సదరు ప్రకటనను పీసీడీఏ వెబ్‌సైట్ నుంచి తొలగించింది. ప్రస్తుతం ఆర్మీలోని వివిధ విభాగాల ఉన్నతాధికారుల పద్దుల్లో నిధుల కొరత ఉందని, ఇది తాత్కాలికమేనని, త్వరలోనే ఈ సమస్య తీరుతుందని పీసీడీఏ అధికారులు పేర్కొన్నారు.

కరుగుతున్న హిమనీనదాలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: వాతావరణ వేడి హిమానీనదాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నట్లు తాజా సర్వే పేర్కొంది. ఫలితంగా గంగానది వంటి నదుల్లో నీటి ప్రవాహాల్లో మార్పులు చోటుచేసుకుంటాయని అధ్యయనకారులు హెచ్చరిస్తున్నారు. ఈ ప్రభావం ఎక్కువగా హిమాలయాల్లోని హిందూ-కుష్ పర్వత శ్రేణుల్లో (హెచ్‌కేహెచ్) ఉన్నట్లు చెబుతున్నారు. ఈ పరిధిలో మన దేశంతోపాటు అఫ్ఘానిస్థాన్, బంగ్లాదేశ్, భూటాన్, చైనా, మయన్మార్, నేపాల్, పాకిస్థాన్ ఉన్నాయి. ఇక్కడ నుంచే గంగానదితోపాటు ఇండస్, ఎల్లో, మెకాంగ్, ఇరవాడీ నదులకు నీటి ప్రవాహం వెళ్తుంది. తాజా గణాంకాల ప్రకారం హెచ్‌కేహెచ్‌లో 1.5డిగ్రీల వేడి పెరిగినట్లు కాఠ్‌మాండూ కేంద్రంగా పనిచేస్తున్న సెంటర్ ఫర్ ఇంటిగ్రేటెడ్ మౌంటేన్ డెవలప్‌మెంట్(ఐసీఐఎంవోడీ) సంస్థ తెలియజేసింది. గత ఐదు దశాబ్దాల కాలంలో హిమాలయ మంచుపర్వతాలు చాలా వేగంగా కరుగుతున్నట్లు పేర్కొంది. హెచ్‌కేహెచ్‌లోని తూర్పు, పశ్చిమ హిమాలయాల్లో ఈ మార్పులు అధికంగా.. మధ్య హిమాలయాల్లో ఒక మాదిరిగా ఉన్నట్లు వివరించింది.



8న ఏపీఐఐసీ కార్యాలయం ప్రారంభం

మంగళగిరి, ఫిబ్రవరి 5: మంగళగిరిలో రాష్ట్ర పరిశ్రమల మౌలిక సదుపాయాల కల్పనా సంస్థ (ఏపీఐఐసీ) ప్రధాన కార్యాలయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నెల 8వ తేదీని ప్రారంభించనున్నారు. ఇందుకోసం ఏపీఐఐసీ అధికారులు ఏర్పాట్లు ముమ్మరం చేస్తున్నారు. రాష్ట్ర విభజనానంతరం.. ఇప్పటి వరకు ఆ సంస్థ ప్రధాన కార్యాలయాన్ని విజయవాడ గురునానక్ రోడ్డులోని ఓ ప్రైవేటు అద్దె భవనంలో నడుపుతున్నారు. సొంత భవనం సమకూర్చుకోవాలన్న ఆలోచనతో మంగళగిరి ఆటోనగర్ పక్కనే 22.17 ఎకరాల విస్తీర్ణంలో ఐటీ పార్కు పేరుతో వేసిన వెంచర్‌లో జీ+11 భవన సముదాయ నిర్మాణాన్ని చేపట్టారు. తొలుత రూ.46కోట్ల అంచనా వేసినా, చివరికి 2 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో భారీ బహుళ అంతస్థులతో నిర్మించడానికి రూ.వంద కోట్లకు పైగా ఖర్చు చేశారు. ఇందులో రెండు సెల్లార్లను పార్కింగ్ కోసం కేటాయించారు. పై మూడు అంతస్థులను ఏపీఐఐసీ సొంతానికి, మిగతా తొమ్మిది అంతస్థులను పరిశ్రమలశాఖ, ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు, మరికొన్ని ఐటీ సంస్థలకు అద్దెకు ఇవ్వనుంది. తద్వారా మంగళగిరిలో మరిన్ని ఐటీ సంస్థలు కొలువు తీరనున్నట్లు తెలుస్తోంది.



మంగళగిరిలో ప్రారంభానికి సిద్ధమైన ఏపీఐఐసీ ప్రధాన కార్యాలయ భవన సముదాయం

విద్యుత్ చార్జీలు పెరగవ్!

- రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమిదే
- సంస్కరణలతో ధరలకు కళ్లెం
- వినియోగదారులకే తొలి ప్రాధాన్యం
- విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్ జస్టిస్ భవానీ ప్రసాద్
- బెజవాడలో అట్టహాసంగా అంతర్జాతీయ ఇంధన సదస్సు ప్రారంభం
- నేడు సీఎం చంద్రబాబు హాజరు





సదస్సులో జస్టిస్ భవానీ ప్రసాద్‌ను సత్కరిస్తున్న అజయ్‌జైన్, ప్రదర్శనలో ఎలక్ట్రిక్ వాహనాలు

విజయవాడ, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విభజన తర్వాత నవ్యాంధ్రప్రదేశ్ విద్యుత్ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయని ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్ జస్టిస్ భవానీప్రసాద్ అన్నారు. నష్టాలను తగ్గించి డిస్కంల ఆదాయం పెంచడంతో పాటు వినియోగదారులకు చార్జీలు పెంచకుండా, నాణ్యమైన విద్యుత్, మెరుగైనసేవలు అందిస్తున్నామని ఆయన అన్నారు. దీనివెనుక శాఖలో పనిచేస్తున్న లైన్‌మెన్ మొదలుకొని ఉన్నతాధికారుల వరకూ అందరి కృషి ఉందని అభినందించారు. విజయవాడలోని నోవాటెల్ హోటల్‌లో 'ఏపీ ఎనర్జీ ఇన్నోవేషన్ సమ్మిట్-2019' పేరుతో మంగళవారం ప్రారంభమైన రెండురోజుల అంతర్జాతీయ ఇంధన సదస్సులో జస్టిస్ భవానీప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'ఏపీలో విద్యుత్ సంస్కరణలకు శ్రీకారం చుట్టాం. కరెంటు కొనుగోలు ఖర్చును 86% నుంచి 76శాతానికి తగ్గించాము. ఆ మేరకు వినియోగదారులకు కూడా చార్జీలను తగ్గించాం. భవిష్యత్‌లో కూడా విద్యుత్ ఛార్జీలను పెంచకూడదనేది ప్రభుత్వ లక్ష్యం' అని ఆయన తెలిపారు. విద్యుత్ ప్రమాదాల్లో చనిపోయిన, గాయపడిన బాధితులకు సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా నష్టపరిహారం అందించేలా విద్యుత్ నియంత్రణ మండలి చర్యలు తీసుకుందని జస్టిస్ భవానీ ప్రసాద్ తెలిపారు. ఇటీవల విజయనగరం జిల్లాలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు చనిపోవడంతో ఒక్కొక్కరికీ రూ.5 లక్షల నష్టపరిహారం, మరో రూ.5లక్షలు చొప్పున చంద్రన్న బీమా కలిపి మొత్తం రూ.10లక్షలు అందించినట్టు తెలిపారు. గతంలో రూ.1-2 లక్షలే పరిహారంగా ఇచ్చేవారన్నారు. రాష్ట్రంలోని న్యాయ నిర్వహణ భవంతులలో గ్రీన్ ఎలక్ట్రిసిటీని ప్రోత్సహిస్తున్నారని, ఏపీని గ్రీన్ జ్యుడీషియరీగా ప్రకటించాలని హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రవీణ్‌కుమార్‌ను కోరుతున్నామన్నారు.

ఆంధ్రప్రదేశ్ ఎనర్జీ, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అజయ్ జైన్ మాట్లాడుతూ.. విద్యుత్ రంగంలో కూడా నూతన ఆవిష్కరణలకు సీఎం చంద్రబాబు అధిక ప్రాధాన్యమిస్తున్నారని చెప్పారు. 'పోలవరం ప్రాజెక్టు పూర్తయితే అతిపెద్ద బహుళార్థక విద్యుత్ ప్రాజెక్టు అందుబాటులోకి వస్తుంది. భవిష్యత్‌లో సముద్రపు అలల నుంచి, వైఫై సిగ్నల్స్ ద్వారా కూడా కరెంటును ఉత్పత్తి చేసే అవకాశం ఉంది. విద్యుదుత్పత్తి పెరగడంతో రాష్ట్రంలో ఇంధన ఛార్జీలు రూ. 14 నుంచి రూ.2.45 లకు తగ్గాయి. వచ్చే ఐదేళ్లలో రాష్ట్రంలో విద్యుత్ వాహనాల వినియోగాన్ని గణనీయంగా పెంచుతాం. అమరావతిలోకి పొల్యూషన్ ఫ్రీ ఎలక్ట్రికల్ వాహనాలను మాత్రమే అనుమతించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది' అని అజయ్‌జైన్ తెలిపారు. నెడ్‌క్యాప్ వైఎస్ చైర్మన్, ఎండీ ఎం.కమలాకర్‌బాబు తదితరులు సదస్సులో మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యుత్ చార్జింగ్‌తో నడిచే వాహనాలను ప్రదర్శనకు ఉంచారు. బుధవారం నాటి సదస్సులో సీఎం చంద్రబాబు పాల్గొంటారు.

ఏపీకి అర్హత లేదు

- అదనపు రుణాలపై కేంద్రం ప్రకటన

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): 14వ ఆర్థికసంఘం నిర్దేశితాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2018-19 సంవత్సరంలో షరతులను పూర్తి చేయలేదని, అందువల్ల అదనపు రుణాలు పొందేందుకు ఏపీ ప్రభుత్వానికి అర్హత లేదని కేంద్రం ప్రకటించింది. రాజ్యసభలో వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి అడిగిన ఓ ప్రశ్నకు సమాధానమిస్తూ కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పొన్‌రాధాకృష్ణన్ ఈ విషయం వెల్లడించారు. 14వ ఆర్థిక సంఘం ఏపీ, తెలంగాణ రెండింటికీ జీఎస్డీపీలో మూడు శాతం



మేరకు ఆర్థికలోటుకు పరిమితి విధించిందని పేర్కొన్నారు. అయితే, రుణ జీఎస్డీపీ నిష్పత్తి 25 శాతం దాటకుండా, వడ్డీ చెల్లింపులు-ఆదాయ వసూళ్ల నిష్పత్తి 10 శాతం మించకుండా ఉంటే ఈ ఆర్థికలోటు పరిమితిలో కూడా సడలించవచ్చని ఆర్థికసంఘం సిఫారసు చేసిందని తెలిపారు. ఈ ప్రాతిపదిక ప్రకారం తెలంగాణకు మాత్రమే రూ.2052 కోట్ల మేరకు అదనపు రుణాలు చేసేందుకు అర్హత లభించిందని స్పష్టం చేశారు. 2018-19లో జీఎస్డీపీలో 0.25 శాతానికి సమానంగా ఈ మొత్తం ఉంటుందని, అది మూడు శాతం సాధారణ పరిమితికి అదనంగా లభిస్తుందని ఆయన చెప్పారు. కాగా, ఎఫ్ఆర్‌బీఎం పరిమితిని 0.5 శాతం పెంచాలని ఏపీ ప్రభుత్వం విజ్ఞప్తి చేసిందని, కానీ షరతులు పూర్తిచేయనందున రాష్ట్రానికి అర్హత లేదన్నారు. అలాగే, ప్రత్యేక ప్యాకేజీలో భాగంగా ఈఏపీల ద్వారా తీసుకున్న రుణాలకు వడ్డీని చెల్లించేందుకు రూ.15.81 కోట్లు విడుదల చేశామని మరో ప్రశ్నకు కేంద్ర మంత్రి సమాధానంగా చెప్పారు. కాగా, వెనుకబడిన జిల్లాల నిధులపై గల్లా జయదేవ్ ప్రశ్నించగా.. రూ.350 కోట్లు విడుదల చేసి, ప్రక్రియలో లోపాల వల్ల తిరిగి వెనక్కి తీసుకున్నామని హోంశాఖ సహాయ మంత్రి హన్స్‌రాజ్ గంగారామ్ లోక్‌సభలో తెలిపారు.

చేనే..తల రాత మారనుంది!

- అప్పులు, ఆకలి నిన్న.. ఆర్థిక భరోసా నేడు!
- చేనేత కార్పొరేషన్ ప్రకటనపై నేతన్నల సంబరాలు
- ఇప్పటికే రూ.110 కోట్ల రుణవిముక్తి



అమరావతి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): పండగలకు ఊరందరికీ కొత్త దుస్తులు నేసేవాడి ఒంటిపై వస్త్రం కాదు కాదా? ఒంట్లో సత్తువలేని పరిస్థితి..! గిట్టుబాటు ధర లభించక, మరోపని చేయలేక నూలుపోగును ఉరితాడుగా చేసుకుని అర్ధంతరంగా తనువు చాలించే దుస్థితి!.. వెరసి.. ఆకలి, అప్పులు కలగలిసిన జీవితం! ఇవన్నీ ఉమ్మడి ఏపీలోని చేనేతల బతుకు చిత్రం!!. కానీ.. పరిస్థితిలో అనూహ్య మార్పొచ్చింది. రాష్ట్ర విభజన తర్వాత చంద్రబాబు ప్రభుత్వం నేతన్నలను రుణ విముక్తుల్ని చేయడంతో వారి బతుకులు గాడిలోపడ్డాయి. ఆకలి కేకలు లేవు.. ఉరితాడు అవసరం రాలేదు! తాజాగా.. చేనేత కార్పొరేషన్ ఏర్పాటు చేయనున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటించడంతో చేనేత వర్గాలు సంబరాలు చేసుకొంటున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో అప్పుల ఊబి నుంచి ఆర్థిక భరోసా వైపు అడుగులు పడుతున్నాయి.

బాబు సహకారంతో రుణవిముక్తి..

ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయం తర్వాత గ్రామీణులకు చేనేతే ప్రధాన జీవనాధారారం. ప్రస్తుతం రాష్ట్రంలోని 13 జిల్లాల్లో హ్యాండ్లూమ్ కో-ఆపరేటివ్ సెక్టార్‌లో 2.48లక్షల మంది చేనేత కార్మికులున్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం బయటి సహకార సంఘాల్లో 1.50లక్షల మంది ఉన్నారు. మొత్తం 906 చేనేత సహకార సంఘాలు రిజిస్టర్ కాగా, అందులో బాగా పనిచేసుత్తున్నవి 606. కానీ.. ఒంట్లో శక్తినంతటినీ కూడగట్టుకుని వస్త్రాన్ని ఉత్పత్తి చేసే చేనేత కార్మికుడి కష్టాలు దశాబ్దాలుగా తీరలేదు. రాష్ట్ర విభజనకు ముందు వరకూ రోజూ ఎక్కడో ఒక చోట చేనేత కార్మికుడి ఆత్మహత్య పత్రికల్లో కనిపించేది. అయితే ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఏపీలో చేనేత కార్మికులకు రూ.110 కోట్ల అప్పులు చంద్రబాబు ప్రభుత్వం చెల్లించింది. వడ్డీ సైతం జమ చేసింది. దీంతో వేలాది మంది చేనేతకార్మికులు రుణవిముక్తులయ్యారు.

ప్రత్యేక ప్రణాళిక అమలు!

ఇదే సమయంలో చేనేతల్ని అన్ని విధాలా పైకి తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడికక్కడ భారీగా క్లస్టర్లు ఏర్పాటు చేసి ఉమ్మడిగా పనిచేసుకునే వీలు కల్పించింది. పాతకాలపు మగ్గాల బరువు నుంచి విముక్తి కల్పించేందుకు అధునాతన మగ్గాలపై శిక్షణ ఇచ్చింది. ఆ తర్వాత ఆదరణ-2 కింద జాకార్డ్‌లు అందజేసింది. సొంత మగ్గం ఏర్పాటు చేసుకుందామంటే సొంత ఇల్లులేని కార్మికులకు ఎన్టీఆర్ గృహాలను కేటాయించింది. వర్క్‌షెడ్ నిర్మాణం కోసం అదనంగా లక్ష రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తోంది. పాతమగ్గాలను కాళ్లతో తొక్కి యాభై ఏళ్లకే మోకాళ్ల నొప్పులతో అనారోగ్యం పాలవుతోన్న కార్మికులకు వృద్ధాప్య పింఛను ఇస్తున్న ఏపీ ప్రభుత్వం.. బటన్ నొక్కితే కదిలే అధునాతన మగ్గాలను ఇచ్చింది. వాటికయ్యే విద్యుత్ ఖర్చును కార్మికుడిపై పడకుండా 150 యూనిట్ల వరకూ ఉచితంగా ఇస్తున్నట్లు తాజాగా రాజమండ్రిలో చంద్రబాబు ప్రకటించారు. వర్షాకాలంలో వస్త్ర ఉత్పత్తికి ఆటంకం కలిగి చేనేతలకు ఆర్థిక ఇబ్బందులు తలెత్తకుండా ప్రతినెలా రెండువేల రూపాయల చొప్పున వేజ్‌లాస్ కింద ఆర్థిక సాయమందిస్తున్నారు. అయితే, ముడిసరుకు కొనుగోలుకు ఆర్థిక సమస్య. ఈ ఇబ్బంది నుంచి గట్టెక్కాలంటే చేనేతలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర పద్మశాలీ సంఘం అధ్యక్షుడు, జాతీయ హ్యాండ్లూమ్ బోర్డు సభ్యుడు కేఏఎన్ మూర్తితోపాటు పలువురు చేనేత వర్గాల ముఖ్యులు ముఖ్యమంత్రికి విన్నవించాయి. దీనిపై చంద్రబాబు సానుకూలంగా స్పందించి.. తాజాగా కార్పొరేషన్ ఏర్పాటు ప్రకటన చేయడంతో చేనేత వర్గాలు సంబరాలు చేసుకొంటున్నాయి. కాగా, చేనేత కార్పొరేషన్ ప్రకటన అనంతరం ఆప్కో చైర్మన్ గుజ్జల శ్రీనివాస్ స్పందిస్తూ.. చంద్రబాబు చేసిన సాయానికి ప్రతిగా.. ఓటుతో రుణం తీర్చుకుందామని చేనేత వర్గాలకు విజ్ఞప్తి చేశారు.

పరిశ్రమలకు బీజేపీ, వైసీపీ అడ్డు

- 'మన్నవరం' గుజరాత్‌కు తరలింపు యత్నం
- మండలిలో మంత్రి అమరనాథ్‌రెడ్డి.. బీజేపీ, టీడీపీల మధ్య వాగ్వివాదం

అమరావతి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): "బీజేపీ, వైసీపీ పరిశ్రమలు, పెట్టుబడులు రాష్ట్రానికి రాకుండా అడ్డుపడుతున్నాయి. రాష్ట్రానికి రావాల్సిన అనేక ప్రాజెక్టులను, పరిశ్రమలను రానీయకుండా ఏపీపై కేంద్రం వివక్ష చూపుతోంది" అని మంత్రి అమరనాథరెడ్డి మండిపడ్డారు. మంగళవారం రాష్ట్ర శాసన మండలిలో సభ్యులు అడిగిన పలు ప్రశ్నలకు పలువురు మంత్రులు సమాధానాలిచ్చారు. ప్రకాశం జల్లా కనిగిరిలో జాతీయ పెట్టుబడి, తయారీ జోన్(నిమ్జ్) ఏర్పాటుపై టీడీపీ ఎమ్మెల్సీ కరణం బలరాం, డొక్కా మాణిక్యవరప్రసాద్ అడిగిన ప్రశ్నలకు మంత్రి అమరానాథరెడ్డి సమాధానమిచ్చారు. "రూ.43.500 కోట్లతో, 14,231 ఎకరాల్లో 5 లక్షల మందికి ఉపాధి లభించేలా 'నిమ్జ్'ను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. కేంద్రం దానిని రానీయకుండా చేస్తోంది. మన్నవరం ప్రాజెక్టును గుజరాత్‌కు తరలించే ప్రయత్నాలు చేసింది. విభజన చట్టం ప్రకారం ప్రాజెక్టులు, పరిశ్రమలు ఏపీకి రాలేదు. మేం కియ తెస్తే ఓర్వలేక ధర్నాలు చేస్తున్నారు" అని అమరనాథ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ సభ్యులు 'మంత్రి, కేంద్రాన్ని తప్పుపట్టడం సరి కాదు' అంటూ అభ్యంతరం వ్యక్తం చేశారు. అధికార పార్టీ సభ్యులు జోక్యం చేసుకుని ఉన్నమాట అంటే ఉలుకెందుకంటూ బీజేపీ సభ్యులను నిలదీశారు. దీనిపై కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. విభజన చట్టంలోని గిరిజన విశ్వవిద్యాలయం గురించి సభ్యులు సంధ్యారాణి, సూర్యారావు, శ్రీనివాసుల నాయుడు, యండపల్లి శ్రీనివాసులరెడ్డి, బాలసుబ్రహ్మణ్యం ప్రశ్నలకు మంత్రి గంటా శ్రీనివాస్ సమాధానమిస్తూ "గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటులో జాప్యం జరుగుతున్న మాట వాస్తవమే. పార్లమెంటులో సవరణ బిల్లు పెట్టినట్లు కేంద్రం తెలిపింది. వీసీ నియామకం జరిగింది" అని తెలిపారు. దీనిపై అధికార పార్టీ సభ్యులు కేంద్రం నిర్లక్ష్యాన్ని నిరసించగా, 10 ఏళ్లలో చేయాల్సినవి ఐదేళ్లలోనే చేశామని బీజేపీ సభ్యుడు సోము వీర్రాజు అన్నారు. విభజన చట్టం ప్రకారం వచ్చిన వర్సిటీల పనితీరును తెలుసుకునేందుకు కమిటీని నియమించాలని, సభ్యుల బృందాలు వెళ్లి పరిశీలించేలా ఏర్పాట్లు చేయాలని సోము కోరారు. విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు కోర్టు అడ్డంకులను తొలగించి, వెంటనే భర్తీ చేయాలని సభ్యులు ఏఎస్ రామకృష్ణ, శమంతకమణి, బాలసుబ్రహ్మణ్యం, రాము సూర్యారావు కోరారు. న్యాయసలహా తీసుకుని పోస్టుల భర్తీని పరిశీలిస్తామని మంత్రి గంటా హామీ ఇచ్చారు. ఆహార కల్తీ, ప్రజాపంపిణీలో ఈ-పోస్ సమస్యలు, అంగన్‌వాడీ భవనాల అద్దె చెల్లింపులపై శమంతకమణి, పోతుల సునీత అడిగిన ప్రశ్నలకు మంత్రులు ప్రత్తిపాటి పుల్లారావు, పరిటాల సునీత స్పందించారు.

రుణ మాఫీతో లాభం లేదు

6 వేల సాయమూ అంతే.. అసలు సమస్యకు ఇవి మందు కాదు

- దీర్ఘకాలంలో నష్టం తప్పదు
- పొలాన్ని బట్టి రైతుకు సాయమా?
- ఎక్కువ మందికి ప్రయోజనం ఉండదు
- ప్రపంచ నిపుణుడు అనిత్ ముఖర్జీ స్పష్టీకరణ

వాషింగ్టన్, ఫిబ్రవరి 5: భారత్‌లో వ్యవసాయ సంక్షోభానికి సంబంధించిన అసలు సమస్యను వదిలేసి.. ఆర్థిక భారంగా మారే కార్యక్రమాలను రాజకీయ పార్టీలు ప్రకటించడంపై ప్రపంచ స్థాయి నిపుణుడు అనిత్ ముఖర్జీ ఆందోళన వ్యక్తంచేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ప్రకటించిన రైతు రుణమాఫీ, ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన రైతులకు ఏటా రూ.6 వేల సాయం పథకాలపై ఆయన పెదవి విరిచారు. ఐదెకరాల్లోపు ఉన్న రైతులకు రూ.6 వేల చొప్పున చేస్తామంటున్న సాయం.. దేశంలోని గ్రామీణ రైతాంగానికి అంతగా లబ్ధి చేకూర్చదని ఓ ఇంటర్వ్యూలో స్పష్టం చేశారు. సెంటర్ ఫర్ గ్లోబల్ డెవలప్‌మెంట్ థింక్-ట్యాంక్‌లో పాలసీ ఫెలోగా ఉన్న ఆయన.. వర్ధమాన దేశాల్లో పరిపాలన, పబ్లిక్ ఫైనాన్స్, సేవల పంపిణీ రంగాలపై మంచి నిపుణుడు. ప్రజాసబ్సిడీల సంస్కరణ, సమ్మిళిత ఆర్థికాభివృద్ధి, లింగ సాధికారతల్లో బయోమెట్రిక్ ఐడీ, డిజిటల్ చెల్లింపుల ప్రభావంపై తాజాగా ఆయన అధ్యయనం చేస్తున్నారు. కేంద్రం తన మధ్యంతర బడ్జెట్‌లో 12 కోట్ల మంది చిన్న, సన్నకారు రైతులకు రూ.6 వేల చొప్పున నేరుగా వారి ఖాతాల్లో జమ చేస్తామనడం, సార్వజనీన మౌలిక వేతన (యూబీఐ) పథకం, దేశంలో ప్రతి ఒక్కరికీ కనీస ఆదాయ హామీ పథకం ప్రవేవపెడతామని రాహుల్ చేసిన ప్రకటన.. ఇవన్నీ ఎన్నికల ముందు రాజకీయ గిమ్మిక్కులేనని ఆయన తేల్చిచెప్పారు. 'కొన్ని ఎకరాల్లోపు వ్యవసాయ భూమి ఉన్నవారికే సాయం చేస్తామన్న కార్యక్రమాలు గతంలో అత్యధిక గ్రామీణ జనాభాకు అందలేదు. ఇందుకు రుజువులు కూడా ఉన్నాయి. ఇంకా ఎక్కువ పొలం ఉన్న వారు కూడా సంక్షోభంలో ఉన్నారు. ఐదెకరాల్లోపు వారికి ఇప్పుడు ప్రకటించిన రూ.6 వేల సాయం పథకం కూడా రాజకీయంగా ఎదురుదెబ్బ తీసే అవకాశముంది. ఎందుకంటే ఆర్థికంగా బాగున్న రైతులకే ప్రభుత్వం ఈ సాయం అందిస్తుందన్న వాదన ఉంది. రాహుల్ ప్రకటించిన కనీస ఆదాయ పథకం, మోదీ ఆదాయ వృద్ధి పథకాలు తప్పుదోవ పట్టించేలా ఉన్నాయి. పట్టణ పేదలకు ఇవి ఏ మాత్రం అందవు. దేశంలో ఇప్పుడు పట్టణ పేదలే నానాటికీ పెరిగిపోతున్నారు. కానీ వారిని ప్రభావశీ ఓటుబ్యాంకుగా పార్టీలు గుర్తించడం లేదు. కొన్ని వర్గాలకు అందించే లక్ష్యంతో అమలు చేస్తున్న పథకాలతో ఎన్ని ఇబ్బందులో భారత్‌కే ఎక్కువ తెలుసు. అనర్హులైన వారికి కేటాయించడం, అవినీతి, లీకేజీ వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. ఆధార్, జన్‌ధన్ స్కీములు అనుకున్న లక్ష్యాలను నెరవేర్చలేకపోయాయి. సగం వండిన పథకాలు మేలు చేయకపోగా.. అనతికాలంలోనే గాక దీర్ఘకాలంలోనూ మరింత హాని చేస్తాయి. అసలు సమస్యలు పరిష్కారం కాకపోగా.. ద్రవ్య భారం సృష్టిస్తాయి. గతంలో అమలైన రైతు రుణమాఫీనే తీసుకోండి. అదెంత నష్టం చేసిందో తెలుసా? అయినా రాజకీయ నాయకులకు ఓట్లే కావాలి. ఇప్పుడు కేంద్రం నేరుగా రైతుల ఖాతాల్లో రూ.6 వేలు జమ చేసే కార్యక్రమాన్ని ప్రకటించింది. ఇది కూడా రుణమాఫీలా నష్టం చేకూర్చదని ఆశిస్తున్నాను' అని ముఖర్జీ తెలిపారు.

వివాదాస్పద ట్వీట్.. సౌదీలో ఇందూరువాసికి 5ఏళ్ల జైలు

(గల్ఫ్ నుంచి ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

ఓ వివాదాస్పద ట్వీట్.. గల్ఫ్‌లో తెలంగాణ వాసికి పెద్ద చిక్కే తెచ్చిపెట్టింది. మయన్మార్‌లో రోహింగ్యాలపై దమనకాండను సమర్థిస్తూ ట్విటర్‌లో పోస్ట్ చేసినందుకు నిజామాబాద్ జిల్లాకు చెందిన యువకుడికి సౌదీలో ఐదేళ్ల జైలు శిక్ష పడింది. జిల్లాలోని పెర్కిట్ గ్రామానికి చెందిన చెన్నా రాకేశ్ కొన్నేళ్లుగా సౌదీలో ఉంటున్నాడు. మయన్మార్ లోని రోహింగ్యా ముస్లింలపై అక్కడి సైనిక ప్రభుత్వం చేస్తున్న దమనకాండను సమర్థిస్తూ 2017లో ట్విటర్‌లో ఓ మెసేజ్ పెట్టాడు. వెంటనే అతడిని సమర్థిస్తూ ఇతర దేశాలకు చెందిన కొందరు పోస్టింగులు పెట్టారు. ఈ పరిణామం ఓ వర్గంలో తీవ్ర వివాదాస్పదమైంది. కొద్దిసేపటికే రాకేశ్ తన పోస్టింగ్‌ను తొలగించినా.. పలువురి ఫిర్యాదుతో అక్కడి పోలీసలు అతడిని అరెస్టు చేశారు. కేసును విచారించిన న్యాయస్థానం రాకేశ్‌కు ఐదేళ్ల జైలు శిక్ష విధించింది. ప్రస్తుతం అతడు రియాద్‌లోని జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు. సామాజిక మాధ్యమాల్లో వివాదస్పద ట్వీట్‌ను షేర్ చేసినప్పుడు.. తెలియకుండా చేశామని ఒప్పుకుంటే ఇక్కడ స్వల్ప శిక్షతో బయటపడతారు. రాకేశ్ కేసు ఇందుకు భిన్నం. అతడే స్వయంగా వివాదాస్పద ట్వీట్ చేయడంతో తీవ్ర నేరమై కూర్చుంది. ఉన్నత న్యాయస్థానంలో అప్పీలు చేసుకునేందుకు గడువు సమీపిస్తుండడంతో అతడి కుటుంబీకులు సహకరించాల్సిందిగా పలువురిని కోరుతున్నారు.



పోప్ ఫ్రాన్సిస్‌ను ముద్దాడుతున్న ఈజిప్టు అజార్ షాహీ ఇమామ్ షేక్ అహ్మద్ అల్ తయ్యబ్

గల్ఫ్ గడ్డపై శాంతివచనం

- యూఏఈలో పోప్ ఫ్రాన్సిస్ బహిరంగ ప్రార్థనలు

అబుదాబి, ఫిబ్రవరి 5: క్రైస్తవ మత గురువు పోప్ ఫ్రాన్సిస్ గల్ఫ్ గడ్డపై తనదైన ముద్రవేశారు. యూఏఈలో అడుగు పెట్టిన తొలి కేథలిక్ గురువుగా రికార్డు సృష్టించిన ఆయన.. పశ్చిమాసియాలో శాంతియుత వాతావరణానికి పిలుపునిచ్చారు. మంగళవారం అబుదాబిలోని జాయెద్ స్పోర్ట్స్ సిటీ స్టేడియంలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో ఆయన పాల్గొన్నారు. ఇస్లాం మతానికి పుట్టినిల్లు అయిన సౌదీ అరేబియాకు యూఏఈ సరిహద్దు దేశమే అయినా ఇక్కడ క్రైస్తవ మతాచారంపై ఆంక్షలు లేవు. యూఏఈ ఆర్థిక వ్యవస్థలోనే కాదు... అక్కడి జనాభాలోనూ 10% క్రైస్తవులు ఉన్నారు. ఈ నేపథ్యంలో స్టేడియంలో పోప్ నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో దాదాపు 50వేల మంది పాల్గొన్నారు.



మమతతో బాబు మంతనాలు

ప్రధానీ.. తప్పుకో!

రాజీనామా చేసి మళ్లీ గుజరాత్‌కు వెళ్లిపో... కేంద్రంలో ఏక వ్యక్తి, ఏక పార్టీ ప్రభుత్వం

రాష్ట్ర సంస్థలను గుప్పిట పట్టే ప్రయత్నం... సీబీఐ విషయంలో నైతిక విజయం మాదే!

రాజ్యాంగ, ప్రజాస్వామ్య విజయమిది: మమత... కోల్‌కతాలో మూడు రోజుల ధర్నా విరమణ

ఏపీలో మా ఎంపీలపైనా సీబీఐ, ఈడీలతో దాడి... ఉమ్మడి పోరాటం కొనసాగుతుంది: బాబు

కోల్‌కతా, ఫిబ్రవరి 5: "ప్రధాన మంత్రీ.. ముందు నువ్వు రాజీనామా చేయి. తిరిగి గుజరాత్‌కు వెళ్లిపో. కేంద్రంలో ఉన్నది ఏక వ్యక్తి, ఏక పార్టీ ప్రభుత్వమే. రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు సహా అన్నిటినీ గుప్పిట పట్టాలని భావిస్తోంది" అంటూ పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సుప్రీంలో ఇప్పుడు తమకు సానుకూల తీర్పు వచ్చిందని, నైతిక విజయం తమదేనని.. వచ్చే వారంలో ఢిల్లీలో పోరాటం కొనసాగిస్తామని చెప్పారు. సీబీఐ అంటే తనకెంతో గౌరవం ఉందని, కానీ, అది ప్రధాని మోదీ, బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా ఆదేశాలనే పాటిస్తోందని తప్పుబట్టారు. కోల్‌కతాలోని మెట్రో సినిమా ఎదుట చేపట్టిన మూడు రోజుల ధర్నాను విరమిస్తున్నట్లు మంగళవారం రాత్రి ప్రకటించారు. ఈ కార్యక్రమానికి ఏపీ సీఎం చంద్రబాబు కూడా హాజరయ్యారు. కోర్టు తీర్పు తర్వాత.. ధర్నా విరమణ అనంతరం మమత విలేకరులతో మాట్లాడారు. "తొలుత బీజేపీ బ్లాక్‌మెయిల్ చేస్తుంది. దాంతో వాళ్లంతా బీజేపీలో చేరతారు. ఆ తర్వాత వాళ్లపై ఎటువంటి కేసులూ ఉండవు. కేంద్ర దర్యాప్తు సంస్థలు అప్పటికే నమోదు చేసిన కేసులను ఎత్తేస్తారు" అని ధ్వజమెత్తారు. "మేం చట్టాన్ని గౌరవిస్తాం. ప్రజాస్వామ్య పునాదులను ధ్వంసం చేయడానికి జరుగుతున్న ప్రయత్నాలపైనే నా పోరాటం. కేంద్రంపై పోరాటంలో నేను ఒంటరిదానిని కాదు. ఈరోజు చంద్రబాబు వచ్చారు. నవీన్ పట్నాయక్ కూడా నాకు మద్దతు ఇచ్చారు. వారిని సంప్రదించి, తదుపరి చర్యలు తీసుకుంటా" అని చెప్పారు. సుప్రీం తీర్పుతో సివిల్ సర్వెంట్ల నైతికత పెరుగుతుందని వ్యాఖ్యానించారు. తాను విచారణకు రానని రాజీవ్ కుమార్ ఎన్నడూ చెప్పలేదని, ఒకరికొకరు సహకరించుకోవాలని కోర్టు గతంలో కూడా సూచించిందని గుర్తు చేశారు. అరెస్టు చేయడానికే ఆదివారం వచ్చారని, కానీ, అరెస్టు చేయరాదని కోర్టు నిర్దేశించినందుకు కృతజ్ఞతలని చెప్పారు. ఓ ముఖ్యమంత్రిగా ఉండి ధర్నా చేయవచ్చా అని ప్రశ్నించగా.. గతంలో అరవింద్ కేజ్రీవాల్, జయలలిత చేశారని గుర్తు చేశారు.


కూటమి రూపకర్త మమత: చంద్రబాబు

మహా కూటమి 'రూపకర్త' పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ అని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. ప్రతిపక్షానికి ఆమే మూలస్తంభమని చెప్పారు. మోదీని గద్దె దించడమే లక్ష్యంగా 'మహా కూటమి' ఏర్పడుతోందని, ప్రధాని అభ్యర్థి ఎవరో ఏకాభిప్రాయంతో నిర్ణయించుకుంటామన్నారు. బెంగాల్ సీఎం మమత దీక్ష విరమణ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రతి చర్యకూ ప్రతి చర్య ఉంటుందని, రాష్ట్రంలో అయోమయం సృష్టించడానికి కేంద్రం ప్రయత్నించిందని, కానీ, రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో బెంగాల్లో తృణమూల్ క్లీన్‌స్వీప్ చేస్తుందని, మొత్తం 42 సీట్లనూ గెలుచుకుంటుందని, జాతీయ స్థాయిలో ఆమే నిర్ణయాత్మక శక్తిగా ఉంటారని తెలిపారు. జనవరి 19న కోల్‌కతాలో నిర్వహించిన ప్రతిపక్షాల ర్యాలీలో పాల్గొన్న 23 పార్టీల ప్రతినిధిగా తాను హాజరయ్యానని చెప్పారు. "ప్రధాని మోదీ సహకార సమాఖ్య గురించి తరచూ చెబుతూనే.. అహంకారంతో ప్రవర్తిస్తారు. ఏ ప్రతిపక్షాన్నీ వదలడం లేదు. ఏపీలో మా ఎంపీలపై సీబీఐ, ఈడీలతో దాడి చేయించారు" అని అన్నారు. కాగా, దేశ సమాఖ్య వ్యవస్థపై దాడికి నిరసనగా భావసారూప్య ముఖ్యమంత్రులంతా కలిసి ఈనెల 12న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా చేయాలని నిర్ణయించారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. శరద్ పవార్, కేజ్రీవాల్, శరద్ యాదవ్ తదితరులతో మాట్లాడామని, మమత ధర్నాను ముగించి ఢిల్లీకి పోరాటాన్ని మార్చాలని నిర్ణయించామని చంద్రబాబు తెలిపారు. ఓటింగ్ యంత్రాలను ఏమార్చడం చాలా తేలిక అని, దేశ భవిష్యత్తును ఒక కంప్యూటర్ ఆపరేటర్ చేతిలో పెట్టలేమని తేల్చి చెప్పారు. కాగా.. బెంగాల్ పరిణామాలపై విపక్షాల ఆందోళనలతో మంగళవారం పార్లమెంట్ ఉభయ సభలు దద్దరిల్లాయి.

యోగీ... ముందు యూపీని చూసుకో!

ఉత్తరప్రదేశ్‌లో చాలామంది ప్రజలు, రైతులు చనిపోతున్నారని, ఓ పోలీసు అధికారిని కూడా హత్య చేశారని, ఆ రాష్ట్ర సీఎం యోగి ఆదిత్యనాథ్ తొలుత యూపీని చూసుకోవాలని మమత ఎద్దేవా చేశారు. బెంగాల్లోని రాయ్‌గంజ్, బలూర్‌ఘాట్ సభల్లో పాల్గొనడానికి ఆదివారం యోగి ఆదిత్యనాథ్ వచ్చారు. కానీ, ఆయన హెలికాప్టర్‌కు అనుమతి ఇవ్వలేదు. బంకురా జిల్లాలో సభలో పాల్గొనడానికి మంగళవారం వచ్చారు. మళ్లీ మమత సర్కారు అనుమతి నిరాకరించింది. ఈ నేపథ్యంలోనే మమత విమర్శలు గుప్పించారు. ఇప్పుడు పోటీ చేస్తే ఆయన యూపీలోనే గెలవలేరని, కానీ, బెంగాల్లో తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు.

బెంగాల్ దంగల్



సుప్రీంకోర్టు మధ్యేవాదం

(మూడోపేజీ తరువాయి)

తేదీ ఖరారు చేస్తే ఆ రోజున ఆయన విధేయతతో హాజరవ్వాలని చీఫ్ జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్ దీపక్ గుప్తా, జస్టిస్ సంజీవ్ ఖన్నాతో కూడిన ధర్మాసనం మంగళవారం నాడు ఇచ్చిన రూలింగ్‌లో తేల్చిచెప్పింది. అదే సమయంలో ఆయనను అరెస్ట్ చేయరాదని, ఒత్తిడిని పెంచేలా చర్యలు తీసుకోరాదని సీబీఐకు స్పష్టం చేసింది. "వివాదాన్ని నివారించేందుకు గాను- రాజీవ్ కుమార్ విచారణను అటు కోల్‌కతాలో గానీ, ఇటు న్యూఢిల్లీలో గానీ కాకుండా ఓ తటస్థ ప్రదేశంలో జరపాలని అంటూ ఇందుకు మేఘాలయ రాజధాని షిల్లాంగ్‌ను సూచించింది. అది కూడా షిల్లాంగ్ సీబీఐ కార్యాలయంలో జరపరాదని ఆజ్ఞాపించింది. కోర్టు ఆదేశం వెలువడిన వెంటనే రాజీవ్‌కుమార్ సీబీఐకి ఒక లేఖ రాస్తూ ఫిబ్రవరి 8న షిల్లాంగ్‌కు రావడం తనకు సమ్మతమేనని చెప్పారు.

ఓ పక్క స్వల్ప ఊరటనిస్తూనే సుప్రీం కోర్టు రాజీవ్ కుమార్‌కు, మమత ప్రభుత్వానికి మరో పక్క షాకిచ్చింది. శారదా చిట్‌ఫండ్ స్కాంలో సాక్ష్యాల్ని ధ్వంసం చేశారన్న సీబీఐ ఆరోపణలపై ఈనెల 20లోగా సమాధానమివ్వాలని రాజీవ్ కుమార్‌ను ఆదేశించింది. ఈ కుంభకోణంపై సీబీఐ దర్యాప్తుకు 2014లో కోర్టే ఆదేశించిందని, అయితే ఆ దర్యాప్తుకు బెంగాల్ సర్కారు సహకరించడం లేదని, ఇది కోర్టు ధిక్కారమేనని సీబీఐ చేసిన ఆరోపణను కూడా పరిగణనలోకి తీసుకున్న బెంచ్- దీనిపై ఫిబ్రవరి 18లోగా సమాధానం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి, డీజీపీకి నోటీసులు జారీచేసింది. వారిచ్చిన సమాధానాలు పరిశీలించాక- అవసరమైతే వారిని ఫిబ్రవరి 20న విచారణకు పిలిపిస్తామని కూడా తేల్చిచెప్పింది.

సీల్డు కవరులో రాజీవ్, తృణమూల్ సర్కార్‌కు వ్యతిరేకంగా వివరాలు

అంతకు ముందు కోర్టులో జోరుగా వాదనలు సాగాయి. మొదట పావుగంట సేపు అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్, సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా శారదా స్కాం గురించి క్లుప్తంగా బెంచ్‌కు వివరించారు. సీబీఐ తరఫున వాదనలు వినిపించిన వారు పురా మంగళవారం నాడు అదనంగా ఓ అఫిడవిట్‌ను సమర్పించారు. అంతేకాక- రాజీవ్ కుమార్‌కు, తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా వివరాలను ఓ సీల్డు కవర్లో బెంచ్‌కు అందజేశారు. "శారదా స్కాంపై దర్యాప్తుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందానికి (సిట్‌కు) నేతృత్వం వహించిన రాజీవ్ కుమార్ మొత్తం సాక్ష్యాలను ధ్వంసం చేశారు. కొన్నింటిని తారుమారు చేశారు. 2014లో సీబీఐకి ఈ దర్యాప్తు అప్పగించాక అనేకసార్లు కేసు ఫైళ్లను అడిగినా సీడీఆర్ (కాల్ డేటా రికార్డింగ్‌లు) తప్ప మరేమీ ఇవ్వలేదు. ఆ సీడీఆర్‌లు కూడా కొన్ని సృష్టించినవి, మరికొన్ని తారుమారు చేసినవి. నిందితులతో ఆయన కుమ్మక్కయ్యారు. 2013లో రాష్ట్ర ప్రభుత్వమే ఏర్పాటు చేసిన సిట్‌లోని అధికారులంతా నిందితులతో లాలూచీ పడ్డారు. దర్యాప్తునకు ప్రభుత్వం అడుగడుగునా అవరోధాలు కల్పించింది. సీబీఐ అధికారులను అరెస్టు చేయడానికి రాష్ట్ర పోలీసులు ప్రయత్నించారు" అని కోల్‌కతాలోని సీబీఐ ఎస్పీ పార్థ ముఖర్జీ సమర్పించిన 17 పేజీల అఫిడవిట్‌ను కేకే వేణుగోపాల్ బెంచ్‌కు సమర్పించారు.

ఐదేళ్లు ఎఫ్ఐఆర్ లేదు.. సడెన్‌గా ఎందుకు?

కోల్‌కతా

పోలీసు తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపించారు. "ఇది వివిధ రాష్ట్రాలకు విస్తరించిన స్కాం కాబట్టి కోర్టు దీన్ని సీబీఐకి అప్పగించింది. 2016లో ఇదే సుప్రీం కోర్టు సిట్ పనితీరును అభినందించింది కూడా! నాలుగున్నరేళ్ల పాటు ఈ కేసును సీబీఐ పెద్దగా పట్టించుకోలేదు. ఆకస్మికంగా గత ఆదివారం నాడు ఏకంగా 40 మంది సీబీఐ అధికారులు ఢిల్లీ నుంచి దిగారు. ఏమిటిది, ఎందుకీ తొందర? ప్రధాని నరేంద్ర మోదీ రెండు బహిరంగసభల్లో మాట్లాడిన మరుసటి రోజే కేసుకు జీవం వచ్చింది. పాత సీబీఐ డైరెక్టర్ పదవి నుంచి వైదొలిగే చివరిరోజున, డీజీపీ పదవీవిరమణ రోజున- హఠాత్తుగా వచ్చారు. ఐదేళ్ల పాటు రాజీవ్ కుమార్‌పై ఎలాంటి ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదు. ఆయన నిందితుడు కాదు. నేరానికి ప్రోద్బలమిచ్చినవాడు కాదు. కానీ హఠాత్తుగా ఆయనను చుట్టుముట్టారు. ఎందుకు?" అని నిలదీశారు. "అధికారులను అవమానించి, ఇబ్బందిపెట్టడమే లక్ష్యంగా రాజకీయ ప్రయోజనాలతో చేస్తున్న దర్యాప్తులివి" అని సింఘ్వీ ఘాటుగా విమర్శించారు.

మమతతో ధర్నాలో పాల్గొంటారా!

- అధికారినన్న విషయం మర్చిపోయారా?
- సర్వీసు రూల్స్ ఉల్లంఘించారు
- రాజీవ్‌కుమార్‌పై కేంద్రం ఉచ్చు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: బెంగాల్ దంగల్‌కు కారణమైన కోల్‌కతా సిటీ పోలీసు కమిషనర్ రాజీవ్ కుమార్ చుట్టూ కేంద్రం ఉచ్చు బిగిస్తోంది. ఆయనపై క్రమశిక్షణ చర్య తీసుకోవాలని తాజాగా ఓ లేఖను బెంగాల్ ప్రభుత్వానికి లేఖ రాసింది. "ఆయన ఓ ఉన్నతాధికారి. ధర్నా చేస్తున్న ముఖ్యమంత్రి మమతా బెనర్జీతో పాటుగా తాను కూడా ధర్నాకు కూర్చొనడం తప్పు. రాజకీయ నాయకులు చేస్తున్న ఆందోళనల్లో పాల్గొనడం ఆలిండియా సివిల్ సర్వీసెస్ నిబంధనలు- 1968లోని 3, 5, 7కు విరుద్ధం. ఆయన సర్వీసు రూల్స్‌ను అతిక్రమించారు. ఆయనపై తక్షణం క్రమశిక్షణ చర్యలు తీసుకోండి" అని కేంద్ర హోంశాఖ ఆ లేఖలో డిమాండ్ చేసింది. సీబీఐకు సహాయ నిరాకరణ చేసినట్లు కూడా ఆయనపై అభియోగం ఉంది. ఆయనపై ఖచ్చితంగా చర్య తీసుకోవాల్సిందేనని స్పష్టం చేసింది. ఈ లేఖతో ఆయనపై అన్ని వైపుల నుంచీ ఉచ్చు బిగించాలని కేంద్రం ప్రయత్నిస్తోంది. ఇప్పటికే సాక్ష్యాల ధ్వంసం అభియోగాన్ని సుప్రీంకోర్టులో మోపిన కేంద్రం ఇక సర్వీసు రూల్స్ ఉల్లంఘన సాకుతో శాఖాపరంగా ఇబ్బంది పెట్టే పని మొదలెట్టింది.

మోదీలాంటి ప్రధానిని చూడలేదు

- ఆయనను దించడమే మా లక్ష్యం: బాబు

కోల్‌కతా, ఫిబ్రవరి 5: మోదీని గద్దె దించడమే లక్ష్యంగా 'మహా కూటమి' ఏర్పడుతోందని టీడీపీ అధినేత, ఏపీ సీఎం చంద్రబాబు తెలిపారు. తమ ప్రధాని అభ్యర్థి ఎవరో ఏకాభిప్రాయంతో నిర్ణయించుకుంటామన్నారు. అయినా, మోదీతో పోల్చితే ఇంకెవరైనా బాగా పరిపాలిస్తారని చెప్పారు. బెంగాల్ సీఎం మమత దీక్షకు సంఘీభావం ప్రకటించేందుకు కోల్‌కతా వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో మమతా బెనర్జీ కీలకమనే బీజేపీ దాడులకు పాల్పడుతోందని చంద్రబాబు ఆరోపించారు. దేశమంతా మమతకు అండగా ఉందని భరోసా ఇచ్చారు. యావత్ భారతదేశం మార్పు కోసం ఎదురు చూస్తోందని చంద్రబాబు అన్నారు. 'దేశ చరిత్రలో మోదీ వంటి ప్రధానిని ఇంతవరకూ చూడలేదు. ఇక ముందు కూడా చూసే అవకాశం లేదు. మోదీ, అమిత్ షా దేశంలో తామే నిజాయితీపరులు అనుకుంటున్నారు. రాఫెల్ కుంభకోణంతో పాటు ఆర్థిక నేరగాళ్లను దేశం దాటించడం బీజేపీ ప్రభుత్వం సాధించిన అతిపెద్ద ఘనత' అని చంద్రబాబు ఎద్దేవా చేశారు. బీజేపీ మరోసారి అధికారంలోకి వస్తే ప్రజాస్వామ్యం మరింత అపహాస్యం అవుతుందని అన్నారు. ఓటింగ్ యంత్రాలను ఏమార్చడం తేలికని, దేశ భవిష్యత్తును ఒక కంప్యూటర్ ఆపరేటర్ చేతిలో పెట్టలేమని తేల్చిచెప్పారు.

మా మద్దతు అక్కర్లేదని రాసిస్తారా?



- ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ సూటి ప్రశ్న

కోల్‌కతా, ఫిబ్రవరి 5: "కూటమి కట్టిన 23 ప్రతిపక్ష పార్టీలను దోపిడీ పార్టీలు, దొంగల పార్టీలని అభివర్ణిస్తున్నారు కదా! లోక్‌సభ ఎన్నికల తర్వాత కేంద్రంలో ప్రభుత్వ ఏర్పాటుకు ఈ 23 పార్టీల సహకారం మేం కోరం అని సంతకం చేసి మరీ అఫిడవిట్ ఇస్తారా!?" అని ప్రధాని మోదీని ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ ప్రశ్నించారు. మమతకు సంఘీభావం తెలపడానికి కోల్‌కతా వచ్చిన ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. బీజేపీతో సంబంధాలు తెంచుకుంటే అవినీతి ముద్ర వేస్తున్నారని విమర్శించారు. బీజేపీతో సంబంధాలు తెంచుకున్నప్పటి నుంచి చంద్రబాబును వేధిస్తున్నారన్నారు. వాళ్లకు కావాలంటే ఒళ్లో కూర్చో బెట్టుకుంటారని, లేకపోతే వేధిస్తారని విమర్శించారు.

'చుక్కల' తీర్పు ఆర్డీవోకి..

- కలెక్టర్ జిల్లా కమిటీలకు చెల్లు.. సబ్ డివిజనల్‌లోనే పరిష్కారం
- దరఖాస్తు పరిష్కార సమయం.. 6 నుంచి 2 నెలలకు కుదింపు
- జేసీ వద్ద అప్పీల్‌కు అవకాశం.. చట్ట సవరణకు సభలో బిల్లు

అమరావతి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): చుక్కల భూముల పరిష్కారంలో ఆర్డీవోలకే కీలక అధికారం ఇవ్వాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు అమల్లోకి రాబోతున్నాయి. జిల్లాస్థాయి కమిటీ స్థానంలో సబ్ డివిజనల్ కమిటీలను ఏర్పాటు చేసేలా చుక్కల భూముల చట్టంలో కీలక సవరణ ప్రతిపాదిస్తూ రెవెన్యూశాఖ మంగళవారం అసెంబ్లీలో బిల్లును ప్రవేశపెట్టింది. వచ్చే రెండు రోజుల్లో బిల్లుపై చర్చించి ఆమోదించనున్నారు. ప్రతిపాదిత సవరణలను అనుసరించి... జిల్లా కలెక్టర్ నేతృత్వంలో కమిటీలను ఎత్తివేశారు. సబ్ డివిజనల్ అంటే రెవెన్యూ డివిజన్ పరిధిలోనే దరఖాస్తుల పరిష్కారం, తిరస్కారం జరిగిపోయేలా ఏర్పాట్లు చేశారు, సబ్ కలెక్టర్ లేదా ఆర్డీవో చైర్మన్‌గా సబ్ డివిజనల్ కమిటీని ప్రతిపాదించారు. ఈ కమిటీలో సంబంధిత మండల తహసిల్దార్, ఇతర అధికారులుంటారు. ఈ కమిటీ నిర్ణయంపై విభేదించేవారు జాయింట్ కలెక్టర్ వద్ద అప్పీల్ చేసుకోవాలి. కేవలం 30 రోజుల్లోనే జేసీ అప్పీల్‌ను పరిష్కరించాలి. అక్కడా న్యాయం లభించలేదనుకుంటే భూ పరిపాలనా ప్రధాన కమిషనర్ వద్ద అప్పీల్ చేసుకోవాలి. అలాగే, దరఖాస్తుల పరిష్కార కనీస సమాయాన్ని ఆరు నెలల నుంచి రెండు నెలలకు కుదించారు.

పొజిషన్ ఉంటే పట్టా

కొత్తగా 4ఏ కింద ఓ అంశాన్ని ఈ బిల్లులో ప్రతిపాదించారు. 2017 జూన్ 14 నాటికి చుక్కల భూములపై కనీసం 12 ఏళ్లపైగా పొజిషన్ ఉన్నవారికి పట్టా ఇస్తారు. దానికోసం సదరు వ్యక్తి పాస్‌బుక్, టైటిల్‌డీడ్, రిజిస్ట్రేషన్ డీడ్ వంటి వాటిని సమర్పించాలి. తగిన ధ్రువీకరణ పత్రాలుందిస్తే చాలు, ఏపీ భూమి హక్కుల చట్టప్రకారం యజమానిగా గుర్తిస్తారు. రెవెన్యూ రికార్డుల్లో వారిపేర్లు చేర్చి తాజాపరుస్తారు. ఇందుకు ఓ షరతును పెట్టనున్నారు. ప్రభుత్వం వివిధ అవసరాల కోసం పేదలు, ప్రభుత్వ సంస్థలు, ఇతరులకు 1954 జూన్ 18 తర్వాత కేటాయించిన చుక్కల భూములకు ఈ నియమం వర్తించదు.

శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు కొత్త ఎస్పీలు

అమరావతి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు కొత్త ఎస్పీలను నియమించారు. మంగళవారం రాత్రి పొద్దుపోయాక ఈ ఉత్తర్వులు వెలువడ్డాయి. ప్రస్తుతం ఇంటెలిజెన్స్ ఎస్పీగా ఉన్న వెంకటరత్నాన్ని శ్రీకాకుళం ఎస్పీగా నియమించారు. విశాఖ డీసీపీగా ఉన్న ఏఆర్ దామోదర్‌కు విజయనగరం ఎస్పీగా బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం విజిలెన్స్అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీగా ఉన్న డి.కోటేశ్వరరావును విజయవాడ డీసీపీ (అడ్మిన్)గా బదిలీ చేశారు. ఇదే విభాగంలో ఎస్పీగా ఉన్న వి.హర్షవర్ధన్‌ను విజయవాడ డీసీపీ (లా అండ్ ఆర్డర్)గా నియమించారు. ఐపీఎస్ హోదా ఉన్న అధికారులు నిర్వహించే ఈ పదవుల్లో నాన్ కేడర్ ఎస్పీలను ఈ పోస్టుల్లో నియమించడం బహుశా ఇదే తొలిసారి.

ఆర్టీసీ సమ్మె లేదు

- బస్సుల రాకపోకలు యథాతథం
- ఈయూ కూటమితో మంత్రి చర్చలు సఫలం
- తాత్కాలికంగా 25% ఫిట్‌మెంట్‌కు ఓకే



చర్చల అనంతరం ప్రభుత్వ ప్రతినిధులు, యూనియన్ నేతలు

విజయవాడ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్ఆర్టీసీ)లో సమ్మె తప్పింది. గుర్తింపు కార్మిక సంఘం ఎంప్లాయీస్ యూనియన్ (ఈయూ) కూటమితో రవాణా మంత్రి కె.అచ్చెన్నాయుడు మంగళవారం జరిపిన చర్చలు ఫలించాయి. దీంతో బుధవారం నుంచి తలపెట్టిన సమ్మెను విరమిస్తున్నట్లు ఈయూ ప్రకటించింది. చర్చలు ఆమోదయోగ్యంగా ఉన్నందున తాత్కాలికంగా సమ్మెను విరమించినట్లు ఈయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి వైవీ రావు 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. ఈయూ నిర్ణయంపై ప్రధాన విపక్ష కార్మిక సంఘం నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్ఎంయూ) భగ్గుమంది.

పాతిక శాతం ఫిట్‌మెంట్ ఇస్తాం

బుధవారం నుంచి సమ్మె చేస్తున్నట్లు ఈయూ ప్రకటించిన నేపథ్యంలో మంత్రి అచ్చెనాయుడు మంగళవారం అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టిన అనంతరం ఈయూ, ఎస్‌డబ్ల్యూఎఫ్, కార్మిక పరిషత్ కూటమి అగ్రనాయకత్వంతో చర్చలు జరిపారు. ఇందులో ఆర్టీసీ ఎండీ సురేంద్రబాబు కూడా పాల్గొన్నారు. తక్షణం ఆర్టీసీ కార్మికులకు 25 శాతం ఫిట్‌మెంట్ ఇస్తామని మంత్రి ప్రతిపాదించారు. ఎన్జీవోలకు ఫిట్‌మెంట్ పెంపుదలపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని.. వారికి ఎంత ప్రకటిస్తామో అంతమేర ఆర్టీసీ కార్మికులకు కూడా పెంచుతామని హామీ ఇచ్చారు. ఒకవేళ ఎన్జీవో సంఘాలకు ఆర్టీసీకి ప్రతిపాదించిన ఫిట్‌మెంట్ కంటే తక్కువ ప్రకటించినా.. ఆర్టీసీ కార్మికులకు మాత్రం తగ్గించరని చెప్పినట్లు తెలుస్తోంది. ఫిట్‌మెంట్ కాలపరిమితి నాలుగేళ్లపాటు ఉంటుంది. పాత బకాయిలతో పాటు అరియర్స్ అన్నీ కలిపి 2020 నాటికి చెల్లిస్తామని ఆయన హామీ ఇచ్చారు. దీనికి సంబంధించి మొదటి వాయిదాను ఉగాది నాటికి చెల్లించేందుకు సుముఖత వ్యక్తం చేసినట్లు తెలిసింది. పల్లె వెలుగు బస్సుల ద్వారా వస్తున్న నష్టాన్ని భరించేందుకు ప్రభుత్వం సిద్ధమని మంత్రి తెలిపారు. ఎంత మేర నష్టాన్ని భరించాలో ముఖ్యమంత్రితో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. ఎంవీటాక్స్, డీజిల్‌పై పన్ను మినహాయింపు వంటి వాటినీ ఆయన దృష్టికి తీసుకెళ్లి.. నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. మిగిలిన సమస్యలను పరిష్కరించాలని ఎండీకి మంత్రి సూచించారు. ఈ ప్రతిపాదనలకు ఈయూ కూటమి నేతలు అంగీకరించడంతో చర్చలు ఫలవంతంగా ముగిశాయి. సంస్థలో ఆర్టీసీ కార్మికులకు 2017 ఏప్రిల్ నుంచి ఫిట్‌మెంట్ పెంచాల్సి ఉంది. ఈ క్రమంలో గుర్తింపు సంఘంతో జరిగిన చర్చల సందర్భంగా 19 శాతం ఐఆర్ ను యాజమాన్యం ప్రకటించింది. దీనికి ససేమిరా అన్న ఈయూ కూటమి నేతలు సీఎంను గత నెలలో కలిసి 50 శాతం ఐఆర్ ఇవ్వాలని కోరారు. ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఎక్కువ ఆశించవద్దని ఆయన సూచించారు. దరిమిలా యాజమాన్యానికి ఈయూ కూటమి, ఎన్ఎంయూ వేర్వేరుగా సమ్మె నోటీసులు ఇచ్చాయి. దీంతో మంత్రి అచ్చెన్నాయుడు ఈయూ కూటమి నేతలతో చర్చించి తమ ప్రతిపాదనలకు ఒప్పించారు.

ఈయూపై ఎన్ఎంయూ ఆగ్రహం


ప్రభుత్వ ప్రతిపాదనలను ఆమోదించి ఆర్టీసీ కార్మికులను ఈయూ దగాచేసిందని ఎన్ఎంయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు విమర్శించారు. కార్మికులకు 50 శాతం ఫిట్‌మెంట్ ఇప్పిస్తామన్న హామీని తుంగలో తొక్కి 25 శాతానికి అంగీకరించడం దారుణమన్నారు. 'ఎన్ఎంయూ గతంలో గుర్తింపు సంఘంగా ఉన్నప్పుడు 19శాతం ఐఆర్ సాధిస్తే.. ఆనాడు 27 శాతం డిమాండ్ చేసిన ఈయూ.. ఇపుడు 50 శాతం డిమాండ్ చేసి 25 శాతానికి అంగీకరించడం దారుణం. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే విషయమై ఎలాంటి నిర్ణయం జరగలేదు. మొత్తం 80 శాతం అరియర్స్ ఒకేసారి ఇప్పిస్తామని కార్మికులను ఈయూ నమ్మించింది. చివరకు సిబ్బంది కుదింపు చర్యలకు అంగీకరించి ద్రోహం చేసింది. 60 ఏళ్లకు ఉద్యోగ విరమణ పెంపు విషయం చర్చకు రాలేదు. మహిళా కార్మికులకు కార్గోలో పని కల్పిస్తామని ఇచ్చిన హామీపైనా చర్చించలేదు. అందుకే మేం బుధవారం బ్లాక్‌డేను పాటిస్తున్నాం. కార్మికులంతా నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరు కావాలి' అని పిలుపిచ్చారు.

750 కోట్ల భారం..: 'ఆర్టీసీని కాపాడుకునేందుకు కార్మికులు, అధికారులు ఎంతో కష్టపడుతున్నారు. డీజిల్ రేట్ల పెరుగుదలతో నష్టాలు వస్తున్నాయి. పొదుపు చర్యల ద్వారా నష్టాన్ని తగ్గించుకునే ప్రయత్నం జరుగుతోంది. సంస్థలో 62 శాతంగా ఉన్న ఆక్యుపెన్సీని 80 శాతానికి తీసుకురావడం సామాన్య విషయం కాదు. పల్లెవెలుగుతో పాటు పలు విభాగాల్లో నష్టాలు వస్తున్నాయి. అయినా కార్మికులకు తాత్కాలికంగా 25 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాలని నిర్ణయించాం. చర్చలు ఫలవంతం కావడం సంతోషంగా ఉంది. సహకరించిన ఈయూ కూటమికి ధన్యవాదాలు. ఎన్జీవోలకు ఎంత మేర ఫిట్‌మెంట్ పెంచితే అంత మేర ఆర్టీసీ కార్మికులకు కూడా పెంచుతాం. 25 శాతం ఫిట్‌మెంట్ వల్ల రూ.750 కోట్ల మేర సంస్థపై అదనపు భారం పడుతుంది.'

- మంత్రి అచ్చెన్నాయుడు

ఎన్ఆర్‌సీపై కేంద్రానికి సుప్రీం చీవాట్లు

- ఎన్నికల విధులకు బలగాల్ని మళ్లిస్తామన్న హోంశాఖ
- ప్రక్రియను అడ్డుకుంటున్నారని చీఫ్‌జస్టిస్ మందలింపు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: అసోంలో జాతీయ పౌరుల జాబితా (ఎన్ఆర్‌సీ) రూపకల్పనకు కేంద్రం అడ్డంకులు కల్పిస్తోందని సుప్రీంకోర్టు తప్పుబట్టింది. ఎన్నికల విధుల నిర్వహణ నిమిత్తం అక్కడున్న కేంద్ర పారామిలటరీ బలగాలను కొద్ది వారాల పాటు ఉపసంహరిస్తామని కేంద్రం పెట్టుకున్న అప్పీలుపై ప్రధాని న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్‌తో కూడిన ధర్మాసనం తీవ్ర ఆక్షేపణ వ్యక్తం చేసింది. "ఇలా బలగాల్ని మళ్లించి ప్రక్రియను అడ్డుకోవాలన్నదే కేంద్రం ప్రయత్నంగా కనిపిస్తోంది. కేంద్రం సహాయనిరాకరణ చేసి ఇంతవరకూ చేసిన మొత్తం పనిని ధ్వంసం చేయడమే లక్ష్యంగా భావించాల్సి వస్తోంది" అని చీవాట్లు పెట్టింది. ఏది ఏమైనా మొదట విధించిన గడువు- జులై 31లోపు దీన్ని పూర్తి చేయాల్సిందేనని స్పష్టం చేసింది. ఎన్ఆర్‌సీ పని కోసం కొందరు అధికారులను ఎన్నికల విధుల నుంచి మినహాయింపు నిచ్చే విషయాన్ని పరిశీలించాల్సిందిగా ఎలక్షన్ కమిషన్‌ను సుప్రీం బెంచ్ కోరింది. కిందటేడాది ప్రచురించిన ఎన్ఆర్‌సీ ముసాయిదా ప్రకారం- మొత్తం 3.29 కోట్ల మందికి గాను 2.89 కోట్ల ప్రజల వివరాలను నమోదు చేశారు. 40 లక్షల పైచిలుకు పేర్లు అందులో లేవు. వీటిలో 37లక్షల పేర్లను తిరస్కరించారు. 2 లక్షల పేర్లను పెండింగ్‌లో ఉంచారు. ఈ 40 లక్షల మందిపై వివాదం చెలరేగుతోంది. కాగా. సుప్రీం చీవాట్లపై స్పందించిన హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ గడువులోగా ఎన్ఆర్‌సీని పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు. 'విదేశీయులెవరి పేర్లూ లేకుండా చూస్తాం. ఎన్ఆర్‌సీని అప్‌డేట్ చేయడానికి కట్టుబడి ఉన్నాం' అని స్పష్టం చేశారు.



అవగాహన

డైట్ వర్సెస్ ఎక్సర్‌సైజ్

బరువు తగ్గాలంటే ఏం చేయాలి? ఈ ప్రశ్న సహజంగానే చాలామందిని వేధిస్తూ ఉంటుంది. సరైన బరువు కన్నా ఎక్కువ ఉంటే.. కేలరీలను తగ్గించుకోవడానికి ఎక్సర్‌సైజులు చేస్తే సరిపోతుందా? లేక సరైన డైట్‌ను ఫాలో అయితే చాలా? ఈ ప్రశ్నలకు ఇటీవల కొందరు ఆరోగ్య పరిశోధకులు సమాధానం రాబట్టారు. ఈమధ్య జరిపిన ఒక పరిశోధనలో శారీరక శ్రమ కన్నా తీసుకునే డైట్ ముఖ్యమని తేల్చారు.



ఫిట్‌గా కనిపించాలంటే క్రమం తప్పకుండా ఎక్సర్‌సైజులు చేయాల్సిందే. అంటే శారీరక శ్రమతో ఒంట్లోని కేలరీలను కరిగించాలన్నమాట. ఆ కేలరీలు ఆహారం వల్ల చేకూరుతున్నాయి. మనం తీసుకునే ఆహారంలో పది శాతం కేలరీలు జీర్ణక్రియలో భాగంగా బర్న్ అవుతుంటే, పది నుంచి ముప్పై శాతం శారీరక శ్రమ వల్ల ఖర్చవుతాయి. అయితే 'నీవు ఎంతసేపు ఎక్సర్‌సైజులు చేస్తున్నావనే దాని కన్నా ఎంత తింటున్నావు అనేది కూడా ముఖ్యమే' అంటున్నారు న్యూట్రిషనిస్టు లీసా డ్రయెర్. సహజంగానే కేలరీలనేవి మనం తీసుకుంటున్న ఆహారం, పానీయాల ద్వారా సమకూరితే, ఎక్సర్‌సైజుల ద్వారా వాటిలో కొంతభాగం ఖర్చవుతాయి. క్రీడాకారులను వదిలేస్తే, మిగతావారు ఎక్సర్‌సైజుల ద్వారా ఐదు నుంచి పదిహేను శాతం కేలరీలను బర్న్ చేస్తారు. అయితే ఇది మనం తీసుకుంటున్న ఆహారానికి సమానం ఎంత మాత్రం కాదు. అలాంటప్పుడు డైట్‌కు, ఎక్సర్‌సైజ్‌కు సమతూకం ఉండదు. 'సాధారణంగా చాలామంది ఎక్కువ ఆహారం తీసుకోవడం ద్వారా శరీరానికి అవసరమైన కేలరీలకన్నా అధికంగా అందుతాయి. ఎక్సర్‌సైజులు చేసినప్పుడు మాత్రమే కొన్ని కేలరీలు బర్న్ అవుతాయి. ఆ తర్వాత పరిస్థితి ఏంటీ... అందుకే కేలరీలను బర్న్ చేయడం కన్నా, కేలరీలను కట్ చేయడం ఉత్తమం' అంటున్నారు ఫిట్‌నెస్ నిపుణురాలైన శాలినీ భార్గవ.

70, 30 రూల్...

బరువు తగ్గాలంటే 70 శాతం సరైన డైట్ పాటిస్తూ, 30 శాతం ఎక్సర్‌సైజులు చేయాలని సూచిస్తుంటారు. అయితే కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో అంటే జెండర్, వయసు, వ్యక్తి ఆరోగ్యాన్ని బట్టి 80 శాతం, 20 శాతంగా కూడా మార్చుకోవచ్చంటున్నారు. ఈ రూల్‌ను ఫిట్‌నెస్ నిపుణులు చాలాకాలంగా చెబుతున్నప్పటికీ బరువు తగ్గాలనుకున్నవారు పూర్తిగా ఎక్సర్‌సైజుల పైనే ఆధారపడకుండా, డైట్ విషయంలోనే స్ట్రిక్ట్‌గా ఉంటే మంచిదనేది ఎక్కువ మంది అభిప్రాయంగా కనిపిస్తోంది. "కేవలం నడక వల్ల బరువు తగ్గరు. కార్డియో, వెయిట్ ట్రైనింగ్‌తో పాటు మానసిక ప్రశాంతతను పొందే యోగ, మెడిటేషన్, పవర్ యోగ వంటివి కూడా అవసరమే" అంటున్నారు ఫిట్‌నెస్ నిపుణురాలు లీనా మోగ్రే. ఆరోగ్యం బాగుండాలంటే సరైన నిద్ర కూడా అవసరమే. దీనివల్ల మెదడు కంఫర్ట్ ఫుడ్ మాత్రమే కావాలని శరీరానికి సూచనలిస్తుంది. రాత్రి పూట మేలుకొని స్నాక్స్, జంక్‌ఫుడ్ తినాల్సిన అవసరం రాదు. దాంతో అనవసరపు కేలరీలు దరి చేరవు. మొత్తానికి ఎక్సర్‌సైజుల కన్నా డైట్ ప్లాన్ సరిగా ఉంటే బరువు తగ్గించుకోవాలనే బెంగ ఉండదు.

ప్రతిభ

'డూడ్లింగ్'... ఆర్ట్‌లో సరికొత్త స్టయిల్. విదేశాల్లో పాపులరైనా మన దగ్గర ఇంకా ఇలాంటి ఆర్ట్ ఒకటి ఉందనే విషయం చాలా మందికి తెలియదు. ఇంజనీరింగ్ చదివిన తన ఈడు అమ్మాయిలంతా కెరీర్‌పైనే దృష్టి సారిస్తుంటే ఇరవై మూడేళ్ల స్నిగ్ధ మునిపల్లి మాత్రం సమాజసేవతో పాటు, సృజనాత్మక రంగంలో ముందడుగు వేస్తోంది. అరుదైన 'లైవ్ డూడ్లింగ్'తో ఆకట్టుకుంటున్న 'స్నిగ్ధ' మనోహర విజయం ఆమె మాటల్లోనే...

డూడ్లింగ్ గర్ల్





నా ప్రయాణం చిన్నదే... జీవితంలో, ఎంచుకున్న రంగంలో! కానీ ఎన్నో నేర్చుకున్నా. నాకేం కావాలో... ఏం కావాలనుకుంటున్నానో మొదటి నుంచీ స్పష్టత ఉంది. నేను పుట్టింది, పెరిగిందీ హైదరాబాద్‌లోనే. నాన్న రమేశ్ కుమార్ బీహెచ్ఈఎల్‌లో ఉద్యోగి. అమ్మ నిర్మల గృహిణి. చిన్నప్పటి నుంచి వాళ్లు నాకు ఇచ్చిన స్వేచ్ఛ వల్లనేమో... నచ్చింది చదువుతూ, అభిరుచికి తగిన పని చేసుకుంటున్నా. హైదరాబాద్‌లోని సీబీఐటీలో రెండేళ్ల క్రితం మెకానికల్ ఇంజనీరింగ్ పూర్తి చేశాను. ఆ వెంటనే 'ఊబర్'లో ఉద్యోగం వచ్చింది. ప్రస్తుతం అందులో 'కమ్యూనిటీ ఆపరేషన్ స్పెషలిస్టు'గా పనిచేస్తున్నా.

కలత చెంది...

బాలలపై లైంగిక వేధింపుల వార్తలు చూసినప్పుడల్లా నాలో ఏదో తెలియని కలత మొదలయ్యేది. బాధ కలిగేది. కాలేజీలో ఉన్నప్పుడు ఈ విషయం గురించి నా స్నేహితురాలితో మాట్లాడితే నవ్వి వెళ్లిపోయింది. అదేదో బహిరంగంగా మాట్లాడరాని అంశంగా అనుకుంటారు. ఇలాంటి విషయాల్లో ఎవరికి వారు బాధపడుతూ, ఎవరో వచ్చి ఏదో చేస్తారని కూర్చోవడం ఎంత వరకు సమర్థనీయం? నచ్చిన దారిలో పూలున్నా... ముల్లున్నా... పట్టించుకునే తత్వం కాదు నాది! నా చుట్టూ ఉన్న సమాజం బాగు కోసం కృషి చేయగలిగితే చాలు! నా ఆలోచన అదే! అందుకే చదువు అయిపోయిన తరువాత లైంగిక వేధింపులకు గురైన బాలల కోసం పని చేశాను. తెలిసీ తెలియని వయసులో ఇలాంటివి వారు ఎవరికీ చెప్పుకోలేరు. అలాంటప్పుడు నేనున్నాని కాస్త భరోసా కల్పిస్తే... అంతకు మించి వారు ఇంకేమీ కోరుకోరు. అలాంటి బాధితులను కలిసి, వారికి కౌన్సెలింగ్ ఇచ్చాను. ధైర్యంగా ముందుకొచ్చిన వారిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లి ఫిర్యాదులు ఇప్పించాను. వాళ్లు ఏ నిర్ణయం తీసుకున్నా... అండగా ఉంటానన్న నమ్మకం కల్పించగలిగాను. అలా యాభై మంది బాధితులకు బాసటగా నిల్చోవడం నాకు ఎంతో సంతృప్తినిచ్చింది.

అనుకోకుండా అటు వైపు...

నా వయసు యువతీ యువకులతో పోలిస్తే నాదో భిన్నమైన ప్రపంచం. నా అభిరుచులు, ఆశయాలు వేరు! భవిష్యత్తులో ఏదో చేసేసి, ఏదో అయిపోవాలని ఎప్పుడూ కలలు కనలేదు. జీవితంలో మనకు ఎదురైన సవాళ్లను స్వీకరించి, చుట్టుపక్కల ఎంత వరకు మార్పు తేగలనో అంత వరకే ఆలోచిస్తాను. అలా అనుకోకుండా ఓ రోజు ఆన్‌లైన్‌లో 'డూడుల్స్' చూశాను. 'డూడ్లింగ్' అంటే అదో రకమైన స్కెచింగ్. సాధారణ ఆర్ట్‌కు భిన్నంగా, కొత్తగా ఉంటుంది. దీంతో దానిపై ఆసక్తి పెరిగింది. ఆన్‌లైన్‌లో డూడ్లింగ్ గురించి వెతికాను. పరిశోధించి, సొంతగా నేర్చుకున్నా. నెమ్మదిగా దానిపై పట్టు వచ్చింది. రెండేళ్ల కిందటే డూడుల్స్ మొదలు పెట్టా. చివరకు అదే నా అభిరుచిగా మారిపోయింది. అందులో నా ప్రత్యేకత 'కామిక్, లైవ్ డూడ్లింగ్'.



'లైవ్ డూడ్లింగ్' అంటే జరుగుతున్న ఈవెంట్‌ను డూడుల్స్‌లో చూపడం. ఉదాహరణకు మ్యూజిక్ ఈవెంట్ నడుస్తుందనుకోండి... ఆ వాతావరణాన్నంతా డూడుల్స్ స్కెచ్ వేయడం! అదీ ఈవెంట్ అయిపోయేలోగా! ఈ తరహా డూడ్లింగ్ చేసేవారు నాకు తెలిసి ఇక్కడ ఎవరూ లేరు. విదేశాల్లో దీనికి బాగా ప్రాచుర్యం ఉంది.

ఈవెంటే కాన్సెప్ట్...

'లైవ్ డూడ్లింగ్' అంటే జరుగుతున్న ఈవెంట్‌ను డూడుల్స్‌లో చూపడం. ఉదాహరణకు మ్యూజిక్ ఈవెంట్ నడుస్తుందనుకోండి... ఆ వాతావరణాన్నంతా డూడుల్స్ స్కెచ్ వేయడం! అదీ ఈవెంట్ అయిపోయేలోగా! ఈ తరహా డూడ్లింగ్ చేసేవారు నాకు తెలిసి ఇక్కడ ఎవరూ లేరు. విదేశాల్లో దీనికి బాగా ప్రాచుర్యం ఉంది. అలా ఇప్పటిదాకా సండే సోల్ సెనేట్, బీయోప్, ఆర్ట్ ఎగ్జిబిషన్స్, కేఫ్స్‌లో వేశాను. చాలా సంస్థలతో కలిసి దీనిపై పని చేస్తున్నాను. ప్రస్తుతం దేశంలోనే యువత పాల్గొనే భారీ ఈవెంట్ 'అండర్ 25'లో లైవ్ డూడ్లింగ్ కోసం బెంగళూరు వచ్చాను. ఇందులో నా లైవ్ పెర్‌ఫార్మెన్స్ ఇచ్చాను. 'ఆమ్నెస్టీ' అంతర్జాతీయ మేగజైన్‌లో నా ఆర్ట్ వర్క్ ప్రచురించారు. నాకు స్కెచ్ వేయడానికి పేపరే అక్కర్లేదు... డోర్స్, షూస్, సూట్‌కేస్ వంటి వాటిపై కూడా డూడుల్స్ గీశాను. నిజానికి ఇలా స్కెచ్ వేయడం ఎంతో కష్టం. ఎందుకంటే ఒక్కో దాని టెక్స్చర్ ఒక్కోలా ఉంటుంది. వాటికి తగ్గట్టుగా గీయాలంటే దేనికి దానికే ప్రత్యేకమైన టెక్నిక్ ఉపయోగించాలి.


నవతరానికి నూతనోత్తేజం...

ఓ పక్క ఉద్యోగం, మరో పక్క డూడ్లింగ్‌తో బిజీగా ఉన్నా సామాజిక సేవను మాత్రం వదిలిపెట్టలేదు. ప్రస్తుతం మోటివేషనల్ స్పీకర్‌గా వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటున్నా. ఇటు వైపు రావడానికి ఓ బలమైన కారణం ఉంది. దేశ భవిష్యత్తుకు పునాది యువతే! కానీ చాలా మందికి వారిపై వారికి శ్రద్ధ లేదు. జీవితంలో ఎదగాలన్నా, ఏదన్నా సాధించాలన్నా ముందు నిన్ను నువ్వు ప్రేమించాలి. గౌరవించుకోవాలి. నా వయసు యువతీ యువకుల్లో ఇప్పుడది కొరవడింది. 'నువ్వు సిగరెట్ ఎందుకు తాగుతున్నావ'ని అడిగితే 'జస్ట్ సోషలైజ్ అవ్వడానికి' అని బదులిచ్చారు కొంత మంది యువకులు! అది విని నాకు ఆశ్చర్యమేసింది. నిజానికి సిగరెట్ తాగాలని లేకపోయినా నలుగురితో కలవడం కోసం తాగడం అన్నమాట. వారిపై వారికి అవగాహన లేకే ఇలాంటివన్నీ చేస్తుంటారు. కానీ అక్కడ వాళ్ల వ్యక్తిత్వాన్ని కోల్పోతున్నారన్న వాస్తవాన్ని గ్రహించలేకపోతున్నారు. ముఖ్యంగా ఐటీ తదితర రంగాల్లో పనిచేసేవారిలో ఈ తరహా ఆలోచనలు ఎక్కువగా గమనించాను. ఇలాంటి వారి మైండ్‌సెట్ మార్చడానికే నేను మోటివేషనల్ స్పీకర్‌గా మారాను. నా వల్ల ఓ నలుగురు స్ఫూర్తి పొందినా చాలు కదా! ఈ క్రమంలో ఎన్నో వేదికలపై ప్రసంగించాను.

సోలో ట్రావెలింగ్...

రోజుకు పద్నాలుగు గంటలు పనిచేస్తున్నా. లేదంటే దేనికీ న్యాయం చేయలేం కదా! ఇష్టంగానే కష్టపడుతున్నా. వీటన్నింటికీ దూరంగా అప్పుడప్పుడూ సోలో ట్రావెలింగ్ చేస్తుంటా. ట్రావెలింగ్ నాకు ఎంతో ఇష్టం. అయితే కేవలం ఒక ప్రాంతానికి వెళ్లి, చుట్టుపక్కల చూసి వచ్చేయను. అక్కడి పరిసరాలు గమనించి, స్థానిక స్థితిగతులను డూడుల్స్‌గా మారుస్తాను. వీటితోపాటు ఖాళీ ఉంటే పోయెట్రీ రాస్తుంటా. అదీ సామాజిక అంశాలపైనే! ఇక చిన్నప్పటి నుంచీ వంట చేయడం చాలా చాలా ఇష్టం. ఓ షాపింగ్ మాల్‌లో పెట్టిన వంటల పోటీలో బహుమతి కూడా గెలుచుకున్నా. ఇవన్నీ ఎందుకంటే చెప్పాను కదా... 'ముందు మనల్ని మనం ప్రేమించుకోవాలి' అని! అప్పుడే జీవితం... చుట్టూ ఉన్న జనజీవనం అందంగా కనిపిస్తుంది. మనలో పాజిటివ్ వైబ్రేషన్స్‌ను పాస్ చేస్తుంటుంది.

● హనుమా



పొటాటో... గార్లిక్ నగ్గెట్స్

క్విక్ బైట్



బంగాళా దుంపల్ని మెత్తగా ఉడికించి, తురుములా చేసుకోవాలి. వాటికి ప్రాసెస్డ్ ఛీజ్ వెల్లుల్లి పేస్ట్, చిల్లీ ఫ్లేక్స్, ఉప్పు, మొక్కజొన్న పిండి కలపాలి. ఈ మిశ్రమాన్ని చిన్న ఉండలుగా చేసుకొని, వాటిని కార్న్ స్లర్రీలో ముంచి, బ్రెడ్ క్రంబ్స్ పొడి మీద రోల్ చేయాలి. వీటిని నూనెలో వేగించి, తరువాత సాస్‌తో వేడివేడిగా తింటే ఎంతో రుచిగా ఉంటాయి.



బ్యూటీ

వాతావరణంలో మార్పుల వల్ల చర్మం దురద పెట్టడంతో పాటు పొడిబారి నిర్జీవంగా మారుతుంది. కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా చర్మం తాజాగా, నిగారింపుతో కనిపించేలా చేయొచ్చు. అవేమిటంటే...

చర్మం పొడిబారుతోందా?



స్నానం: వేడినీళ్లతో ఎక్కువ సేపు స్నానం చేయకూడదు. స్నానానికి గోరువెచ్చని నీటిని ఉపయోగించాలి. తేమను అందించే సబ్బువాడితే చర్మం పొడిబారదు. తాజా తులసి ఆకుల్ని నీళ్లలో వేడిచేసి, ఆ నీళ్లతో స్నానం చేస్తే శరీరానికి సాంత్వన లభిస్తుంది.

స్కిన్ మాయిశ్చరైజర్: చర్మం తేమ కోల్పోయినప్పుడు మాయిశ్చరైజర్ క్రీమ్ రాసుకోవాలి. చర్మ తత్వాన్ని బట్టి రోజుకు రెండు సార్లు క్రీమ్ రాసుకోవాలి. సమస్య తీవ్రంగా ఉంటే కొద్దిగా గ్లిజరిన్ అప్లై చేసినా ఫలితం కనిపిస్తుంది.

కలబంద: దీనిలోని మాయిశ్చరైజింగ్, టోనింగ్, యాంటీసెప్టిక్ గుణాలు చర్మానికి రక్షణనిస్తాయి. కలబంద గుజ్జులో కొద్దిగా కొబ్బరినూనె, పుదీనా నూనె కలిపి, ఈ మిశ్రమాన్ని స్నానానికి ముందు చర్మానికి రాసుకోవాలి.

ఆలివ్ నూనె: దీనిలోని విటమిన్ ఇ ఫ్రీరాడికల్స్‌ను, చర్మం మీది మలినాలను తొలగిస్తుంది.

సన్‌స్క్రీన్ లోషన్: ఎండలో కొద్దిసేపు ఉండడం ఆరోగ్యానికి మంచిదే. కానీ ఎక్కువ సేపు ఉంటే సూర్యరశ్మి చర్మానికి హాని చేస్తుంది. కాబట్టి బయటకు వెళ్లేటప్పుడు సన్ స్క్రీన్ లోషన్ రాసుకోవాలి.

నవ్య ఆంధ్రజ్యోతి యంగ్

వన్యప్రాణి సంరక్షణ గురించి విద్యార్థులు పాఠాల్లో చదువుకొని ఆ తరువాత మర్చిపోయే సాధారణ విషయం కాదు. చదువుకున్న ప్రతి విద్యార్థీ ఆ దిశగా అడుగులేయాలి. అప్పుడే చదువుకు సార్థకత అని నమ్మి విద్యార్థులను ఆ బాటలో నడిపించేందుకు లక్షల జీతాన్ని వదిలి ఆశయానికి జీతాన్ని, జీవితాన్ని త్యాగం చేశాడు కోల్‌కతాకు చెందిన నిరీత్ దత్తా...

అతని జీతం.. జీవితం

వన్యప్రాణుల కోసం..



లక్షల్లో జీతం ఇచ్చే కొలువుల కోసం ఆరాటపడే యువతకు భిన్నం నిరీత్ దత్తా. డెహ్రాడూన్ లోని తులాస్ ఇనిస్టిట్యూట్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశాడు. చదువు పూర్తవ్వగానే 'బైజూస్' ఎడ్‌టెక్ కంపెనీలో ఉద్యోగం. 22 ఏళ్లకే రూ. 10 లక్షల వార్షిక జీతంతో కొలువు కోరి వరించింది నిరీత్‌ను. స్నేహితులందరూ నిరీత్‌దత్తాను 'అదృష్టవంతుడువి' అని అభినందించారు. కానీ అతని దృష్టిలో మాత్రం ఆ మాటకు వేరే అర్థం ఉంది. అది అడవితల్లి ఒడిలో అతను చవిచూసిన చల్లగాలి స్పర్శ. ఆ అనుభవం ఆఫీసులో అతన్ని కుదురుగా కూర్చోనివ్వలేదు. అతి కష్టం మీద ఆర్నెల్లు పని చేసి కొలువుకు సెలవు పలికాడు.

ఆశయం దిశగా అడుగులు

ప్రస్తుతం నిరీత్ చిన్నపిల్లల కోసం పాఠశాలల్లో వన్యప్రాణి సంరక్షణలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాడు. ఇప్పటివరకు 23 వర్క్‌షాపులు నిర్వహించాడు. వచ్చే ఏడాదికల్లా 40 వర్క్‌షాపులను నిర్వహించాలనే లక్ష్యంతో నిరీత్ పని చేస్తున్నాడు. ఒక్కో సెషన్‌ను గంటన్నర పాటు నిర్వహిస్తారు. అతను వేసే జోక్స్‌తో సమయం ఇట్టే గడిచిపోతుంది. కార్యక్రమం చివరలో 'మద్రాస్ క్రోకోడైల్ బ్యాంక్ ట్రస్ట్'కు చెందిన 'స్నేక్‌బైట్' అనే వీడియోను చూపుతారు నిరీత్. కోల్‌కతాలో అతను చిన్న పిల్లాడిగా ఉన్నప్పుడే జంతు సంరక్షణ కార్యక్రమాల్లో పాలు పంచుకునేవాడు. పిల్లలను ఊహాలోకంలో విహరింపజేయటం, సమయం తెలియకుండా వారిని కట్టిపడేయడం అతనికి వెన్నతో పెట్టిన విద్య. ఈ నైపుణ్యాలు అతనికి శిక్షణలో బాగా అక్కరకొస్తున్నాయి. స్కూల్ మేనేజ్‌మెంట్ నుంచి శిక్షణ తరగతులు నిర్వహించడానికి ఫీజు తీసుకోవాలనే ఆలోచన ఉన్నా యాజమాన్యాలు ఆసక్తి చూపవని విరమించుకున్నాడు.

పాఠశాలల నుంచే పురోగతి...

"ఈ పనిలో భారీ వేతనాలు ఉండవు. దీంతో దీన్ని ఉపాధి మార్గంగా ఎంచుకునేందుకు విద్యార్థులు ఆసక్తి చూపటం లేదు. ప్రస్తుతం ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ అనేది ఒక సబ్జెక్ట్‌గా ఉంది. కానీ విద్యార్థుల్లో వన్యప్రాణులను రక్షించాలనే స్పృహను అది ఏ మాత్రం పెంచలేకపోయింది. ఎంత మంది విద్యార్థులు వన్యప్రాణులను చూసేందుకు అడవులకు విహార యాత్రలకు వెళుతున్నారు? ఇలాంటి చిన్న చిన్న విషయాలపై పాఠశాలలు దృష్టిపెడితే వన్యప్రాణుల సంరక్షణలో అవగాహనను పెంచటం మరింత సులభం అవుతుంది" అంటారు నిరీత్.

వన్యప్రాణి సంరక్షణ కోసం పాటుపడుతున్న కొంతమంది వ్యక్తులతో కలసి యాంటీ వైల్డ్‌లైఫ్ క్రైమ్ అండ్ యానిమల్ రైట్ సొసైటీ ఆఫ్ ఇండియా పేరుతో ఒక సంస్థను నిరీత్ నడుపుతున్నాడు. ప్రభుత్వ అధికారిగా వన్యప్రాణుల సంరక్షణకు మరింత కృషి చేయవచ్చనే ఆలోచనతో, మనసుకు నచ్చిన పనిలో మరింత ముందుకెళ్లేందుకు యూపీఎస్సీ పరీక్షకు ప్రిపేర్ అవుతున్నాడు నిరీత్.



- గడచిన ఐదేళ్లలో నిరీత్ 83 పాములను కాపాడాడు.
- వేస్ట్‌మేనేజ్‌మెంట్ ఫీల్డ్‌లో పనిచేయటం కూడా నిరీత్‌కు చాలా ఇష్టం. కొంతమంది అంతర్జాతీయ ఆర్కిటెక్ట్‌లతో అతను చర్చలు జరుపుతున్నాడు.
- 'సీఎస్ఆర్' కార్యక్రమంలో భాగంగా 'యుడో నౌ' అనే ఒక స్టార్టప్ కంపెనీ కొన్ని వర్క్‌షాపుల నిర్వహణలో నిరీత్‌కు స్పాన్సర్ చేస్తోంది.

ఇలా చేయండి

మారిన జీవనశైలికి తోడు వివిధ షిఫ్టుల్లో ఆఫీసు వేళల కారణంగా చాలామందికి వర్కవుట్స్ చేసేందుకు సమయం లభించడం లేదు. ఆఫీసులో గంటల తరబడి కంప్యూటర్ ముందు కూర్చొని పనిచేసేవారిలో వెన్ను నొప్పి, మెడనొప్పి వంటి సమస్యలు సాధారణం. ఎక్కువసేపు కాళ్లు కదపకుండా కూర్చొని పనిచేయడం వల్ల కీళ్ల మీద ఒత్తిడి పడడమే అందుకు కారణం. అయితే రోజూ వ్యాయామాలు చేసేవారిలో ఈ సమస్యలు తక్కువ. కానీ వ్యాయామం ఊసే ఎత్తని వారిని ఈ సమస్యలు ఎక్కువగా వేధిస్తాయి. అలాంటివారికి ఉపశమనం కలిగించేందుకు తేలికైన, సులువైన ఎక్సర్‌సైజ్‌లు ఉన్నాయి. వీటిని కూర్చొనే ఎంచక్కా చేసేయొచ్చు.

కూర్చున్నచోటే ఉత్సాహంగా...



- **కాళ్లను చాచి :** పాదాన్ని నేలపై ఉంచి, మోకాలిని ముందుకు చాచాలి. తొడభాగం, మోకాలు భాగం స్ట్రెచ్ అయ్యేంత వరకూ శరీరాన్ని ముందుకు వంచాలి. వెన్నెముక నిటారుగా ఉండేలా చూసుకోవాలి. ఇలా రెండు కాళ్లతో ప్రతి మూడు లేదా అయిదు నిమిషాలకు ఒకసారి 30 సెకన్ల పాటు చేయాలి.
- **మోకాలిని ఛాతీకి:** ఎడమ మోకాలిని రెండు చేతులతో పట్టుకొని మీ ఛాతీ భాగానికి సమీపంగా తీసుకువచ్చి, మోకాలిని ఛాతీకి ఆనించాలి. దీంతో మీ వెన్నెముక స్ట్రెచ్‌కు గురవుతుంది. తరువాత ఈ ఎక్సర్‌సైజ్‌ను కుడి మోకాలితో కూడా చేయాలి. ఇలా ప్రతి మూడు నుంచి అయిదు నిమిషాలకు ఒకసారి 20 సెకన్ల సమయం చేస్తే, కండరాలకు విశ్రాంతి లభిస్తుంది.
- **తొడభాగం ముందుకు:** మీ కుర్చీకి సమీపంగా నిల్చొని, ఎడమ పాదాన్ని సీటు వెనక భాగానికి ఆనించాలి. మోకాలిని మందుకు వంచి రెండో పాదాన్ని నేలపై ఉంచి, శరీరాన్ని ముందుకు కదిలించాలి. దీంతో తొడ భాగం, తుంటిభాగాలు స్ట్రెచ్‌కు లోనవుతాయి. అయిదు నిమిషాలకొకసారి ఇలా చేస్తే కాళ్లు ఒత్తిడికి లోనవవు.
- **తలను మోకాళ్లకు ఆనించడం:** ఈ పొజిషన్‌లో మీ చేతుల్ని తొడల వెనక ఉంచి తలను మోకాళ్లకు ఆనించాలి. దీంతో పొట్టభాగం స్ట్రెచ్ అవుతుంది. ఇలా మూడు నుంచి నాలుగు నిమిషాలు చేయాలి.
- **పక్కకు శరీరాన్ని వంచడం:** కుర్చీలో కూర్చొనే ఎడమ చేతిని మీ తలభాగం మీదకు ఎత్తిఉంచాలి. ఇప్పుడు కుడిచేతి వైపు శరీరాన్ని వంచాలి. కుడి చేతిని తలపైకి ఎత్తి ఉంచి, ఎడమ చేతివైపు వంగాలి. ఇలా అయిదు నిమిషాలకు ఒకసారి 15 లేదా 20 సెకన్ల పాటు చేయాలి.

కొత్త బండి గురూ!



నింజా నయా లుక్

సరికొత్త హంగులద్దుకుని మరింత ఆకర్షణీయంగా ముస్తాబైంది కవాసకీ నింజా జెడ్‌ఎక్స్-6ఆర్. స్పోర్ట్స్ బైక్‌లను ఇష్టపడే వారికి ఇది అద్భుతమైన సవారీ అందిస్తుందని కంపెనీ చెబుతోంది. గత ఏడాది బుకింగ్ చేసుకున్న వారికి తాజాగా బైక్ డెలివరీ ప్రారంభమైంది. నిజానికి ధర పరంగా తప్ప పెర్‌ఫార్మెన్స్‌ను బట్టి చూస్తే... 6ఆర్‌తో పోటీపడే బైక్‌లు భారత్‌లో లేవనే అంటున్నారు.

జెడ్‌ఎక్స్-6ఆర్ చూడటానికి సూపర్ స్పోర్ట్ బైక్‌లా కనిపించినా, రోజువారీ ప్రయాణాలకు సైతం సరిపోయేలా ఉండటం దీని విశేషం. సాధారణంగా 600సీసీ సూపర్ స్పోర్ట్స్ టాప్ ఎండ్ పవర్ బ్యాండ్ కలిగి ఉంటాయి. కానీ ఈ కొత్త నింజా మాత్రం విభిన్నం. 636సీసీ ఇన్‌లైన్ ఫోర్ ఇంజిన్‌తో ఉన్నప్పటికీ, ఎక్స్‌ట్రా స్ట్రోక్ కారణంగా తక్కువ ఆర్‌పీఎం వద్ద కూడా అదనపు శక్తి అందుతుంది. 13,500 ఆర్‌పీఎం వద్ద 128 బీహెచ్‌పీ శక్తి, 11,000 ఆర్‌పీఎం వద్ద 70.8 ఎన్‌ఎం టార్క్‌ను ఇస్తుంది. దీనిలో ఎలక్ట్రిక్ క్విక్ షిఫ్టర్ ఉండటం వల్ల గేర్లు మార్చినప్పుడల్లా క్లచ్ ఉపయోగించాల్సిన అవసరం అంతగా ఉండదు. ఇక బైక్‌లో ముఖ్యమైన ఫీచర్... టూత్‌స్మాలర్ ఫ్రంట్ కౌంటర్ షాఫ్ట్ స్ప్రోకెట్ (15-టూత్) ఉండటం. దీనివల్ల డ్రైవ్ రేషియో తగ్గుతుంది. తద్వారా గేర్ మార్చినప్పుడల్లా మరింత ఎక్కువగా యాక్సలరేషన్ పుడుతుంది. ఇతర ఫీచర్లలో ఫుల్ ఎల్‌ఈడీ హెడ్‌ల్యాంప్స్, ట్రాక్షన్‌కంట్రోల్, రెండు రైడింగ్ మోడ్స్ (ఫుల్, లో పవర్), షోవా సస్పెన్షన్, బ్రిడ్జ్‌స్టోన్ బాటాక్స్ రబ్బర్ మొదలైనవి ఉన్నాయి. దీని ప్రారంభ ధర రూ.10.49 లక్షలు (ఎక్స్‌షోరూమ్, ఢిల్లీ).

బెటర్ లైఫ్

నిర్ణయానికి ఇంత జాప్యమా?

రెండేళ్ల కిందట ఎంఎస్సీ పూర్తి చేశాను. అయితే మా వాళ్లంతా ఆశిస్తున్నట్లు నేను ఉద్యోగ ప్రయత్నాలేమీ చేయడం లేదు. ఏదో ఒకటి.. రెండు బ్యాంక్ ఎగ్జామ్స్ వాళ్ల కోసం వెళ్లి రాసొచ్చాను. నిజానికి నా మనసంతా వ్యవసాయంపైనే ఉంది. మాకు కావాల్సినంత నీటి వసతిగల పదెకరాల నాణ్యమైన వ్యవసాయ భూమి ఉంది. ఆధునిక విధానాల్లో పంటలు పండించి, సొంత ఊళ్లోనే ఆనందంగా ఉండవచ్చనేది నా ఆలోచన. కానీ మావాళ్లేమో 'ఈ మాత్రం వ్యవసాయం చేయడానికి ఇంత చదువు ఎందుకు చదివినట్లు' అంటూ రోజూ నా తల తినేస్తున్నారు. అయితే నా నిర్ణయాన్ని మార్చుకోవడానికి మాత్రం సిద్ధంగా లేను. కాకపోతే, 'ఈ నిర్ణయానికి రావడానికి నాకు ఇంత సమయం ఎందుకు పట్టింది? ముందే అనుకుని ఉంటే, ఇంటర్‌లోనో, డిగ్రీలోనో చదువు ఆపేసి అప్పుడే వ్యవసాయం పైన దృష్టి పెడితే సరిపోయేది కదా' అన్న అంతర్మధనం నన్ను ఈ మధ్య బాగా వేధిస్తోంది. ఈ క్షోభ వల్ల వ్యవసాయంపై కూడా పూర్తి స్థాయిలో దృష్టి సారించలేకపోతున్నా. ఈ మానసిక స్థితి నుంచి బయటపడి, అనుకున్న దిశగా అడుగులు వేసే మార్గం చెప్పండి.

- ఆర్.కుమార్, మహబూబ్‌నగర్

ఆలోచనలు ఒక కొలిక్కి వచ్చిన తర్వాతే కదా ఏదైనా నిర్ణయం జరిగేది! ఈ నిర్ణయానికి రావడం అన్నది ఇప్పుడు జరిగిందేమో గానీ, దానికి సంబంధించిన ఆలోచనలు మీలో ఎప్పటి నుంచో కొనసాగుతూ ఉండి ఉండాలి. నిజానికి ఆలోచనలన్నీ నిర్ణయాలు కాలేవు. దశాబ్దాల పర్యంతంగా సాగిన ఆలోచనలు కూడా ఒక నిర్ణయానికి రాకపోవడం అనేది కొందరికి అనేక సార్లు జరుగుతుంది. ఎందుకంటే ఏ ఆలోచనకు ఆ ఆలోచన ఏకపక్షంగానే వస్తాయి. కానీ, నిర్ణయానికి రావడానికి ముందు వేయి కోణాల్లో ఆలోచించాల్సి ఉంటుంది. ఆలోచనలు చేయడానికి ఒక స్థాయి అంటూ అవసరం లేకపోవచ్చు. కానీ నిర్ణయం తీసకోవడానికి ఒక స్థాయి అవసరం. ఎవరైనా అలా లోతుగా ఆలోచించకుండానే బిరబిరా నిర్ణయం తీసుకున్నా, అది నిలబడదు. మధ్యలో మళ్లీ ఊగిసలాట మొదలవుతుంది. అది మరీ ప్రమాదం. ఇప్పటికైనా మీరు ఒక నిర్ణయానికి రావడం సంతోషించాల్సిన విషయమే. కాకపోతే, మీరు అనుకుంటున్న ఆ వ్యవసాయం గురించి మీరు ఏ మేరకు అధ్యయనం చేశారన్నది ఇప్పుడు ముఖ్యం. అలా అధ్యయనం చేయకపోతే, మీ ఆలోచనలు ఆచరణాత్మకంగా వెళ్లవు. విద్యావంతులైన కొంత మంది ఇలాంటి నిర్ణయానికి రావడానికి వెనుక చాలా సార్లు పల్లెటూరి ప్రశాంతత, పంటపొలాల్లోని పచ్చదనం వీటి ఆకర్షణే ఉంటుంది. వాటి మీద ప్రేమే అధికంగా ఉంటుంది. అయితే ఇవేవీ మనిషిని వ్యవసాయపరమైన శ్రమకు పూర్తి స్థాయిలో సిద్ధం చేయలేవు. వ్యవసాయం అనేది మానసికమే కాదు, శారీరక శ్రమను కూడా కోరుకుంటుందనే వాస్తవాన్ని ఎప్పుడూ మరిచిపోకూడదు. అయితే ఒక సైన్స్ పట్టభద్రుడైన మీరు వ్యవసాయంలోకి దిగగానే ఆ జ్ఞానాన్ని పూర్తిగా మూలకు పడేయకుండా, మీ ఊళ్లో సైన్స్ విద్యార్థులకు ఎంతో కొంత విజ్ఞానాన్ని పంచండి. అది ఇన్నేళ్ల చదువుకు సార్థకత చేకూరుతుంది.



> లోతుగా ఆలోచించకుండానే బిరబిరా నిర్ణయం తీసుకుంటే అది నిలబడదు. మధ్యలో మళ్లీ ఊగిసలాట మొదలవుతుంది. అది మరీ ప్రమాదం.

- డాక్టర్ ప్రవీణ్‌కుమార్ చింతపంటి
కన్సల్టెంట్ సైకియాట్రిస్ట్, ట్రాంక్విల్ మైండ్ క్లినిక్, మాదాపూర్, హైదరాబాద్

మీ మానసిక సమస్య ఏదైనా సరే బెటర్ లైఫ్‌కు రాసి పంపండి.
పరిష్కార మార్గాలు అందిస్తాం.
మా మెయిల్ ఐడీ: navya@andhrajyothy.com

డైలీ సుడోకు - 444

3				2	5	4		6
							3	
	6	4	9					
	2					7	6	
5			2		1			9
	1	9					2	
					4	9	5	
	5							
8		7	5	9				2

ఎలా పూరించాలి?

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. నిలువుగా, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి. ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

సుడోకు- 443 సమాధానం

6	2	7	1	9	5	8	4	3
1	9	5	8	4	3	6	2	7
4	3	8	2	7	6	9	5	1
8	1	9	3	2	7	4	6	5
7	5	3	9	6	4	1	8	2
2	4	6	5	8	1	3	7	9
3	8	1	6	5	2	7	9	4
9	7	2	4	3	8	5	1	6
5	6	4	7	1	9	2	3	8

సెలబ్ స్టైల్

ఎంత సక్కగున్నావే!



సమంత

"అందానికి అర్థం... మిమ్మల్ని చూసేంత వరకూ తెలియలేదు"..., "మీరు బ్యూటీ క్వీన్'... ఇలా అభిమానుల కామెంట్లతో సమంత ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలోని కొన్ని ఫొటోలకు కామెంట్లు నిండిపోతున్నాయి. 'రంగస్థలం' సినిమాలో రామలక్ష్మిని చూస్తూ చిట్టిబాబు హృదయం 'ఎంత సక్కగున్నావే' అని రాగాలు తీసింది. ఇప్పుడు సమంత తాజా ఫొటోషూట్‌ను చూసి నెటిజన్లు "ఎంత అందంగా ఉన్నావే..." అంటూ మైమరిచిపోతున్నారు. ఫ్యాషన్‌కి చిరునామాగా ఉంటారు. ట్రెండ్‌ను ఫాలో కావడమే కాదు సెట్ చేస్తారు కూడా. కానీ అప్పుడప్పుడూ ఆమె డ్రెస్సింగ్ స్టయిల్‌పై ఎప్పుడూ ట్రోలింగ్స్ వస్తూనే ఉంటాయి. అప్పట్లో పెళ్లయిన కొత్తలో ఆమె వెకేషన్‌కు వెళ్లినప్పటి ఫొటోలపై నెటిజన్లు అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. పెళ్లయిన తర్వాత కూడా బికినీ ధరించడం ఏంటి అంటూ మోరల్ పోలీసింగ్ చేయడానికి నెటిజన్లు ప్రయత్నించారు. "నా రూల్స్ నేను రాసుకుంటాను" అంటూ వారికి ఘాటుగానే రిప్లై ఇచ్చారు. ఫ్యాషన్ డిజైనర్ ప్రతిమా జుకేల్కర్ రూపొందించిన బ్లాక్ గౌన్‌లోని ఉన్న సమంత ఫోటోలు నెట్‌లో హల్‌చల్ చేస్తున్నాయి.


నెట్టింట్లో ఆదివాసీ మేళా

యూట్యూబ్

'కచర' షార్ట్‌ఫిలింతో దర్శకురాలిగా మారారు జెన్నీఫర్ అల్ఫోన్సె. ఈ లఘుచిత్రం ఆమెకు నంది అవార్డులను తెచ్చిపెట్టింది. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగించడానికి 'వేర్ హెల్మెట్', కథానాయిక లావణ్యా త్రిపాఠి ప్రధాన పాత్రలో 'సిగ్నల్ జంప్', మహిళల భద్రత అంశంపై స్ట్రేంజర్స్, షి-టీమ్ లఘుచిత్రాలూ తీశారు. కేన్ చిత్రోత్సవాల్లో 'స్ట్రేంజర్స్' ప్రదర్శితమైంది కూడా. అంతేకాదు ఆదిలాబాద్‌లోని గోండు తెగలపై రెండేళ్ల క్రితం 'గుసాడి' అనే డాక్యుమెంటరీని రూపొందించారు. తాజాగా ఓ జాతరపై మరో డాక్యుమెంటరీ రూపొందించి యూట్యూబ్‌లో విడుదల చేశారు. మోస్రం గిరిజనులకు ఎంతో ప్రీతిపాత్రమైన 'నాగోబా జాతర' తెలంగాణాలో ప్రస్తుతం జరుగుతోంది. సుమారు 2 వేల ఏళ్ల చరిత్ర ఉన్న ఈ ఉత్సవాలు ఆదిలాబాద్ జిల్లా కేస్లాపూర్‌లో ప్రతి ఏటా ఎంతో వైభవంగా జరుగుతాయి. ఈ నెల 4 నుంచి 7వ తేదీ వరకూ సాగే ఈ జాతరకు పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒడిశాలలోని మోస్రం గిరిజనులూ తరలివెళతారు. మరి ఈ జాతర ఎలా జరుగుతుందో, ఆ సందడి ఎలా ఉంటుందో తన మూడు నిమిషాల డాక్యుమెంటరీ 'నాగోబా జాతర- ద ట్రైబల్ కార్నివాల్'లో చూపించే ప్రయత్నం చేశారు జెన్నీఫర్. సోమవారం విడుదలైన ఈ డాక్యుమెంటరీ నెటిజన్లను ఆకట్టుకుంటోంది.



జెన్నీఫర్ అల్ఫోన్సె



ఆంధ్రప్రదేశ్

2.26 లక్షల కోట్లతో 2019-20 బడ్జెట్ – ప్రజా రంజకం, ప్రగతి సాధకం.


నవ్యాంధ్ర నిర్మాణంలో నవశకం

రూ. 5000 కోట్లతో అన్నదాత సుఖీభవ	నిరుద్యోగ భృతి రూ. 2000కు పెంపు	పసుపు-కుంకుమకు రూ.4000 కోట్లు కేటాయింపు	రైతు మద్దతు ధరకు రూ.1000 కోట్లు కేటాయింపు



అమరావతి - ప్రజా రాజధాని

- 34,000 ఎకరాల భూమి సేకరించడం ఒక చరిత్ర
- ప్రపంచంలోని 5 అత్యుత్తమ రాజధాని నగరాల్లో ఒకటిగా అమరావతి నిర్మాణం
- ప్రజా రాజధాని నిర్మాణ అంచనా వ్యయం రూ.1.09 లక్షల కోట్లు
- మొదటి దశలో రూ.58,687 కోట్లు ఖర్చు, ప్రస్తుతం రూ.39,875 కోట్ల మేర పనులు
- 5 టవర్లుగా సెక్రటేరియట్, అసెంబ్లీ, హైకోర్టు భవనాలు, ఉద్యోగులకు నివాస సముదాయాల నిర్మాణం
- మెరుగైన ఆధునిక మౌలిక సదుపాయాలు
- రాజధాని అమరావతికి అనుసంధానంగా పవిత్ర సంగమం వద్ద ఐకానిక్ బ్రిడ్జ్ నిర్మాణం



పోలవరం


- ఆంధ్రప్రదేశ్ జీవనాడి పోలవరం ప్రాజెక్టు
- పోలవరం ప్రాజెక్టు ద్వారా మొత్తం 40 లక్షల ఎకరాలకు సాగునీరు - 15 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు సాగునీరు. కృష్ణా గోదావరి నదుల కింద మరో 25 లక్షల ఎకరాల సాగు స్థిరీకరణ
- ఇప్పటివరకు 64.31% పనులు పూర్తి - రూ. 10,069.66 కోట్లు ఖర్చు
- 2019 జూన్ నాటికి గ్రావిటీ ద్వారా సాగునీటి సరఫరా
- 24 గంటల్లో 32,100 ఘనపు మీటర్ల కాంక్రీట్ పనులు పూర్తి చేసి ప్రపంచ రికార్డు
- ఇతర సాగునీటి ప్రాజెక్టులపై రూ. 63,657.52 కోట్లు ఖర్చు, 32.02 లక్షల ఎకరాలకు సాగునీటి లక్ష్యం



సంక్షేమం

- లక్ష కోట్లతో దేశంలోనే ప్రగతిశీల రాష్ట్ర సంక్షేమ పథకాలు
- 51 లక్షల మంది లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా ద్వారా రూ.24,618 కోట్లు పింఛన్ల పంపిణీ
- రూ. 200 నుంచి రూ. 2000కు, 10 రెట్లు పెరిగిన పింఛన్లు
- మత్స్యకారులు, రజకులు, ఇతర సామాజిక వర్గాల వృత్తిదారుల్లో పదిమందికి పింఛను సౌకర్యం
- 100% రేషన్ కార్డుల పంపిణీ, పేదలకు చంద్రన్న సంక్రాంతి, క్రిస్మస్, రంజాన్ కానుకలు
- గ్రామీణ కుటుంబాలకు 100% ఎల్పీజీ వంట గ్యాస్ కనెక్షన్లు
- బీసీ సంక్షేమానికి రూ. 40,000 కోట్లు
- ఎస్సీ సంక్షేమానికి రూ. 40,254 కోట్లు, ఎస్టీలకు రూ. 14,210 కోట్లు
- మైనారిటీలకు రూ. 3,215 కోట్లు, దివ్యాంగులకు రూ. 4,326 కోట్లు
- కాపు కార్పొరేషన్ ద్వారా రూ. 3,100 కోట్లు
- బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా రూ. 285 కోట్లు
- లక్ష పథకం కింద రూ. 100 కోట్లతో 15 లక్షల గృహిణులకు, 10 లక్షల బాలికలకు అదనపు పంపిణీ

గత 5 ఏళ్లలో ప్రభుత్వ శాఖల పనితీరుకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో — మొత్తం — 670 పురస్కారాలు లభించాయి



చంద్రన్న బీమా

- 2.5 కోట్ల అసంఘటిత కార్మికులకు రూ. 5 లక్షల వరకు బీమా సౌకర్యం కల్పిస్తున్న రాష్ట్రంగా అగ్రస్థానంలో నిలిచిన ఏపీ
- 1,93,819 మంది బాధిత కుటుంబాలకు రూ. 2,685 కోట్ల బీమా పరిహారం చెల్లింపు
- పథకంలో నమోదైన కుటుంబాలకు చెందిన విద్యార్థులు 15,71,135 మంది
- రూ. 1200 చొప్పున మొత్తం రూ. 188.54 కోట్ల ఉపకార వేతనాలు మంజూరు – త్వరితగతిన క్లెయిమ్ పరిష్కారం





విద్యుత్తు

- రాష్ట్రంలో ఇప్పుడు విద్యుత్తు కోతలు, పవర్ హాలిడేస్ లేవు
- గృహాలకు, పరిశ్రమలకు 24/7 విద్యుత్ సరఫరా
- 4 ఏళ్లలో విద్యుత్తు రంగంలో రూ. 39,604 కోట్ల పెట్టుబడులు
- కర్నూలు, కడప, అనంతపురంలో 4,000 మెగావాట్ల సామర్థ్యంతో సౌర విద్యుత్తు ప్రాజెక్టుల ఏర్పాటు
- 900 యూనిట్లలోపు విద్యుత్తు వినియోగించే రైతులు, గృహాలకు విద్యుత్తు ఛార్జీలు పెంచలేదు
- ఆక్వా రంగానికి యూనిట్ రూ. 2కే విద్యుత్ సరఫరా. రోజుకు 9 గంటల ఉచిత విద్యుత్తు
- ఎస్సీ, ఎస్టీలకు 100 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు (అక్షయ జ్యోతి)
- అత్యంత వెనుకబడిన బీసీ వర్గాలకు కూడా 100 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు



యువనేస్తం

- ముఖ్యమంత్రి యువనేస్తం ద్వారా 4.32 లక్షల మంది నిరుద్యోగ యువతకు నెలకు రూ. 1,000 నిరుద్యోగ భృతి చెల్లింపు
- నైపుణ్యాభివృద్ధి పెంపొందించేందుకు యువతకు ప్రత్యేక శిక్షణ
- స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ద్వారా 8.66 లక్షల మంది యువతకు శిక్షణ
- పర్యాటక రంగానికి సంబంధించి 43,050 మందికి శిక్షణ పూర్తి
- ఉద్యోగాలు పొందినవారు 1.78 లక్షల మంది
- ఎన్టీఆర్ విదేశీ విద్యాదరణ కింద ఉపకారవేతనాలు, కోచింగ్



ప్రజా ఆరోగ్యం

- ఎన్టీఆర్ వైద్య సేవ పరిమితి రూ. 2.50 లక్షల నుంచి రూ. 5 లక్షలకు పెంపు. 455 ఆస్పత్రుల్లో 1044 వ్యాధులకు ఉచిత చికిత్స
- ఎన్టీఆర్ వైద్య సేవల ద్వారా 17.14 లక్షల మంది పేదలకు రూ. 4,758 కోట్లతో ఉచిత వైద్య సేవలు
- 276 తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాల ద్వారా 7.16 లక్షల మహిళలకు క్షేమంగా ప్రసవం – మాతా శిశు మరణాల తగ్గింపు
- 6.91 లక్షల మంది శిశువులకు ఎన్టీఆర్ బేబీ కిట్ల పంపిణీ
- 468 ఆసుపత్రుల్లో 108 సేవలు 24/7 అందుబాటు
- 7 జిల్లాల్లో 122 ఫీడర్ అంబులెన్సులు, గిరిజన తండాల్లో బైక్ అంబులెన్సులు
- రూ. 860 కోట్లతో ఉద్యోగుల హెల్త్ స్కీమ్, 2.80 లక్షల మందికి లబ్ధి ప్రతి జిల్లాలో ఎన్టీఆర్ క్యాన్సర్ కేర్ సెంటర్లు





పసుపు కుంకుమ

- రూ 20 వేల కోట్లతో 93.18 లక్షల మంది ఆడపడుచులకు పసుపు-కుంకుమ చెల్లింపు
- మూడు విడతల్లో ప్రతి డ్వాక్రా సభ్యురాలికి రూ. 20,000 చెల్లింపు
- స్వయం సహాయక సంఘాల్లో ప్రతి సభ్య కుటుంబానికి నెలకు 10 వేల రూపాయల సంపాదన లక్ష్యం
- ఇప్పటికే పసుపు కుంకుమ పెట్టుబడి నిధిగా రూ. 1,868 కోట్లు అందజేత
- స్త్రీ నిధిగా రూ. 550.75 కోట్లు. రూ. 13,926 కోట్ల నిధులు సమీకరణ
- డ్వాక్రా మహిళలకు రూ. 472.27 కోట్ల వడ్డీలేని రుణాలు
- ప్రతి డ్వాక్రా సభ్యురాలికి రూ. 4,000 విలువ చేసే స్మార్ట్ ఫోన్



వ్యవసాయ రంగం

- వ్యవసాయ రంగంలో సగటున 11% వృద్ధి రేటు సాధించిన ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్
- బడ్జెట్లో లక్ష కోట్ల రూపాయలు వ్యవసాయ బడ్జెట్ కేటాయింపు
- రూ. 24,500 కోట్లతో రైతు రుణమాఫీ, దేశంలోనే ఒక చరిత్ర
- 11.30 లక్షల ఎకరాల్లో సూక్ష్మసేద్య పథకం అమలు - దేశంలోనే ఏపీకి మొదటి స్థానం
- వ్యవసాయానికి పగటి పూట నాణ్యమైన 9 గంటల ఉచిత విద్యుత్
- 25 లక్షల కౌలు రైతులకు రూ. 9,411 కోట్ల పంట రుణాలు దేశంలోనే రికార్డు
- రైతులకు 30,000 సోలార్ పంపు సెట్ల పంపిణీ
- దేశంలోనే తొలిసారిగా జింక్, బోరాన్, జిప్సం సూక్ష్మ పోషకాలు ఉచితంగా సరఫరా. 8% నుంచి 16% పెరిగిన దిగుబడి
- వ్యవసాయ యాంత్రీకరణకు అధిక ప్రాధాన్యత. ఎస్సీ, ఎస్టీలకు 70% రాయితీ. రైతు రథం కింద 12,217 ట్రాక్టర్ల పంపిణీ, ఈ ఏడాది 11,664 ట్రాక్టర్ల పంపిణీ లక్ష్యం
- విపత్తులతో నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ 50% నుంచి 75% అదనంగా పెంపు




గ్రామీణ మౌలిక సదుపాయాలు

- గ్రామాల్లో పేదలకు 20 లక్షల ఇళ్ల నిర్మాణం
- గత 5 ఏళ్లలో 24,000 కిలోమీటర్ల సిమెంట్ రోడ్ల నిర్మాణం
- రాష్ట్ర వ్యాప్తంగా ఓడీఎఫ్ ద్వారా చేసి 21.21 లక్షల ఎకరాలకు వీధి దీపాల ఏర్పాటు
- రూ. 4,115 కోట్ల వ్యయంతో 35.64 లక్షల మరుగుదొడ్ల నిర్మాణం
- 2018 జూన్ నాటికి ఓడీఎఫ్ రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ రికార్డు
- 9,000 గ్రామ పంచాయతీల్లో చెత్త నుంచి సంపద తయారు చేసే 7,813 కేంద్రాల నిర్మాణం
- రూ. 203.38 కోట్లతో 2071 గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణంలో ప్రగతి



పారిశ్రామికాంధ్రప్రదేశ్‌గా రాష్ట్రం

- రూ. 16 లక్షల కోట్ల పెట్టుబడులతో 33 లక్షల ఉద్యోగాల కల్పనకు అవకాశాలు – విశాఖలో వరుసగా మూడు భాగస్వామ్య సదస్సులు
- రూ. 1.77 లక్షల కోట్ల పెట్టుబడులతో 810 పరిశ్రమలు ఏర్పాటు, ఉత్పత్తి ప్రారంభం
- అనంతపురంలో కియా కార్ల పరిశ్రమ, చిత్తూరు జిల్లా శ్రీసిటీ సెజ్‌లో ఇసుజు, హీరో మోటో కార్ప్, అపోలో టైర్స్, విజయవాడలో అశోక్ లేలాండ్ వంటి ఆటోమొబైల్, అంతర్జాతీయ పరిశ్రమలు ఏర్పాటు
- ఐటీ రంగంలో లక్ష ఉద్యోగాలు, ఎలక్ట్రానిక్స్ రంగంలో రెండు లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యం
- విశాఖ సమీపంలో భోగాపురం, నెల్లూరు జిల్లా దగదర్తి విమానాశ్రయాల పనులు వేగవంతం. కర్నూలు సమీపంలో ఓర్వకల్లు విమానాశ్రయం ప్రారంభం
- శరవేగంగా మచిలీపట్నం ఓడరేవు పనులు, రామాయపట్నం ఓడరేవు శంకుస్థాపన, త్వరలో భావనపాడు ఓడరేవు
- నేచురల్ గ్యాస్ నెట్‌వర్క్ విస్తరణ, కాకినాడ-శ్రీకాకుళం పైప్‌లైన్ ఏర్పాటుకు ప్రణాళిక
- విశాఖపట్నం, కృష్ణపట్నం, కర్నూలుతో పాటు విజయవాడల్లో ఆర్థిక నగరాల నిర్మాణం
- విశాఖలో ఐటీ, రాయలసీమలో హార్డ్‌వేర్, ఆటోమొబైల్ రంగం అభివృద్ధి





అన్న క్యాంటీన్లు

- ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అన్నపూర్ణ
- ఇప్పటికే 203 అన్న క్యాంటీన్ల ద్వారా రూ. 5కే నాణ్యమైన అల్పాహారం, భోజనం



ఆదరణ - పేదరికంపై గెలుపు

- రూ. 4,000 కోట్ల వ్యయంతో పేదరికంపై గెలుపు
- 964 కోట్లతో ఆదరణ పథకం ద్వారా 90% రాయితీతో ఆధునిక యంత్రాలు, పనిముట్ల పంపిణీ
- రాష్ట్రవ్యాప్తంగా 8 లక్షల వృత్తిదారులు లబ్ధిదారులు



పట్టణ మౌలిక సదుపాయాలు

- శరవేగంగా పట్టణ పేదలకు 10 లక్షల ఇళ్ల నిర్మాణం
- రూ. 1.05 లక్షల కోట్లతో పట్టణాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి
- 5 ఏళ్లలో పట్టణ ప్రాంతాల్లో 2,779 కిలోమీటర్ల రహదారుల నిర్మాణం
- రూ. 8,300 కోట్లతో పీపీపీ పద్ధతిలో విశాఖ మెట్రో రైలు ప్రాజెక్టు



పెళ్లికానుక

పేదల ఇంట పెళ్లి బాజాలు మోగిస్తున్న చంద్రన్న పెళ్లి కానుక

- బీసీలకు రూ. 35 వేలు
- ఎస్సీలకు రూ. 40 వేలు
- ఎస్టీలకు రూ. 50 వేలు
- దుల్హన్ పథకం కింద మైనారిటీలకు రూ. 50 వేలు
- కులాంతర వివాహం చేసుకున్న ఎస్సీ, ఎస్టీలకు రూ.75 వేలు
- లబ్ధి పొందిన యువతులు 66,538 మంది - మొత్తం రూ. 269 కోట్లు





విద్యారంగం

- మన ఊరు-మన బడి, బడి పిలుస్తోంది కార్యక్రమంతో 89.61% పాఠశాల ప్రవేశాల పెంపు
- రూ. 4,848 కోట్లతో పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన
- 3,640 డిజిటల్ క్లాస్ రూములు 1217 వర్చువల్ క్లాస్ రూముల ఏర్పాటు
- బడికొస్తా పథకం కింద బాలికలకు 1.87 లక్షల సైకిళ్ల పంపిణీ
- 39 లక్షల మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం
- రూ. 100 కోట్లతో విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాల అభివృద్ధికి చర్యలు విదేశీ విద్య కోసం పేద విద్యార్థులకు రూ. 15 లక్షలు
- డీఎస్సీ ద్వారా 9,862 టీచర్ పోస్టుల భర్తీ. అదనంగా 7,726 పోస్టుల భర్తీకి మరో ప్రకటన

ఈ అభివృద్ధి పరిణామాలు ఇలాగే కొనసాగిద్దాం. పనిచేసే ప్రభుత్వానికి ప్రజా దీవెనలు అందిద్దాం



ప్రేక్షకులు మెచ్చే చిత్రాలు చేయడానికి కృషి చేస్తా!

- రామ్‌చరణ్

"అభిమానులు, ప్రేక్షకులు అందరికీ నచ్చే చిత్రాన్ని, అందర్నీ ఎంటర్‌టైన్ చేసే చిత్రాన్ని అందించడానికి మేమంతా ఎంతగానో శ్రమించాం. దురదృష్టవశాత్తు... మేం అనుకున్న విధంగా ఒక మంచి చిత్రాన్ని (వినయ విధేయ రామ) ఇవ్వలేక అంచనాలను అందుకోలేకపోయాం. ప్రేక్షకులు, అభిమానులు చూపించే ఈ ఆదరణ, అభిమానాన్ని ప్రేరణగా తీసుకుని భవిష్యత్తులో వారందరికీ నచ్చే... మెచ్చే చిత్రాలు చేయటానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తాను" అని రామ్‌చరణ్ అన్నారు. ఆయన కథానాయకుడిగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో డివివి దానయ్య నిర్మించిన 'వినయ విధేయ రామ' సంక్రాంతికి విడుదలైంది. ఈ చిత్రఫలితాన్ని ఉద్దేశిస్తూ మంగళవారం రామ్‌చరణ్ ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. అందులో "ప్రియమైన అభిమానులు, ప్రేక్షకులకు... నా పట్ల, మా సినిమా పట్ల మీరు చూపించిన ప్రేమ, అభిమానాలకు వినయపూర్వక ధన్యవాదాలు. మా 'వినయ విధేయ రామ' సినిమా కోసం రేయింబవళ్లు కష్టించిన సాంకేతిక నిపుణులు అందరికీ నా ధన్యవాదాలు. మా నిర్మాత దానయ్య అందించిన సహకారం మాటల్లో వర్ణించలేనిది. మా చిత్రాన్ని నమ్మిన పంపిణీదారులు, ప్రదర్శనదారులకు కృతజ్ఞుడనై ఉంటాను. మీరు ఎల్లప్పుడూ చూపించే ఈ ప్రేమ, అభిమానానికి ధన్యవాదాలు. ప్రేమతో.. మీ రామ్‌చరణ్" అని ఆయన పేర్కొన్నారు.

తెలుగు సినిమా@87

హ్యాపీ బర్త్‌డే... తెలుగు సినిమా!

ఇవాళ్టితో తెలుగు సినిమాకు ఎనభై ఏడు వసంతాలు నిండాయి. మన తొలి పూర్తి తెలుగు టాకీ 'భక్త ప్రహ్లాద' ఎనభై ఏడేళ్ళ క్రితం సరిగ్గా ఇదే రోజున విడుదలైంది. ప్రముఖ దర్శకుడు హెచ్.ఎం. రెడ్డి దర్శకత్వంలో 'భక్తప్రహ్లాద' తయారైంది. ఎనభై ఏడేళ్ళ క్రితం 1932 ఫిబ్రవరి 6న థియేటర్లలో తొలిసారిగా రిలీజైంది. అలా ఆ రోజున పూర్తి స్థాయి తెలుగు చిత్రాలు ప్రేక్షకులను తెరపై పలకరించడం మొదలైంది. ఆ విధంగా మన తెలుగు సినిమాకు ఇవాళ పుట్టినరోజు. పరిశ్రమకూ, ప్రేక్షకులకూ పండుగ రోజు. ఇవాళ సమాజంపై అమితంగా ప్రభావం చూపుతున్న మాధ్యమం అంటే, నిస్సందేహంగా సినిమానే! మన కట్టూబొట్టూ, ఆట, పాట, మాట, ప్రవర్తన - ఇలా అన్నిటినీ ఇతోధికంగా మార్చిన పాపం, పుణ్యం మన సినిమాలదే! జీవితంలో విడదీయరాని భాగంగా మారిపోయింది కాబట్టే... సినిమాల గురించి, అందులోనూ మన తెలుగు సినిమా పుట్టినరోజును ప్రత్యేకంగా గుర్తు చేసుకుంటున్నది.



'భక్త ప్రహ్లాద'లో మాస్టర్ కృష్ణారావు, 'సురభి' కమలాబాయి, మునిపల్లె సుబ్బయ్య

అలా మొదలైంది...

ఇలా వాక్చిత్రాలు (టాకీలు) రాక ముందు దాకా ప్రపంచవ్యాప్తంగా భాషతో ప్రమేయం లేని మూగచిత్రాలు (మూకీలు) వచ్చేవి. మనదేశంలోనూ అంతే! మన పూర్తి తెలుగు చిత్రం ఎలా రూపొందిందనేది చారిత్రక క్రమంలో పరిశీలిస్తే ఆసక్తిగా అనిపిస్తుంది. మన దేశంలో... మన భారతీయ భాషలో రూపొందిన తొలి వాక్చిత్రం 'ఆలమ్ ఆరా'. ఈ తొలి భారతీయ టాకీ 1931 మార్చి 14న బొంబాయిలోని మెజెస్టిక్ థియేటర్‌లో విడుదలైంది. అది మన దేశంలో సినీ రంగంలో కొత్త విప్లవానికి నాంది. అప్పటి నుంచి దేశంలో వివిధ భారతీయ భాషల వారీగా టాకీలు రాసాగాయి. మన హెచ్.ఎం. రెడ్డి ఆ 'ఆలమ్ ఆరా'కు దర్శకత్వ శాఖలో పని చేసినవారే! 'ఆలమ్ ఆరా' తరువాత దర్శకత్వ శాఖ నుంచి స్వతంత్ర దర్శకుడిగా ఎదిగిన హెచ్.ఎం. రెడ్డి ఆ తరువాత సరిగ్గా ఏడున్నర నెలలకు తొలి దక్షిణ భారతీయ భాషా టాకీ 'కాళిదాస్'ను రూపొందించారు. ప్రధానంగా తమిళం, కొన్ని తెలుగు మాటలు - పాటలు, అక్కడక్కడా హిందీ డైలాగులతో తయారైన సినిమా 'కాళిదాస్'.



దర్శక పితామహుడు హెచ్.ఎం. రెడ్డి

ఆ 'కాళిదాస్' చిత్రం 1931 అక్టోబర్ 31న మద్రాసులోని కినిమా సెంట్రల్ (తరువాతి కాలంలో మురుగన్ టాకీస్ అయింది)లో విడుదలైంది. దర్శక - నిర్మాతలు అప్పట్లో "తొలి తమిళ - తెలుగు టాకీ" అంటూ 'కాళిదాస్'కు ప్రకటనలు జారీ చేశారు. తెరపై కనిపించే పాత్రలు మాట్లాడడం జనానికి వింతగా అనిపించింది. ఆ సగం తమిళం, సగం తెలుగు సినిమా కాసులు కురిపించింది. దాంతో, ఈ సారి పూర్తిగా తెలుగులోనే తీయాలనే ఆలోచన వచ్చింది. అలా అప్పుడు మళ్ళీ హెచ్.ఎం. రెడ్డి దర్శకత్వంలోనే పూర్తి తెలుగు టాకీగా 'భక్త ప్రహ్లాద' రూపొందింది.

ఇలా తెలిసింది...

నిర్మాతలు బొంబాయి వాళ్ళు కావడంతో, ఆ చిత్ర నిర్మాణం, సెన్సారింగ్ అక్కడే జరిగాయి. ఫస్ట్ రిలీజ్ కూడా బొంబాయిలోనే! నిజానికి, సగం తెలుగున్న 'కాళిదాస్' కన్నా ముందే, ఈ పూర్తి తెలుగు టాకీ 1931 సెప్టెంబర్ 15న వచ్చిందని కొద్దికాలం ఆధారాలు లేని ప్రచారం జరిగింది. అయితే, అది వాస్తవం కాదని పరిశోధకుడు డాక్టర్ రెంటాల జయదేవ కొన్నేళ్ళ శ్రమతో, సాక్ష్యాధార సహితంగా నిరూపించారు. 'భక్త ప్రహ్లాద' 1932 జనవరి 22న సెన్సార్ పూర్తి చేసుకొని, ఫిబ్రవరి 6న బొంబాయిలోని శ్రీకృష్ణా థియేటర్‌లో విడుదలైనట్లు అసలు నిజాలు వెలికితీశారు. ఆ వివరాలన్నీ అప్పట్లో 'ఆంధ్రజ్యోతి' పత్రిక పాఠకలోకానికి తొలిసారిగా తెలియజేసింది.

ధర్మవరం రామకృష్ణమాచార్యులు రచించిన 'ప్రహ్లాద' నాటకం ఆధారంగా, సురభి నాటక సంస్థ నటులతో ఈ సినిమా తీశారు. హిరణ్యకశిపుడిగా మునిపల్లె సుబ్బయ్య, అతని భార్య లీలావతిగా 'సురభి' కమలాబాయి, వారి బిడ్డ ప్రహ్లాదుడిగా మాస్టర్ కృష్ణారావు ముఖ్యపాత్రధారులు. మొత్తం 9,762 అడుగుల నిడివిగల పది రీళ్ళ సినిమా ఇది. ఈ తొలి పూర్తి తెలుగు సినిమా కేవలం రూ. 18 వేల పెట్టుబడితో, 18 రోజుల్లో నిర్మాణమైంది.

ఇదీ చేయాల్సింది...

అలా మొదలైన మన సినిమా ఈ ఎనభై ఏడేళ్ళ ప్రయాణంలో ఎంతో ముందుకు సాగింది. ఎన్నో మైలురాళ్ళు దాటింది. సాదాసీదాగా వందలు, వేల రూపాయల్లో మొదలైన సినిమా నిర్మాణం ఇవాళ హంగామాగా ఎన్ని పదుల కోట్ల రూపాయల పెట్టుబడికీ, ఎన్ని వందల రోజుల నిర్మాణానికీ, మరెన్ని వందల కోట్ల వసూళ్ళ స్థాయికీ ఎదిగిందో తెలిసిందే! కళాత్మక విలువలు, కాసుల వర్షాల మధ్య వ్యత్యాసం గురించి చర్చ సాగుతూనే ఉంది. భిన్నాభిప్రాయాల మాటెలా ఉన్నా, మన సినిమా ఆనవాళ్ళ మీద ఇప్పటికీ అశ్రద్ధ కొనసాగుతోందనేది మాత్రం నిర్వివాదాంశం. ఆ అశ్రద్ధ వల్ల పాత చిత్రాల ప్రింట్లే లేని పరిస్థితి. ఇప్పటికైనా మన సినిమా పెద్దలు కళ్ళు తెరిచి పుణే ఫిల్మ్ ఆర్కైవ్స్ లాంటి చోట్ల మిగిలిన మన కొద్దిపాటి పాత తెలుగు చిత్రాల ప్రింట్లనైనా డిజిటలైజ్ చేయించాలి. అందుకు ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాధినేతలూ చొరవ చూపాలి. సినిమా ప్రియులందరూ మన సినిమాకు ఇవ్వగలిగిన అసలైన బర్త్ డే గిఫ్ట్ అదే!

ప్రవీణ్ సత్తారు దర్శకత్వంలో...

ప్రేమికుడిగా, క్రీడాకారుడిగా, హుషారైన కుర్రాడిగా... ఇలా ఎటువంటి పాత్రలోనైనా నటించగల యువ కథానాయకుడు అక్కినేని నాగచైతన్య. 'చందమామ కథలు', 'గుంటూరు టాకీస్', 'పీఎస్వీ గరుడవేగ' చిత్రాలతో ఎటువంటి కథనైనా తెరకెక్కించగల సామర్థ్యమున్న విలక్షణ దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్న ప్రతిభాశాలి ప్రవీణ్ సత్తారు. వీరిద్దరి కలయికలో ఓ చిత్రం రూపొందనుందని విశ్వసనీయ వర్గాల సమాచారం. నాగచైతన్య, ప్రవీణ్ సత్తారు మధ్య కథాచర్చలు జరుగుతున్నాయి. ప్రస్తుతం నాగచైతన్య 'మజిలీ' చిత్రంలో నటిస్తున్నారు. త్వరలో మేనమామ వెంకటేశ్‌తో కలిసి నటిస్తున్న 'వెంకీమామ' చిత్రీకరణ ప్రారంభించనున్నారు. ఈ రెండు చిత్రాల తర్వాత ప్రవీణ్ సత్తారు చిత్రం ప్రారంభమవుతుందని వినికిడి.



నాగచైతన్య

మాఫియా సముద్రంలో...

బెల్లంకొండ సాయి శ్రీనివాస్ కథానాయకుడిగా 'ఆర్‌ఎక్స్ 100' ఫేమ్ అజయ్ భూపతి దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందనుంది. దీనికి 'మహా సముద్రం' అనే టైటిల్ ఖరారు చేసినట్టు సమాచారం. మాఫియా నేపథ్యంలో దర్శకుడు కథ సిద్ధం చేశారు. ఇదొక మల్టీస్టారర్ సినిమా. బెల్లంకొండ సాయి శ్రీనివాస్‌తో పాటు చిత్రంలో మరో కథానాయకుడికి చోటుంది. అతను ఎవరనేది త్వరలో తెలుస్తుంది. ప్రస్తుతం తేజ దర్శకత్వంలో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ కథానాయకుడిగా నటిస్తున్న 'సీత' చిత్రీకరణ చివరిదశకు వచ్చేసింది. అది పూర్తయిన వెంటనే అజయ్ భూపతి చిత్రం మొదలవుతుందని తెలుస్తుంది. ఈలోపు మరో కథానాయకుడి ఎంపిక పూర్తవుతుందట! ప్రస్తుతం ఇద్దరు ముగ్గురు యువ కథానాయకులు పేర్లు పరిశీలనలో ఉన్నాయట.



సాయి శ్రీనివాస్

అతనిలో అదే చూశా!

- కియారా అడ్వాణీ



క్రియేటివ్ ఫీల్డ్‌లో ఉన్నవారికి స్టార్‌డమ్ రావడం అంత సులభమేమీ కాదు. దాని వెనుక కొన్నేళ్ల కష్టం, తపనా ఉంటాయి. ఊరికే ఎవరూ గొప్పవారు కాలేరు. చాలామందిలో నేనీ విషయాన్ని గమనించా" అని కియారా అడ్వాణీ అన్నారు. 'భరత్ అనే నేను', 'వినయ విధేయ రామ' చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన కథానాయిక ఈమె. ప్రస్తుతం 'అర్జున్‌రెడ్డి'కి రీమేక్‌గా హిందీలో తెరకెక్కుతున్న 'కబీర్‌సింగ్' చిత్రంలో షాహిద్ సరసన నటిస్తున్నారు. సినిమాలో వీరిద్దరి మధ్య కెమిస్ట్రీ అదిరిపోతుందని చిత్ర యూనిట్ చెబుతోంది. షాహిద్ గురించి కియారా ఆసక్తికర విషయాలను చెప్పారు. "షాహిద్ నా కన్నా 12 ఏళ్లు సీనియర్. కానీ అతని సినిమాలు చూస్తూ పెరిగానని మాత్రం చెప్పను. కబీర్‌సింగ్ చివరి షెడ్యూల్ జరుగుతున్నప్పుడు అతనిలో ఓ విషయం గమనించా. ఇప్పటికే అతను హీరోగా నిరూపించుకున్నాడు. కానీ ఇంకా ఏదో సాధించాలనే తపన గట్టిగా ఉంది. అది 'కబీర్‌సింగ్' నిజం అవుతుందని నమ్ముతున్నా. ఎందుకంటే ఈ సినిమాలో షాహిద్ కపూర్ అనే వ్యక్తి ఎక్కడా కనిపించడు. కబీర్‌సింగ్ పాత్ర మాత్రమే కనిపిస్తుంది. దానికోసం షాహిద్ ఎంతగా కష్టపడ్డాడో దగ్గరగా చూసినవాళ్లకే తెలుస్తుంది" అని పొగడ్తలతో ముంచెత్తారు కియారా.

అంజలిగా వస్తోంది!



నయనతార

నయనతార ప్రధాన పాత్రలో, సీబీఐ అధికారి పాత్రలో నటించిన తమిళ చిత్రం 'ఇమైక్క నోడిగల్'. ఈ క్రైమ్ థ్రిల్లర్‌కు ఆర్. అజయ్ జ్ఞానముతు దర్శకుడు. ఇందులో అథర్వ, రాశీఖన్నా జంటగా నటించారు. ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకుల ముందుకు 'అంజలి సీబీఐ ఆఫీసర్'గా తీసుకొస్తున్నారు నిర్మాతలు సీహెచ్ రాంబాబు, ఆచంట గోపీనాథ్. ప్రస్తుతం తెలుగు అనువాద కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ "ఈ నెల 22 మా చిత్రం విడుదల కానుంది. నయనతార నటన చిత్రానికి ప్రధాన ఆకర్షణ. ప్రతినాయకుడిగా హిందీ దర్శకుడు అనురాగ్ కశ్యప్, నయనతారకు భర్తగా అతిథి పాత్రలో విజయ్ సేతుపతి ప్రేక్షకులను ఆకట్టుకుంటారు" అన్నారు. ఈ చిత్రానికి 'హిప్ హాప్' తమిళ సంగీత దర్శకుడు.

నేటితరం ఆలోచనలతో...



వెంకటేశ్, ఈశ్వర్

ఈశ్వర్, టువా చక్రవర్తి, అంకిత మహారాణా హీరో హీరోయిన్లుగా రూపొందిన చిత్రం '4 లెటర్స్'. 'కుర్రాళ్ళకి అర్థమవుతుందిలే' అన్నది ఉప శీర్షిక. ఆర్.రఘురాజ్ దర్శకత్వంలో దొమ్మరాజు హేమలత, ఉదయ్‌కుమార్ నిర్మించారు. మంగళవారం ఈ సినిమా ట్రైలర్‌ను వెంకటేశ్ ఆవిష్కరించారు. నిర్మాతలు మాట్లాడుతూ "నేటితరం ప్రేమకథతో తెరకెక్కిన చిత్రమిది. కమర్షియల్ హంగులతో అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించేలా ఉంటుంది. సెన్సార్ పనులు పూర్తయ్యాయి. ఈ నెల 22న ప్రేక్షకుల సినిమాను విడుదల చేస్తున్నాం" అని చెప్పారు. "ప్రేమ, పెళ్లి విషయాల్లో నేటితరం ఆలోచనలు, అభిప్రాయాలు ఎలా ఉంటున్నాయన్న కథాంశంతో రూపొందించిన చిత్రమిది. వాస్తవాలకు దగ్గరగా ఉంటుంది" అని దర్శకుడు రఘురాజ్ తెలిపారు.

ఎంతవారలైనా శిక్షార్హులే!



అద్వైత్, జహీదా శ్యామ్, అలోక్ జైన్, సీతారెడ్డి ముఖ్య పాత్రధారులుగా రామదూత ఆర్ట్స్ పతాకంపై గురు చిందేపల్లి దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ఎంతవారలైనా'. జి.సీతారెడ్డి నిర్మాత. షూటింగ్ తుదిదశకు చేరుకుంది. దర్శకుడు మాట్లాడుతూ "ఎంతవారలైనా కాంత దాసులు కావచ్చు, కనకదాసులు కావచ్చు. కానీ, తప్పు చేస్తే ఎంతవారైనా కచ్చితంగా శిక్షార్హులే అన్న లైన్‌తో హారర్ థ్రిల్లర్‌గా తెరకెక్కిస్తున్న చిత్రమిది" అని చెప్పారు. "హైదరాబాద్, మైసూర్, బెంగళూరు, చిక్‌మగళూరులలో దాదాపు 60 రోజుల పాటు షెడ్యూల్ చేశాం. షూటింగ్ పూర్తికావొచ్చింది. నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. త్వరలో ఫస్ట్ లుక్ రిలీజ్ చేస్తాం" అని నిర్మాత చెప్పారు.

అంతా మహిళలే!



నదియా

నదియా ప్రధాన పాత్ర పోషించిన 'తిరక్కు వరతకయ' తమిళ చిత్రాన్ని కె.కె.ఆర్. క్రియేషన్స్ సంస్థ 'దేవి' పేరుతో తెలుగులోకి అనువదించింది. మహిళా దర్శకులు తులసీదాస్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో నదియా సీబీఐ ఆఫీసర్‌గా నటించారు. చిత్రం అనువాద కార్యక్రమాలు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా నిర్మాతలు కర్రి సత్యనారాయణరెడ్డి, కె.కృష్ణ, సబ్బెళ్ల వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ 'సస్పెన్స్, క్రైమ్, థ్రిల్లర్ అంశాలతో ఈ చిత్రం రూపుదిద్దుకొంది. ఓ మర్డర్ మిస్టరీని ఛేదించే క్రమంలో నదియా నటన ప్రేక్షకుల్ని అలరిస్తుంది. పాత్రధారులతో పాటు దర్శకనిర్మాతలు, సాంకేతిక నిపుణులు .. అంతా మహిళలే పనిచేసిన చిత్రమిదది. ఈ నెలాఖరున విడుదల చేస్తున్నాం. సినిమాలో ఐదు పాటలు ఉన్నాయి' అని చెప్పారు.

సినీ కార్మికులకు ఆరోగ్య భీమా కల్పిస్తాం

- పి. రామ్మోహన్‌రావు



కాదంబరి కిరణ్, దశరథ్, రామ్మోహన్‌రావు, వేణుగోపాల్

తెలుగు చిత్రపరిశ్రమలోని సినీ కార్మికులకు ఆరోగ్య బీమా సౌకర్యం కల్పిస్తామని తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పి.రామ్మోహన్‌రావు చెప్పారు. కొన్ని విభాగాల కార్మికులకు ఆరోగ్య బీమా లేదనీ, వాళ్లకు ఎఫ్.డి.సి. నుండి హెల్త్ ఇన్సూరెన్స్ అందిస్తామన్నారు. నటుడు కాదంబరి కిరణ్ నిర్వహిస్తున్న 'మనం సైతం' సేవా కార్యక్రమంలో ఆయన అతిథిగా పాల్గొన్నారు. సోమవారం సాయంత్రం హైదరాబాద్‌లోని నిర్మాతల మండలి హాలులో జరిగిన కార్యక్రమంలో పది మంది పేద కార్మికులకు ఆర్థిక సహాయాన్ని రామ్మోహన్‌రావు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'చిత్రపురి కాలనీలో ఒక వైద్యశాల నిర్మించాలని ప్రయత్నిస్తున్నాం. దీనివల్ల అక్కడ నివసిస్తున్న కార్మికులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. నిత్యం పోటీ ఉండే చిత్రపరిశ్రమలో ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం గొప్ప విషయం' అంటూ కాదంబరి కిరణ్, ఆయన టీమ్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు దశరథ్, మాజీ మంత్రి లక్ష్మారెడ్డి సతీమణి శ్వేత కూడా పాల్గొన్నారు.

స్ట్రీట్ డ్యాన్సర్లు!



శ్రద్ధా కపూర్

'ఎబిసిడి 2' తర్వాత వరుణ్ ధావన్, శ్రద్ధా కపూర్ జంటగా నటిస్తున్న హిందీ చిత్రానికి 'స్ట్రీట్ డ్యాన్సర్' టైటిల్ ఖరారు చేశారు. 'ఎబిసిడి 2' చిత్రానికి దర్శకత్వం వహించిన నృత్యదర్శకుడు రెమో డిసౌజా ఈ చిత్రానికీ దర్శకుడు కావడంతో ఈ చిత్రం టైటిల్ 'ఎబిసిడి 3' అనుకున్నారంతా! అయితే... త్రీడీలో రూపొందుతున్న డిఫరెంట్ డ్యాన్స్ బేస్డ్ చిత్రమిదని ఫస్ట్ లుక్ పోస్టర్లు, టైటిల్‌తో స్పష్టం చేశారు. ఇందులో హీరో హీరోయిన్లు ఇద్దరూ స్ట్రీట్ డ్యాన్సర్లుగా కనిపించనున్నారు. శ్రద్ధా కపూర్‌ది పాకిస్తానీ డ్యాన్సర్ క్యారెక్టర్ అని నటిస్తున్నారని సమాచారం. "వీధుల్లో నడవడం ఎందుకు? డ్యాన్స్ చేయగలిగినప్పుడు!" అని వరుణ్ ధావన్ పేర్కొన్నారు. నిజానికి, ఈ పాత్రలో కత్రీనా కైఫ్ నటించాలి. సల్మాన్‌ఖాన్ 'భారత్'తో ఈ 'స్ట్రీట్ డ్యాన్సర్' షెడ్యూల్స్ క్లాష్ కావడంతో సినిమా నుంచి ఆమె తప్పుకున్నారు. తొమ్మిది నెలల ముందే ఈ సినిమా విడుదల తేదీ ప్రకటించారు. ఈ ఏడాది నవంబర్ 8న సినిమాను విడుదల చేయనున్నట్టు తెలిపారు.



కాలేజీ రోజులు ఎంతో హాయిగా, సరదాగా సాగిపోతుంటాయి. కానీ డిగ్రీ పూర్తి అయి విద్యార్థి నుంచి ఉద్యోగిగా ఎదిగే క్రమంలో ఎన్నో పాఠాలను నేర్చుకోవాల్సి వస్తుంది. పదుల్లో ఉండే అవకాశాలకు వేలాది మంది పోటీ పడుతుంటారు. అందుకు అనుగుణంగా సిద్ధమైతేనే పోటీలో ముందు వరుసలో నిలవడంతోపాటు అనుకున్న లక్ష్యాన్ని చేరుకోగలం. ఇందుకు డిగ్రీ పూర్తి చేసిన మొదటి రోజు నుంచే ప్రయత్నించాలి. చుట్టూ ఉన్న పరిస్థితులను అవగాహన చేసుకోవాలి. రెజ్యూమె నుంచి ఇంటర్వ్యూ వరకు ప్రతి విషయంలో మెరుగవడానికి కృషి చేయాలి. ఈ నేపథ్యంలో ఉద్యోగాన్వేషణకు అప్పుడే కాలేజీ నుంచి బయటకు వచ్చిన విద్యార్థి ఎటువంటి వ్యూహాలు అనుసరించాలో చూద్దాం..

విద్యార్థి నుంచి.. ఉద్యోగిగా

విద్యార్థి దశ నుంచి ఉద్యోగిగా మారే క్రమం చాలా ఆసక్తిగా ఉంటుంది. ఎటువంటి బాధ్యతలు లేని విద్యార్థి జీవితం నుంచి నిత్యం సవాళ్లను ఎదుర్కొనే ఉద్యోగిగా మారడానికి ఎన్నో విషయాలను నేర్చుకోవాలి.

బయటకు రాగానే

కాలేజీ నుంచి డిగ్రీతో బయటకు రాగానే ఎన్నో ఉద్యోగావకాశాలు ఆహ్వానిస్తుంటాయి. వాటిలో అన్నీ మన అర్హతలు, నైపుణ్యాలకు అనుగుణంగా ఉండకపోవచ్చు. ఇటువంటి సందర్భంలో ఉద్యోగ ప్రకటనలో పేర్కొన్న అర్హతలు, నైపుణ్యాలతోపాటు బాధ్యతలకు సంబంధించి కొన్ని కీ వర్డ్స్ ఉంటాయి. వాటిని నిశితంగా పరిశీలించాలి. కొన్ని మన ప్రొఫైల్‌కు మ్యాచ్ అయ్యే అవకాశం ఉంటుంది. అటువంటి వాటిని గుర్తించి ఉద్యోగ ప్రకటనకు అనుగుణంగా రెజ్యూమెను సిద్ధం చేసుకోవాలి. ఉదాహరణకు ప్రకటనలో.. ఉద్యోగిగా ఎంపికైన వ్యక్తి ఆన్ టైమ్, ఆన్ బడ్జెట్‌లో విధులు నిర్వహించాలి అని ఉంటుంది. ఇందుకు కాలేజ్‌లో చేసిన ప్రాజెక్ట్ లేదా క్లబ్ అధ్యక్షుడిగా, ఈవెంట్ ఆర్గనైజర్‌గా నిర్వహించిన బాధ్యతలను ఉదాహరణగా తీసుకోవాలి. దాని ఆధారంగా అనుకున్న సమయంలో, బడ్జెట్‌లో ఏవిధంగా బాధ్యతలు నిర్వహించింది సంక్షిప్తంగా వివరించాలి. మరో కీలక అంశం సదరు విషయాన్ని గణాంకాల రూపంలో వివరిస్తే ప్రభావవంతంగా ఉంటుంది. అంతేకాకుండా ఇటువంటి వాటి ద్వారా మీ నాయకత్వ లక్షణాలు కూడా తెలుస్తాయి. రెజ్యూమెను సిద్ధం చేసుకునేటప్పుడు స్పెల్లింగ్, గ్రామర్, ఫార్మాటింగ్ ఎర్రర్స్ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

కీలకం నెట్‌వర్క్

ఉద్యోగాన్వేషణలో కీలక సాధనం నెట్‌వర్క్. అంటే మనకుండే పరిచయాలు. ఈ పరిచయాలను ఉద్యోగాన్వేషణలో ప్రభావవంతంగా వినియోగించుకోవాలి. నెట్‌వర్కింగ్ అనేది ఇంటి నుంచే ప్రారంభం కావాలి. ముందుగా తల్లిదండ్రులు, వారి స్నేహితులు. ఆ తరవాత కాలేజీలో మీ స్నేహితులు, సీనియర్లు, లెక్చరర్లు, అలూమ్ని. ఇవన్నీ విలువైన వనరులు. ఉద్యోగాన్వేషణలో వీటన్నింటిని సమర్థంగా వినియోగించుకోవాలి. వీరందరితో మీలోని అర్హతలు, నైపుణ్యాల గురించి చర్చించాలి. ఎటువంటి ఉద్యోగం కావాలనుకుంటున్నారో వివరించాలి. తద్వారా అవకాశం లభించవచ్చు. ఒక్కోసారి అనుకున్న ఉద్యోగం దొరక్కపోవచ్చు. కానీ సరైన అవకాశం దొరికే వరకు అందులో సర్దుకుపోవడానికి ప్రయత్నించాలి. తద్వారా ఎంతో విలువైన అనుభవం వస్తుంది.

ఇంటర్న్‌షిప్ వైపు

అన్ని విధాల ప్రయత్నిస్తున్నప్పటికీ పూర్తి స్థాయి (ఫుల్ టైమ్ జాబ్) ఉద్యోగం లభించని పక్షంలో ఇంటర్న్‌షిప్ వైపు దృష్టి సారించడం ప్రయోజనకరం. తద్వారా ఉద్యోగ అవకాశాలు మెరుగవుతాయి. కాలేజీ విద్య ద్వారా లభించని నైపుణ్యాలు, అనుభవం వంటి వాటిని ఇంటర్న్‌షిప్‌తో పొందొచ్చు. ఉదాహరణకు మేనేజ్‌మెంట్ విద్యార్థి బ్యాంకింగ్ రంగంలో ఇంటర్న్‌షిప్ చేయడం ద్వారా ఆ రంగంలోని పరిస్థితులపై ఒక అవగాహన ఏర్పడుతుంది.

- ఇది ఇంటర్వ్యూ సమయంలో ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇంటర్న్‌షిప్ అనేది పూర్తి స్థాయి ఉద్యోగం కాకపోయినప్పటికీ కెరీర్‌లో ముందుకు వెళ్లడానికి కావల్సిన విలువైన అనుభవాన్ని దీని ద్వారా పొందొచ్చు. కాబట్టి ఎటువంటి స్టయిపెండ్ లేకున్నా కూడా ఇంటర్న్‌షిప్‌ను ఎంచుకోవడం ఉత్తమం.

ఆన్‌లైన్‌లో చురుగ్గా

ప్రస్తుతం నియామక ప్రక్రియ పూర్తిగా డిజిటల్ మోడ్‌లోకి మారిపోయింది. ఇటువంటి నేపథ్యంలో ఉద్యోగాన్వేషణను విజయవంతం చేసుకోవాలంటే ఆన్‌లైన్‌లో చురుగ్గా ఉండటం తప్పనిసరి. రిక్రూటర్లు కూడా ఆన్‌లైన్ ప్రొఫైల్స్ ద్వారా తమకు కావల్సిన అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసుకుంటున్నారు. కాబట్టి మీకు సంబంధించిన పూర్తి వివరాలు అంటే అర్హతలు, నైపుణ్యాలు, సాధించిన విజయాలు, అనుభవం వంటి అంశాలన్నీ ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉండేలా చూసుకోవాలి. అయితే రిక్రూటర్లు రెజ్యూమెతోపాటు అదనపు సమాచారం కోసం ఆన్‌లైన్ / సోషల్ మీడియాలో మీ రెప్యూటేషన్‌ను కూడా పరిగణనలోకి తీసుకుంటారు.

కాబట్టి ఆన్‌లైన్ ప్రొఫైల్‌ను జాబ్ సెర్చ్‌కు అనుకూలంగా ఉండేలా చూసుకోవాలి. జాబ్ / ఇండస్ట్రీకి సంబంధించిన కీ వర్డ్స్ ప్రొఫైల్ హెడ్డింగ్‌లో ఉండేలా చూసుకోవాలి. సంబంధిత రంగంలోని లేటెస్ట్ న్యూస్, అప్‌డేట్స్‌ను షేర్ చేస్తూ ఉండాలి. తద్వారా ఆ రంగంపై మీకున్న నాలెడ్జ్, ఆసక్తి రిక్రూటర్లకు అర్థమవుతుంది. అంతేకాకుండా సంబంధిత గ్రూప్స్‌లోని ఇండస్ట్రీ నిపుణులు, ప్రొఫెషనల్స్‌తో ఇంటరాక్ట్ అవుతూ ఉండాలి.

సిద్ధంగా ఉండాలి

ఉద్యోగ సాధనలో కీలకమైన దశ ఇంటర్వ్యూ. కాబట్టి దీని కోసం పక్కాగా ప్రిపేర్ కావాలి. ఇంటర్వ్యూలో ఎలా వ్యవహరిస్తారనే దానిపై మాత్రమే అవకాశాలు ఆధారపడి ఉంటాయి. ముందుగా ఇంటర్వ్యూ ఫార్మాట్ తెలుసుకోవాలి. ఈ విషయంలో ఒక్కో కంపెనీ ఒక్కో విధానాన్ని అనుసరిస్తుంది. కాబట్టి ఫార్మాట్ తెలిస్తే తదనుగుణంగా సన్నాహాలు చేసుకోవడం సులువు. ఆఫర్ చేసిన కంపెనీ గురించిన వివరాలను క్షుణ్నంగా తెలుసుకోవాలి. కంపెనీ లక్ష్యాలు, పాటించే విలువల గురించి అవగాహన పెంచుకోవాలి. కొన్నేళ్లుగా కంపెనీ తీరు ఎలా ఉంది వంటి అంశాలపై అప్‌డేట్ కావడం మంచిది. ఆ వివరాలు, అప్లయ్ చేసుకున్న జాబ్ నేచర్ ఆధారంగా ఎటువంటి ప్రశ్నలు ఎదురుకావచ్చో ముందే ఊహించుకుని ప్రిపేర్ కావాలి.

ఆరోగ్య కార్యకర్తలు

ఖాళీలు 1900

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైద్యారోగ్య కుటుంబ సంక్షేమ విభాగం బహుళ ప్రయోజన ఆరోగ్య కార్యకర్త ఉద్యోగాల భర్తీకి మహిళల నుంచి దరఖాస్తులు కోరుతోంది

- జిల్లావారీ ఖాళీలు: శ్రీకాకుళం 52, విజయనగరం 29, విశాఖపట్నం 150, తూర్పు గోదావరి 227, పశ్చిమ గోదావరి 193, కృష్ణా 168, గుంటూరు 242, ప్రకాశం 99, నెల్లూరు 176, చిత్తూరు 182, కడప 97, అనంతపురం 140, కర్నూలు 145
- అర్హత: పదోతరగతి ఉత్తీర్ణతతోపాటు ఎంపీహెచ్‌ఏ కోర్సు పూర్తిచేసి ఉండాలి లేదా ఇంటర్ (ఒకేషనల్) పూర్తిచేసి ప్రభుత్వాసుపత్రుల్లో ఏడాది క్లినికల్ శిక్షణ పొంది ఉండాలి.
- వయసు: ఫిబ్రవరి 1 నాటికి 42 ఏళ్లు మించకూడదు. ఒప్పంద పద్ధతిలో ఎంపీహెచ్‌ఏగా పనిచేస్తున్నవారికి ప్రాధాన్యం ఇస్తారు.
- దరఖాస్తు ఫీజు: రూ.300
- దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఫిబ్రవరి 20
- వెబ్‌సైట్: www.cfw.ap.nic.in

కానిస్టేబుళ్లు

ఖాళీలు 1763

బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్ఎఫ్) కానిస్టేబుల్ (ట్రేడ్స్‌మ్యాన్) భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ఉద్యోగాలు: కాబ్లర్, టైలర్, కార్పెంటర్, కుక్, బార్బర్, స్వీపర్, పెయింటర్, వెయిటర్, డ్రాఫ్ట్‌మన్
- అర్హత: మెట్రిక్యులేషన్ లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణతతోపాటు సంబంధిత ట్రేడ్‌లో రెండేళ్ల అనుభవం ఉండాలి. లేదా రెండేళ్ల డిప్లొమా (ఇండస్ట్రియల్ ట్రైనింగ్) పూర్తిచేసి ఉండాలి.
- వయసు: ఆగస్టు 1 నాటికి 18 నుంచి 23 ఏళ్ల మధ్య ఉండాలి.
- దరఖాస్తుకు ఆఖరు తేదీ: మార్చి 3
- వెబ్‌సైట్: www.bsf.nic.in

అకౌంట్స్ ఆఫీసర్లు

ఖాళీలు 4

విశాఖపట్నం పోర్టు ట్రస్టు అకౌంట్స్ ఆఫీసర్ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- అర్హత: ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటంట్స్ ఆఫ్ ఇండియా లేదా ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అండ్ వర్క్స్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా మెంబరై ఉండాలి.
- ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా
- దరఖాస్తుకు ఆఖరు తేదీ: మార్చి 20
- వెబ్‌సైట్: www.vizagport.com

అసిస్టెంట్ ప్రొఫెసర్లు

ఖాళీలు 134

చండీగఢ్‌లోని పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (పీజీఐఎంఈఆర్) కింది విభాగాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- విభాగాలవారీ ఖాళీలు: మెడికల్ 121, నాన్ మెడికల్ 13
- మెడికల్ విభాగాలు: అనెస్థీషియా, అనాటమీ, కమ్యూనిటీ మెడిసిన్ అండ్ ఎస్‌పీహెచ్, హెల్త్ ఎకనామిక్స్, సీటీవీఎస్, సైటాలజీ, డెర్మటాలజీ, ఎండోక్రైనాలజీ, జనరల్ సర్జరీ
- అర్హత: సంబంధిత విభాగంలో పీజీ (ఎండీ / ఎంఎస్ / ఎంసీహెచ్ / డీఎం) లేదా పీహెచ్‌డీ పూర్తిచేసి ఉండాలి.
- దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఫిబ్రవరి 9
- వెబ్‌సైట్: www.pgimer.edu.in

అసిస్టెంట్ సర్జన్లు

ఖాళీలు 17

ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్ అసిస్టెంట్ సర్జన్ల నియామకానికి దరఖాస్తులు కోరుతోంది.

- విభాగం: అసిస్టెంట్ కమాండెంట్ / వెటరినరీ
- దరఖాస్తు ఫీజు: రూ.400 (ఎస్సీ/ ఎస్టీ/ఎక్స్ సర్వీస్‌మెన్/ మహిళలకు ఫీజు మినహాయింపు వర్తిస్తుంది)
- దరఖాస్తుకు ఆఖరు తేదీ: మార్చి 6
- వెబ్‌సైట్: www.recruitment.itbpolice.nic.in

దిక్సూచి

జువాలజీలో ఏవి ముఖ్యం..?

ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు త్వరలో ప్రారంభం కానున్నాయి. బైపీసీ విద్యార్థులకు అత్యంత కీలకమైన సబ్జెక్టు జువాలజీ. ఫస్టియర్ నుంచే జువాలజీలో మంచి పట్టు సాధిస్తే తర్వాత నీట్, ఎంసెట్ పరీక్షలకు ఉపయోగపడుతుంది. అందువల్ల సబ్జెక్టును అవగాహన చేసుకుంటూ ముఖ్యమైన అంశాలను మళ్లీ మళ్లీ రివిజన్ చేసుకోవాలి. మొదటి సంవత్సరం జువాలజీలో అత్యధిక మార్కుల సాధనకు ఎటువంటి వ్యూహాలను అనుసరించాలో చూద్దాం..

జువాలజీలో గత నాలుగేళ్ల ప్రశ్నాపత్రాలను పరిశీలిస్తే కొన్ని పాఠ్యాంశాల నుంచి క్రమం తప్పకుండా ప్రశ్నలు ఇస్తున్నారనే విషయాన్ని అర్థం చేసుకోవచ్చు. ఈ క్రమంలో ఏయే యూనిట్ల ఎన్ని మార్కుల ప్రశ్నలు అడగొచ్చు, వాటిలోని ముఖ్యమైన పాఠ్యాంశాలు ఏవో చూద్దాం...

Unit - I Diversity of living world

ఈ యూనిట్ నుంచి ఎక్కువగా 2 మార్కులు, 4 మార్కుల ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఇందులోంచి కచ్చితంగా ప్రాక్టీస్ చేయాల్సిన పాఠ్యాంశాలు కొన్ని ఉన్నాయి. అవి..

- Trinomial Nomenclature
- ICZN
- Species aspects
- Binomial Nomenclature
- Evil of quartet
- Co-Extinctions

Unit - II Structural organisation

ఎక్కువగా 2 మార్కులు, 4 మార్కుల ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఈ యూనిట్ నుంచి విద్యార్థులు కచ్చితంగా ప్రాక్టీస్ చేయాల్సిన అంశాలు...

- Retroperitoneal organs
- Origin and function of microglial cells



- Cephalization
- True coelom / secondary body cavity
- Structure of skeletal muscle
- Exocrine and Endocrine glands with examples
- Secretions and functions of mast cells
- Haversian system of bone
- White matter and grey matter of CNS
- Structure of cardiac muscle

Unit - III Animal Diversity - I

ఈ యూనిట్ నుంచి కూడా ఎక్కువగా 2 మార్కులు, 4 మార్కుల ప్రశ్నలు అడిగే అవకాశం ఉంది. దీన్ని గమనించి విద్యార్థులు తప్పనిసరిగా నేర్చుకోవాల్సిన అంశాలు కొన్ని ఉన్నాయి. అవి..

- Tube in Tube organization
- Canal system in sponges
- Features of polychaetes
- Aristotle's lantern
- Chief characters of crustaceans
- Enterocoelom
- Features of anthozoans
- Difference between larvae and adults

Unit - IV Animal Diversity - II

దీని నుంచి సాధారణంగా 2 మార్కులు, 4 మార్కుల ప్రశ్నలు అడుగుతుంటారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు ఈ పాఠ్యభాగంలో కచ్చితంగా ప్రాక్టీస్ చేయాల్సిన అంశాలు ఇవీ...

- Difference between male frog and female frog
- Hallmarks of chordates
- Difference between heart of amphibians and reptiles
- Flight adaptations in birds
- Function of radula
- Poisonous and non poisonous snakes in south India
- Compare bony and cartilaginous fish
- Types of caudal fins

Unit - V Locomotion and Reproduction

ఈ యూనిట్ నుంచి ఎక్కువగా 2 మార్కులు, 4 మార్కుల ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఇందులోంచి కచ్చితంగా ప్రాక్టీస్ చేయాల్సిన అంశాలు కొన్ని ఉన్నాయి. అవి..

- Conjugation in ciliates
- T.S. of flagellum
- Longitudinal binary fission in euglena
- Lateral Appendages
- Kinety
- Amoeboid Locomotion
- Types of Flagella

Unit - VI Biology in Human Welfare

దీని నుంచి 2 మార్కులు, 4 మార్కులు, 8 మార్కుల ప్రశ్నలు కూడా వచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఇందులోంచి కచ్చితంగా నేర్చుకోవాల్సిన అంశాలు తెలుసుకుందాం...

- Life cycle of Plasmodium vivax
- Incubation period
- Life cycle of Ascari's lumbricoides
- Life cycle of Entamoeba histolytica
- Circadian rhythms
- Hyperparasite
- Parasitic castration

Unit - VII Cockroach

ఈ యూనిట్ నుంచి ఎక్కువగా 4 మార్కులు, 8 మార్కుల ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంది. ఇందులో ముఖ్యమైన అంశాలు....

- Respiratory system of Cockroach and its diagram
- Structure and diagram of ommatidium
- Blood circulatory system of periplaneta
- diagram of mouth parts of Cockroach
- Digestive system of Cockroach
- Female reproductive system of Cockroach

Unit - VIII Ecology and Environment

ఈ యూనిట్ నుంచి ఎక్కువగా 2 మార్కులు, 4 మార్కులు, 8 మార్కుల ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంది.



విద్యార్థులు కింది అంశాలను తప్పనిసరిగా నేర్చుకోవాలి...

- Lentic and lotic Ecosystem
- Significance of DFC, GFC
- Major air pollutants and their effects
- Causes, effects, control of global warming
- Various zones of eco ecosystem
- Advantages of UV-rays
- Green House effect
- Different types of food chains
- Adaptations of animals living in freshwater and marine water


ఎ. శ్రీనివాసరావు
సీనియర్ అధ్యాపకులు

డల్లాస్ కంపెనీలో శ్రీ కేపిటల్ పెట్టుబడి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి): అమెరికాలోని డల్లాస్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న కృత్రిమ మేధ (ఏఐ) రంగంలోని స్టార్టప్ కంపెనీ ఎడ్జ్‌టెన్సర్‌లో శ్రీ కేపిటల్ పెట్టుబడులు పెట్టింది. పెట్టుబడి వివరాలను మాత్రం బయటకు వెల్లడించలేదు. ఎడ్జ్‌టెన్సర్‌కు బెంగళూరులో అభివృద్ధి కేంద్రం ఉంది. దీన్ని రాజేశ్ నరసింహ, సౌమిత్రి జె రాయ్ కలిసి నెలకొల్పారు. మాస్ మార్కెట్‌కు ఆమోదయోగ్యమైన వ్యయంతో ఎడ్జ్ ఆధారిత ఏఐ సొల్యూషన్లను అభివృద్ధి చేయడంపై ఈ కంపెనీ దృష్టి పెట్టింది. ఆమోదయోగ్యమైన ధరల ఏఐ సొల్యూషన్ల మార్కెట్‌లో ఎడ్జ్‌టెన్సర్ కీలక పాత్ర పోషించగలదని భావిస్తున్నామని శ్రీ కేపిటల్ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ పార్టనర్ శశి రెడ్డి తెలిపారు.

మార్కెట్‌కు మంచిదే!

2019పై మిరే అసెట్ గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్స్ సీఈఓ స్వరూప్ మొహంతి

వినియోగ, వాహన రంగ కంపెనీలకు బాగుంటుంది

ఎన్నికల సమయంలో వృద్ధి పుంజుకుంటుంది

హైదరాబాద్, ఆంధ్రజ్యోతి బిజినెస్

మార్కెట్‌లో ఒడిదుడుకులు ఉన్నప్పుడే పెట్టుబడులకు మంచి అవకాశం. మదుపర్లు సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రణాళిక (సిప్)ను కొనసాగించాలి. పెట్టుబడులకు 2019 బాగా ఉండే అవకాశాలు ఉన్నాయని మిరే అసెట్ గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్స్ (ఇండియా) ముఖ్య కార్య నిర్వహణ అధికారి (సీఈఓ) స్వరూప్ మొహంతి తెలిపారు. దేశంలో వ్యవస్థాపూర్వకమైన వృద్ధి కొనసాగుతుందని, ప్రపంచవ్యాప్తంగా 35 సంవత్సరాల లోపు వయసున్న జనాభాలో 65 శాతం మంది భారత్‌లోనే ఉన్నారని వివరించారు. భారత్‌కు ఇది ఎంతో అనుకూల అంశం. పెట్టుబడులన్నీ ఇక్కడికే వస్తాయని, మరెక్కడా లేని వ్యాపార స్వేచ్ఛ భారత్‌లో ఉందన్నారు. గతంలో మార్కెట్ పడిపోతే 60 శాతానికి పైగా మదుపర్లు సిప్‌ను నిలిపివేసే వారని.. ఇప్పుడు అటువంటి పరిస్థితులు లేవని వివరించారు. మిరే అసెట్ మ్యూచువల్ ఫండ్ కంపెనీ రూ.23,500 కోట్ల ఆస్తులను (ఏయూఎం) నిర్వహిస్తోంది. ఇందులో ఇండియా ఈక్విటీ ఫండ్ కిందే రూ.10 వేల కోట్ల ఆస్తులను నిర్వహిస్తున్నట్లు మొహంతి తెలిపారు. మార్కెట్‌పై ఆయన ఏమన్నారంటే..

- 2019లో స్థూల ఆర్థిక పరిస్థితులు స్థిరంగా ఉండొచ్చు. ప్రపంచ వృద్ధి రేటు కొద్దిగా మందగించినా.. పదేళ్ల సగటు కన్నా ఎక్కువగానే ఉంది. భారత్‌లో 7 శాతం పైన వృద్ధి రేటు కొనసాగుతోంది. దీర్ఘకాల ప్రాతిపదికన దేశంలోని అనుకూల జనాభా పరిణామాలు వృద్ధికి మద్దతుగా నిలవనున్నాయి.
- ఇటీవల తగ్గిన ముడి చమురు ధరలు భారత కరెంట్ ఖాతా లోటు (సీఏడీ)పై ఒత్తిడిని తగ్గించనుంది. దీని వల్ల డాలరుతో రూపాయి మారకపు విలువ పెరగొచ్చు. 2018 అక్టోబరులో అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధర 36 శాతం పెరిగింది. నాలుగేళ్ల గరిష్ఠ స్థాయి 86 డాలర్లకు చేరింది . అంతర్జాతీయంగా డిమాండ్ తగ్గుతుందన్న భయం తో ఆ తర్వాత 40 శాతం తగ్గింది. ముడి చమురు సరఫరా పెరగడం.. గిరాకీ మందగించడం వల్ల 2019లో ముడి చమురు ధరలు తక్కువగానే ఉండొచ్చని అంచనా.
- 2018లో తగ్గిన రూపాయి మారకపు విలువ 2019లో ఒక శ్రేణి మధ్య కదలాడే అవకాశం ఉంది. అమెరికా ఫెడ్ పరిమాణాత్మక నిబంధనలు కఠినం చేయడం.. విదేశీ సంస్థాగత మదుపర్లు పెట్టుబడులను వెనక్కి తీసుకోవడం, అధిక ముడి చమురు ధరలు, వర్ధమాన దేశాల కరెన్సీలు బలహీన పడడం 2018లో రూపాయి క్షీణతకు కారణం అయ్యాయి. ప్రధానంగా రిటైల్ ద్రవ్యోల్బణం, చమురు ధరలు, అంతర్జాతీయంగా మదుపు సాధనాలు ఇస్తున్న ప్రతిఫలాలపై 2019లో రూపాయి మారకపు విలువ ఆధారపడి ఉంది.
- ఏప్రిల్ లేదా మేలో జరిగే లోక్‌సభ ఎన్నికలపై ప్రపంచ మదుపర్లు దృష్టి సారించనున్నారు. గతంలో జరిగిన ఎన్నికలను పరిశీలిస్తే.. ఎన్నికల సమయంలో వృద్ధి పుంజుకుంది.
- గత ఏడాదిలో మార్కెట్‌కు ఎదురు గాలులుగా నిలిచిన స్థూల ఆర్థిక అంశాలు ఈ ఏడాదిలో సానుకూల పవనాలుగా మారడానికి వీలుంది.
- అంతర్జాతీయంగా, దేశీయంగా కొన్ని ప్రతికూల పరిణామాలు చోటు చేసుకున్నా.. 2019లో కంపెనీల ఎర్నింగ్‌లు పుంజుకోవచ్చని భావిస్తున్నాం.
- రిటైల్ ద్రవ్యోల్బణం 2018 ప్రారంభంలో 5.07 శాతం ఉంది. 2018 నవంబరులో 2.33 శాతానికి పరిమితమైంది. ఆహార వస్తువుల ధరలు నియంత్రణలో ఉన్నందున రి టైల్ ద్రవ్యోల్బణం అదుపులోనే ఉండే అవకాశం ఉంది.
- మధ్య కాలానికి జీఎస్‌టీ, ఐబీసీ చట్టం అమలు ప్రభావాలు సానుకూల ప్రభావాన్ని చూపొచ్చు. అయితే.. నెలకు జీఎస్‌టీ పన్ను వసూళ్లు స్థిరంగా రూ.లక్ష కోట్లపైనే ఉండడం మార్కెట్‌కు కీలకం. మౌలిక సదుపాయాలపై చేస్తున్న ఖర్చు, రైతులకు నగదు బదిలీ మొదలైన అంశాలు కూడా ఆర్థిక వ్యవస్థలో వినియోగం పెరగడానికి దోహదం చేయనున్నాయి.
- ముడి చమురు ధర బ్యారెల్‌కు 70 డాలర్లు మించి కొనసాగితే మాత్రం ఆర్థిక వ్యవస్థకు ఇబ్బందే.
- అమెరికా, చైనాల మధ్య వాణిజ్య యుద్ధం వర్ధమాన మార్కెట్ల కరెన్సీలపై ప్రభావం చూపే వీలుంది.
- వినియోగ, వాహన రంగ కంపెనీలు, బ్యాంకింగ్, ఫైనాన్షియల్ రంగాలకు చెందిన కంపెనీల షేర్లకు మార్కెట్‌లో మద్దతు లభించే వీలుంది. ఐటీ, ఫార్మా, ఆరోగ్య సంరక్షణ రంగాలకు చెందిన షేర్లు పెద్దగా ఆకర్షణీయంగా ఉండకపోవచ్చు.



హైదరాబాద్ మార్కెట్ కీలకం..

మిరే హైదరాబాద్ శాఖ నుంచి మిరే మ్యూచువల్ ఫండ్‌లలో మదుపర్లు రూ.728 కోట్ల పెట్టుబడులు పెట్టారు. హైదరాబాద్ శాఖ కంపెనీకి కీలకమైందని, కంపెనీ నిర్వహిస్తున్న ఆస్తుల్లో హైదరాబాద్ వాటా 2018, డిసెంబరు చివరకు రూ.728 కోట్లు ఉందని మొహంతి తెలిపారు. 2017 చివరి నాటికి ఈ ఆస్తులు రూ.450 కోట్లు మాత్రమే నన్నారు. ఇక్కడి నుంచి 55,000 ఇన్వెస్టర్ ఫోలియోలు ఉండగా.. 30,000 సిప్ ఫోలియోలేనన్నారు. కంపెనీ నిర్వహిస్తున్న మొత్తం ఆస్తులు ప్రస్తుతమున్న రూ.23,500 కోట్ల నుంచి 2019లో రూ.40,000 కోట్లకు చేరగలవని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. హైదరాబాద్ శాఖ ఏయూఎం రూ.1,000 కోట్లకు చేరగలదన్నారు.

రెనో ఇండియా అధిపతి మామిళ్లపల్లి వెంకట్రామ్



న్యూఢిల్లీ: మామిళ్లపల్లి వెంకట్రామ్‌ను రెనో ఇండియా ఎండీగా నియమిస్తున్నట్టు ఫ్రాన్స్‌కు చెందిన ఆటోమొబైల్ దిగ్గజం 'రెనో గ్రూప్' ప్రకటించింది. వచ్చే నెల 1 నుంచి ఈ నియామకం అమలులోకి వస్తుంది. ఆటోమొబైల్ రంగంలో విస్తృత అనుభవం ఉన్న వెంకట్రామ్ ప్రస్తుతం రెనో గ్రూప్ రష్యా వ్యవహారాలు చూస్తున్నారు. మధురై కామరాజ్ యూనివర్సిటీ నుంచి మెకానికల్ ఇంజినీరింగ్ పట్టభద్రుడైన వెంకట్రామ్, రెనో గ్రూప్‌లో చేరక ముందు టాటా మోటార్స్, జనరల్ మోటార్స్ కొరియా, జనరల్ మోటార్స్ ఇండియా, లంబోర్ఘినీ, డెల్ఫీ ఇండియా, ఐషర్ ట్రాక్టర్స్ వంటి పలు ఆటోమొబైల్ సంస్థల్లో పని చేశారు. ఇప్పటి వరకు రెనో ఇండియా ఎండీగా ఉన్న సుమిత్ సహానీ, రెనో గ్రూప్ ఆఫ్రికా, మిడిల్ ఈస్ట్ ఇండియా ప్రాంత ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడిగా కొనసాగుతారు. త్వరలోనే ఆయన చేపట్టే కొత్త పదవిని ప్రకటిస్తామని రెనో గ్రూప్ తెలిపింది.

24 గంటల్లో పన్ను రిఫండ్!

రెండేళ్లలో అందుబాటులోకి: పాండే

న్యూఢిల్లీ: మరో రెండేళ్లలో అన్ని రిటర్నులను 24 గంటల్లో ప్రాసెస్ చేయడంతో పాటు రిఫండ్‌ను సైతం జారీ చేసే వ్యవస్థను ప్రవేశపెట్టనున్నట్లు రెవెన్యూ కార్యదర్శి అజయ్ భూషణ్ పాండే తెలిపారు. ఇందుకు అనుగుణంగా ప్రత్యక్ష పన్నుల కేంద్ర బోర్డు (సీబీడీటీ) ఐటీ వ్యవస్థను ఆధునికీకరించేందుకు గత నెలలో కేంద్ర ప్రభుత్వం రూ.4,200 కోట్లు మంజూరు చేసిందన్నారు. ఈ ఏడాదిలో రూ.1.50 లక్షల కోట్ల విలువైన రిఫండ్లను నేరుగా పన్ను చెల్లింపుదారుల బ్యాంక్ ఖాతాలో జమ చేయడం జరిగిందని పాండే చెప్పారు. ఐటీ డిపార్ట్‌మెంట్ సేవలిప్పుడు ఆన్‌లైన్ ద్వారానూ జరుగుతున్నాయని మధ్యంతర బడ్జెట్ ప్రసంగంలో తాత్కాలిక ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు.

'స్మార్ట్' స్టార్టప్‌లకు ఒప్పో సహకారం

తెలంగాణ ప్రభుత్వంతో ఒప్పందం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో స్టార్టప్ సంస్కృతిని పెంచేందుకు, స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు స్మార్ట్‌ఫోన్ల తయారీ సంస్థ ఒప్పో..రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. ఒప్పందంలో భాగంగా స్మార్ట్‌ఫోన్ సంబంధిత పరిజ్ఞానానికి సంబంధించిన రంగాల్లో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు సహాయం అందించనుంది. కెమెరా, ఇమేజ్ ప్రాసెసింగ్, బ్యాటరీ, 5జీ నెట్‌వర్క్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), గేమింగ్ రంగాల్లోని సమస్యల పరిష్కారానికి సంబంధించి అప్లికేషన్స్, టెక్నాలజీ, సేవలు అందించే స్టార్టప్‌లను తాము గుర్తించి ప్రోత్సహిస్తామని ఒప్పో భారత ఉపాధ్యక్షుడు తస్లీమ్ ఆరిఫ్ పేర్కొన్నారు.



నానో కనుమరుగు!

జనవరిలో ఉత్పత్తి లేదు, అమ్మకాలు లేవు

న్యూఢిల్లీ: రతన్ టాటా కలల కారు 'నానో' త్వరలో చరిత్రగా మిగలనుంది. ఈ సంవత్సరం జనవరిలో గుజరాత్‌లోని సనంద్ దగ్గర ఉన్న టాటా మోటార్స్ ప్లాంట్‌లో ఒక్క 'నానో' కారు కూడా ఉత్పత్తి కాలేదు. అలాగే దేశంలో ఎక్కడా ఒక్క 'నానో' కారు అమ్ముడు పోలేదు. ఎగుమతులదీ ఇదే పరిస్థితి. గత ఏడాది ఇదే సమయంలో కంపెనీ 83 నానో కార్లు ఉత్పత్తి చేసి, 62 కార్లను విక్రయించింది. టాటా మోటార్స్ సంస్థ మంగళవారం రెగ్యులేటరీ సంస్థలకు ఈ విషయం తెలిపింది. నిజానికి వచ్చే ఏడాది ఏప్రిల్ నుంచి ఈ కార్ల ఉత్పత్తి నిలిపి వేయాలని, టాటా మోటార్స్ నిర్ణయించింది. ప్రస్తుత నానో కారు, కొత్తగా అమలులోకి వస్తున్న బీఎస్-6 ప్రామాణిక కాలుష్య నిబంధనలు, భద్రతా నిబంధనలకు అనుగుణంగా లేదు. అందుకు అనుగుణంగా తీర్చిదిద్దాలంటే మరింత ఖర్చు చేయాలి. చేసినా, కొనుగోలుదారుల ఆదరణను చూరగొంటుందో లేదో నమ్మకం లేదు. దీంతో వచ్చే ఏడాది ఏప్రిల్ నుంచి 'నానో' కార్ల ఉత్పత్తి నిలిపి వేయాలని నిర్ణయించింది. అయితే ఈ లోపే మార్కెట్లో అమ్మకాలు జీరో స్థాయికి పడిపోవడంతో వచ్చే ఏడాది మార్చి కంటే ముందే, 'నానో' కారు చరిత్ర చరిత్రగా మిగిలి పోతుందని భావిస్తున్నారు. కంపెనీ అధికార వర్గాలు మాత్రం దీనిపై ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదని చెబుతున్నాయి. డిమాండ్‌ను బట్టి నానో కార్ల ఉత్పత్తి ఉంటుందని కంపెనీ అధికార ప్రతినిధి ఒకరు చెప్పారు. సామాన్య మధ్య తరగతి ప్రజలకు కూడా రూ.లక్షకే కారు అందించాలనే రతన్ టాటా సంకల్పంతో, టాటా మోటార్స్ కంపెనీ 'నానో' కారును అభివృద్ధి చేసింది. జనవరి, 2008లో ఢిల్లీలో జరిగిన ఆటో షోలో ఈ కారును మొదటిసారిగా ప్రదర్శించారు. ఆ మరుసటి సంవత్సరం మార్చి నుంచి 'నానో' కార్ల అమ్మకాలు ప్రారంభమయ్యాయి. అయితే అప్పటికే ఉత్పత్తి ఖర్చులు పెరిగి పోయాయి. అయినా 'నా వాగ్దానం వాగ్దానమే' అని రతన్ టాటా స్పష్టం చేయడంతో టాటా మోటార్స్ 'నానో' బేసిక్ మోడల్‌ను లక్ష రూపాయలకే అందించింది. నానో కారు ప్రాజెక్టు ప్రారంభం నుంచే అనేక సమస్యలు ఎదుర్కొంది. నిజానికి టాటా మోటార్స్ ఈ కారును పశ్చిమ బెంగాల్‌లోని నందిగామ్ దగ్గర ఉత్పత్తి చేయాలనుకుంది. అందుకు అవసరమైన భూమిని అప్పటి వామపక్ష ప్రభుత్వం కంపెనీకి కేటాయించింది. అయితే రైతుల నుంచి బలవంతంగా ఈ భూములు సేకరించడాన్ని వ్యతిరేకిస్తూ టీఎంసీ నాయకత్వంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చెలరేగాయి. దాంతో కంపెనీ ఈ ప్లాంట్‌న గుజరాత్‌లోని సనంద్‌కు తరలించింది.

తానే ప్రభువునని మోదీ అనుకుంటున్నారు

ఆయనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత.. 3 రాష్ట్రాల ఎన్నికల ఫలితాలే రుజువు

- అంతర్లీనంగా కోపం.. బయటపడలేదు
- బీజేపీనే ఆయన్ను పక్కకు పెట్టాలనుకుంటోంది
- రాఫెల్ డీల్.. మోదీ చేయించిన 'బైపాస్' సర్జరీ
- ఇందిరతో మోదీని పోల్చడమా!
- రామమందిరంపై సుప్రీం తీర్పును గౌరవిస్తాం
- మోదీ ఓటమే లక్ష్యం.. ప్రధానిని తర్వాత తేలుస్తాం
- హిందుస్థాన్ టైమ్స్ ఇంటర్వ్యూలో రాహుల్

"మోదీ ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతకు ఇటీవలి ఎన్నికల ఫలితాలు కేవలం నమూనా మాత్రమే. ప్రధాని మోదీపై ప్రజల్లో అంతర్లీనంగా కోపం ఉంది. కాకపోతే ప్రస్తుతానికి అది పూర్తిగా పైకి కనిపించట్లేదుగానీ.. తెలుస్తోంది" అని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ 'హిందుస్థాన్ టైమ్స్'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో అన్నారు. ముఖ్యాంశాలు..

రైతులను అవమానించడమే!

కిసాన్ సమ్మాన్ నిధి పేరుతో.. రైతు కుటుంబానికి రోజుకు 17 రూపాయల చొప్పున ఇవ్వడమంటే అవమానించడమే. మోదీ సర్కారు ఇప్పుడు ఏమీ దిక్కుతోచని పరిస్థితిలో ఉంది. అందుకే ఆదరాబాదరాగా ఈ తాత్కాలిక ఉపశమన చర్యలను ప్రకటిస్తోంది. కానీ, ఇవేవీ పనిచేయవు. మోదీ ఈ బడ్జెట్‌లో రైతుల కోసం చేసినదానికన్నా.. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ప్రకటించిన రుణమాఫీ ఎక్కువగా పనిచేసింది. ప్రధాని మోదీ తన 20-25 మంది ఆశ్రితులకు సంబంధించి రూ.3.5 లక్షల కోట్ల బ్యాంకు రుణాలను మాఫీ చేశారు. కాబట్టి రైతు రుణమాఫీ కూడా న్యాయమైనదే. అనిల్ అంబానీ రుణాన్ని మాఫీ చేసినప్పుడు.. రైతుల రుణాలను మాఫీ చేయడం ద్వారా వారికెందుకు సాయం చేయరు? ప్రస్తుతం దేశంలో నెలకొన్న వ్యవసాయ సంక్షోభం.. మోదీ ప్రభుత్వ వైఖరివల్ల ఏర్పడిందే. మోదీ సర్కారు మన రైతులను అప్పుగా చూస్తుంది. మనదేశంలో రెండో హరిత విప్లవం పూర్తిగా సాధ్యమే. దానికి ఏం చేయాలంటే.. మౌలిక సదుపాయాలను కల్పించాలి, ఆహార శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయాలి, రైతులకు తమ పంటను మార్కెట్లకు తీసుకెళ్లడానికి అవసరమయ్యే రవాణా సౌకర్యం కల్పించాలి. కానీ, ఈ రోజు అది జరగట్లేదు. పంట బీమాతో లాభాలు పొందడానికి జిల్లాలకు జిల్లాలనే కార్పొరేట్లకు కట్టబెడుతున్నారు. పంట బీమా రైతులకే ప్రయోజనం చేకూర్చాలన్న మౌలిక నిబంధనకు విరుద్ధమిది. మోదీ ప్రభుత్వం జమ్ము కశ్మీర్‌లో ఈ బీమాను అనిల్ అంబానీ కంపెనీ చేతిలో పెట్టింది. దేశ ఆస్తులను, సంపదను 20-30 మంది ఆశ్రితులకు క్రమానుగతంగా అప్పజెప్పే ప్రక్రియ ఇది. రక్షణ, వ్యవసాయం.. ఇలా అన్ని రంగాల్లోనూ ఇదే జరుగుతోంది.

వ్యవసాయంపై కాంగ్రెస్ ప్రణాళికలు

ఎవరైనా సంక్షోభంలో ఉన్నప్పుడు వారికి సాయం చేయాలి. అందుకోసం ఒక ప్రణాళిక ఉండాలి. అంతే తప్ప.. ప్రతిపక్షాలు ప్రశ్నించినప్పుడు చర్యలు తీసుకుని, ఆ తర్వాత పట్టించుకోకుండా వదిలేసే వైఖరి ఉండకూడదు. దేశంలో వ్యవసాయరంగానికి సంబంధించి ప్రభుత్వ వైఫల్యాలపై మేం ప్రశ్నించేంత వరకూ మోదీ నిద్రపోతున్నారు. భారతదేశానికి వ్యవసాయంతో భావోద్వేగ బంధం ఉంది. రైతుల బాధను, వారికొచ్చే విపత్తులకు మనందరం స్పందిస్తాం. వ్యవసాయం గురించి పెద్దగా పట్టించుకోవాల్సిన అవసరం లేదని మోదీ భావిస్తూ ఉండొచ్చు. కానీ మేం అలా కాదు. మా దృష్టిలో రైతులు ఆర్థిక నిర్మాణంలో భాగస్వాములు. సాగును మన ఆర్థికవ్యవస్థలో సమర్థంగా భాగం చేయాల్సిన అవసరం ఉంది. ప్రపంచీకరణ ఈ ప్రపంచాన్ని మార్చేసింది. మొదటి హరిత విప్లవం సమయంలో పాటించిన వ్యూహాలు ఇప్పుడు పనిచేయవు. మనదేశానికిప్పుడు ఒక మిశ్రమ వ్యూహం కావాలి. కానీ.. వ్యవసాయానికి సంబంధించి అయినా, మరే ఇతర రంగానికి సంబంధించి అయినా.. మిస్టర్ నరేంద్రమోదీ వద్ద ఎలాంటి వ్యూహాలూ లేవు. అదే సమస్య.

పెరుగుతున్న నిరుద్యోగం

దేశంలోని 15-20 మంది అతిపెద్ద పారిశ్రామికవేత్తల నుంచి మాత్రమే ప్రజలు ఉద్యోగాలు పొందట్లేదు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల సామర్థ్యాన్ని పెంచడం ద్వారా కూడా ఉద్యోగాలను సృష్టించవచ్చు. అలాగని పెద్ద పరిశ్రమలను నేను తక్కువ చేయట్లేదు. వాటి ప్రాధాన్యం వాటిదే. అదే సమయంలో.. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు కూడా బ్యాంకులు, విధానాలు అందుబాటులో ఉండాలి. అగ్రస్థానంలో ఉన్న 40 వ్యాపారాల ఎన్‌పీఏలు రూ.12 లక్షల కోట్లు ఎందుకున్నాయి? చిన్న, మధ్యతరహా పరిశ్రమల ఎన్‌పీఏలో అందులో కొంచెం మాత్రమే ఎందుకున్నాయి? అంటే.. పెద్ద కంపెనీలకు ఉన్న 'దారులు' వాటికి లేకపోవడమే కారణం.

కనీస ఆదాయపథకం

అదో విప్లవాత్మక ఆలోచన. దేశానికి దిశ. దేశంలోని అత్యంత బలహీనులైనవారిని కాపాడాలన్న మా నిబద్ధత. దీనిపై బాగా ఆలోచించి, క్రమంగా అమలు చేస్తాం. దీనిపై ఇప్పటికే ఆరునెలలుగా కృషి చేస్తున్నాం. మరిన్ని చర్చలు జరిపి.. సమర్థంగా అమలయ్యేలా ఒక విధానాన్ని రూపొందిస్తాం. 'అందులో భాగంగా.. మోదీ రైతులకు ప్రకటించిన 6000 కంటే ఎక్కువిస్తారా' అంటే.. సూత్రప్రాయంగా దీన్ని మేం ప్రతిపాదించాం. దీనిపై నిపుణులు కూలంకషంగా పరిశీలించి ఎలా చేయాలో చెబుతారు. ప్రస్తుతం ఉన్న పథకాలను, గ్రామీణ ఉపాధి హామీని కొనసాగిస్తూనే కనీస ఆదాయపథకాన్ని అమలు చేస్తాం.

మోదీని పక్కన పెట్టే రోజు దగ్గర్లోనే..

'మాకు మోదీ ఉన్నారు.. మరి ప్రతిపక్షాలకు ఎవరున్నారు' అని బీజేపీ అడుగుతోంది. కానీ, గడ్కరీ, సుష్మాస్వరాజ్, రాజ్‌నాథ్ సింగ్.. ఇంకా బీజేపీలోని అందరు నాయకులను అడిగి చూడండి. నరేంద్రమోదీ తరహా పనితీరుకు వారి నుంచి తిరస్కారం ఎదురైతే నేను ఆశ్చర్యపోను. అంటే.. నిజంగా విభేదాలు బీజేపీలోనే ఉన్నాయి. మోదీకి అర్థంకాని విషయమేంటంటే.. మొత్తం పార్టీ ఆయన్ను పక్కకు పెట్టడానికి వేచి చూస్తోంది. అలాగే.. నా పదిహేనేళ్ల రాజకీయ కెరీర్‌లో.. ఇంత ఐకమత్యంతో ఉన్న ప్రతిపక్షాన్ని నేను చూడలేదు. ఉదాహరణకు.. మాతో తీవ్రంగా పోరాడిన చంద్రబాబునాయుడు ఇప్పుడు మాతో కలిసి పనిచేస్తున్నారు.

బెంగాల్‌లో సంఘర్షణ

ప్రస్తుతం దేశంలోని ప్రతి వ్యవస్థా మోదీ నిరంకుశత్వాన్ని ఎదుర్కొంటోంది. అచ్చం బ్రిటిషర్లలాగా... మోదీ తనను తాను భారతదేశానికి ప్రభువుగా భావించుకుంటున్నారు. మేం అలా పనిచేయం. మేం ప్రభుత్వంలో ఉన్నాం, ప్రతిపక్షంలోనూ ఉన్నాం. వ్యవస్థలను తాకకూడదు, భారత సమాఖ్య వ్యవస్థపై దాడి చేయకూడదన్న సిద్ధాంతం మాది. వ్యవస్థలు మన దేశానికి ఆత్మవంటివి. వాటిని కాపాడాలి. మోదీ దేశానికన్నా ఎక్కువ కాదు. ఎవ్వరికన్నా, దేనికన్నా కూడా ఎక్కువ భారతదేశమే. రాజకీయంగా పోరాడాలనుకుంటే పోరాడాలి తప్ప.. న్యాయమూర్తిలా మారకూడదు. అది రాజ్యాంగాన్ని, దేశాన్ని సవాల్ చేయడమే. అది దేశవ్యతిరేకం.

ఇందిరతో మోదీకి పోలికా?

అది (ఇందిరాగాంధీతో మోదీని పోల్చడం) ఇందిరాజీని పూర్తిగా అవమానించడమే. మా నానమ్మ తీసుకున్న నిర్ణయాలు ప్రేమ, ఆప్యాతల నుంచి వచ్చినవి. ఆమె పేదల కోసం పనిచేశారు. ప్రజలతో కలిసి పనిచేశారు. ఆమె తీరుతెన్నులు అందరినీ ఏకం చేసేలా ఉండేవి. అదే మోదీ నిర్ణయాలు.. కోపం, ద్వేషం నుంచి వస్తాయి. ఆయన నిర్ణయాలు దేశాన్ని విభజిస్తాయి. పేదలు, బలహీనుల పట్ల ఆయనకు ఎలాంటి సహానుభూతీ లేదు.

ప్రియాంక రాజకీయ భవిష్యత్తు

పార్టీ జనరల్ సెక్రటరీగా ఆమెకు జాతీయ స్థాయిలో పాత్ర ఉంది. ఇచ్చిన పాత్రను విజయవంతంగా నిర్వర్తించేలా పార్టీని తీర్చిదిద్దుతున్నాను. నేనిచ్చిన విధిని విజయవంతంగా నిర్వ



ర్తిస్తే దాని ఆధారంగా మరో విధిని నిర్దేశిస్తాను.

రామమందిరం

కాంగ్రెస్ పార్టీకి దేశ వ్యవస్థలపైన, న్యాయప్రక్రియపైన గౌరవం ఉంది. ఈ అంశం కోర్టు పరిధిలో ఉన్నందున నేను నిర్ణయం చెప్పడం సబబు కాదు. ఈ విషయంలో మాకు పూర్తి స్పష్టత ఉంది. సుప్రీంకోర్టు ఏం చెబుతుందో దాన్నే కాంగ్రెస్ సహా అందరూ అంగీకరించాలి.

2014తో పోలిస్తే పుంజుకున్న పార్టీ

దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ పుంజుకోని ఒక్క రాష్ట్రం కూడా నాకు కనిపించట్లేదు. ఈశాన్య రాష్ట్రాల్లో, ఒడిశాలో, కర్ణాటకలో, మహారాష్ట్రలో, ఉత్తరాదిన.. యూపీ, బిహార్‌లో అన్ని చోట్లా మేం పుంజుకుంటాం. దేశ ప్రజల్లో మోదీపై అంతర్లీనంగా ఒక కోపం ఉంది. పూర్తిగా పైకి కనపడకపోయినా.. కోపమైతే ఉంది. నోట్ల రద్దు, జీఎస్టీ ద్వారా, రైతులను విస్మరించడం ద్వారా, ఆర్థిక వ్యవస్థను నాశనం చేయడం ద్వారా దేశానికి.. ప్రత్యేకించి పేదలకు మోదీ కలిగించిన బాధ ఇందుకు కారణం. ఇటీవల జరిగిన ఎన్నికల్లో మూడు రాష్ట్రాల్లో కనిపించింది ఆ ప్రతిక్రియే.

మోదీ ఓటమి తర్వాతే..

కాంగ్రెస్ కన్నా విపక్షాలకు ఎక్కువ సీట్లు వస్తే ప్రాంతీయ పార్టీ నాయకుడికి లేదా కాంగ్రెస్‌లోనే మరో నేతకు మద్దతిస్తారా? అంటే.. దీనిపై ప్రతిపక్షాలన్నీ కలిసి చర్చించాం. ఆరెస్సెస్-బీజేపీ ఓటమి, దేశ రాజ్యాంగ విలువలను కాపాడటమే మా ప్రధాన లక్ష్యం. దాన్ని సాధించాక.. ప్రధాని అనేది ఎవరో మాలో మేం చర్చించుకుని నిర్ణయించుకుంటాం.

రాఫెల్.. కుంభకోణం

రాఫెల్‌తో కొత్తగా ఒప్పందం కుదుర్చుకోవడంలో కీలకపాత్ర కేవలం మోదీదే. దీంట్లో నాటి రక్షణ మంత్రి మనోహర్ పర్రీకర్‌కు ఏ సంబంధం లేదు. అది మోదీ నిర్వహించిన 'బైపాస్ సర్జరీ'. వైమానికదళం, రక్షణ శాఖ, ఆర్థిక శాఖ.. అన్నిటినీ బైపాస్ చేశారాయన. యూపీఏ హయాంలో రూ.526 కోట్లకు బేరమాడిన విమానాన్ని రూ.1600 కోట్లకు కొన్నారు. ఇది దసో వార్షిక నివేదికలో కనిపిస్తున్న వాస్తవం.

నేరమని తెలిసీ చేశారు

129 మంది విద్యార్థులపై అమెరికా అభియోగం

భారత్ నిరసనకు సమాధానం

వాషింగ్టన్, ఫిబ్రవరి 5: పే అండ్ స్టే రాకెట్‌లో అరెస్టయిన 129 మంది భారతీయ విద్యార్థులకూ తాము చేస్తున్నది నేరమని ముందే తెలుసునని, అన్నీ తెలిసే ఉద్దేశపూర్వకంగా ఈ నేరానికి వారు పాల్పడ్డారని డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం ఆరోపించింది. "ఫార్మింగ్‌టన్ విశ్వవిద్యాలయంలో లెక్చరర్లు ఉండరు, క్లాసులుండవు అని వారికి ముందే తెలుసు. ఆన్‌లైన్‌లో గానీ, వ్యక్తిగతంగా కానీ ఎలాంటి క్లాసులకూ హాజరవ్వాల్సిన పనిలేదని వారికి తెలుసు. ఈ విషయం ఆ వర్సిటీ వెబ్‌సైట్లో రాసే ఉంది. అయినప్పటికీ చట్టవిరుద్ధంగా అమెరికాలో ఉండిపోవాలన్న కాంక్షతో వారీ పనికి ఒడిగట్టారు" అని అమెరికా విదేశాంగ శాఖ ఓ ప్రకటనలో పేర్కొంది. విద్యార్థుల నిర్బంధంపై భారత ప్రభుత్వం దౌత్యపరమైన నిరసన (డీమార్ష్) వ్యక్తం చేసిన రెండ్రోజులకు అమెరికా దానిపై ఈ విధంగా స్పందించింది. "భారత-అమెరికా స్టూడెంట్ ఎక్స్ఛేంజి ప్రోగ్రామ్‌లో ఇది ఓ అసాధారణ పరిణామం. ఓ దురదృష్టకర అంకం. మేం భారతీయ విద్యార్థులను చాలా విలువైన ఆస్తిగా పరిగణిస్తాం. అమెరికా పురోగతిలో, విశ్వవిద్యాలయాల్లో, ఆర్థిక వ్యవస్థలో వారి పాత్ర ఎంతో ఉంది. ఏటా దాదాపు 10 లక్షల మంది భారతీయ విద్యార్థులు అమెరికా విద్యాసంస్థల్లో, పరిశోధనశాలల్లో చేరుతున్నారు. నిరుడు1,96,000 మంది విద్యార్థులు వచ్చారు. వారి వల్ల మా ఆర్థికవ్యవస్థకు దాదాపు 600 కోట్ల డాలర్ల ఆదాయం సమకూరుతోంది. మోసం అనేది చాలా అరుదుగా జరుగుతోంది. వీసా మోసం ఘటనలు చాలా తక్కువ. దీన్ని చూసి మొత్తం స్టూడెంట్ ప్రోగ్రామ్‌ను తప్పుబట్టడం సరికాదు" అని విదేశాంగ శాఖ పేర్కొంది.

ఒకరికి బెయిలు

ఫార్మింగ్‌టన్ విశ్వవిద్యాలయంలో విద్యార్థులను చేర్పించి మోసం చేసిన ఆరోపణలపై అరెస్టయిన ఎనిమిది మంది విద్యార్థులను మంగళవారం నాడు మిచిగన్ కోర్టులో హాజరుపరిచారు. తాము నేరానికి పాల్పడలేదని వారంతా విన్నవించారు. అందులో ఒకరైన కర్నాటి ఫణిదీప్‌కు కోర్టు 10వేల డాలర్ల పూచీకత్తుపై బెయిల్ మంజూరు చేసింది. మిగిలిన ఏడుగురు- కాకిరెడ్డి భరత్, కందాళ సురేష్, ప్రేమ్ రాంపీస, సామ సంతోష్, తక్కళ్లపల్లి అవినాష్, నూనె అశ్వంత్, ప్రత్తిపాటి నవీన్‌లు తమను నిర్బంధంలోనే ఉంచేందుకు సమ్మతి తెలిపారు. వీరి నేరం గనక రుజువైతే దాదాపు ఐదేళ్ల దాకా జైలుశిక్ష పడే అవకాశం ఉంది.

ఆంధ్రజ్యోతి

బిజినెస్

సెన్సెక్స్	నిఫ్టీ	బంగారం	వెండి (కిలో)	రూపాయి (ఒక డాలర్‌కు)	ముడి చమురు
34.07 ↑	22.10 ↑	25 ↓	205 ↑	23 పైసలు ↑	↓
36,616.81	10,934.35	33,350	40,315	71.57	62.12
		ముంబై 10 గ్రాములు (99.9 స్వచ్ఛత)			

విజయవాడ • బుధవారం 6 ఫిబ్రవరి 2019

andhrajyothibusiness@gmail.com

హెచ్‌పీసీఎల్ డివిడెండు 65%

న్యూఢిల్లీ:ప్రభుత్వ రంగ ఇంధన విక్రయ సంస్థ హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్) ఆర్థిక ఫలితాలు మార్కెట్ వర్గాలను నిరాశపర్చాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2018-19).. మూడో త్రైమాసికానికి (అక్టోబరు-డిసెంబరు) కంపెనీ లాభం 87 శాతం తగ్గి రూ.248 కోట్లకు పరిమితమైంది. ముడి చమురు ధరల తగ్గుదలతో ఏర్పడిన ఇన్వెంటరీ నష్టాలతో పాటు రిఫైనింగ్ మార్జిన్లు తగ్గడం ఇందుకు ప్రధాన కారణం. గత ఆర్థిక సంవత్సరం (2017-18)లో ఇదే త్రైమాసికానికి హెచ్‌పీసీఎల్ రూ.1,950 లాభం ప్రకటించగలిగింది. సమీక్షా కాలానికి కంపెనీ చమురు నిల్వలపై రూ.3,465 కోట్లు నష్టపోవాల్సి వచ్చిందని హెచ్‌పీసీఎల్ చైర్మన్, ఎండీ ముకేశ్ కే సురానా తెలిపారు. డిసెంబరుతో ముగిసిన మూడు నెలల్లో కంపెనీ విక్రయాలు రూ.76,884 కోట్లుగా నమోదయ్యాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి గాను షేర్‌హోల్డర్లకు ఒక్కో షేరుపై రూ.6.50 (65%) మధ్యంతర డివిడెండ్ చెల్లించనున్నట్లు కంపెనీ బోర్డు ప్రకటించింది.

మళ్లీ లాభాల్లోకి పీఎన్‌బీ

డిసెంబరు త్రైమాసికానికి రూ. 247 కోట్లు



న్యూఢిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) మూడు త్రైమాసికాల నష్టాల పరంపర నుంచి బయటపడి డిసెంబరు త్రైమాసికంలో తొలిసారిగా లాభాలు ప్రకటించింది. 2018 ఫిబ్రవరిలో బ్యాంకులో రూ.14 వేల కోట్ల నీరవ్ మోదీ కుంభకోణం బయటపడిన నాటి నుంచి వరుసగా నష్టాలు ప్రకటిస్తూనే వచ్చింది. ఈ ఏడాది మూడో త్రైమాసికంలో బ్యాంకు రూ.247 కోట్ల లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో ఆర్జించిన లాభం రూ.230.11 కోట్లతో పోల్చితే ఇది 7.12 శాతం అధికం. మొండి బకాయిలు (ఎన్‌పీఏ) తగ్గడం, రుణ బకాయిల వసూలులో వేగం పెరగడంతో బ్యాంకు తిరిగి పట్టాల పైకి వచ్చినట్టు బ్యాంకు ప్రకటించింది. బ్యాంకింగ్ కార్యకలాపాల ద్వారా లాభదాయకత పెరగడంతో పాటు ఆస్తుల నాణ్యత కూడా మెరుగుపడిందని, కుంభకోణంలో చిక్కుకున్న ఒక పద్దుకు కేటాయింపుల భారం సైతం తొలగిపోయిందని బ్యాంకు మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ సునీల్ మెహతా తెలిపారు. ఇంతకు ముందు మూడు వరుస త్రైమాసికాల్లో బ్యాంకు రూ.13,416.91 కోట్లు (2017-18 చివరి త్రైమాసికం), రూ.940 కోట్లు (ఈ ఏడాది మొదటి త్రైమాసికం), రూ.4532.35 కోట్లు (రెండో త్రైమాసికం) నష్టాలను ప్రకటించింది. గత ఏడాదితో పోల్చితే బ్యాంకు ఆదాయం 2.64 శాతం క్షీణించి రూ.14,854.24 కోట్లకు చేరింది. 2018 మార్చి చివరి నాటికి 18 శాతానికి చేరిన స్థూల ఎన్‌పీఏలను డిసెంబరు త్రైమాసికంలో 16.33 శాతానికి తగ్గించగలిగామని మెహతా అన్నారు. ఈ ఏడాది మార్చి చివరి నాటికి అవి మరో రెండు శాతం తగ్గి 14 శాతానికి దిగిరాగలవన్న ఆశాభావం ఆయన ప్రకటించారు. అయితే గత ఏడాది ఇదే త్రైమాసికంతో పోల్చితే మాత్రం స్థూల ఎన్‌పీఏలు 12.11 శాతం నుంచి 16.33 శాతానికి పెరిగాయి. నికర ఎన్‌పీఏలు కూడా 7.55 శాతం నుంచి 8.22 శాతానికి పెరిగాయి. రూపాయి విలువలో స్థూల ఎన్‌పీఏలు రూ.77,733.33 కోట్లు, నికర ఎన్‌పీఏలు రూ.35,675.12 కోట్లుగా ఉన్నాయి.

ఎన్‌పీఏలకు తగ్గిన కేటాయింపులు

డిసెంబరు త్రైమాసికంలో ఎన్‌పీఏలకు కేటాయింపులు రూ.2996.42 కోట్ల నుంచి రూ.2565.77 కోట్లకు తగ్గించుకోగలిగామని మెహతా చెప్పారు. ఇదే కాలంలో రూ.4,424 కోట్ల బకాయిలు రాబట్టామని ఆయన అన్నారు. అయితే రూ.3,324 కోట్లు కొత్తగా ఎన్‌పీఏలుగా నమోదయ్యాయి. బ్యాంకు ఎలాంటి ఆటుపోట్లనైనా తట్టుకోగల స్థితిలో ఉన్నదని, ప్రధానంగా వసూళ్లు పెంచడంతో పునరుజ్జీవం సాధ్యమైందన్నారు. రిస్క్‌తో కూడిన ఆస్తుల విలువ కూడా రూ.89 వేల కోట్ల కన్నా పైబడి తగ్గిందని తెలిపారు. ఎన్‌సీఎల్‌టీలో ఉన్న రుణ పరిష్కార కేసుల విషయం ప్రస్తావిస్తూ వాటికి కేటాయింపులు 75 శాతం మేరకు ఉన్నాయని, అన్ని ప్రధాన ఖాతాల నుంచి వసూళ్లు వేగం అందుకున్నాయని, నాలుగో త్రైమాసికంలో ఈ ఖాతాల నుంచి రూ.8,000 కోట్లు వసూలు చేయగలమని ఆశిస్తున్నామని ఆయన చెప్పారు.

దివాలా పరిష్కార ప్రక్రియలో ఉన్న ఎస్సార్ స్టీల్, భూషణ్ పవర్ అండ్ స్టీల్ రెండింటి నుంచే రూ.5000 కోట్ల నుంచి రూ.6000 కోట్లు రాబట్టగలమని భావిస్తున్నట్టు తెలిపారు. మంచి ఆఫర్ వస్తే తప్ప ఏ సంస్థలోనూ వాటాలు విక్రయించాల్సిన అవసరం లేదని మెహతా అన్నారు. గృహ రుణాల రంగంలోని పీఎన్‌బీ హౌసింగ్ ఫైనాన్స్‌లో 32.8 శాతం వాటాలను అమెరికాకు చెందిన కార్లైల్ గ్రూప్‌నకు విక్రయిస్తారన్న వార్తలపై స్పందించడానికి ఆయన నిరాకరించారు. ప్రస్తుతం ఆ పీఈ సంస్థకు పీఎన్‌బీ హౌసింగ్‌లో 32.4 శాతం వాటాలున్నాయి. అంతర్జాతీయ వ్యాపారాలు కూడా క్షీణించడం వల్ల మూడు ప్రాంతాల్లో కార్యకలాపాలను మూసివేశామని, హాంకాంగ్ శాఖను గణనీయంగా కుదించామని మెహతా చెప్పారు.

భెల్‌కు కలిసొచ్చిన మూడో త్రైమాసికం

» షేరుకు 40 పైసల మధ్యంతర డివిడెండు

న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగంలోని బీహెచ్‌ఈఎల్ డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికంలో రూ.191.95 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 25 శాతం ఎక్కువ. దీంతో వాటాదారులకు ఒక్కో షేరుపై 40 శాతం చొప్పున మధ్యంతర డివిడెండ్ చెల్లించాలని కంపెనీ డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది. ప్రస్తుతం బీహెచ్‌ఈఎల్ షేరు ముఖ విలువ రూ.2. దీని ప్రకారం ఒక్కో షేరుపై వాటాదారులకు 80 పైసల చొప్పున మధ్యంతర డివిడెండ్ లభిస్తుంది. ఫిబ్రవరి 21న ఈ డివిడెండ్ చెల్లించనున్నట్టు కంపెనీ పేర్కొంది. 'కొత్త వ్యాపారాల్లోకి విస్తరించడంతో పాటు వేగంగా ప్రాజెక్టుల అమలు, ఖర్చుల నియంత్రణ, ఉన్న వనరులను గరిష్ఠ స్థాయిలో ఉపయోగించడం ద్వారా ఈత్రైమాసికంలో ఉత్పాదకతతో పాటు లాభాలు పెంచుకున్నాం' అని బీహెచ్‌ఈఎల్ సీఎండీ అతుల్ సొబ్తీ చెప్పారు.

గెయిల్ లాభం రూ.1,681 కోట్లు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ సంస్థ గెయిల్ ఇండియా లిమిటెడ్ మూడో త్రైమాసిక (అక్టోబరు-డిసెంబరు) లాభం 33 శాతం వృద్ధి చెంది రూ.1,681 కోట్లకు (ఒక్కో షేరుపై రూ.7.46) చేరుకుంది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికానికి సంస్థ లాభం రూ.1,262.22 కోట్లుగా నమోదైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2018-19) గాను షేర్‌హోల్డర్లకు రూ.10 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుపై రూ.6.25 మధ్యంతర డివిడెండ్ చెల్లించనున్నట్లు గెయిల్ ప్రకటించింది. సమీక్షా కాలంలో సహజ వాయువు విక్రయంతో పాటు సరఫరా పెరగడం సంస్థ లాభాల పెరుగుదలకు దోహదపడింది. ఎల్‌పీజీతో పాటు లిక్విడ్ హైడ్రోకార్బన్ (ఎల్‌హెచ్‌సీ) విభాగం మెరుగైన పనితీరు కనబర్చాయని పేర్కొంది. త్రైమాసికంలో ఎల్‌హెచ్‌సీ వ్యాపార మార్జిన్ గణనీయంగా పెరగగా.. సహజవాయువు, పెట్రోకెమికల్ విభాగాల మార్జిన్లు మాత్రం ఒత్తిడిని ఎదుర్కొన్నాయని గెయిల్ చైర్మన్, ఎండీ బీసీ త్రిపాఠి తెలిపారు.

టెక్ మహీంద్రా ఆదాయంలో 15% వృద్ధి

న్యూఢిల్లీ : డిసెంబరుతో ముగిసిన త్రైమాసికం దేశీయ ఐటీ దిగ్గజం 'టెక్ మహీంద్రా'కు బాగానే కలిసొచ్చింది. అనుబంధ కంపెనీలతో కలిపి ఈ కాలానికి కంపెనీ రూ.8,944 కోట్ల రాబడులపై రూ.1,203 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఆదాయం 15 శాతం, నికర లాభం 27.5 శాతం పెరిగాయి. 'ఈ త్రైమాసికంలో రాబడులతో పాటు లాభ శాతమూ పెంచుకున్నాం. ఈ సంవత్సరానికి లక్ష్యంగా నిర్ణయించిన 500 కోట్ల డాలర్ల వార్షిక టర్నోవర్‌ను చేరుకోవడం ఆచరణ యోగ్యంగానే కనిపిస్తోంది' అని కంపెనీ సీఈఓ సీపీ గుర్నానీ తెలిపారు.

సువెన్ లైఫ్ డివిడెండ్ 150 శాతం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఔషధ తయారీ సంస్థ సువెన్‌లైఫ్ మూడో త్రైమాసిక లాభం 27.22% తగ్గి రూ.25.16 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం ఏడాదిలో ఇదే కాలానికి కంపెనీ రూ.34.57 కోట్ల లాభం ఆర్జించింది. సమీక్షా కాలానికి సంస్థ ఆదాయం వార్షిక ప్రాతిపదికన 19.27 శాతం క్షీణించి రూ.134.78 కోట్లకు పడిపోయింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరాని (2018-19)కి గాను షేర్ హోల్డర్లకు రూపాయి ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుపై రూ.1.50 (150 శాతం) మధ్యంతర డివిడెండ్ చెల్లించనున్నట్లు సువెన్ లైఫ్ బోర్డు ప్రకటించింది. డివిడెండ్ చెల్లింపులకు అర్హులైన షేర్‌హోల్డర్ల రికార్డు తేదీని ఈనెల 15గా ప్రకటించిన సంస్థ.. 25వ తేదీన డివిడెండ్ చెల్లించనున్నట్లు తెలిపింది.

నిరోధాలు 10960, 11000

టెక్ వ్యూ

నిఫ్టీ పాజిటివ్‌గానే ప్రారంభమై 10940 వద్ద సుదీర్ఘ కన్సాలిడేషన్ అనంతరం 22 పాయింట్ల లాభంతో డే గరిష్ఠ స్థాయిలో క్లోజయింది. మార్కెట్ మరోసారి కీలక దశలో ప్రవేశించింది. మానసిక అవధి 11000కి చేరువవుతోంది. ఇదే స్వల్పకాలిక, మధ్యకాలిక ట్రెండ్ నిర్ణయ స్థాయి. ఈ స్థాయిలో గతంలో ఏర్పడిన భారీ రియాక్షన్‌తో పోల్చితే ఈ సారి మైనర్ రియాక్షన్లు మాత్రమే ఏర్పడ్డాయి. అమ్మకాల ఒత్తిడి తగ్గిందనేందుకు ఇది సంకేతం. ధోరణి ఇప్పటికీ పాజిటివ్‌గానే ఉన్నా మరింత ర్యాలీకి పటిష్ఠతపై స్పష్టమైన సంకేతం వెలువడడం అవసరం.

బుధవారం స్థాయిలివే...

నిరోధం : 10960 మద్దతు : 10900

- మరింత పురోగమించేందుకు ఇంట్రాడే నిరోధం 10960 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధం 11000. ఆ పైన ముగిసినప్పుడే స్వల్పకాలిక అప్‌ట్రెండ్ మరింతగా కొనసాగుతుంది.
- మైనర్ ఇంట్రాడే మద్దతు స్థాయి 10900 కన్నా దిగజారితే మైనర్ ఇంట్రాడే కరెక్షన్‌లో పడుతుంది. ప్రధాన మద్దతు స్థాయి 10800. అంతకన్నా దిగువన క్లోజయితే స్వల్పకాలిక కరెక్షన్ ఏర్పడుతుంది.

■ వి.సుందర్ రాజా

మిడ్ సెషన్ మెరుగు

ఆస్ట్రో వ్యూ

తిథి : మాఘ శుక్ల విదియ
నక్షత్రం : శతభిషం

ఆశ్లేష, జ్యేష్ఠ, రేవతి నక్షత్ర జాతకులు, మీన, కర్కాటక రాశులవారు అప్రమత్తంగా ఉండాలి.

నిఫ్టీ : 10934.35 (+22.10)

ట్రెండ్ మార్పు వేళలు : 1.03

ధోరణి : నిఫ్టీ ఫ్యూచర్స్ నిలకడగా ప్రారంభమై 10.05 నుంచి 11.45 వరకు నిస్తేజంగా ట్రేడ్ కావచ్చు. అదే ధోరణిలో ట్రేడవుతూ తదుపరి 1.45 వరకు, తిరిగి చివరిలోను మెరుగ్గా ట్రేడ్ కావచ్చు. ఆ తర్వాత 1.30 వరకు మెరుగ్గా ట్రేడయి చివరిలో మరోసారి నిస్తేజం అయ్యే ఆస్కారం ఉంది.

ట్రేడింగ్ వ్యూహం : నిఫ్టీ ఫ్యూచర్స్ 10.15 సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి) కన్నా దిగువన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో షార్ట్ పొజిషన్లు తీసుకుని 11.45 సమయానికి క్లోజ్ చేసుకోవాలి. 11.45 తర్వాత ఎటిపి కన్నా పైకి వస్తే లాంగ్ పొజిషన్లు తీసుకుని 1.30 సమయానికి. 1.45 తర్వాత తిరిగి దిగువకు వస్తే షార్ట్ పొజిషన్లు తీసుకుని ముగింపు సమయంలోను క్లోజ్ చేసుకోవాలి.

నిరోధం : 109750, 11010

మద్దతు స్థాయిలు : 10895, 10860

ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంతకన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.
గమనిక : ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

■ డా.భువనగిరి అమరనాథశాస్త్రి
www.thefinanciala strologer.blogspot.in

ఆచితూచి మదుపర్ల కొనుగోళ్లు



ముంబై: స్టాక్ మార్కెట్ మంగళవారం ఆటుపోట్ల నడుమ స్వల్ప లాభాలతో ముగిసింది. సెన్సెక్స్ 34.07 పాయింట్ల లాభంతో 36616.81 దగ్గర, నిఫ్టీ 22.10 పాయింట్ల లాభంతో 10934.35 దగ్గర ముగిశాయి. సూచీలు లాభాలతో ముగియడం వరుసగా ఇది నాలుగో రోజు. ఆర్‌బీఐ ద్రవ్య, పరపతి విధాన సమీక్ష నేపథ్యంలో మదుపరులు ఆచితూచి కొనుగోళ్లు జరిపారు. 'మార్కెట్ ఆటుపోట్లతో ట్రేడైంది. నిఫ్టీకి 10950 పాయింట్ల దగ్గర గట్టి ప్రతిఘటన ఎదురైంది. అయితే ఆర్‌బీఐ కీలకమైన వడ్డీ రేట్లు పెంచక పోవచ్చనే అంచనాతో మదుపరులు ఆటోమొబైల్, ప్రైవేట్ బ్యాంకల షేర్లలో కొద్దిస్థాయిలో కొనుగోళ్లు జరిపారు' అని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ కంపెనీ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ చెప్పారు. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ఎలాంటి సానుకూల సంకేతాలు లేకపోవడం కూడా మంగళవారం మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. సెన్సెక్స్ సెక్టోరియల్ సూచీల్లో ఆటో, ఆర్థిక సేవల కంపెనీల సూచీలు మాత్రమే కొద్దిపాటి లాభాలతో ముగిశాయి. రియల్టీ, మెటల్, ఎఫ్‌ఎంసీజీ ఇండెక్స్‌లు మాత్రం అమ్మకాల ఒత్తిడితో నీరసించాయి. సెన్సెక్స్ షేర్లలో హీరో మోటోకార్ప్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, బజాజ్ ఆటో, మారుతి, ఎం అండ్ ఎం షేర్లు లాభాలతో ముగియగా టాటా మోటార్స్, కోల్ ఇండియా, ఓఎన్‌జీసీ షేర్లు నష్టాలతో క్లోజయ్యాయి.

కుప్పకూలిన సుజ్లాన్ షేరు

కంపెనీ ఆర్థిక పరిస్థితి ఏ మాత్రం బాగోలేదని వచ్చిన వార్తలతో మార్కెట్లో సుజ్లాన్ ఎనర్జీ షేరు కుప్పకూలింది. దీంతో బీఎస్‌ఈలో ఈ కంపెనీ షేరు ఒక దశలో 42.91 శాతం నష్టపోయి 52 వారాల కనిష్ఠ స్థాయి అయిన రూ.2.70కు పడిపోయింది. తర్వాత కొద్దిగా కోలుకుని 23.26 శాతం నష్టంతో రూ.3.63 దగ్గర క్లోజైంది.

ఆగని ఆర్‌కామ్ పతనం

అనిల్ అంబానీ నాయకత్వంలోని రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్‌కామ్) షేరు మంగళవారం కూడా నష్టాల పరంపరను కొనసాగించింది. బీఎస్‌ఈలో ఈ కంపెనీ షేరు 27.95 శాతం నష్టంతో రూ.5.44 దగ్గర ముగిశాయి. ఇంట్రాడేలో ఒక దశలో 32.84 శాతం నష్టంతో రూ.5.07కి చేరింది. ఈ ప్రభావం మిగతా గ్రూప్ కంపెనీల షేర్లపైనా కనిపించింది. రిలయన్స్ పవర్ కంపెనీ షేరు 30.12 శాతం, రిలయన్స్ నావల్ అండ్ ఇంజినీరింగ్ కంపెనీ షేరు 13.39 శాతం నష్టపోయింది. రూ.46,000 కోట్ల అప్పుల చెల్లింపుల్లో విఫలమవడంతో ఆర్‌కామ్ దివాలా పరిష్కార ప్రక్రియకు రంగం సిద్ధమైంది. అప్పటి నుంచి అడాగ్ గ్రూప్ కంపెనీల షేర్లన్నీ నష్టాల బాట పట్టాయి.

ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ కంపెనీల వివరాలివ్వండి

» ప్రభుత్వానికి ఎన్‌సీఎల్ఏటీ ఆదేశం

ప్రభుత్వానికి ఎన్‌సీఎల్ఏటీ ఆదేశంన్యూఢిల్లీ: ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ గ్రూప్ కంపెనీల పేర్లు వాటి వర్గీకరణతో సహా అందించాలని, రుణాల చెల్లింపు విషయంలో వాటి సామర్థ్యం ఏమిటో కూడా సవివరంగా తెలియచేయాలని ఎన్‌సీఎల్ఏటీ.. ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ గ్రూప్ రుణ పరిష్కార ప్రణాళికను సోమవారం ప్రభుత్వం ఎన్‌సీఎల్ఏటీకి అందించింది. ఈ రుణ పరిష్కార ప్రణాళికా ప్రక్రి య పర్యవేక్షించడానికి సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ డీకే జైన్‌ను నియమించినట్టు కూడా తెలిపింది. దివాలా చట్టంలో నిర్దేశించిన విధివిధానాలకు అనుగుణంగానే ఈ ప్రక్రియ మొత్తం పూర్తవుతుందని కూడా తెలిపింది. రుణ పరిష్కార ప్రణాళికలో ప్రభుత్వం ఆ గ్రూప్‌లోని కంపెనీలను వాటి ఆర్థిక స్థితి రీత్యా ఆకుపచ్చ, పసుపు, ఎరుపు వర్ణాల్లో విభజించింది. అయితే దేశీయంగానే ప్రధాన కార్యాలయాలు ఉండి కార్యకలాపాలు నిర్వహిస్తున్న కంపెనీల్లో ఏయే కంపెనీలను ఆ మూడు రంగుల్లో వర్గీకరించింది వివరాలందించడంతో పాటు వాటి వాస్తవ ఆర్థిక స్థితిని కూడా వచ్చే విచారణ తేదీ నాటికి తెలియచేయాలని ప్రభుత్వానికి సూచించింది. ఇద్దరు సభ్యుల ఎన్‌సీఎల్ఏటీ బెంచ్ ఈ అంశంపై తదుపరి విచారణను ఈ నెల 11వ తేదీకి వాయిదా వేసింది. ఇవి కాకుండా విదేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఆ గ్రూప్‌లోని ఇతర కంపెనీల వివరాలు వేరుగా అందించాలని కూడా కోరింది.

ఐబీసీలో 53వ సెక్షన్‌లో నిర్దేశించిన వాటర్‌ఫాల్ సిస్టమ్‌లోనే ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ కంపెనీల మానిటైజేషన్ ప్రక్రియ నిర్వహిస్తామని, అమ్మకం ద్వారా వచ్చిన ఆదాయాలను కూడా అదే విధానం కింద రుణదాతలందరికీ పంపిణీ చేస్తామని ఎన్‌సీఎల్ఏటీకి తెలియచేసింది. ఐబీసీలోని 53వ సెక్షన్ కింద సీనియర్ రుణదాతలకు ముందు గా చెల్లింపులు చేసి మిగిలిన సొమ్మును అన్‌సెక్యూర్డ్, సబార్డినేట్ రుణదాతలకు అందించాల్సి ఉంటుంది.

మరో రూ.3.5 లక్షల కోట్ల మొండి బకాయిలు

» హెచ్చరించిన ఇండియా రేటింగ్స్

ముంబై: కార్పొరేట్ రుణాల్లో మరో రూ.3.50 లక్షల కోట్లు మొండి బకాయిలుగా మారే అవకాశం ఉందని తాజా నివేదిక ఒకటి హెచ్చరించింది. గత ఏడాది సెప్టెంబరు నాటికి రూ.13.5-14 లక్షల కోట్ల కార్పొరేట్ రుణాలు ఒత్తిడిని ఎదుర్కొంటుండగా.. అందులో రూ.3.5 లక్షల కోట్ల రుణాలను బ్యాంకులు ఇంకా అధికారికంగా (ఒత్తిడిలో ఉన్నట్లు) గుర్తించలేదని ఇండియా రేటింగ్స్ నివేదిక వెల్లడించింది. అధికారికంగా గుర్తించని వాటిలో 40 శాతం (రూ.1.5-2 లక్షల కోట్లు) మేర రుణాలు 2020 సెప్టెంబరు కల్లా మొండి పద్దులోకి చేరే అవకాశం ఉందని అంచనా వేస్తోంది. వీటి కోసం బ్యాంకులు అదనంగా రూ.40 వేల కోట్ల మేర కేటాయింపులు జరపాల్సి రావచ్చని ఇండియా రేటింగ్స్‌లో బ్యాంకింగ్, ఆర్థిక సేవల సంస్థల విభాగ అసోసియేట్ డైరెక్టర్ జిందాల్ హరియా అన్నారు.

సుబాగ్జోన్‌పై కోర్టులో డాక్టర్ రెడ్డీస్‌కు విజయం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ జనరిక్ ఔషధం సుబాగ్జోన్ కేసులో విజయం సాధించింది. ఆ ఔషధంపై తాము డాక్టర్ రెడ్డీస్‌కు అనుకూలంగా ఇచ్చిన ఇంజంక్షన్ ఉత్తర్వులపై తిరిగి విచారించేందుకు అమెరికా అప్పీళ్ల కోర్టు నిరాకరించిందని బ్రిటన్‌కు చెందిన ఫార్మా కంపెనీ ఇండివియార్ పీఎల్‌సీ ప్రకటించింది. కొన్ని రకాల నొప్పుల నివారణలో ఉపయోగించే ఔషధాలకు బానిసలైపోయిన వారికి చికిత్స అందించడంలో ఉపయోగించే ఈ ఔషధాన్ని అమెరికా మార్కెట్‌లో డాక్టర్ రెడ్డీస్ సహా పోటీదారులు విడుదల చేయడాన్ని నిరోధించేందుకు ఇండివియార్ న్యాయపోరాటం సాగిస్తోంది. అయితే ఈ పోటీ ఔషధాలను నిలువరించడం వల్ల తమకు ఏ విధంగా ప్రయోజనం అన్నది ఇండివియార్ నిరూపించలేకపోయిందంటూ డాక్టర్ రెడ్డీస్ ఔషధాలపై (బుప్రెనోర్ఫిన్, నాలోక్జోన్) గతంలో జిల్లా కోర్టు విధించిన ప్రాథమిక ఇంజంక్షన్‌ను అప్పీళ్ల కోర్టు కొట్టి వేసింది.

కర్నూలు సోలార్ పార్కుకు రూ.173 కోట్లు

న్యూఢిల్లీ (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా పాణ్యం మండలంలో ఏర్పాటు చేస్తున్న 1,000 మెగావాట్ల సోలార్ విద్యుత్ పార్కుకు, కేంద్ర ప్రభుత్వం తన వాటా కింద రూ.173.8 కోట్లు విడుదల చేసింది. ఈ మొత్తాన్ని ఆంధ్రప్రదేశ్ సోలార్ పవర్ కార్పొరేషన్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీకి విడుదల చేసినట్టు కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి ఆర్కే సింగ్ వెల్లడించారు. రాజ్యసభలో టీడీపీ ఎంపీ టీజీ వెంకటేశ్ అడిగిన లిఖిత పూర్వక ప్రశ్నకు సమాధానంగా ఆయన ఈ విషయం చెప్పారు. ఈ ప్రాజెక్టు ఇప్పటికే ప్రారంభమై సౌర విద్యుత్ ఉత్పత్తవుతోందన్నారు. ఆంధ్ర ప్రదేశ్‌కు 4,740 మెగావాట్ల సౌర, 10,787.62 మెగావాట్ల పవన విద్యుత్ ప్రాజెక్టులను మంజూరు చేసినట్టు కేవీపీ రామచంద్ర రావు అడిగిన మరో ప్రశ్నకు సమాధానంగా మంత్రి చెప్పారు.

బులియన్

బంగారం (10 గ్రాములు)	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	ప్రొద్దుటూరు	చెన్నై
24 క్యారెట్లు	34,480	33,760	34,390	33,700	33,280
క్రితం ముగింపు	34,400	33,780	34,410	33,600	33,280
22 క్యారెట్లు	31,930	31,300	31,630	31,240	31,810
క్రితం ముగింపు	31,850	31,300	31,650	31,220	31,810
వెండి (కిలో)	41,700	41,900	41,500	41,500	44,000
క్రితం ముగింపు	41,500	41,700	41,300	41,500	43,700

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 4.65 — నెక్ (100 గుడ్లు)

హైదరాబాద్	403	చిత్తూరు	438
వరంగల్	405	చెన్నై	445
విజయవాడ	401	నమక్కల్	430
గోదావరి	401	బెంగళూరు	435
విశాఖపట్నం	406	ముంబై	456

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	70	విజయవాడ	75
కరీంనగర్	71	గుంటూరు	76
వరంగల్	70	ఒంగోలు	77
మహబూబ్‌నగర్	70	చిత్తూరు	88
కర్నూలు	70	నెల్లూరు	88
విశాఖపట్నం	78	అనంతపురం	89
గోదావరి	72		

ఉత్తర్వులపై అప్పీల్‌కు వెళతా

» ప్రకటించిన విజయ్ మాల్యా

లండన్ : యూకే ప్రభుత్వ ఉత్తర్వులపై భారీ అప్పీల్‌కు సిద్ధమవుతున్నట్లు పరారీలో ఉన్న ఆర్థిక నేరగాడు విజయ్ మాల్యా ప్రకటించారు. భారత్‌లో రూ.9,000 కోట్ల నిధుల మళ్లింపు, మోసం చేశాడన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న మాల్యాను స్వదేశానికి అప్పగించేందుకు యూకే హోం శాఖ మంత్రి సాజిద్ జావిద్ ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. అయితే దీనిపై హైకోర్టులో అప్పీల్ చేసుకునేందుకు మాల్యాకు రెండు వారాల గడువునిచ్చారు. ఒకవేళ ఇక్కడ కూడా మాల్యాకు వ్యతిరేకంగా తీర్పు వస్తే సుప్రీం కోర్టుకు అప్పీల్ చేసుకునే అవకాశం ఉంది. మాల్యా ఆర్థిక మోసాలకు పాల్పడ్డారని, నకిలీ పత్రాలతో రుణాలు తీసుకున్నారన్న ప్రాథమిక సాక్ష్యాధారాలున్నాయని అంటూ భారత్‌కు ఆయనను అప్పగించే విషయం పరిశీలించాలని కోరుతూ వెస్ట్‌మినిస్టర్ మెజిస్ట్రేట్ కోర్టు గత ఏడాది డిసెంబరు 10న తీర్పునిచ్చిన సంగతి తెలిసిందే. హోం శాఖ మంత్రి నిర్ణయం తీసుకోకముందు అప్పీల్ ప్రక్రియ చేపట్టరాదని భావించానని, తాజాగా ఆదేశాలు జారీ చేయటంతో ఈ ప్రక్రియను మొదలుపెట్టాలని నిర్ణయించినట్లు విజయ్ మాల్యా ట్విటర్‌లో పేర్కొన్నారు.

ఆస్తుల అప్పగింతపై అభ్యంతరం లేదు

» పీఎంఎల్ఏ కోర్టుకు విన్నవించిన ఈడీ

ముంబై : పరారీలో ఉన్న ఆర్థిక నేరస్థుడు విజయ్ మాల్యాకు చెందిన ఆస్తులను బ్యాంకులకు అప్పగించేందుకు ఎలాంటి అభ్యంతరం లేదని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)... కోర్టుకు తెలిపింది. అయితే భవిష్యత్తులో కోర్టు క్లెయిమ్ చేసుకునేందుకు అనుమతిస్తే బ్యాంకులు ఆ మొత్తాలను వడ్డీతో సహా తిరిగి ఇవ్వాల్సి ఉంటుందని, ఇందుకు సంబంధించి అండర్‌టేకింగ్ ఇవ్వాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. మాల్యా ఆస్తుల విక్రయానికి సంబంధించి అనుమతివ్వాలని ఎస్‌బీఐ సారథ్యంలోని బ్యాంకుల కన్సార్షియం.. పీఎంఎల్ఏ ప్రత్యేక కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. జప్తు చేసిన ఆస్తులను త్వరితగతిన విక్రయించేందుకు సత్వరమే అనుమతించాలని ఆ పిటిషన్‌లో కన్సార్షియం కోరింది.

అమ్మకానికి రీడ్ అండ్ టేలర్

» ఆదేశాలు జారీ చేసిన ఎన్‌సీఎల్‌టీ

ముంబై : రీడ్ అండ్ టేలర్.. లిక్విడేషన్ (అమ్మకం)కు నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) ఆదేశాలు జారీ చేసింది. కార్మికుల హక్కులను పరిరక్షించే విధంగా గోయింగ్ కన్సర్న్ (యథావిధిగా కార్యకలాపాలు సాగించటం)తో కంపెనీని విక్రయించే విధంగా చూడాలని రిజల్యూషన్ ప్రొఫెషనల్ (ఆర్‌పీ)కి సూచించింది. రీడ్ అండ్ టేలర్‌ను కొనుగోలు చేసేందుకు ముందుకు వచ్చిన కొత్త ఇన్వెస్టర్ ఇండియా గాస్.. రూ.50 కోట్ల నెట్‌వర్త్‌తో పాటు రూ.2 కోట్ల నాన్ రిఫండబుల్ ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ (ఈఎండీ) చూపించటంలో విఫలం కావటంతో ఎన్‌సీఎల్‌టీ బెంచ్‌కు సారథ్యం వహించిన భాస్కర పంతుల మోహన్, వి నల్లసేనాపతి ఈ మేరకు లిక్విడేషన్‌కు ఉత్తర్వులు జారీ చేశారు. ఎలాంటి నెట్‌వర్త్‌ను చూపించటంలో విఫలం కావటంతో నేషనల్ కంపెనీ లా అప్పిలేట్ ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్ఏటీ)ను ఇండియా గాస్ ఆశ్రయించరాదని కూడా ఎన్‌సీఎల్‌టీ బెంచ్ ఆదేశించింది. మరోవైపు రీడ్ అండ్ టేలర్ లిక్విడేషన్‌కు అనుమతినిస్తూ ఆదేశాలు జారీ చేయటంతో పాటు యూఎస్‌కు చెందిన ఇన్వెస్టర్ ఫినిక్స్ జీబీఎల్ దాఖలు చేసిన టేకోవర్ బిడ్‌ను తిరస్కరించింది. మళ్లీ సమయాన్ని వృధా చేయాలని తాము భావించటం లేదని బెంచ్ స్పష్టం చేసింది. ఇప్పటికే నాలుగైదు బిడ్లు విఫలమయ్యాయని, లాభాల్లో నడుస్తున్న కంపెనీతో పాటు కార్మికుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని సాధ్యమైనంత త్వరలో లిక్విడేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని ఆర్‌పీకీ బెంచ్ ఆదేశాలిచ్చింది. కాగా ఎన్‌సీఎల్‌టీ లిక్విడేషన్ ఉత్తర్వులపై ఉద్యోగుల అసోసియేషన్.. ఎన్‌సీఎల్ఏటీని ఆశ్రయించాలని నిర్ణయించింది.

మెడ్‌టెక్ జోన్‌లో మ్యాగ్నెటిక్ కాయిల్స్ పరిశోధన కేంద్రం

» రూ. 25 కోట్ల విడుదలకు సూత్రప్రాయంగా ఆమోదం

న్యూఢిల్లీ (ఆంధ్రజ్యోతి): విశాఖపట్టణం మెడ్‌టెక్ జోన్‌లో సూపర్ కండక్టింగ్ మ్యాగ్నటిక్ కాయిల్స్ పరీక్ష, పరిశోధన కేంద్రం ఏర్పాటుకు నిధులు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా ఆమోదం తెలిపింది. ఈ మేరకు రాష్ట్ర వైద్య శాఖ కార్యదర్శి పూనం మాలకొండయ్యకు రాసిన లేఖను ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్ ప్రవీణ్ ప్రకాశ్‌కు కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖలోని ఫార్మా విభాగం అండర్ సెక్రటరీ సందీప్ కుమార్ అందచేశారు. మెడికల్ డివైజ్ ఇండస్ట్రీ ఫర్ కామన్ ఫెసిలిటీ కేంద్రానికి ఆర్థిక సహకారం అందించే పథకం నుంచి రూ. 25 కోట్లు ఇస్తామని పేర్కొన్నారు.



తొలి త్రైమాసికానికి రూ.65,869 కోట్లు కావాలి

వార్షిక బడ్జెట్‌ను రూ.2,26,177.53 కోట్లుగా ప్రతిపాదించిన ప్రభుత్వం... ఓటాన్ అకౌంట్ కావడంతో పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టేవరకూ అవసరమైన ఖర్చుల కోసం రూ.65,869.23 కోట్లు మంజూరు చేయాలని అసెంబ్లీ ముందు ప్రతిపాదించింది. ఎన్నికలు ఏప్రిల్, మే నెలల్లో జరుగుతాయని భావించి, ముందు జాగ్రత్తగా మరో నెలకు కలిపి సుమారు మూడునెలలకు సరిపడ మొత్తం ప్రతిపాదించారు. ఎన్నికల అనంతరం ఏ ప్రభుత్వం వచ్చినా తిరిగి పూర్తి బడ్జెట్‌ను సభ ముందు ఉంచాల్సి ఉంటుంది.



బ్రాహ్మణులకు రూ.100 కోట్లు

అమరావతి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణ కార్పొరేషన్‌కు ప్రభుత్వం ఈసారి కేటాయింపులు పెంచింది. ఇప్పటి వరకూ కార్పొరేషన్‌కు మొత్తం రూ.285 కోట్లు కేటాయించిన ప్రభుత్వం.. 2019-20 ఆర్థిక సంవత్సరానికి రూ.100 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించింది. 2014-15లో రూ.25కోట్లు, 2015-16లో రూ.35కోట్లు, 2016-17లో రూ.75 కోట్లు, 2017-18లో రూ.75కోట్లు, 2018-19లో రూ.75కోట్లు ఇచ్చింది. గత ఎన్నికల సమయంలో మొత్తం ఐదేళ్లలో రూ.500కోట్లు ఇస్తామని టీడీపీ హామీ ఇచ్చినందున మిగిలిన రూ.215 కోట్లను ఇప్పుడు కేటాయించాలని బ్రాహ్మణ కార్పొరేషన్ కోరింది. ఇది ఓటాన్ అకౌంట్ బడ్జెట్ మాత్రమే అయినందున రూ.25కోట్లు పెంచి కేటాయింపులు రూ.100 కోట్లు చేసింది.



గృహ నిర్మాణానికి సగమే!

4079 కోట్లే కేటాయింపు

అమరావతి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): గృహనిర్మాణ రంగానికి ప్రభుత్వం తాజా బడ్జెట్‌లో చేసిన కేటాయింపులు అంతంతమాత్రంగానే ఉన్నాయి. ప్రస్తుతం పురోగతిలో ఉన్న ప్రాజెక్టులన్నింటికీ కలిపి రూ.10,060 కోట్లు అవసరం అని గృహనిర్మాణశాఖ ప్రతిపాదించగా... ప్రభుత్వం కేవలం రూ.4079 కోట్లతో సరిపెట్టింది. గృహనిర్మాణశాఖ ఇప్పటికే రూ.5వేల కోట్ల రుణానికి వెళ్తోంది. ఇందుకు బ్యాంకు గ్యారెంటీలు ఇచ్చేందుకు ప్రభుత్వం అంగీకారం తెలిపింది. అవి కాకుండానే రూ.10వేల కోట్లు అవసరం అవుతాయని అధికారులు లెక్కగట్టారు. కానీ ఆ స్థాయిలో కేటాయింపులు మాత్రం జరగలేదు. ఇది ఓటాన్ అకౌంట్ బడ్జెట్టే కాబట్టి, పూర్తిస్థాయి బడ్జెట్‌లో అదనపు కేటాయింపులు ఉంటాయని ప్రభుత్వం హామీ ఇచ్చింది. కానీ ఈ లోగా పెట్టుకున్న భారీ లక్ష్యాల పూర్తికి నిధులు పెద్దఎత్తున అవసరం అవుతున్నాయి.



రాబడికి రియల్ ఎస్టేట్ దన్ను!

- **రిజిస్ట్రేషన్లతో రూ.6600 కోట్లు**
- **35% ఆదాయం పెరుగుతుందని అంచనా**

అమరావతి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ పెరుగుతుండడంతో రిజిస్ట్రేషన్లతో ప్రభుత్వానికి సైతం ఆదాయం పెరుగుతోంది. రిజిస్ట్రేషన్ల శాఖ ద్వారా 2019-20లో రూ.6,600 కోట్ల ఆదాయం వస్తుందని ప్రభుత్వం అంచనా వేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.4,200 కోట్లు వస్తుందని అంచనా వేయగా ఆ మేరకు వచ్చేసింది. అదేవిధంగా ఈ మార్చినాటికి రూ.4,880 కోట్లు వస్తుందని అంచనా వేయగా... అది కూడా సాధించే అవకాశాలున్నాయి. అందుకే వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.6,600 కోట్లు వస్తుందని బడ్జెట్‌లో పేర్కొన్నారు. గత ఏడాది కంటే ఇది 35శాతం ఎక్కువ. రాబోయే కాలంలో రాజధాని అమరావతిలో రియల్ ఎస్టేట్, నిర్మాణ కార్యక్రమాలు ఊపందుకుంటాయని, అదేసమయంలో రాష్ట్రంలోని మిగతా నగరాల్లో కూడా కొత్త ఉత్సాహంతో నిర్మాణరంగ కార్యక్రమాలు జరుగుతాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది. రిజిస్ట్రేషన్‌శాఖ వర్గాలు కూడా ఈ విషయంలో దాదాపు సానుకూలంగానే ఉన్నాయి.



పట్టణాభివృద్ధిపై ఫోకస్

- **రూ.7979 కోట్ల ప్రతిపాదన**
- **అన్న క్యాంటీన్లకు రూ.300 కోట్లు**
- **పారిశుద్ధ్యం, నీటి సరఫరాకు 2160 కోట్లు**
- **రాజధానిలో భూసమీకరణకు 226 కోట్లు**

అమరావతి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): పట్టణాభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. తాజా బడ్జెట్‌లో రూ.7979.34 కోట్లు కేటాయించింది. గత బడ్జెట్‌లో దీనికి రూ.7740.80 కోట్లు ఇచ్చారు. అంటే అప్పటితో పోల్చితే 3.08 శాతం అధికంగా నిధులు కేటాయించారు. రాష్ట్రంలోని 110 మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థలను అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలనుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం ఆ లక్ష్యాన్ని సాధించేందుకు ఏటా నిధులు పెంచుతోంది. ఈ క్రమంలో పట్టణ ప్రాంతాల్లోని పేదలకు నాణ్యమైన, రుచికరమైన ఆహారాన్ని తక్కువ ధరలకే అందజేసే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన 'అన్న క్యాంటీన్ల'కు కూడా బడ్జెట్‌లో పెద్దపీట వేసింది. వీటికి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.200 కోట్లు కేటాయించగా... 2019-20 సంవత్సరానికి రూ.300 కోట్లకు పెంచారు. అలాగే పట్టణ స్థానిక సంస్థల్లో సీఐపీ కింద మౌలిక వసతుల కల్పనకు రూ.100 కోట్లను కేటాయించారు. గత బడ్జెట్‌లో దీనికి నిధులేమీ ఇవ్వలేదు. ఇక... నీటి సరఫరా, పారిశుద్ధ్యానికి రూ.2160.24 కోట్లను తాజా బడ్జెట్‌లో ప్రతిపాదించారు. రాజధానిలో భూసమీకరణకు ప్రభుత్వం గణనీయంగా నిధుల పెంచింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.166.53 కోట్లు కేటాయించగా... 2019-20 కాలానికి రూ.226.27 కోట్లను ప్రతిపాదించారు.

వరాల పద్దు

(మొదటి పేజీ తరువాయి)

అందిస్తామన్నారు. డ్రైవర్లకు సాధికార సంస్థ ఏర్పాటు, వెనుకబడిన వర్గాల్లో అనేక కులాలకుప్రత్యేక కార్పొరేషన్లు... ఇలా అనేక ప్రకటనలు చేశారు. వీటిలో కొన్ని ఇప్పటికే అమలులోకి వచ్చాయి కూడా! వీటితోపాటు మిగిలిన అన్ని హామీలపై సాధికార ముద్ర వేస్తూ మంగళవారం బడ్జెట్ కేటాయింపులు జరిగాయి. రూ.2.26 లక్షల కోట్ల బడ్జెట్‌లో రూ.65,486 కోట్లు సంక్షేమ సంబంధిత పద్దులకే కేటాయించడం విశేషం. రైతుల కోసం ప్రవేశపెట్టిన 'అన్నదాతా సుఖీభవ' పథకానికి రూ.5వేల కోట్లు కేటాయించారు. డ్వాక్రా మహిళలకు పసుపు-కుంకుమకు నిధులు ఇచ్చారు. వృద్ధాప్య, వితంతు, వికలాంగ, చేనేత, డప్పు కళాకారులు... ఇలా 12 రకాల సామాజిక పింఛన్లను రెట్టింపు చేసిన సంగతి తెలిసిందే. ఈ పద్దు కింద కేటాయింపులనూ రెట్టింపు చేశారు. గతంలో ఉన్న రూ.5012 కోట్లను రూ.12,819.18 కోట్లకు పెంచారు. క్షత్రియ సామాజిక వర్గానికి కొత్తగా కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.50 కోట్లు కేటాయించారు. 'జయహో బీసీ'లో ఇచ్చిన హామీల మేరకు ఏర్పాటు చేసిన 21 బీసీ కార్పొరేషన్లకు రూ.3వేల కోట్లు ప్రత్యేకించారు. బీసీ ఉప ప్రణాళికను దీనికి అదనంగా అమలు చేస్తారు.

కొత్తగా ఆరు కేటాయింపులు...

ఈసారి కొత్తగా ఆరు పద్దులు బడ్జెట్ బుక్కులోకి ఎక్కాయి. అన్నదాతా సుఖీభవ... సరికొత్త పథకం. సూక్ష్మ, చిన్న, మధ్య తరగతి పరిశ్రమలకు (ఎంఎస్ఎంఈ) ప్రోత్సాహం కోసం రూ.400కోట్లు కేటాయించారు. అలాగే...మూతబడిన ఎంఎస్ఎంఈలను తిరిగి ప్రారంభించేందుకు సాయం కోసం రూ.100 కోట్లు ఇచ్చారు. డ్రైవర్ల సంక్షేమం కోసం ఒక సాధికార సంస్థను ఏర్పాటు చేసి రూ.150 కోట్లు ఇచ్చారు. పట్టణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం రూ.100 కోట్లు ఇచ్చారు. రాజుల సామాజిక వర్గం సంక్షేమం కోసం రూ.50 కోట్లు ఈ బడ్జెట్‌లో తొలిసారి ఇచ్చారు. ఇప్పటికే అమలులో ఉన్న 41 అభివృద్ధి, సంక్షేమ పథకాలకు భారీగా నిధులు పెంచారు.

పాడి... పంట!

కొత్తగా ప్రకటించిన 'అన్నదాత సుఖీభవ'తోపాటు వ్యవసాయ-అనుబంధ కేటాయింపులు పెద్దస్థాయిలో పెంచారు. రైతులకు మద్దతు ధర దక్కేందుకు (మార్కెట్ ఇంటర్‌వెన్షన్) వీలుగా ప్రతి ఏటా రూ.500 కోట్లతో నిధి ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పుడు దీనిని రూ.వెయ్యి కోట్లకు పెంచారు. వ్యవసాయ యాంత్రీకరణ.. అంటే, ట్రాక్టర్లు, రోటొవేటర్లు, ఇతర యంత్ర పరికరాల కోసం రూ.300.17కోట్లు కేటాయించారు. రైతుకు అదనపు ఆదాయాన్నిచ్చే పాడి పశువులకు మరింత బీమాతో ధీమా కల్పించారు. ఈ పద్దుకింద కేటాయింపులను రూ.50 కోట్ల నుంచి ఏకంగా 200 కోట్లకు పెంచారు. గడ్డి, దాణా అభివృద్ధి కోసం పాత బడ్జెట్‌లో రూ.149కోట్లు కేటాయించగా... ఈసారి దానిని 200 కోట్లు చేశారు. పండ్ల తోటలను ప్రోత్సహించేందుకు రూ.124కోట్లు, మత్స్యరంగం అభివృద్ధికి రూ.100కోట్లు కేటాయించారు.

హామీల మేరకు అన్నీ...

డ్వాక్రా మహిళలకు 'పసుపు-కుంకుమ' ఇచ్చేందుకు గత బడ్జెట్‌లో రూ.1700కోట్లు కేటాయించగా... దానిని ఇప్పుడు 4వేల కోట్లకు పెంచారు. నిరుద్యోగ భృతికి గత బడ్జెట్‌లో వెయ్యి కోట్లు కేటాయించగా... ఈసారి రూ.1200కోట్లు ఇచ్చారు. డ్వాక్రా సంఘాలకు వడ్డీలేని రుణాల కింద గతంలో వెయ్యి కోట్లు కేటాయించగా...ఈసారి రూ.1100కోట్లకు పెంచారు. అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రత్యేక అభివృద్ధి నిధికి కేటాయించిన నిధులను రూ.500కోట్ల నుంచి రూ.800కోట్లకు పెంచారు. అత్యంత ప్రజాదరణ చూరగొన్న, సామాన్యులకు అండగా నిలుస్తున్న 'చంద్రన్న బీమా' పథకానికి కేటాయింపుల్ని ఒకటిన్నర రెట్లు పెంచారు. గత ఏడాది రూ.140 కోట్లు దీనికోసం కేటాయించగా... ఈసారి రూ.354కోట్లు ఇచ్చారు. పేదలు, చిన్నపాటి కూలీలు, కార్మికుల కడుపు నింపుతున్న 'అన్న క్యాంటీన్ల' బడ్జెట్‌ను 50శాతం పెంచి... రూ.300కోట్లు చూపించారు. చేనేత కార్మికుల జీవనోపాధికి సాయం చేసేందుకు గతంలో ఇచ్చిన రూ.200కోట్లను ఈసారి రూ.225కోట్లకు పెంచారు. 9, 10వ తరగతి విద్యార్థులకు పౌష్టికాహారం కోసం రూ.156.72 కోట్లు కేటాయించారు. ఇది గత కేటాయింపుల కంటే 65శాతం ఎక్కువ.

కానుకలు ఘనం...


వివిధ వర్గాలకు అందిస్తున్న చంద్రన్న పెళ్లి కానుకలకు కేటాయింపులను 25 నుంచి 82 శాతం వరకు పెంచారు. బీసీలకు 175కోట్లు, ఎస్సీలకు రూ.128.21కోట్లు, మైనార్టీలకు 100కోట్లు, గిరిజనులకు 15కోట్లు, దివ్యాంగులకు పెళ్లి కానుక కోసం రూ.10.26కోట్లు కేటాయించారు. విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించేందుకు సహాయం చేసే ఎన్టీఆర్ విదేశీ విద్యాదరణ పథకానికి కేటాయింపులను రూ.68 కోట్ల నుంచి వంద కోట్లకు పెంచారు.

కార్పొరేషన్లకు కాసుల కళ

ఏపీ క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు రూ.25 కోట్లు పెంచి రూ.100కోట్లు కేటాయించారు. బ్రాహ్మణ కార్పొరేషన్‌కు గత ఏడాది రూ.75కోట్లు కేటాయించగా... ఈసారి రూ.100కోట్లు ఇచ్చారు. వైశ్య కార్పొరేషన్‌కు గతంలో రూ.30కోట్లు కేటాయించగా...ఈసారి రూ.50కోట్లకు పెంచారు. కొత్తగా రూ.50 కోట్లతో క్షత్రియ కార్పొరేషన్ ఏర్పాటు చేశారు.

ఉత్తమంగా 'ఉపాధి'

ఉపాధి హామీ పథకం నిధులను అత్యధికంగా, ఉత్తమంగా వాడుకుంటున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. గ్రామాల స్వరూపం మార్చేలా... పల్లెల్లో రహదారులు, మురుగు కాల్వలు, అంగన్‌వాడీ భవనాలు, పంచాయతీ భవనాల నిర్మాణం, చివరకు శ్మశానాల అభివృద్ధికీ ఉపయోగపడిన ఉపాధి హామీ పథకానికి ఈసారి మరింత పెద్దపీట వేశారు. ఉపాధి హామీ పథకాన్ని ఇతర పథకాలతో అనుసంధానం చేసి మరింత పెద్దఎత్తున పనులను చేపట్టేందుకు వెయ్యి కోట్లు కేటాయించారు. గతంతో పోల్చితే ఇది రూ.250 కోట్లు అధికం!



దారుల కోసం నిధులు

కీలక నెట్‌వర్క్ రోడ్ల కోసం రూ.331కోట్లు కేటాయించారు. కొత్త రాజధాని భూసమీకరణ అవసరాల కోసం రూ.226.27కోట్లు కేటాయించారు. రైల్వే లైన్ల కోసం 180 కోట్లు, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ రోడ్ల కోసం రూ.50కోట్లు, పంచాయతీరాజ్ రోడ్ల పునర్నిర్మాణం కోసం రూ.50కోట్లు కేటాయించారు.

రూపాయి రాక

	పైసల్లో	వాస్తవ మొత్తం (రూ.కోట్లలో)
రాష్ట్ర పన్నులు, సుంకాలు	42.31	(75,438)
కేంద్ర పన్నుల్లో వాటా	20.39	(36,360.3)
పన్నేతర ఆదాయం	37.13	(66,188.4)
వడ్డీ వసూళ్లు	0.15	(283.2)

రూపాయి పోక

	పైసల్లో	వాస్తవ మొత్తం (రూ.కోట్లలో)
అభివృద్ధి వ్యయం	73.13	(1,31,907.3)
వడ్డీ చెల్లింపులు	10.27	(18,529.7)
పరిపాలనా ఖర్చు	4.97	(8,975.4)
పన్ను వసూళ్ల వ్యయం	0.74	(1,343.1)
ఇతరత్రా వ్యయం	10.87	(19,613.9)

సొంత ఆదాయం 75,438 కోట్లు

- **రూ.7,903 కోట్ల మేరకు పెరిగిన రాబడి**

అమరావతి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): రాబోయే ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర సొంత ఆదాయం రూ.75,438 కోట్లుగా ఉంటుందని బడ్జెట్‌లో అంచనా వేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సర సవరించిన అంచనాలతో పోల్చితే ఇది రూ.7903 కోట్లు అధికం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర సొంత ఆదాయాన్ని రూ.65,535 కోట్లుగా అంచనా వేసినా... దీన్ని రూ.67,535 కోట్లకు పెంచారు. ఈ సారి కూడా వాణిజ్యపన్నుల రూపంలోనే ఖజానాకు భారీగా నిధులు రానున్నాయి. ఈ మొత్తాన్ని రూ.66,004 కోట్లుగా అంచనా వేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ద్వారా రూ.4,880 కోట్లు, ఎక్సైజ్ సుంకం ద్వారా రూ.7357 కోట్ల ఆదాయం అంచనా వేయగా.. 2019-20 ఆర్థిక సంవత్సరానికి ఎక్సైజ్ సుంకం ద్వారా రూ.8518 కోట్లు, వాహన పన్ను ద్వారా రూ.4,000 కోట్లు, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల శాఖ ద్వారా రూ.6,600 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేస్తున్నారు. 2019-20లో పన్నేతర ఆదాయం రూ.5,750 కోట్ల మేర వస్తుందని బడ్జెట్‌లో పేర్కొన్నారు. పన్నేతర ఆదాయంలో గనులు, ఖనిజాల శాఖ ద్వారా రూ.2,750 కోట్లు, అటవీశాఖ నుంచి రూ.700 కోట్లు ఉంటుందని అంచనా వేశారు.

కేంద్ర గ్రాంట్లు రూ.60,721 కోట్లు

రాబోయే ఆర్థిక సంవత్సరానికి కేంద్ర పన్నుల్లో వాటా రూ.36,360 కోట్లు, కేంద్రం నుంచి రావాల్సిన గ్రాంట్లను రూ.60,721 కోట్లుగా అంచనా వేశారు. 2018-19 బడ్జెట్లో కేంద్ర పన్నుల్లో వాటాగా రూ.33,929 కోట్లు, కేంద్ర గ్రాంట్లను రూ.50,000 కోట్లుగా అంచనా వేశారు. కానీ, కేంద్రం నుంచి ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి రూ.38 వేల కోట్లే వస్తాయని భావిస్తున్నారు. కాగా, రెవెన్యూ వ్యయంలో సింహభాగం వేతనాలకు రూ.44,087 కోట్లు, పెన్షన్లకు రూ.16,695 కోట్లు, వడ్డీ చెల్లింపులకు రూ.17,805 కోట్లు, నాన్ సాలరీ విభాగం ఖర్చుకు రూ.10,032 కోట్లు, నిర్వహణకు రూ.10,032 కోట్లు, సబ్సిడీలు, గ్రాంట్లకు రూ.87,954 కోట్లు కేటాయించారు. ఇందులో విద్యుత్ సబ్సిడీకి రూ.3,500 కోట్లు, బియ్యం సబ్సిడీకి రూ.3,000 కోట్లు కేటాయించారు.

రూ.39,478 కోట్ల మార్కెట్ రుణాలు

2019-20లో జీఎస్‌డీపీని రూ.10.67 లక్షల కోట్లుగా అంచనా వేశారు. ఇందులో 3 శాతం మొత్తాన్ని ఓపెన్ మార్కెట్ నుంచి రుణాలుగా పొందే వీలుంది. దీని ఆధారంగా రూ.39,478 కోట్ల మార్కెట్ రుణాలు చేసుకోవచ్చని బడ్జెట్‌లో పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ పరిమితి రూ.32,972 కోట్లుగా ఉందని 2018-19 సవరించిన అంచనాల్లో వివరించారు.

వచ్చే నెల నుంచే రెట్టింపు భృతి!

- **నిరుద్యోగులకు నెలకు రూ.2వేలు**
- **'అన్నదాతా సుఖీభవ' ఖరీఫ్ నాటికే**
- **విధి విధానాలు ఖరారుకు సమయం**
- **కౌలు రైతుల గుర్తింపునకు కసరత్తు**
- **ప్రభుత్వ వర్గాల సమాచారం**
- **మాది సంక్షేమ సర్కారు: యనమల**

అమరావతి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రైతులు, కౌలు రైతులకు పెట్టుబడి సహాయం అందించే 'అన్నదాతా సుఖీభవ' పథకాన్ని ఖరీఫ్ ప్రారంభంనాటికి అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇక... ఇప్పటికే 'యువనేస్తం' పేరిట అమలు చేస్తున్న నిరుద్యోగ భృతిని రెట్టింపు చేసి, ప్రతినెలా రూ.2 వేలను వచ్చే నెల నుంచే చెల్లించే అవకాశాన్ని పరిశీలిస్తోంది. సుమారు 4.50 లక్షల మంది నిరుద్యోగ యువతకు దీనిద్వారా లబ్ధి చేకూరనుంది. 'అన్నదాతా సుఖీభవ' విధి విధానాలను ఇంకా ఖరారు చేయాల్సి ఉందని, మార్చి లోపు ఈ ప్రక్రియ పూర్తయ్యే అవకాశం లేదని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. బడ్జెట్ ప్రవేశ పెట్టిన తర్వాత ఆర్థిక మంత్రి యనమల అసెంబ్లీ లాబీల్లోని తన చాంబర్లో విలేకరులతో మాట్లాడుతూ ఈ విషయం ధ్రువీకరించారు. 'ఈ పథకం అమలుపై విధి విధానాలను ఇంకా ఖరారు చేయాల్సి ఉంది. తెలంగాణలో భూమి యజమానులకు మాత్రమే సాయం ఇచ్చారు. ఇక్కడ కౌలు రైతులకు కూడా ఇవ్వాలని అనుకొంటున్నాం. వారిని ఎలా గుర్తించాలి... వారికి ఏ మేరకు సాయం ఇవ్వాలన్నది నిర్ధారించాలి. దీనికి కొంత సమయం పడుతుంది. అందుకే వచ్చే ఆర్థిక సంవత్సరంలోనే దీని అమలు ప్రారంభం అవుతుంది. ఖరీఫ్ వ్యవసాయ సీజన్ ప్రారంభం నాటికి ఈ సాయం అందేలా చూడాలని అనుకొంటున్నాం" అని యనమల వివరించారు. నిరుద్యోగ భృతి పెంపునకు కొత్త ఆర్థిక సంవత్సరం దాకా ఆగాల్సిన అవసరం లేదన్నారు. ఈలోపుగానే 'రెట్టింపు' చెల్లింపు మొదలవుతుందని తెలిపారు. వివిధ వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఆ దృష్టితోనే అనేక కొత్త కార్యక్రమాలకు రూప కల్పన చేసి అమలు చేస్తున్నామని తెలిపారు. "గతంలో ప్రకటించినవికాక కొత్తగా డ్రైవర్ల సాధికార సంస్థ, క్షత్రియ సామాజిక వర్గానికి మరో కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. బడ్జెట్‌లో కేటాయింపులు కూడా చేశాం" అని యనమల తెలిపారు.

పర్యాటకానికి రూ.467 కోట్లు

అమరావతి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పర్యాటక, భాషా, సాంస్కృతిక శాఖ బడ్జెట్ 20 శాతం పెరిగింది. ప్రభుత్వం గత ఏడాది ఈ శాఖకు రూ.385 కోట్లు కేటాయించింది. 2019 - 20 ఆర్థిక సంవత్సరంలో రూ.467 కోట్లు ప్రభుత్వం కేటాయింపులు చేసింది. భవానీ ద్వీపం అభివృద్ధి కార్పొరేషన్‌కు రూ.20 కోట్లు, శిల్పారామానికి రూ.30 కోట్లు కేటాయించింది. రాష్ట్ర క్రీడలు, యువజన సంక్షేమ శాఖకు ప్రభుత్వం రూ.1515 కోట్లు కేటాయించింది.

విద్యలో నాణ్యతకు పెద్దపీట

- **రూ.25,955 కోట్లు కేటాయింపు**
- **మొత్తం పద్దులో ఇది 11.5%**
- **ప్రాథమిక, మాధ్యమిక విద్యకు రూ.22,783.37 కోట్లు**
- **ఉన్నత విద్యకు రూ.3,171.63 కోట్లు**
- **దీని నుంచి ఒక్కొక్క కొత్త వర్సిటీకి రూ.40 కోట్లు**

అమరావతి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ప్రవేశ పెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో విద్యా రంగానికి రూ.25,955 కోట్లు కేటాయించింది. మొత్తం రాష్ట్ర బడ్జెట్‌లో ఇది 11.5 శాతంగా ఉంది. ప్రాథమిక, మాధ్యమిక విద్యకు రూ.22,783.37 కోట్లు, ఉన్నత విద్యకు రూ.3,171.63 కోట్లు కేటాయించారు. ఉన్నత విద్యలో సాంకేతిక విద్యకు రూ.870.32 కోట్లు ఇచ్చారు. మధ్యాహ్న భోజన పథకంలో వివిధ ఆహార పదార్థాలను చేర్చడం, బడికొస్తా, మన ఊరు-మనబడి, బడి పిలుస్తోంది వంటి పథకాలతో పాటు డిజిటల్ క్లాస్ రూమ్‌లు, ఈ-హాజర్ కార్యక్రమాలను మేళవించి విద్య నాణ్యతను పెంచేందుకు చేసిన కసరత్తు బడ్జెట్‌లో స్పష్టంగా కనిపించింది. అత్యంత కీలకమైన మధ్యాహ్న భోజన పథకాన్ని కళాశాలలకు, పాలిటె క్నిక్ కాలేజీలకు కూడా విస్తరిస్తున్నట్లు బడ్జెట్ ప్రసంగంలో ఆర్థికశాఖ మంత్రి యనమల రామకృష్ణుడు తెలిపారు. ఈ పథకంలోని ఆహారంలో మాంసకృత్తుల విలువలను పెంచుతున్నట్లు చెప్పారు. 9-10 తరగతుల విద్యార్థుల మధ్యాహ్న భోజనం కోసం రూ.156.72 కోట్లు, ఇంటర్మీడియెట్ విద్యార్థుల కోసం రూ.58 కోట్లు కేటాయించారు. రాష్ట్రంలోని పాత వర్సిటీల్లో మౌలిక సదుపాయాలను పెంచేందుకు చర్యలు తీసుకుంటారు. కొత్త వర్సిటీల్లో మౌలిక సౌకర్యాల కల్పనకు ఒక్కొక్క వర్సిటీకి రూ.40 కోట్లు చొప్పున కేటాయించారు.

'విద్య'కు మెరుగులు

- కాంట్రాక్టు ఉపాధ్యాయుల పదవీ విరమణ వయసు 60 ఏళ్లకు పెంపు
- డ్రాపవుట్స్ తగ్గింపుపై ప్రత్యేక దృష్టి
- నాణ్యమైన మధ్యాహ్న భోజనానికి భారీ నిధులు
- గత ఏడాది బడ్జెట్: రూ.24,446 కోట్లు
- తాజా బడ్జెట్: రూ.25,955 కోట్లు
- పెంపు: రూ.1,509 కోట్లు


తగ్గిన కేటాయింపులు: యూటీఎఫ్

ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో విద్యారంగానికి కేటాయింపులు తగ్గాయని, ఇది విచారకరమని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ సాబ్జీ, పి. బాబురెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రాన్ని హబ్‌గా మారుస్తామని ప్రకటించిన బడ్జెట్ అలా లేదన్నారు.

మండలిలో..

- **బడ్జెట్ ప్రవేశపెట్టిన మంత్రి నారాయణ**

అమరావతి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శాసనమండలిలో పురపాలక మంత్రి పీ నారాయణ మంగళవారం ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. 35 పేజీల బడ్జెట్ పుస్తకంలోని 154అంశాలను మండలి ముందుంచారు. రైతులకు పెట్టుబడి సాయం చేసేందుకు కొత్తగా చేపట్టిన 'అన్నదాతా సుఖీభవ' పథకానికి రూ.5వేల కోట్లు, 93.81లక్షల మంది డ్వాక్రా మహిళలకు పసుపు-కుంకుమ కింద రూ.10వేలు చొప్పున, ఎన్టీఆర్ భరోసా పింఛన్లను రూ.2వేలకు పెంచడం, యువనేస్తం పథకం కింద నిరుద్యోగ భృతిని రూ.వెయ్యి నుంచి రూ.2వేలకు పెంచుతున్నట్లు ప్రకటించడం, వివిధ కులాల ఫెడరేషన్లను కార్పొరేషన్లుగా మార్పు చేయడం, ఆడ పిల్లల పెళ్లిళ్లకు చంద్రన్న పెళ్లికానుక, పేదలు, కార్మికులకు చంద్రన్న బీమా, పోలవరం సహా వివిధ సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం వంటి అనేక అంశాలను తన ప్రసంగంలో ప్రస్తావించారు. కాగా, టీడీపీ అధికారం చేపట్టాక తొలి మూడేళ్ల వ్యవసాయశాఖ మంత్రిగా వ్యవహరించిన మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు మండలిలో బడ్జెట్ ప్రవేశపెట్టారు. తరువాత ఆ శాఖను నిర్వహిస్తున్న సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి నిరుడు వ్యవసాయశాఖ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు.


అసెంబ్లీలో బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్న యనమల, ప్రసంగాన్ని ఆలకిస్తున్న చంద్రబాబు, చినరాజప్ప, అచ్చెన్నాయుడు





బడ్జెట్‌ను సీఎం చంద్రబాబుకు అందజేస్తున్న యనమల, ఆర్థిక శాఖ అధికారులు

అన్నదాతా సుఖీభవ!





"ఏడు పదుల ఆంధ్రుల కల, మన రాష్ట్ర జీవ నాడి పోలవరం డ్యామ్ శరవే గంగా పూర్తవుతోందని, దేశంలోనే అతి పెద్ద ప్రాజెక్టులలో ఒకటిగా నిలుస్తుందని ఊహించామా? నదుల అనుసంధాన ప్రక్రియలో దేశానికి ఆంధ్రప్రదేశ్ మార్గదర్శకం అవుతుందని, మన గడ్డ మీద నుంచే మన పరిపాలన,

ఊహించామా? అనుకొన్నామా?

న్యాయవ్యవస్థ కొనసాగాలన్న కల అమరావతి రూపంలో ఇంత స్వల్ప సమయంలో నెరవేరగలదని అనుకున్నామా? ఇంతటి తీవ్ర ఆర్థిక లోటులోకూడా, పెద్దఎత్తున రైతులకు సంపూర్ణ రుణమాఫీ చేస్తామని, స్వయం సహాయక మహిళా సంఘాలకు పసుపు-కుంకుమ అందిస్తామని, పెన్షన్ల మొత్తాన్ని 10 రెట్లు పెంచుతామని, సంక్షేమంలో ఇతర రాష్ట్రాలకు ఆంధ్రప్రదేశ్ మార్గదర్శకం అవుతుందని భావించామా? గ్రామీణ జీవన దశలు అన్నింటికీ వర్తించేలా అద్భుతమైన మౌలిక సదుపాయాలను నెలకొల్పే సామర్థ్యాన్ని పెంపొందించి, దేశానికి మార్గదర్శకమైన నమూనాని మనం అందిస్తామని ఊహించామా? కానీ ఇవన్నీ ఈ రోజున నిజంగా సాధించాం" అని యనమల వివరించారు.

కొత్తగా ఏమిచ్చారంటే..

పథకం	కేటాయింపు (రూ.కోట్లలో)
అన్నదాతా సుఖీభవ	5,000
ఇళ్ల స్థలాలకు భూసేకరణ	500
సూక్ష్మ, చిన్న, మధ్యమ పారిశ్రామిక సంస్థల ఏర్పాటుకు ప్రోత్సాహం	400
డ్రైవర్ల సాధికార సంస్థ	150
పట్టణ స్థానిక సంస్థ(యూఎల్‌బీ)ల్లో సీఐపీ కింద మౌలిక వసతుల కల్పన	100
క్షత్రియుల సంక్షేమం	50

- రూ.5 వేలకోట్లతో నూతన రైతు పథకం
- అనిశ్చితిలో అన్నదాతకు అండగా నిధి
- దీనికోసం రూ.వెయ్యికోట్లు కేటాయింపు
- బడుగులకు కార్పొరేషన్లు, ఇతోధిక లబ్ధి
- పలు బీసీ సొసైటీలకు కార్పొరేషన్ హోదా
- ఎస్సీల సంక్షేమానికి రూ.32,843 కోట్లు,
- ఎస్టీల ప్రయోజనాలకు రూ.8,950 కోట్లు,
- బీసీలకు రూ.28,805 కోట్లు ఖర్చుచేశాం
- ప్రభుత్వ ఉద్యోగులకు 860 కోట్ల 'ఈహెచ్‌ఎస్'
- డ్రైవర్ల కోసమూ కొత్తగా సాధికార సంస్థ


అమరావతి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): 'అన్నదాతా సుఖీభవ' పేరుతో రైతుల కోసం కొత్త పథకాన్ని ప్రారంభిస్తున్నట్టు రాష్ట్ర ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు వెల్లడించారు. 2019-20 ఆర్థిక సంవత్సరానికిగాను ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రతిపాదనలను ఆయన మంగళవారం శాసనసభకు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన ఈ కొత్త పథకాన్ని ప్రకటించారు. వ్యవసాయంలో ఆశించినస్థాయిలో వృద్ధి సాధిస్తున్న రైతాంగానికి చేయూతనిచ్చేందుకు దీనిని రూపొందించినట్టు తెలిపారు. 'వ్యవసాయ సంక్షోభాన్ని గుర్తించిన ముఖ్యమంత్రి... అన్నదాతకు ఆప్తబాంధవుడిగా నిలిచారు. రూ.24 వేల కోట్ల రుణభారం నుంచి విముక్తం చేశారు. ఇదే ఉదారతను రైతుల పట్ల కొనసాగిస్తూ, 2019-2020 సంవత్సరానికిగాను రూ.ఐదు వేల కోట్లతో కొత్త పథకం ప్రతిపాదిస్తున్నాం' అని ప్రకటించారు. గత నాలుగున్నరేళ్లలో రూ.81,554 కోట్లను కేటాయించడం, వ్యవసాయాభివృద్ధిపై రాష్ట్రప్రభుత్వానికి ఉన్న శ్రద్ధను సూచిస్తుందని తెలిపారు. ఇంకా ఆయన ఏమన్నారంటే..

నాయకత్వమంటే ఇలా..

'అటు రాజకీయ యంత్రాంగానికి, ఇటు ప్రభుత్వ యంత్రాంగానికి మార్గదర్శకంగా ఉంటూ రాష్ట్ర ప్రజల అపారమైన నమ్మకం పొందేందుకు, వారిని కార్యోన్ముఖులను చేసేందుకుగాను ముఖ్యమంత్రి సమర్థ నాయకత్వం స్ఫూర్తినిచ్చింది. రాష్ట్ర సమస్యలను కేంద్రప్రభుత్వ అరకొర సాయం మరింత జటిలం చేసినప్పటికీ నాయకత్వ సామర్థ్యంతో, అధికార యంత్రాంగం తోడ్పాటుతో అభివృద్ధి పథంలో ప్రభుత్వం కొనసాగుతోందనేది మరువకూడని అంశం. తల్లిగర్భం నుంచి జీవితాంతం ప్రతి దశలోనూ సంక్షేమాన్ని అమలుచేస్తున్న స్ఫూర్తిదాయకమైన ప్రభుత్వమిది. వ్యాపార, వాణిజ్యాభివృద్ధికి అనుకూల వాతావరణం కల్పించడంతోపాటు సమాజంలో పేదరిక నిర్మూలన, ఆహారభద్రత, సమ్మిళిత అభివృద్ధి, సేవల అందజేత, రైతులు, అసంఘటిత కార్మికులు, షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగలు, బడుగు వర్గాలు, బలహీనవర్గాలు, వెనుకబడిన తరగతులు, అత్యంత వెనుకబడి తరగతులు, ఆర్థికంగా బలహీనవర్గాలు, మహిళలు, శిశువులు, యువత, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్, వయోవృద్ధులకు సాధికారత కల్పించడానికి ప్రభుత్వం చేపట్టిన చర్యలు, పాటించిన విధానాలు, చేసిన కృషి సత్ఫలితాలనిచ్చాయి. నీటి పారుదల, వ్యవసాయోత్పత్తి, ఉత్పాదకత, అందరికీ పక్కాఇళ్లు, సురక్షిత తాగునీరు, పారిశుధ్యం, నిరంతర విద్యుత్, రోడ్ల నిర్మాణం, విద్యానైపుణ్యాభివృద్ధి, ఆరోగ్య భద్రత, జీవనోపాధి అవకాశాలు, సామాజిక భద్రత, గ్రామీణాభివృద్ధి, పట్టణాభివృద్ధి రంగాల్లో ఆంధ్రప్రదేశ్ వేగవంతమైన అభివృద్ధిని నమోదుచేసింది. ఆర్థిక ఒత్తిళ్లకు నెరవకుండా పసుపు-కుంకుమ పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టి, ప్రతి స్వయం సహాయక సంఘ సభ్యురాలికి రూ.10 వేలు చొప్పున అందించాం. అదనంగా మరో మారు రూ.10 వేలు 3 విడతల్లో పంపిణీ చేస్తున్నాం.'

వ్యవసాయం, అనుబంధాలకు..

'రాష్ట్రంలో వ్యవసాయ అనుబంధ రంగాలకు నిరుడు బడ్జెట్‌లో రూ.12,355.32 కోట్లు కేటాయించగా, ప్రస్తుత బడ్జెట్‌లో రూ.15,246.37కోట్లు ఖర్చు చేయాలని ప్రతిపాదించాం. పండించిన పంటకు కనీస మద్దతు ధర లేక మార్కెట్‌లో అనిశ్చితి ఏర్పడినప్పుడు రైతులను ఆదుకునేందుకు మార్కెట్ ఇంటర్వెన్షన్ కింద గతేడాది రూ.500కోట్లు కేటాయించగా, ఈ సారి రూ.వెయ్యి కోట్లకు పెంచాం. వ్యవసాయ యాంత్రీకరణ పథకానికి రూ.300.17కోట్లు ప్రతిపాదించాం. రైతులకు రాయితీపై విత్తనాల సరఫరాకు రూ.300కోట్లు, డిజిటల్ సాయిల్ మ్యాపింగ్, వ్యవసాయరంగంలో సాంకేతిక పద్ధతుల అనుసరణకు రూ.50కోట్లు, కరువు, వాతావరణ అననుకూలత ఏర్పడినప్పుడు రైతులను ఆదుకునేందుకు (ఐఎఫ్‌ఏడీ) నిరుడు రూ.100కోట్లు కేటాయించగా, ఈ సారి ఆ మొత్తాన్ని రూ.200కోట్లకు పెంచాం. పశువుల బీమా కోసం రూ.200కోట్లు కేటాయించాం. పాడి పశువులకు దాణా కోసం రూ.200కోట్లు, ఉద్యానశాఖకు రూ.124కోట్లు, మత్స్యశాఖకు రూ.100కోట్లు కేటాయించాం. ఫుడ్ ప్రాసెసింగ్‌కు రూ.400కోట్లు, సహకార రంగానికి రూ.232కోట్లు ప్రతిపాదించాం.'



విస్తరించిన ఉచిత వెలుగులు

'ఎస్సీ, ఎస్టీలకు జగజ్జీవన్‌జ్యోతి కింద నెలకు ఉచిత విద్యుత్ యూనిట్ సంఖ్యను 100 యూనిట్లకు పెంచాం. అత్యంత వెనుకబడిన తరగతులకు చెందిన 2 లక్షల కుటుంబాలకు 100 యూనిట్లు వరకు ఉచిత విద్యుత్ అందిస్తాం. నాయీ బ్రాహ్మణ సంక్షేమం కోసం, వారి సెలూన్లకు 150 యూనిట్ల వరకు, రజకుల సంక్షేమంలో భాగంగా పూర్తి ఉచితంగా, స్వర్ణకారులకు 100 యూనిట్ల వరకు, చేనేత కార్మికులకు 150 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను అందిస్తాం. దేశంలోనే అత్యధిక సంఖ్యలో ఎల్ ఈడీ బల్బులను ఏర్పాటుచేశాం. భవిష్యత్తులో విద్యుత్ సుంకాల్లో ఎలాంటి పెరుగుదలను ప్రతిపాదించడం లేదు. చంద్రన్న పెళ్లికానుక పథకాన్ని ప్రభుత్వం శాచురేషన్ పద్ధతిలో ప్రతిపేద కుటుంబానికీ విస్తరించింది. ఒక్కో కుటుంబానికి రూ.20 వేలు వార్షిక కవరేజితో ఆరోగ్య బీమా పథకం చేపడుతున్నాం.'

భారీగా పెంచినవి

ఏపీ ధరల స్థిరీకరణ నిధి(100%)	1,000
పశువుల బీమా(300%)	200
డ్వాక్రా గ్రూపులకు పసుపు-కుంకుమ(135%)	4,000
వెనుకబడిన తరగతుల కార్పొరేషన్లు(124%)	3,000
చంద్రన్న బీమా(152%)	354

368 క్యాంటీన్లు

'డ్రైవర్ల సామాజిక, ఆర్థిక శ్రేయస్సు కోరుకుంటూ, రూ.150 కోట్ల కేటాయింపుతో డ్రైవర్ల సాధికార సంస్థను స్థాపించడానికి ప్రతిపాదిస్తున్నాం. దీనిని రైతు సాధికార సంస్థ, మహిళా సాధికార సంస్థ తరహాలోనే ఏర్పాటు చేస్తాం. 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 368 క్యాంటీన్లు మంజూరుచేశాం. అవి ఇప్పటికే పనిచేయడం మొదలుపెట్టాయి. ఉపాధి పథకం ద్వారా కేంద్రం ఆమోదించిన లేబర్ బడ్జెట్ రూ.22 కోట్లు కాగా, ఇప్పటికే రూ.20.19 కోట్లు విలువైన పనిదినాలు నమోదుచేశాం. ఎన్టీఆర్ వైద్యసేవ పథకంద్వారా రూ.5,330 కోట్ల ఖర్చు తో 12 లక్షల మంది రోగులకు లబ్ధి చేకూర్చాం. ఈ పథకంలో ప్రతి కుటుంబానికి ఉన్న అవధిని రూ.2.50 లక్షల నుంచి రూ.ఐదు లక్షలకు పెంచాం.'

వడి వడిగా పెట్టుబడి

'ప్రభుత్వం అవలంబిస్తున్న సానుకూల విధానాల వల్ల ప్రఖ్యాతిగాంచిన కియ మోటార్స్, ఇసుజు, హీరో గ్రూప్, పెప్సికో, మాండలీజ్ జైన్ ఇరిగేషన్, అరవింద్ మిల్స్,షాహీ ఎక్స్‌పోర్ట్స్, జాకీ మొదలైన సంస్థలు, తమ కార్యకలాపాలు మన రాష్ట్రంలో నెలకొల్పేందుకు ఉత్సాహం చూపిస్తున్నాయి. 13 వేల మందికి ఉపాధి కల్పించగల ఫాక్స్‌కాన్ లాంటి సంస్థలను మన రాష్ట్రానికి ఆకర్షించగలిగాం. రూ.70 వేల కోట్ల ప్రతిపాదిత పెట్టుబడితో విశాఖపట్నంలో ఒక డేటా సెంటర్‌ను ఏర్పాటుచేయడానికి అదానీ సంస్థతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాం.'

రాజధాని భూసేకరణపై బిజినెస్ స్కూల్లో స్టడీ

'నదుల అనుసంధానం ద్వారా ఇప్పటివరకు గోదావరినుంచి 263 టీఎంసీల నీటిని కృష్ణా నదిలోకి మళ్లించాం. ఇప్పటి వరకు రూ.64,334 కోట్లు సాగునీటి రంగంపై ఖర్చు పెట్టాం. స్వచ్ఛంద భూసమీకరణ పథకం ద్వారా రాజధానికి 28,074 మంది రైతులు 34,010 ఎకరాలు సమకూర్చిన ఘట్టం.. అంతర్జాతీయ బిజినెస్ స్కూళ్లలో ఒక కేసు స్టడీగా మారింది. అమరావతి నిర్మాణానికయ్యే ఖర్చు మొత్తం రూ.1,09,023 కోట్లుగా అంచనా వేశాం.'

ఉద్యోగుల సహకారం మరవలేం


'కుటుంబంతో గడపగలిగే సమయం, పిల్లల విద్యపై ప్రభావం చూపినా, అమరావతికి తరలిరావడంలో తమదైన పాత్రను ఉద్యోగులు పోషించారు. వారి సహకారం మరవలేం. ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమానికి రాష్ట్ర వ్యాప్తంగా ఇళ్లస్థలాలు/ప్లాట్లు మంజూరు చేయనున్నాం. ఉద్యోగుల వైద్య సేవల కోసం ఈహెచ్‌ఎస్ పథకం ద్వారా రూ.860 కోట్లతో 2.8 లక్షల ప్రభుత్వ ఉద్యోగులకు సహకారాన్ని అందించాం. యువతకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించడం కోసం 42 వేల పోస్టులను నేరుగా భర్తీచేయనున్నాం. సీఎఫ్‌ఎంఎస్ వల్ల కాగితరహిత కార్యకలాపాలకు చక్కని మార్గమేర్పడింది. ప్రభుత్వ పంపిణీ వ్యవస్థలో ఆధార్ అనుసంధానం వల్ల రూ.2,585 కోట్లు ఆదా అయింది.'

అప్పులూ- మిగుళ్లూ..

'మొత్తం అప్పులు 2014-15 ఏడాదికిగాను రూ.1,48,744 కోట్ల నుంచి 2017-18 సంవత్సరానికి రూ.2,23,706 కోట్లకు పెరిగాయి. ఇది జీఎస్‌డీపీ 2014-15లో 28.33 శాతానికి సమానం కాగా, 2017-18 సంవత్సరానికి 27.83 శాతానికి సమానం. 2017 ఏప్రిల్ 1 నుంచి 2018 మార్చి మధ్య కాలానికి రూ.16,151.08 కోట్ల రెవెన్యూ లోటు, రూ.32,372.57 కోట్ల ఆర్థిక లోటు కనిపిస్తోంది. 2017 ఏప్రిల్ 1 నుంచి 2018 మార్చి 31 మధ్య కాలానికి రెవెన్యూ లోటు, ఆర్థికలోటు రాష్ట్రస్థూల ఉత్పత్తిలో వరుసగా 2.01 శాతం, 4.03 శాతంగా ఉన్నాయి. సవరించిన అంచనాల ప్రకారం రెవెన్యూ వ్యయం రూ.1,50,858.53 కోట్లు, కేపిటల్ వ్యయం రూ.25,021.34 కోట్లు, 2018-19 సంవత్సరానికి రెవెన్యూ లోటు దాదాపు రూ.2,494.12 కోట్లు. ఆర్థికలోటు దాదాపు రూ.29,141.72 కోట్లు. ఆర్థిక సంవత్సరానికి గాను రూ.2,26,177.53 కోట్ల వ్యయాన్ని ప్రతిపాదిస్తున్నాం. ఇందులో రెవెన్యూ వ్యయం రూ.1,80,369 కోట్లు, మూలధన వ్యయం రూ.29,596 కోట్లుగా అంచనా వేశాం. 2018-19 బడ్జెట్ అంచనాల కన్నా 2019-20 బడ్జెట్ అంచనాలు మొత్తం మీద 18.38 పెరుగుదలను చూపిస్తున్నాయి. రెవెన్యూ మిగులు రూ.2,099.47 కోట్ల మేర ఉండగలదని అంచనా. ఆర్థికలోటు సుమారు రూ.32,390.68 కోట్ల మేరకు ఉండొచ్చు.'

ప్రతి వర్గానికీ సంక్షేమం

"ప్రామాణిక ఉద్యోగులతోపాటుగా కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకూ 180 రోజుల ప్రసూతి సెలవు వసతిని ప్రభుత్వం కల్పించింది. మహిళలు ఉద్యోగాల్లో మరింతగా పాలుపంచుకునేందుకు దోహదపడే నిర్ణయం ఇది. ముఖ్యమంత్రి యువనేస్తం కింద 4.3 లక్షల మందికి రూ.1000 వంతున నిరుద్యోగ భృతిని అందిస్తున్నాం. ఇటీవలే ఈ భృతిని రూ.2 వేలకు పెంచాం. నాలుగున్నర సంవత్సరాలుగా ప్రభుత్వం రూ.32,843 కోట్లు షెడ్యూల్డు కులాల సంక్షేమానికి, రూ.8950 కోట్లు షెడ్యూల్డు తెగల సంక్షేమానికి, రూ.28,805 కోట్లు వెనుకబడిన తరగతుల సంక్షేమానికి ఖర్చు చేసింది. అన్ని వెనుకబడిన వర్గాల సంక్షేమాన్ని పెంపొందించాలని సర్కారు సంకల్పించింది. దీనికోసం యాదవ, తూర్పుకాపు/గాజుల కాపు, కొప్పుల వెలమ/పోలినాటి వెలమ, కురబ/కురుమ, వణ్యకులక్షత్రియ(వణ్ణెరెడ్డి/వన్ని కాపు/పల్లికాపు/పల్లిరెడ్డి), కళింగ, గవర,చేనేత(పద్మశాలి/దేవాంగ/తొగట/శాలి/తొగట-వీరక్షత్రియ/పట్టుశాలి/తొగటశాలి/సేనాపతుల/శాలివన్), మత్స్యకారులకు(అగ్నికులక్షత్రియ/పల్లి/వాడబలిజ/బెస్త/జాలరి/గంగవర్/గంగపుత్ర/గూండ్ల/నెయ్యిల/పట్టపు, గాండ్ల/తెలికుల/దేవటిలకుల) కొత్త కార్పొరేషన్లు ఏర్పాటుచేశాం. రజక, నాయీ బ్రాహ్మణ, వడ్డెర, సగర/ఉప్పర, కృష్ణ బలిజ/పూసల,వాల్మీకీ/బోయ, బట్రాజ, కుమ్మరి/శాలివాహనలకు ఉన్న కోఆపరేటివ్ సొసైటీస్ ఫెడరేషన్‌ను కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్‌గా మార్చాం. వెనుకబడిన కార్పొరేషన్లకు రూ.మూడు వేల కోట్లను కేటాయించేందుకు ప్రతిపాదిస్తున్నాం. వివిధ వెనుకబడిన తరగతుల కార్పొరేషన్లకు వారిలో దారిద్ర్య దిగువరేఖ కింద ఉన్న జనాభా దామాషా పద్ధతిలో ఈ కేటాయింపులు చేస్తాం. మైనారిటీ సంక్షేమానికి రూ.1,304.43 కోట్లను కేటాయిస్తున్నాం. గత ఆర్థిక సంవత్సరంతో పోల్చితే ఇది 18.57 శాతం ఎక్కువ. దివ్యాంగుల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యతనిచ్చాం. వారికి పునరావాసం, కృత్రిమ అవయవాలు ఏర్పాటుచేసే కార్యక్రమానికి 2019-20 సంవత్సరానికి కేటాయింపులను రెట్టింపు చేస్తూ రూ.70 కోట్లను ప్రతిపాదిస్తున్నాం"



రాష్ట్రానికి ఆరోగ్య'మస్తు'

- ఆరోగ్య శాఖకు రూ.10,032 కోట్లు
- 20% పెరిగిన కేటాయింపులు
- పీఎంఎంవీవై పథకానికి రూ.244 కోట్లు
- మందులు, ఔషధాల కొనుగోలుకు 402 కోట్లు

అమరావతి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రజల ఆరోగ్యానికి భరోసా ఇచ్చింది. గత ఏడాది బడ్జెట్‌తో పోలిస్తే తాజా పద్దులో కేటాయింపులను 20% పెంచారు. ప్రస్తుత బడ్జెట్‌లో ఆరోగ్య శాఖకు ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు రూ.10,032 కోట్లు కేటాయించారు. మందుల కొనుగోలుపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది రూ.102 కోట్లు అదనంగా కేటాయించింది. గత ఏడాది మందులు, డ్రగ్స్ కొనుగోలుకు రూ.300 కోట్లు కేటాయించగా.. తాజా బడ్జెట్‌లో రూ.402 కోట్లు ప్రతిపాదించింది. దీంతో ఏ రకమైన ఔషధానికీ రోగులు ఇబ్బంది పడకూడదనేది ప్రభుత్వ ఆలోచన. ఆరోగ్య సేవలకు రూ.332 కోట్లు, జల కాలుష్యం తగ్గించేందుకు రూ.63 లక్షలు కేటాయించింది. ప్రధాన మంత్రి మాతృ వందన యోజన పథకానికి రాష్ట్ర వాటాలో పెద్దపీట వేసింది. స్త్రీలు గర్భందాల్చిన నాటి నుంచి ప్రసవం వరకు ప్రభుత్వం ఈ పథకం కింద సుమారు రూ.6 వేల వరకు నగదు సాయం అందిస్తుంది. ఈ పథకానికి గత ఏడాది రూ.161 కోట్లు కేటాయించిన ప్రభుత్వం తాజా బడ్జెట్‌లో రూ.224.10 కోట్లు కేటాయించింది.

ఎయిడ్స్ రోగులకు రూ.100 కోట్లు

రాష్ట్ర ప్రభుత్వం ఎయిడ్స్ రోగులకు మరింత భరోసా కల్పించింది. ప్రస్తుతం ఎయిడ్స్ రోగులను ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రతి నెలా రూ.1000 పెన్షన్ ద్వారా అందిస్తున్నారు. ఈ మొత్తంలో వారు ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ఉద్దేశం. పెన్షన్‌ను మరింత మంది ఎయిడ్స్ రోగులను ఆదుకునేందుకు బడ్జెట్‌లో అధిక మొత్తంలో కేటాయింపులు చేసింది. గత ఏడాది ఎయిడ్స్ రోగుల పెన్షన్ కోసం ప్రభుత్వం రూ.33 కోట్లు కేటాయించింది. ఈసారి బడ్జెట్‌లో దాదాపు మూడు రెట్లు పెంచిన రూ.100 కోట్లు కేటాయించింది. గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది 163.67% కేటాయించింది.



- కర్నూలులో స్టేట్ కేన్సర్ సెంటర్‌కు రూ.84 కోట్లు
- కాలిన గాయాల శస్త్ర చికిత్సకు రూ.33.47 కోట్లు
- ఎయిడ్స్ రోగుల పింఛన్‌కు రూ.100 కోట్లు
- గర్భిణులకు నెలనెలా రూ.6 వేలు
- మందుల కొనుగోలుకు రూ.402 కోట్లు

సింహభాగం పోలవరానికే

- 9,835 కోట్ల కేటాయింపు.. జలవనరుల మొత్తం పద్దు 16,852 కోట్లు

అమరావతి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్‌లో పోలవరం ప్రాజెక్టుకు అత్యంత ప్రాధాన్యం దక్కింది. 2019 నాటికి ప్రాజెక్టును పూర్తి చేయాలని ముఖ్యమంత్రి సంకల్పించిన నేపథ్యంలో.. దీనికి వచ్చే ఆర్థిక సంవత్సరంలో అత్యధికంగా రూ.9,835.86 కోట్లు కేటాయించారు. మొత్తం జలవనరుల శాఖ పద్దు రూ.16,852.27 కోట్లు కాగా.. అందులో పెద్ద ఖాతా పోలవరానిదే కావడం గమనార్హం. కాగా.. రాష్ట్రంలో ప్రాధాన్య, ఇతర సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి రూ.45 వేల కోట్లు కావాలని జల వనరుల శాఖ తొలుత కోరింది. ఈ లెక్క చూసి ఆర్థిక శాఖ గజగజలాడింది. బడ్జెట్‌కు తగినట్లుగా సహేతుకమైన గణాంకాలు పంపాలని కోరింది. దీంతో దానిని సరిదిద్ది రూ.17,970.86 కోట్లకు కుదించి జల వనరుల శాఖ పంపింది. వీటిని పరిశీలించిన అనంతరం ఆర్థిక శాఖ 2019-20 బడ్జెట్‌లో రూ.16,852.27 కోట్లు కేటాయించింది.



ఆంధ్రజ్యోతి



బడ్జెట్టా..? బాబు స్తోత్రమా: వామపక్షాలు

అమరావతి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): "అసెంబ్లీలో యనమలది బడ్జెట్ ప్రసంగమా? లేక చంద్రబాబును స్తుతించే స్తోత్రమా? ఎన్నికల వేళ మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టాల్సింది పోయి... రాజ్యాంగ విరుద్ధంగా పూర్తిస్థాయి బడ్జెట్‌ను అసెంబ్లీ ముందు ఉంచడమేమిటి" అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. "రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఓట్లకోసం రూపొందించిన అంకెల గారడీలా ఉంది. వాస్తవ విరుద్ధంగా కేటాయింపులు చేసి ప్రజలను మోసగించేలా బడ్జెట్‌ను రూపొందించారు" అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మధు విజయవాడలో అన్నారు.

సంక్షేమ బాట

- పలు పథకాలు, శాఖలకు భారీగా నిధులు
- అన్ని వర్గాలకు మేలు చేసేలా కేటాయింపులు

అమరావతి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ శంఖం పూరించింది. రైతులు, అన్ని సామాజిక వర్గాలు, నిరుద్యోగులపై వరాల జల్లు కురిపిస్తూ 2019-20 ఆర్థిక సంవత్సరానికి రూ.2,26,177.53 కోట్లతో సర్వజన సంక్షేమ బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. 2018-19 బడ్జెట్ కంటే ఇది 18.38 శాతం ఎక్కువ! రైతును రాజుగా చూడాలనే ఉద్దేశంతో రూ.5,000 కోట్లతో 'అన్నదాతా సుఖీభవ' పథకం ప్రవేశపెట్టారు. అలాగే, మార్కెట్ ధర, కొనుగోలు ధరల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని రైతులకు చెల్లించేందుకు మార్కెట్ ఇంటర్‌వెన్షన్ ఫండ్‌ను రూ.1000 కోట్లకు పెంచారు. వెనుకబడినవర్గాల్లో ఉన్న 193 కులాలకు 21 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి ప్రతి కులాన్నీ ఏదో ఒక కార్పొరేషన్ పరిధిలోకి తీసుకొచ్చారు. బీసీలకు గత ఆర్థిక సంవత్సరం వరకూ 11 కార్పొరేషన్లు ఉండగా, ఈ బడ్జెట్లో మరో 10 కార్పొరేషన్లను ఏర్పాటు చేసి... మొత్తంగా రూ.3,000 కోట్లు కేటాయించారు. 2018-19 బడ్జెట్‌లో 11 బీసీ కార్పొరేషన్లను రూ.1337 కోట్లు కేటాయించారు. 2019-20లో బీసీ సబ్‌ప్లాన్‌కి కేటాయించిన రూ.16,226 కోట్లకు ఇది అదనం. నిరుద్యోగులకు ఇస్తున్న భృతిని వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి రెట్టింపు చేస్తున్నట్లు ప్రకటించి రూ.1200 కోట్లు కేటాయించారు.

కీలక శాఖలకు కేటాయింపులు	(రూ.కోట్లలో)	పెంపుదల (శాతం)
గ్రామీణాభివృద్ధి	32,288.58	55.11
ఎస్సీల సంక్షేమం	16,412.97	19.6
వ్యవసాయం	15,246.37	24.95
వైద్యఆరోగ్యశాఖ	10032.15	18.53
పరిశ్రమలు-ఖనిజాలు	4114.92	33.82
గృహనిర్మాణ శాఖ	4079	10.86
సామాజిక భద్రత, సంక్షేమం	3429.39	13.22
నీటి సరఫరా, పారిశుద్ధ్యం	2894.03	10.32
కార్మిక, ఉపాధి శాఖలు	1308.55	45
కళ, సాంస్కృతిక శాఖలు	103.11	8.56
ఆర్థిక సేవల రంగం	84,755.85	24.95
సామాజిక సేవలు	74,511.93	11.01

ద్రవ్య లోటు 32వేల కోట్లు

రాష్ట్ర బడ్జెట్‌లో అంచనా.. 'వృద్ధి'లో దూసుకెళ్తున్న ఏపీ

- సాగు,పారిశ్రామిక, సేవారంగాల్లో 'కేంద్రం' కంటే టాప్
- నాలుగున్నరేళ్లలో చేసిన అప్పు రూ.74,962 కోట్లు

అమరావతి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విభజన సమయంలో ఉన్న ఆర్థిక లోటు అంతకంతకూ పెరుగుతోంది. 2019-20లో ఈ లోటు రూ.32,390.68 కోట్ల వరకు ఉంటుందని బడ్జెట్ అంచనాల్లో పేర్కొన్నారు. అలాగే 2018-19 బడ్జెట్‌లో రూ.5,000 కోట్ల రెవెన్యూ మిగులు చూపించిన ఆర్థిక శాఖ రాబోయే ఏడాది రూ.2,099.47 కోట్ల లోటును అంచనా వేసింది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర జీఎస్‌డీపీ రూ.10.67లక్షల కోట్లు ఉంటుందని, ఇందులో రెవెన్యూ లోటు 0.20% కాగా, ఆర్థిక లోటు 3.03శాతంగా ఉందని అంచనాల్లో వివరించారు. ఇక రాష్ట్ర విభజన నాటి నుంచి 2017-18 ఆర్థిక సంవత్సరం పూర్తయ్యే వరకూ ప్రభుత్వం రూ.74,962 కోట్లు అప్పులు చేసింది. దీంతో 2014-15వ సంవత్సరంలో రూ.1,48,744 కోట్లుగా ఉన్న ఏపీ అప్పు, 2017-18 సంవత్సరం పూర్తయ్యే నాటికి రూ.2,23,706 కోట్లకు పెరిగింది. 2014-15 జీఎస్‌డీపీలో ఇది 28.33% కాగా, 2017-18 జీఎస్‌డీపీలో ఇది 27.83శాతంగా ఉంది. అలాగే పలు అంశాల్లో కేంద్రం సహకరించకపోయినా.. రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికబద్ధంగా తీసుకుంటున్న చర్యల ఫలితంగా 'వృద్ధి'లో గణనీయమైన ప్రగతి సాధించింది. గడచిన నాలుగున్నరేళ్లలో దేశం వృద్ధిరేటు 7.3% ఉండగా, ఏపీ వృద్ధి రేటు 10.66 శాతంగా నమోదైంది. వ్యవసాయరంగంలో దేశం సగటు వృద్ధిరేటు 2.4% నమోదు కాగా, రాష్ట్రంలో 11శాతానికి చేరుకుంది. పారిశ్రామిక రంగంలో దేశం సగటు వృద్ధిరేటు 7.1% కాగా ఏపీ సగటు వృద్ధి రేటు 9.52శాతంగా నమోదైంది. సేవారంగంలో దేశం వృద్ధి రేటు 8.8% ఉండగా ఏపీ సగటు వృద్ధి రేటు 9.57శాతంగా ఉంది. ఫలితంగా 2018-19 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర వృద్ధిరేటు 11.5 శాతంగా అంచనా వేస్తున్నారు. ఇదే సమయంలో దేశం సగటు వృద్ధిరేటు 7.2 శాతంగా కేంద్రం అంచనా వేసింది.

రెవెన్యూ వ్యయంలో 20% పెరుగుదల

2019-20 ఆర్థిక సంవత్సరంలో రెవెన్యూ వ్యయాన్ని రూ.1,80.369.33 కోట్లుగా అంచనా వేశారు. మూలధన వ్యయాన్ని రూ.29,596.53 కోట్లుగా పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అంచనాలతో పోల్చితే రెవెన్యూ వ్యయం 20.03%, మూలధన వ్యయం 3.2% మేర పెరిగాయి. 2018-19 ఆర్థిక సంవత్సరం సవరణ బడ్జెట్‌లో రెవెన్యూ లోటు రూ.2,494.12 కోట్లుగా ఉంది. అదే సమయంలో ఆర్థిక లోటు రూ.29,141.72 కోట్లుగా నమోదైంది. 2018-19 జీఎస్‌డీపీలో రెవెన్యూ లోటు 0.27% కాగా, ఆర్థిక లోటు 3.14శాతంగా ఉంది.

యనమల గారి చిట్టా



వివరం	2017-18	2018-19 (బ.అం)	2018-19 (స.అం)	2019-20 (బ.అం)
1) రెవెన్యూ వసూళ్లు	1,05,062	1,55,507	1,56,364	1,78,269
ఎ)పన్ను ఆదాయం	49,812	65,535	67,535	75,437
బి) పన్నేతర ఆదాయం	3,813	5,346	5,346	5,750
సి) కేంద్ర పన్నుల్లో వాటా	28,674	33,929	32,787	36,360
డి) గ్రాంట్లు	22,760	50,695	50,695	60,721
2) మూలధన వసూళ్లు	86,888	35,552	39,363	47,435
3) మొత్తం వసూళ్లు	1,91,950	1,91,059	1,95,727	2,25,705
4) రెవెన్యూ వ్యయం	1,21,213	1,50,271	1,58,858	1,80,369
5) మూలధన వ్యయం	13,490	28,678	25,021	29,596
6) రుణాలు, వడ్డీ చెల్లింపు	55,089	10,851	10,942	14,917
7) మొత్తం వ్యయం	1,92,574	1,91,063	1,96,948	2,26,177
8) రెవెన్యూ లోటు	-16,151	5,235	-2,494	-2,099
9) ద్రవ్య లోటు	-32,372	-24205	-29,141	-32,390

బ.అం.- బడ్జెట్ అంచనా
స.అం.- సవరించిన అంచనా
(రూ. కోట్లలో)

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా బడ్జెట్

- మంత్రులు కాల్వ, సోమిరెడ్డి.. విప్ పల్లె, చాంద్ బాషా

అమరావతి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మంత్రి యనమల రామకృష్ణుడు బుధవారం సభలో ప్రవేశపెట్టిన 2019-20 తాత్కాలిక బడ్జెట్‌పై తెలుగుదేశం పార్టీ ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం సంక్షేమానికి పెద్దపీట వేసిందని కొనియాడారు. "సంక్షేమం కొనసాగాలంటే ముఖ్యమంత్రి చంద్రబాబు మళ్లీ గెలవాలి. మంత్రి యనమల ప్రజల ఆశయాలు, ఆకాంక్షలకు అనుగుణంగా బడ్జెట్ ప్రవేశపెట్టారు. నాలుగున్నర సంవత్సరాల పాలనలో అభివృద్ధి, సంక్షేమంలో ఏపీ గణనీయమైన పురోగతి సాధించింది. మన రాష్ట్రానికి వచ్చిన 600 అవార్డులు సీఎం చంద్రబాబు పనితీరుకు నిదర్శనం" అని మంత్రి కాల్వ శ్రీనివాసులు అన్నారు. "ప్రధాని మోదీ రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని చెప్పి కుటుంబానికి రూ.6 వేలు ఇచ్చారు. మా ప్రభుత్వం అవ్వతాతలకు పింఛను కింద ఏడాదికి రూ.24 వేలు, దివ్యాంగులకు రూ.36 వేలు ఇస్తుంది. మా ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అద్భుతం, చారిత్రాత్మకం" అని మంత్రి సోమిరెడ్డి చంద్రమోహనరెడ్డి అన్నారు. "ఓటాన్ అకౌంట్ బడ్జెట్ పేదల బతుకుల్లో వెలుగులు నింపే బడ్జెట్. అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లగా భావించి బడ్జెట్ రూపకల్పన చేశారు. మొత్తం బడ్జెట్‌లో ఒక్క సంక్షేమానికే రూ.65,486 కోట్లు కేటాయించడం అభినందించదగ్గ విషయం. నాలుగున్నర ఏళ్లలో పెన్షన్ కోసం టీడీపీ ప్రభుత్వం రూ24,618 కోట్లు ఖర్చు చేస్తే దాంట్లో కేంద్ర ప్రభుత్వం వాటా కేవలం రూ.1,100 కోట్లే. ఇది కేంద్ర ప్రభుత్వ బాధ్యతారాహిత్యానికి నిదర్శనం" అని ప్రభుత్వ విప్ పల్లె రఘునాథ రెడ్డి అన్నారు. ప్రభుత్వ విప్ చాంద్ బాషా మాట్లాడుతూ, "అన్ని కులాలకు, మతాలకు, వర్గాలకు ప్రస్తుత బడ్జెట్‌లో ప్రాధాన్యమిచ్చారు. మైనార్టీల సంక్షేమానికి గతేడాది కంటే ఈ ఏడాది 18 శాతం అధికంగా కేటాయించడం ఆనందకరం" అన్నారు.

కొత్తవి 10 పాయింట్లే: వీర్రాజు

అమరావతి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): "రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో 2014 నుంచి ఇప్పటి వరకు జరిగిన విషయాలే మరలా చదివారు. మంత్రి యనమల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కొత్తవి 10 పాయింట్లే ఉన్నాయి" అని ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. "బడ్జెట్ పుస్తకంలో కానీ, ప్రసంగంలో కానీ ఏ రంగానికి ఎంత కేటాయించింది స్పష్టంగా లేదు. కేంద్రంపై ఆధారపడిన బడ్జెట్‌లా ఉంది. కేంద్రం సాయం చేయడం వల్లే ఏపీ అభివృద్ధి చెందింది. కేంద్రం రైతుకు ప్రకటించిన సాయం గురించి మాట్లాడటం తగదు. సీఎం చంద్రబాబు చేసిందేమీ లేదు. మోదీ వల్లే రాష్ట్రంలో అభివృద్ధి జరిగింది" అని చెప్పారు.

కీలక రంగాలని విస్మరించారు


"బడ్జెట్‌లో కీలక రంగాలను విస్మరించారు. ఎన్నికల కోసం ఆపద్ధర్మంగా కొన్ని రంగాలకే ప్రధాన్యం ఇచ్చారు" అని పీడీఎఫ్ ఎమ్మెల్సీలు ధ్వజమెత్తారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం మాట్లాడారు. 'విద్యారంగానికి, ప్రభుత్వం గొప్పలు చెప్పుకునే నైపుణ్యాభివృద్ధికీ కేటాయింపులు తగ్గాయి. సీపీఎస్‌పై గత సమావేశాల్లో చర్చ జరిగింది. కమిటీ వేశారు. ఈ సమావేశాల్లో అయినా నిర్ణయం వస్తుందని ఆశించాం. నిర్ణయం రాలేదు. ఐఆర్ ప్రకటన ఉంటుందని ఉద్యోగులు ఆశించారు. కానీ ఐఆర్, పీఆర్సీ ప్రస్తావనే లేదు' అని అన్నారు.

రుణవిముక్తి చేశాకే ఎన్నికలకు..

ఒక్కో రైతుకు 1.5 లక్షలు మాఫీ.. ఇంత లబ్ధి 70 ఏళ్లలో తొలిసారి

- 4ఏళ్లలో సాగుపై 81 వేల కోట్లు
- కోటి ఎకరాల్లో మైక్రో ఇరిగేషన్
- ఉద్యానపంటల కేంద్రంగా సీమ
- మత్స్యరంగంలో మనదే సగం వాటా
- సాగు చర్చలో ముఖ్యమంత్రి వెల్లడి

అమరావతి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ముందుకు సాగుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఈ రంగంలో నాలుగేళ్లలో జాతీయ సగటు వృద్ధిరేటు 2.4శాతం ఉంటే, ఏపీలో 11శాతం ఉందని తెలిపారు. ఎన్ని అవాంతరాలు ఎదురైనా, వర్షాభావం ఏర్పడినా ఎదుర్కొని అధిగదిగుబడి సాధిస్తున్నామని చెప్పారు. వ్యవసాయం, దాని అనుబంధ రంగాలపై మంగళవారం అసెంబ్లీలో చేపట్టిన స్వల్పకాలిక చర్చలో ఆయన ప్రసంగించారు. "2004 నుంచి 2014 వరకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎరువుల్లేక, విత్తనాలు లేక ఆత్మహత్యలు చేసుకున్నారు. విద్యుత్‌షాక్‌లతో మృత్యువాత పడ్డారు. చివరికి కోనసీమలో కూడా క్రాప్ హాలిడే ప్రకటించే పరిస్థితి తీసుకొచ్చారు. తెలుగుదేశం ప్రభుత్వం మొట్టమొదటిసారిగా వ్యవసాయ రంగానికి ప్రత్యేక బడ్జెట్ విధానం తీసుకొచ్చింది. నాలుగేళ్లలో వ్యవసాయ రంగానికి రూ.81వేల కోట్లు ఖర్చుచేశాం. రైతుల ఆదాయం 97శాతం పెంచాం. ప్రకృతి సేద్యంలో 8శాతం వృద్ధి సాధించాం" అని వివరించారు. కేంద్రం రైతులకు అన్ని రకాలుగా అన్యాయం చేసిందని విమర్శించారు. ఐదు ఎకరాలు ఉన్న కుటుంబానికి రూ.6వేలు ఇస్తామని ప్రకటించారని, అంటే రైతుకు రోజుకు రూ.17 వస్తాయని, ఇది రైతుకు భిక్షం వేస్తున్నట్టుగా ఉందని మండిపడ్డారు. ఫసల్ బీమా పథకమే పెద్ద ఫార్సు అని ఆరోపించారు. తమ ప్రభుత్వం జీరో బడ్జెట్ వ్యవసాయానికి అత్యధిక ప్రాధాన్యమిస్తోందని తెలిపారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో 7.5లక్షల మంది రైతులు ప్రకృతి సేద్యంలోకి వస్తున్నారని, 2024 నాటికి అందరూ ఇదే విధానంలోకి వస్తారన్నారు. "స్వాతంత్ర్యం వచ్చాక ఎవరూ చేయనివిధంగా రైతుకు రూ.లక్షన్నర చొప్పున రుణవిముక్తి చేశాం. ఇంకా కొందరికి అందాలి. అందరికీ రుణవిముక్తి చేశాకే ఎన్నికలకు వెళ్తాం. అప్పట్లో మోదీ రుణవిముక్తి వద్దన్నారు. ఆర్‌బీఐ కూడా వద్దని చెప్పింది. అయినా రైతుల కోసం అమలు చేశాం" అని వివరించారు.



త్వరలోనే ఐదు మెగా ఫుడ్‌పార్కులు

భవిష్యత్తులో రాష్ట్రంలో ఐదు మెగా ఫుడ్‌పార్కులు నిర్మిస్తున్నామని, కర్నూలులో సీడ్ పార్కు ఏర్పాటుచేస్తున్నామని సీఎం వివరించారు. వర్షాభావ పరిస్థితులు ఏర్పడినా, నదుల అనుసంధానంతో వాటిని అధిగమించామన్నారు. బిందు, తుంపర సేద్యాన్ని ప్రోత్సహిస్తున్నామన్నారు. 26లక్షల మంది కౌలు రైతులకు రూ.9400కోట్లు రుణాలు ఇచ్చామని, 490 ఎంపీఈవోలను నియమించి రైతులకు విలువైన సలహాలు అందించామని వివరించారు. తడిసిన ధాన్యానికి కేంద్రం సాయం చేయకపోయినా, ఆ భారం భరించి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నామన్నారు. తుఫాన్లు ఏర్పడినా కేంద్రం సాయంపై స్పందించడం లేదని విమర్శించారు. 4.7లక్షల మంది రైతులకు వ్యవసాయ యంత్రాలు పంపిణీ చేశామని చెప్పారు. ఉద్యాన పంటలకు రాయలసీమ కేంద్రంగా మారుతోందని, అనంతపురంలో రైతుల ఆదాయం భారీగా పెరిగిందని తెలిపారు. రూ.14700కోట్ల ఆదాయంతో ఉద్యాన పంటల్లో అనంత అగ్రస్థానంలో నిలిచిందన్నారు. పట్టు పరిశ్రమకు 70 నుంచి 80శాతం రాయితీలు ఇస్తున్నామని, పాడిపరిశ్రమలో, గుడ్ల ఎగుమతుల్లోనూ అగ్రస్థానంలో ఉన్నామన్నారు. పశువుల కోసం గోకులాలు, మినీ గోకులాలు నిర్మిస్తున్నామని తెలిపారు. మత్స్య రంగంలో దేశంలో 45శాతం వాటా మన రాష్ట్రానిదేనని చెప్పారు. ఎన్ని ఇబ్బందులు వచ్చినా ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని పునరుద్ఘాటించారు.

విపక్షాలకు తెలియదు : సోమిరెడ్డి

ఈ ఏడాది తొలి త్రైమాసికంలో ఉద్యాన రంగంలో 17శాతం వృద్ధి వచ్చిందని, కరువు వల్ల వ్యవసాయంలో కొంత లోటు ఏర్పడిందని వ్యవసాయ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. కేంద్రం రైతు కుటుంబం మొత్తానికి ఏడాదికి రూ.6వేలు ఇస్తే, తాము వృద్ధాప్య పెన్షన్ కింద అవ్వకు ఏడాదికి రూ.24వేలు ఇస్తున్నామని చెప్పారు. రూ.5400కోట్లు పెట్టుబడి రాయితీ కింద ఇస్తున్నామని పేర్కొన్నారు. "ప్రతిపక్షానికి వ్యవసాయం అంటే ఏంటో తెలియదు. అందుకే రోడ్లపై తిరుగుతూ ఏదేదో మాట్లాడుతున్నారు. కనీసం అసెంబ్లీకైనా వచ్చి ఉంటే సాగు గురించి తెలుసుకునే అవకాశం వచ్చేది. అసెంబ్లీకి రాకపోయినా జీతాలు మాత్రం కచ్చితంగా తీసుకుంటున్నారు" అని సోమిరెడ్డి మండిపడ్డారు. పాడి పరిశ్రమలో 12శాతం వృద్ధి సాధించామని మంత్రి ఆదినారాయణరెడ్డి తెలిపారు. నదుల అనుసంధానంతో అటు కృష్ణా డెల్టాకు, ఇటు రాయలసీమకు సాగునీరు అందుతోందని, తద్వారా పశుగ్రాస కొరత తీరి పాడి పరిశ్రమ అభివృద్ధి చెందుతోందన్నారు. 12,274 గ్రామాల్లో సైలేజ్, దాణామృతం కేంద్రాలు ఏర్పాటుచేశామని తెలిపారు.

సభలో ఏడు బిల్లులు

ప్రభుత్వం మంగళవారం శాసనసభలో ఏడు బిల్లులు ప్రవేశపెట్టింది. ఆయా శాఖల మంత్రులు వాటిని సభ ముందుంచారు. విశాఖపట్నంలోని సింహాచలం దేవస్థానం పరిధిలోని పంచగ్రామాల ఆక్రమణల క్రమబద్ధీకరణ బిల్లు, చుక్కల భూముల (అప్‌డేషన్ ఇన్ రీసెటిల్‌మెంట్ రిజిస్టర్) సవరణ బిల్లు, ఏపీ అసైన్డ్ భూముల (బదిలీల నిషేధం) సవరణ బిల్లు, శ్రీవెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ విశ్వవిద్యాలయ సవరణ బిల్లు, పరిశ్రమల సవరణ బిల్లు, పారిశ్రామిక వివాదాల సవరణ బిల్లు, కార్మిక చట్టాల (కాంపౌండింగ్ ఆఫ్ అఫెన్సెస్) సవరణ బిల్లులను ప్రవేశపెట్టారు.

అమరావతికి 51,687 కోట్లు

రుణంగా రూ. 37,112 కోట్లు సేకరణ.. ఏటా రూ.1800 కోట్లు చొప్పున ఏడేళ్లు

- 12,600 కోట్లు ఇవ్వనున్న సర్కారు
- బాండ్లద్వారా 500 కోట్ల సమీకరణ
- సీఆర్డీయేకు రాష్ట్ర ప్రభుత్వం గ్యారంటీ
- సమగ్ర ఆర్థిక ప్రణాళికకు ఆమోదం

అమరావతి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచంలోనే అగ్రగామి నగరంగా అమరావతిని తీర్చిదిద్దేందుకు అవసరమైన నిధుల సమీకరణకు ఒక సమగ్ర ఆర్థిక ప్రణాళికకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈమేరకు మంగళవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ ప్రణాళికను ప్రతి ఆరు నెలలకు ఒకసారి సమీక్షించుకుంటూ, అవసరమైన సందర్భాల్లో సీఆర్డీయే అథారిటీ అనుమతితో ముందుకు సాగాలని సీఆర్డీయే కమిషనర్‌ను ఈ ఉత్తర్వుల్లో ఆదేశించారు. ఈ ఉత్తర్వులను అనుసరించి.. ప్రాజెక్ట్ అమరావతికి అయ్యే మొత్తం వ్యయం రూ.51,687 కోట్లుగా ఏపీసీఆర్డీయే అంచనా వేసింది. ఇందులో టైర్-1 ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కోసం (రాజధానిలో రహదారులు- యుటిలిటీలు, గ్రామాల్లో వసతుల కల్పన, హైవోల్టేజ్ విద్యుత్తు టవర్ల మళ్లింపునకు) రూ.18,769 కోట్లు, టైర్-2 ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కోసం(రాజధాని నగరంలోని అన్ని ప్రాంతాలు, ఎల్పీఎస్ లేఅవుట్లలో సకల మౌలిక వసతుల అభివృద్ధి) రూ.17,910 కోట్లు, అవసరమైన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌తోపాటు బీఆర్టీఎస్‌తో కూడిన అమరావతి గవర్నమెంట్ కాంప్లెక్స్‌కు రూ.14,008 కోట్లు అవసరం. ఈ మొత్తంలో రూ.37,112 కోట్లను వివిధ మార్గాల ద్వారా రుణరూపేణా సమీకరించనున్నారు. ఈ రుణాల కోసం వివిధ ఆర్థిక సంస్థలు, వాణిజ్య బ్యాంకులను ఆశ్రయించేందుకు ఏపీసీఆర్డీయే కమిషనర్‌కు అధికారమిచ్చింది. ఇందుకోసం అమరావతిలోని ఆస్తులు, భూములను వాటికి తనఖా (సీఆర్డీయే అథారిటీ ఆమోదంతో) పెట్టేందుకు అనుమతించింది. రాజధాని నిర్మాణానికి 2036-37 వరకు అవసరమైన రుణాలను సమకూర్చుకునేందుకు 3709 ఎకరాలను తనఖా పెట్టేందుకు అనుమతినిచ్చింది. అమరావతిలో ఆర్థికాభ్యున్నతికి దోహదపడేందుకుగాను 3254 ఎకరాలను రిజర్వ్ చేసింది.



ప్రాజెక్ట్ వ్యయంలో తనవంతుగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదలుకుని 2026 వరకు, ఏడు సంవత్సరాలపాటు రాష్ట్ర ప్రభుత్వం సీఆర్డీయేకు ఏటా రూ.1,800 కోట్ల చొప్పున మొత్తం రూ.12,600 కోట్లను ఇవ్వనుంది. అయితే ఇది రుణరూపేణా ఉంటుంది. ఈ మొత్తాన్ని తదుపరి దశల్లో సీఆర్డీయే తనకు ఉన్న వాణిజ్య భూములను ఉపయోగించుకోవడం ద్వారా తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. పబ్లిక్ బాండ్ల జారీ ద్వారా రూ.500 కోట్లను సమీకరించేందుకుగాను, వాటికి రాష్ట్ర ప్రభుత్వం గ్యారెంటీ ఇవ్వనుంది. ఈ బాండ్లకు ఇవ్వాల్సిన వడ్డీరేటును (సీఆర్డీయే అథారిటీ ఆమోదముద్రతో) నిర్ణయించేందుకు సీఆర్డీయే కమిషనర్‌కు అనుమతినిచ్చింది.

ఎస్ఐఐడీపీకి అనుమతి

అమరావతి సస్టెయినబుల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ ఇన్‌స్టిట్యూషనల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుకు(ఏఎస్ఐఐడీపీ) అనుమతులను మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులిచ్చింది. విదేశీ ఆర్థిక సహాయంతో నడిచే పథకం (ఈఏపీ) అయినందున దీని అమలుకు రాష్ట్ర ప్రభుత్వ ఆమోదం తప్పనిసరి. ఈ పథకానికి అయ్యే మొత్తం ఖర్చు 71.50 కోట్ల అమెరికన్ డాలర్లు. ఇందులో ప్రపంచ బ్యాంక్, ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు (ఏఐబీ) సంయుక్తంగా 50 కోట్ల డాలర్లను రుణంగా ఇస్తుండగా, మిగిలిన 21.50 కోట్ల యూఎస్ డాలర్లను రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా భరించనుంది. ఈ పథకం ఏపీసీఆర్డీయే, ఏడీసీల ద్వారా అమలవుతుంది.

4,900 కోట్లతో శాశ్వత సెక్రటేరియట్

అమరావతికే మకుటాయమానంగా నిర్మించదలచిన శాశ్వత సచివాలయం- శాఖాధిపతుల కార్యాలయాలుండే ఐదు టవర్లను రూ.4,900 కోట్ల అంచనా వ్యయంతో తన తరఫున నిర్మించేందుకు ఏపీసీఆర్డీయేకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతినిచ్చింది. బీవోటీ (నిర్మాణం, నిర్వహణ, బదిలీ) విధానంలో జరిగే ఈ టవర్ల నిర్మాణానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం, సీఆర్డీయేల మధ్య అవగాహన ఒప్పందం కుదరాల్సి ఉంది. ప్రతిపాదించిన ఎంవోయూ ప్రకారం ఈ ప్రాజెక్టుకు అయ్యే మొత్తం వ్యయంలో 20 శాతాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరిస్తుండగా, మిగిలిన 80 శాతం నిధులను హడ్కో, వాణిజ్య బ్యాంకుల నుంచి రుణంగా తీసుకోవాలి. ఈ రుణాలకు 8.28 శాతం వడ్డీని ఇవ్వాలి. ఆ ప్రకారం ఈ ప్రాజెక్టుకు అయ్యే వ్యయం రూ.5404.20 కోట్లు కానుంది. రుణాలను తిరిగి చెల్లించేందుకు 12 సంవత్సరాల కాలవ్యవధిని నిర్దేశించిన ప్రభుత్వం అందులో ప్రిన్సిపల్ మారటోరియం పీరియడ్ మూడేళ్లని పేర్కొంది. ఈ ప్రాజెక్టుకు అవసరమయ్యే రుణాలను టర్మ్ లోన్లుగా తీసుకునే సీఆర్డీయే, అందుకు ప్రభుత్వం తనకు చెల్లించే యాన్యుటీని గ్యారంటీగా చూపనుంది. 12 ఏళ్లపాటు ప్రభుత్వం ఏడాదికి రూ.582 కోట్లను (3 నెలలకోమారు రూ.145.70 కోట్ల చొప్పున) చెల్లిస్తుంది. 12 సంవత్సరాల తర్వాత సీఆర్డీయే సచివాలయ టవర్లను ప్రభుత్వానికి బదలాయిస్తుంది. ఈ టవర్ల నిర్మాణం పూర్తయిన తర్వాత వాటిల్లోని కొంత స్థలాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థలు, వాణిజ్య బ్యాంకులు, ఇతర సంస్థలకు అద్దెకు ఇవ్వడం ద్వారా ప్రభుత్వంపై పడే రుణభారాన్ని తగ్గించాల్సిందిగా సీఆర్డీయేను ఆదేశించింది. రాజధాని వనరులను సాధ్యమైనంత ఎక్కువగా వినియోగించుకోవడంతోపాటు అన్ని అంచనాల తయారీ లోపరహితంగా జరిగేలా చూసేందుకు ఆర్అండ్‌బీ సహా వివిధ ప్రభుత్వ శాఖల సీఈలతో కూడిన టెక్నికల్ ఇవాల్యుయేషన్ కమిటీని ఏర్పాటు చేయాలని, థర్డ్ పార్టీ ఏజన్సీలు, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్లను నియమించుకోవాలని కోరింది. తద్వారా ప్రపంచంలో, భారతదేశంలో ఇలాంటి ఆఫీస్ స్పేస్‌ల నిర్మాణానికి అయ్యే వ్యయానికి సమానంగా ఇక్కడి ఖర్చూ ఉండేలా చూడాలని ఆదేశించింది.

384 కి.మీ.. 14 ప్యాకేజీలు.. 20వేల కోట్లు!

- అనంతపురం-అమరావతి ఎక్స్‌ప్రెస్‌వే డీపీఆర్‌లు రెడీ
- త్వరలో కేంద్రానికి నివేదన.. పూర్తికావొస్తున్న భూసేకరణ
- బడ్జెట్‌లోనూ ప్రస్తావించిన రాష్ట్ర ప్రభుత్వం

అమరావతి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ప్రతిష్ఠాత్మక అనంతపురం-అమరావతి గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వేకు మార్గం మరింత సుగమమైంది. ఇటీవలే షార్టెస్ట్ స్ట్రెయిట్ అలైన్‌మెంట్ (ఎస్ఎస్ఎ)కు గ్రీన్‌సిగ్నల్ కేంద్రం తాజాగా పలు సాంకేతిక అనుమతులను కూడా మంజూరు చేసింది. దీంతో ఇప్పటిదాకా ఎదురైన చిక్కులు ఒక్కటొక్కటిగా తొలగిపోయాయి. ఈ నేపథ్యంలో మొత్తం ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్ట్ రిపోర్టు (డీపీఆర్) కూడా అధికారులు సిద్ధం చేసినట్లు తెలిసింది. త్వరలో కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ (ఎంఓఆర్‌టీహెచ్)కు దాన్ని నివేదించనున్నారు. మరోవైపు జాతీయ రహదారుల చట్టం-1951 మేరకు రహదారి నిర్మాణం కోసం చేపట్టిన భూసేకరణ 90 శాతం పూర్తయింది. ఇదే విషయాన్ని కేంద్రం అధికారికంగా ప్రకటించింది. ఈ నేపథ్యంలో అనంత-అమరావతి ఎక్స్‌ప్రెస్‌వే రాబోతోందంటూ రాష్ట్ర ప్రభుత్వం ఓట్-ఆన్-అకౌంట్ బడ్జెట్‌లోనూ ప్రస్తావించింది. వివరాల్లోకి వెళ్తే... రాయలసీమను అమరావతితో అనుసంధానంకోసం 585 కి.మీ. పొడవైన ఎక్స్‌ప్రెస్‌వేను సర్కారు ప్రతిపాదించింది. ఇందులో 384 కి.మీ. గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే. ఆరు, నాలుగు వరసల్లో ఈ రహదారిని నిర్మిస్తున్నారు. రహదారి నిర్మాణానికి రూ. 20వేల కోట్లు, భూసేకరణకు రూ.2500 కోట్లు ఖర్చుకానుంది. భూసేకరణ వ్యయంలో సగం కేంద్రమే భరించనుంది. అయితే 384 కి.మీ. గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణానికి సంబంధించి 20వేల కోట్ల అంచనా వ్యయంతో సమగ్ర ప్రాజెక్టులు రూపొందించారు. ఆరు, నాలుగు వరసల రహదారులు, మార్గంలో భారీ వంతెనలతో కూడిన నిర్మాణాలు ఉండేలా పనులను 14 ప్యాకేజీల కింద విభజించినట్లు తెలిసింది. 20వేల కోట్ల వ్యయంతో 14 ప్యాకేజీల కింద పనులు చేపట్టేలా మొత్తం ప్రాజెక్టు పేరిట ఒక డీపీఆర్ తయారైంది. ఇంకా.. 14 ప్యాకేజీలకు వాటి అంచనా వ్యయానికి సంబంధించిన నివేదికలు తయారవుతున్నాయి. ఇప్పటికే ఏడు ప్యాకేజీల డీపీఆర్‌లు రెడీ అయినట్లు తెలిసింది. త్వరలో మిగతా ప్యాకేజీల డీపీఆర్‌లు కూడా సిద్ధం చేయాలని కన్సల్టెన్సీకి అధికారులు సూచించారు. ఈ నెలాఖరుకి ఈ ప్రక్రియ పూర్తికావొచ్చని అధికారవర్గాలు తెలిపాయి. ఇదిలా ఉంటే.. ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను 90 శాతం పూర్తిచేసినట్లు కేంద్రం ప్రకటించింది. ఇదే విషయాన్ని రాజ్యసభలో ఓ ప్రశ్నకు బుదులుగా చెప్పారు. మరోవైపు రాష్ట్రం కూడా ఈ ప్రాజెక్టు రాబోతోదంటూ బడ్జెట్‌లో ప్రముఖంగా ప్రస్తావించింది. 20వేల కోట్లతో 384 కి.మీ. మేర గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణానికి ఎన్‌హెచ్ఏఐకి అనుమతి ఇచ్చిందని ప్రభుత్వం పేర్కొంది. గత నాలుగేళ్లలో కొత్తగా 2,164 కి.మీ మేర జాతీయ రహదారుల నిర్మాణం జరిగిందని వివరించింది. కాగా, 2019-20 బడ్జెట్‌లో రోడ్లు భవనాల శాఖకు రూ.5,673 కోట్లు ప్రతిపాదించారు. ఇందులో 1611 కోట్లను ఓట్-ఆన్ కింద ప్రతిపాదించారు. ఇందులోనే రూ.290 కోట్లు రోడ్డు రవాణా రంగానికి ప్రతిపాదించారు. మిగిలిన నిధులు కొత్తగా ప్రతిపాదించిన రహదారులు, వంతెనల నిర్మాణం కోసం వినియోగించనున్నారు.

హాకీ ప్రపంచకప్‌కు భారత్ బిడ్డింగ్

లాసానె: హాకీ ప్రపంచకప్ ఆతిథ్య హక్కుల కోసం భారత్‌తో పాటు ఆరు దేశాలు బిడ్ దాఖలు చేసినట్టు అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) వెల్లడించింది. 2023 (జనవరి 13-29)లో జరిగే పురుషులు లేదా మహిళల వరల్డ్ కప్ నిర్వహణకు భారత్ బిడ్ వేసినట్టు తెలిపింది. ఇప్పటి దాకా మూడుసార్లు ప్రపంచకప్ నిర్వహించిన భారత్.. చివరగా గతేడాది భువనేశ్వర్ వేదికగా పురుషుల కప్‌కు ఆతిథ్యమిచ్చిన సంగతి తెలిసిందే.

సౌరాష్ట్ర x విదర్భ
రంజీ ఫైనల్ (నాలుగో రోజు)
ఉ. 9 గం. నుంచి
స్టార్‌స్పోర్ట్స్ 2లో..

ప్రొ వాలీబాల్‌లో నేడు
కొచ్చి X అహ్మదాబాద్
రాత్రి 7 గం. నుంచి
సోనీ సిక్స్, సోనీ టెన్-3లో...



మిథాలీ

ఇంగ్లండ్‌తోనే ఆఖరా..!

టీ20లకు వీడ్కోలు యోచనలో మిథాలీ రాజ్

భారత మహిళల జట్టులో అత్యంత సీనియర్ అయిన మిథాలీ రాజ్ టీ20 కెరీర్ ఇక ముగిసినట్టేనా? ప్రస్తుతం జరుగుతున్న కివీస్‌తో సిరీస్‌లో ఆమెను ఆడిస్తారా? మూడు మ్యాచ్‌ల్లోనూ సుస్థిర స్థానంపై భరోసా లేని వేళ.. ఆమె కీలక నిర్ణయం తీసుకోనుందా? ఇప్పటికిప్పుడు కాకపోయినా స్వదేశంలో వచ్చేనెలలో ఇంగ్లండ్‌తో జరిగే సిరీస్‌లో పొట్టి ఫార్మాట్ నుంచి మిథాలీ వీడ్కోలు చెప్పనుందన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

న్యూఢిల్లీ: భారత వన్డే జట్టు కెప్టెన్ మిథాలీ రాజ్ అంతర్జాతీయ టీ20 కెరీర్ నుంచి తప్పుకొనే అవకాశాలు కనిపిస్తున్నాయి. వచ్చేనెలలో ఇంగ్లండ్ జట్టు భారత పర్యటనకు రానుండగా మార్చి 4 నుంచి మూడు టీ20ల సిరీస్ జరుగుతుంది. ఆ సమయంలోనే 36 ఏళ్ల ఈ సీనియర్ బ్యాట్స్‌వుమెన్ పొట్టి ఫార్మాట్‌కు రిటైర్మెంట్ ప్రకటించనున్నట్టు సమాచారం. అయితే వన్డేల్లో మాత్రం కొనసాగనుంది. మరోవైపు హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలో బుధవారం నుంచి న్యూజిలాండ్‌తో భారత మహిళల జట్టు మూడు టీ20ల సిరీస్ ఆడనుంది. మిథాలీ బ్యాటింగ్ తీరు ఈ ఫార్మాట్‌కు సరిపోదనే అభిప్రాయంతో ఉన్న కెప్టెన్.. ఆమెను తుది జట్టులోకి తీసుకుంటుందా, లేదా? అనేది సందేహమే. ఒకవేళ తొలిమ్యాచ్‌లో ఆడించినా మిగిలిన మ్యాచ్‌లకు దూరం పెట్టే చాన్సుందని టీమ్ మేనేజ్‌మెంట్ నుంచి మిథాలీకి సంకేతాలు అందినట్టు సమాచారం. ఈనేపథ్యంలో ఇంగ్లండ్‌తో సిరీస్‌కు ఎంపిక చేసి ఆమెను గౌరవంగా సాగనంపే అవకాశాలు కనిపిస్తున్నాయి.

నెహ్రా తరహాలో: టీ20ల్లో బంతిని బలంగా బాదడమే ప్రధానం కావడంతో అలాంటి ఆటతీరుకు మిథాలీ సరిపోదనే విమర్శలు చాలా రోజులుగా ఉన్నాయి. ఈ కారణంతోనే టీ20 ప్రపంచకప్ సెమీస్‌లో ఆమెను తుది జట్టుకు ఎంపిక చేయలేదు. ఆ నిర్ణయం మహిళల జట్టులో పెను దుమారం రేపింది. అయితే కెప్టెన్ హర్మన్‌ప్రీత్ మాత్రం మిథాలీ ఉద్వాసనపై ఎలాంటి పశ్చాత్తాపం లేదని అప్పట్లోనే ప్రకటించింది. అదీ కాకుండా వచ్చే ఏడాది జరిగే టీ20 ప్రపంచకప్ కోసం హర్మన్ ఇప్పటి నుంచే పటిష్ఠ జట్టును తయారు చేసుకోవాలనుకుంటోంది. ఎలా గూ మిథాలీ ఆ టోర్నీలో ఆడే అవకాశాలు లేవు. కానీ జట్టుకు ఎనలేని పేరు తెచ్చిన మిథాలీ లాంటి బ్యాట్స్‌వుమన్‌కు ఘనమైన వీడ్కోలు పలకాల్సి ఉందని బీసీసీఐ ఉన్నతాధికారి తెలిపారు. 'ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్‌లో మిథాలీ అన్ని మ్యాచ్‌లు ఆడుతుందని చెప్పలేం. అందుకే పేసర్ ఆశిష్ నెహ్రా తరహాలో సిరీస్‌లోని తొలి మ్యాచ్ ఆడి వీడ్కోలు పలికే చాన్సుంది' అని ఆ అధికారి చెప్పారు.

వేగాన్ని అందుకోవడం లేదా..?: కొంతకాలంగా టీ20ల్లో మిథాలీ చోటుపై చర్చ సాగుతోంది. దీనికి ఆమె స్లో స్ట్రయిక్ రేట్ ఓ కారణం. అలాగే ఫీల్డింగ్‌లో చురుగ్గా లేకపోవడం కూడా ప్రభావం చూపుతోంది. 2017 నుంచి మిథాలీ 105.89 స్ట్రయిక్ రేట్‌తో జెమీమా, స్మృతి, హర్మన్‌ప్రీత్, అనూజ, వేద‌ల తర్వాత ఆరో స్థానంలో ఉంది. ఇది టీ20ల్లో చాలా తక్కువ. మిథాలీ ఇప్పటిదాకా 85 టీ20ల్లో అత్యధికంగా 2,283 రన్స్ చేసి నెంబర్‌వన్‌గా ఉంది. ఇది పురుషుల టీ20ల్లో కూడా ఎక్కువే. ఇందులో 17 అర్ధసెంచరీలు ఉండగా అత్యధిక వ్యక్తిగత స్కోరు 97.

స్టార్ స్పోర్ట్స్ 1,3లో ఉదయం 8.30 నుంచి

రసపట్టులో రంజీ

● సౌరాష్ట్ర 307 ● విదర్భతో ఫైనల్

నాగపూర్: టెయిలెండర్ల అద్భుత పోరాటంతో రంజీ ఫైనల్లో విదర్భకు సౌరాష్ట్ర దీటుగా బదులిచ్చింది. 158/5తో మూడో రోజైన మంగళవారం ఆటను కొనసాగించిన సౌరాష్ట్ర తొలి ఇన్నింగ్స్‌లో 307 పరుగులకు ఆలౌటైంది. దీంతో విదర్భ తొలి ఇన్నింగ్స్ 312 పరుగుల స్కోరుకు 5 పరుగులు మాత్రమే వెనుకబడింది. ఓవర్‌నైట్ బ్యాట్స్‌మన్ స్నెల్ పటేల్ (102) పరుగులు చేయగా.. ఉనాద్కట్ (46), సకరియా (28 నాటౌట్), కమలేష్ (27) విదర్భ బౌలింగ్‌ను ఎదుర్కొని జట్టును పోటీలో నిలిపారు. ఆదిత్య సర్వాటే (5/98) ఐదు వికెట్లతో అదరగొట్టగా.. అక్షయ్ వాఖరే (4/80) నాలుగు వికెట్లు తీశాడు. ఉమేష్ యాదవ్ (1/59) బాడీలైన్ బౌలింగ్‌తో సౌరాష్ట్ర బ్యాట్స్‌మెన్‌ను ఇబ్బంది పెట్టాలని చూసినా.. వారు మాత్రం మొండి ధైర్యం ప్రదర్శించారు. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో విదర్భ.. ఆట ముగిసే సమయానికి 55/2 పరుగులు చేసింది. ఓపెనర్లు ఫయాజ్ ఫజల్ (10), సంజయ్ (16)ను లెఫ్టామ్ స్పిన్నర్ ధర్మేంద్రసింహ్ జడేజా (2/36) పెవిలియన్ చేర్చాడు. వెటరన్ వసీం జాఫర్ (5), గణేష్ సతీష్ (24) క్రీజులో ఉన్నారు. ప్రస్తుతం విదర్భ 60 పరుగుల ఆధిక్యంలో ఉండగా.. చేతిలో 8 వికెట్లున్నాయి.

పంత్‌ను 4 లేదా 5లో ఆడించాలి


గవాస్కర్

న్యూఢిల్లీ: వచ్చేనెలలో ఆరంభమయ్యే ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌కు యువ వికెట్ కీపర్, బ్యాట్స్‌మన్ రిషబ్ పంత్‌ను ఎంపిక చేయాలని టీమిండియా మాజీ కెప్టెన్ సునీల్ గవాస్కర్ సూచించాడు. ఆ సిరీస్‌లో అతణ్ని 6, 7లో కాకుండా.. 4 లేదా 5 స్థానాల్లో బరిలోకి దించాలన్నాడు. 'ఉపఖండంలో ఆస్ట్రేలియాతో జరిగే ఐదు వన్డేల సిరీస్‌కు జట్టులో పంత్ ఉండాలి. టాపార్డర్‌లో అతడి ఎడమచేతి వాటం జట్టుకు ప్రయోజనం చేకూరుస్తుంది. అయితే, అతడిని నాలుగు లేదా ఐదు స్థానాల్లో బరిలోకి దింపితే ఎలా ఆడుతున్నాడో తెలుస్తుంది. అంతేకానీ.. ఆరు, ఏడు స్థానాల్లో ఆడిస్తే భారీ షాట్లకే మొగ్గుచూపుతాడు. కానీ, మనకు కావాల్సింది ఇది కాదు కదా' అని గవాస్కర్ చెప్పుకొచ్చాడు.

మరో సిరీస్‌పై అమ్మాయిల గురి

కివీస్‌తో భారత్ తొలి టీ20 నేడు



స్మృతి మంధాన

వెల్లింగ్టన్: న్యూజిలాండ్‌పై వన్డే సిరీస్ నెగ్గిన జోష్‌లో ఉన్న భారత మహిళలు.. టీ20 సిరీస్‌పైనా కన్నేశారు. దీంట్లో భాగంగా మూడు టీ20ల సిరీస్‌లో బుధవారం జరిగే తొలి మ్యాచ్‌లో గెలవాలనే పట్టుదలతో ఉన్నారు. మహిళల వన్డే చాంపియన్‌షిప్‌లో భాగంగా జరిగిన మూడు వన్డేల సిరీస్‌ను భారత్ 2-1తో నెగ్గింది. కానీ, చివరి వన్డేలో 149 పరుగులకే కుప్పకూలిన మిథాలీ సేన.. 8 వికెట్ల తేడాతో ఓటమి చవిచూసింది. వన్డేల్లో హర్మన్‌ప్రీత్ కౌర్‌కు తన బ్యాటింగ్ సత్తా చాటే అవకాశాలు అంతగా రాలేదు. కానీ టీ20 కెప్టెన్‌గా హర్మన్ తనదైన శైలిలో దుమ్మురేపడానికి సిద్ధంగా ఉంది. వరల్డ్ టీ20 సెమీస్‌లో ఇంగ్లండ్ చేతిలో ఓటమి తర్వాత భారత్ ఆడుతున్న తొలి మ్యాచ్ ఇదే..! ఆ టీ20లో మిథాలీని పక్కన పెట్టడం పెద్ద వివాదాన్నే రాజేసింది. కోచ్ రమేష్ పొవార్, మిథాలీ మధ్య మాటల యుద్ధం తారాస్థాయికి చేరుకుంది. రాజ్ స్ట్రయిక్ రేట్‌పై ప్రశ్నలు తలెత్తాయి. ఈ నేపథ్యంలో టీ20ల్లో మిథాలీ ప్రదర్శనపై అందరి దృష్టి నెలకొని ఉంది. కివీస్‌తో మూడో వన్డేలో స్పిన్నర్లను ఎదుర్కోవడంలో భారత బ్యాట్స్‌వుమెన్ తడబడ్డారు. దానిని సరిదిద్దుకోవాల్సిన అవసరం ఎంతో ఉంది. అద్భుత ఫామ్‌లో ఉన్న ఓపెనర్ స్మృతి మంధానతోపాటు విధ్వంసకర ఇన్నింగ్స్‌లు ఆడే హర్మన్‌ప్రీత్‌పై జట్టు ఎక్కువగా ఆధారపడింది. వేదా కృష్ణమూర్తి స్థానంలో జట్టులో చోటుదక్కించుకున్న ఆల్‌రౌండర్ ప్రియా పూనియా అరంగేట్రం చేసే అవకాశాలున్నాయి. ఈ సిరీస్ నుంచి వచ్చే ఏడాది ఆస్ట్రేలియాలో జరిగే టీ20 వరల్డ్‌కప్‌లో భారత జట్టు ప్రదర్శనపై మేనేజ్‌మెంట్ ఒక అవగాహనకు వచ్చే అవకాశం ఉంది.

దశాబ్దకాలం తర్వాత కివీస్ గడ్డపై వన్డే సిరీస్‌ను ఖాతాలో వేసుకున్న టీమిండియా.. ఇప్పుడు పొట్టి ఫార్మాట్‌లోనూ వారికి షాకిచ్చేందుకు సిద్ధమైంది. అయితే టీ20ల్లో కివీస్‌దే ఆధిపత్యం. భారత జట్టు ఇక్కడ ఒక్క మ్యాచ్ కూడా గెలవకపోగా.. 2009లో జరిగిన ఏకైక సిరీస్‌లోనూ 0-2తో చిత్తయింది. దీంతో ప్రతీకారం కోసం ఎదురుచూస్తున్న రోహిత్ సేన.. ప్రస్తుత ఫామ్‌ను కొనసాగిస్తూ మూడు నెలల విదేశీ పర్యటనను చిరస్మరణీయంగా ముగించాలనుకుంటోంది. అటు ఒత్తిడిలో ఉన్న ఆతిథ్య జట్టు కనీసం ఈ సిరీస్‌లోనైనా గెలిచి పరువు దక్కించుకోవాలని భావిస్తోంది.

స్టార్ స్పోర్ట్స్ 1,3లో మధ్యాహ్నం 12.30 నుంచి

బోణీ కొట్టేస్తారా!



రోహిత్

- **నేటి నుంచి న్యూజిలాండ్‌తో టీ20 సిరీస్**
- **'తొలి' విజయంపై భారత్ దృష్టి**

హామిల్టన్: ఆస్ట్రేలియాలో ఆరంభించిన విజయ యాత్రకు న్యూజిలాండ్‌లో చక్కటి ముగింపునివ్వాలన్నది భారత జట్టు ఆలోచన. ఇప్పటికే వన్డే సిరీస్‌ను 4-1తో దక్కించుకున్న టీమిండియా నేటి (బుధవారం) నుంచి మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో తలపడనుంది. చివరి వన్డే జరిగిన వెస్ట్‌ప్యాక్ మైదానంలోనే ఈ ఆరంభ మ్యాచ్ జరుగనుంది. టీ20ల్లో కివీస్‌పై ఉన్న పేలవ రికార్డును సవరించుకుంటూనే, ఇక్కడ తొలి టీ20 సిరీస్ సాధించాలనే కసితో భారత్ ఉంది. వన్డే సిరీస్‌కు దూరమైన రిషబ్ పంత్ తిరిగి జట్టులోకి వచ్చాడు. ప్రపంచకప్‌లో చోటు దక్కించుకోవాలంటే అతడికి ఈ సిరీస్ మంచి అవకాశం. అలాగే టీనేజర్ శుభ్‌మన్ గిల్ అరంగేట్రం చేసే అవకాశం ఉండగా.. గత జూలైలో చివరి టీ20 మ్యాచ్ ఆడిన ధోనీ మళ్లీ బరిలోకి దిగబోతున్నాడు. ఇక సిరీస్ ఆరంభానికి ముందే స్టార్ ఓపెనర్ గప్టిల్ గాయం రూపంలో కివీస్‌కు ఎదురుదెబ్బ తగిలింది.

ఆత్మవిశ్వాసంతో భారత్: రోహిత్ శర్మ కెప్టెన్సీలో భారత జట్టు టీ20ల్లో అదుర్స్ అనిపించుకుంటోంది. అందుకే 12 మ్యాచ్‌ల్లో అతడి విజయాల శాతం 91.67గా ఉంది. అలాగే రోహిత్ ఫామ్‌కు ఇబ్బందేమీ లేకపోయినా మరో ఓపెనర్ ధవన్ చివరి మూడు వన్డేల్లో విఫలమయ్యాడు. దీంతో బౌన్స్, స్వింగ్‌ను సమర్థంగా ఎదుర్కొనేందుకు అతడు టెన్నిస్ బాల్‌తో ప్రాక్టీస్ చేశాడు. మూడో స్థానంలో గిల్‌ను ఆడించే అవకాశం ఉంది. కఠిన పరిస్థితుల్లో అతడు ఆడిన రెండు వన్డేల్లో 9,7 స్కోర్లతో విఫలమైనా ఈ ఫార్మాట్‌లోనూ పరీక్షించాలనుకుంటున్నారు. ఇక రిషబ్ పంత్‌ను ఏ స్థానంలో బరిలోకి దించుతారనేది ఆసక్తికరంగా మారింది. ధోనీ వికెట్ కీపర్‌గా ఉండడంతో పంత్ స్పెషలిస్ట్ బ్యాట్స్‌మన్‌గానే ఆడనున్నాడు. మరోవైపు ఈఫార్మాట్‌లోనూ ధోనీ రాణించాల్సిన ఆవశ్యకత ఉంది. దినేశ్ కార్తీక్ ఫినిషర్‌గా తానేమిటో ఇప్పటికే నిరూపించుకున్నాడు. బౌలింగ్‌లో పేస్ బాధ్యతను భువనేశ్వర్ తీసుకోనుండగా ఆల్‌రౌండర్ బ్రదర్స్ హార్దిక్ పాండ్యా, క్రునాల్ పాండ్యా తొలిసారిగా ఆడే చాన్స్ ఉంది. ఖలీల్, సిద్దార్థ్ కౌల్‌లో ఒకరు ఆడనున్నారు. స్పిన్నర్‌గా కుల్దీప్ యాదవ్ బరిలోకి దిగనున్నాడు.

కొత్తవారికి చాన్స్!

వన్డే సిరీస్‌ను తమ చెత్త ఆటతో కోల్పోయిన కివీస్.. ఈసారి అలాంటి పొరపాటుకు తావీయకూడదనుకుంటోంది. ఓపెనర్ గప్టిల్ గాయం కారణంగా దూరం కావడంతో కెప్టెన్ విలియమ్సన్ ఓపెనింగ్ చేయనున్నాడు. మూడు సెంచరీలు సాధించిన కొలిన్ మన్రో ఈ ఫార్మాట్‌లో అత్యంత ప్రమాదకారి. ఈ సిరీస్‌లోనూ అతడు ఫామ్ కనబరిస్తే భారత్‌కు ఇబ్బందే. సీనియర్ రాస్ టేలర్, జేమ్స్ నీషమ్‌పై జట్టు ఎక్కువగా ఆధారపడి ఉంది. ఆల్‌రౌండర్ డారిల్ మిచెల్, పేసర్ బ్లెయిర్ టిక్నెర్‌లతో అరంగేట్రం చేయించే చాన్స్ ఉంది. ప్రధాన పేసర్ బౌల్ట్‌కు విశ్రాంతినివ్వగా టిమ్ సౌథీ, ఫెర్గూసన్ ఈ విభాగంలో కీలకం కానున్నారు.

ఓవరాల్‌గా కివీస్‌తో భారత్ ఎనిమిది టీ20లు ఆడితే రెండు మాత్రమే గెలిచి ఆరింట్లో ఓడింది.

జట్లు (అంచనా)

భారత్: రోహిత్ శర్మ (కెప్టెన్), ధవన్, శుభ్‌మన్ గిల్, ఎంఎస్ ధోనీ, రిషభ్ పంత్, దినేశ్ కార్తీక్, హార్దిక్ పాండ్యా, క్రునాల్ పాండ్యా/కేదార్ జాదవ్, భువనేశ్వర్, ఖలీల్ అహ్మద్/సిద్ధార్థ్ కౌల్, చాహల్/కుల్దీప్.

న్యూజిలాండ్: విలియమ్సన్ (కెప్టెన్), మన్రో, టిమ్ సీఫెర్ట్, టేలర్, డారిల్ మిచెల్, నీషమ్, గ్రాండ్‌హోమ్, స్కాట్ కుగెలిన్, బ్రేస్‌వెల్, సౌథీ, ఫెర్గూసన్/టిక్నెర్, సోధీ.

పిచ్, వాతావరణం

చివరి వన్డేలో వెస్ట్‌ప్యాక్ పిచ్ అంచనాలకు భిన్నంగా ప్రవర్తించింది. ఏడాది క్రితం ఇక్కడ జరిగిన ఆఖరి టీ20 మ్యాచ్‌లో కివీస్ 196 పరుగుల స్కోరును కాపాడుకుంది. టాస్ గెలిచిన జట్టు ఫీల్డింగ్‌కు మొగ్గు చూపే అవకాశం ఉంది. ఆకాశం మేఘావృతంగా ఉన్నా వర్షం నుంచి ఇబ్బంది లేదు.

గత 10 టీ20 సిరీస్‌లలోనూ భారత జట్టు విజేతగా నిలిచింది.

రోహిత్ శర్మ కెప్టెన్‌గా ఉన్న 12 టీ20 మ్యాచ్‌ల్లో భారత్ ఒక్కదాంట్లోనే ఓడింది.

రోహిత్ శర్మ మరో 36 పరుగులు చేస్తే టీ20ల్లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలుస్తాడు. ప్రస్తుతం గప్టిల్ (2,272) టాప్‌లో ఉన్నాడు.




కాలికట్ ఆటగాళ్ల ఆనందం

కాలికట్‌కు మరో విజయం

కొచ్చి: ప్రొ వాలీబాల్ లీగ్‌లో కాలికట్ హీరోస్ వరుసగా రెండో విజయం సాధించింది. మంగళవారం హోరాహోరీగా జరిగిన మ్యాచ్‌లో కాలికట్ 3-2 (15-10, 12-15, 15-13, 14-15, 15-9)తో యు ముంబా వాలీపై గెలిచింది. తొలిసెట్‌ను కాలికట్ హీరోస్ 15-10తో గెలుచుకోగా.. ఆ తర్వాత సత్తాచాటుతూ ముంబా 15-12తో రెండోసెట్ నెగ్గింది. మూడో సెట్ నువ్వానేనా అన్నట్టుగా సాగినా.. అజిత్ స్పైక్‌తో 15-13తో కాలికట్ ఆసెట్ నెగ్గింది. నాలుగో సెట్‌లో తొలుత 4-8తో వెనుకడిన ముంబా.. తర్వాత వరుస బ్లాక్‌లు, స్పైక్‌లతో అదరగొడుతూ 15-14తో పైచేయి సాధించి ఫలితాన్ని ఆఖరిసెట్‌కు తీసుకెళ్లింది. నిర్ణాయక ఐదోసెట్ ఆరంభంలో ఇరువురూ 6-6తో సమంగా ఉన్న దశలో ఒక్కసారిగా విజృంభించిన కాలికట్ వరుసగా ఆరు పాయింట్లు సాధించి 12-6తో దూసుకెళ్లింది. 15-9తో సెట్‌తోపాటు మ్యాచ్‌నూ కైవసం చేసుకుంది. అజిత్ లాల్ ఏకంగా 16 (15 స్పైక్‌లు, 1 బ్లాక్) పాయింట్లతో అదరగొట్టాడు.

విరుష్క.. అడవిలో షికారు

న్యూఢిల్లీ: న్యూజిలాండ్‌తో చివరి రెండు వన్డేలు, మూడు టీ20ల నుంచి విశ్రాంతి తీసుకున్న టీమిండియా రెగ్యులర్ కెప్టెన్ విరాట్ కోహ్లీ.. ఇప్పుడు భార్య అనుష్క శర్మతో కలిసి జాలీ ట్రిప్‌ను ఎంజాయ్ చేస్తున్నాడు. ప్రతిరోజూ ఒక్కో చోటకు వెళుతూ అక్కడ ఇద్దరూ దిగిన ఫొటోను సోషల్‌మీడియాలో పోస్ట్ చేస్తూ అభిమానులను ఆనందంలో ముంచెత్తుతున్నాడు. తాజాగా అనుష్కతో కలిసి అడవిలో షికారుకెళ్లిన ఫొటోను పోస్ట్‌చేశాడు.



సాయ్‌పై మనోజ్ ఆరోపణలు

న్యూఢిల్లీ: ఆసియాడ్ సందర్భంగా తగిలిన గాయాలకు చికిత్స పొందేందుకు తగిన ఆర్థికసాయం అందించడంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్) విఫలమైందని ప్రముఖ బాక్సర్ మనోజ్‌కుమార్ ఆరోపించాడు. గత ఆసియాడ్ సందర్భంగా తనకు గాయాలయ్యాయని, చికిత్సకోసం అయ్యే 5.3 లక్షల రూపాయలను అందించేందుకు సాయ్ నిరాకరించిందన్నాడు. కాగా మనోజ్ తన గాయాలను కప్పిపుచ్చి టోర్నీలకు హాజరయ్యాడని, మెరుగైన ఫలితాలు సాధించడంలో విఫలమైనందున అతనిని టాప్ పథకంనుంచి తప్పించారని సాయ్ వివరించింది.

కుల్దీప్ మా నెంబర్‌వన్ స్పిన్నర్: రవి శాస్త్రి

వెల్లింగ్టన్: విదేశీగడ్డపై అద్భుతంగా రాణిస్తున్న స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌ను కోచ్ రవిశాస్త్రి ప్రశంసించాడు. అశ్విన్, జడేజాకన్నా కుల్దీపే ముందున్నాడని, అతడే తమ ప్రధాన స్పిన్నర్ అని స్పష్టం చేశాడు. 'టెస్టు క్రికెట్‌లో ఇప్పుడు మణికట్టు స్పిన్నర్లదే ఆధిపత్యం. విదేశాల్లో కుల్దీప్ విశేషంగా రాణిస్తున్నాడు. సిడ్నీ టెస్టులో 5 వికెట్లతో రాణించాడు. ఆ మ్యాచ్‌లో అతడు బౌలింగ్ వేసిన తీరు అబ్బురపరిచింది. అందుకే ఇప్పుడు అతడే మా ప్రధాన స్పిన్నర్. ఒకవేళ తుదిజట్టులో ఒక్క స్పిన్నర్‌కే చోటుంటే కుల్దీప్‌కే ప్రాధాన్యం' అని శాస్త్రి చెప్పాడు. భారత క్రికెట్‌కు కోహ్లీలాంటి కెప్టెన్ లభించడం అదృష్టమని రవిశాస్త్రి కొనియాడాడు. 'కోహ్లీ ఆటతీరులో నాకు వివ్ రిచర్డ్స్ గుర్తుకొస్తాడు. కెప్టెన్సీ విషయంలో ఇమ్రాన్ ఖాన్ మాదిరి తనకు కావాల్సింది సహచరుల నుంచి చక్కగా రాబట్టుకుంటాడు' అని అన్నాడు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107
Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.



తెలుగు యువతకు వందనం
తెలుగు మమతకు అభివందనం
తెలుగు జాతికి శిరసాభివందనం
తెలుగుదేశం పార్టీ ఆది నుంచి రాజకీయంగా యువతను ప్రోత్సహించి, అధికారాన్ని దగ్గరకు చేర్చి మరియు పేదలకు, సమాజానికి మంచి చేయాలనే సంకల్పంతో ఉంది. అలాగే నేడు ప్రజాక్షేమం కోరి ...
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గౌరవ ముఖ్యమంత్రి వర్యులు
నవ్యాంధ్ర నిర్మాత, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు
శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షునిగా
ప్రమాణ స్వీకారం చేస్తున్న
శ్రీ దేవినేని అవినాష్ గారికి
హృదయపూర్వక శుభాకాంక్షలు
తెలుగు యువత
TELUGU YUVATHA
మీ
కడియాల బుచ్చిబాబు
6 ఫిబ్రవరి, 2019
సాయంత్రం 4 గం.ల నుండి
వేదిక :
సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కాలేజ్
పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్, విజయవాడ